సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 361

శుక్రవారం 22-3-2024



'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అటు ఫోర్... ఇటు సిక్సర్!

మెగా టి20 టోర్నీ ఐపీఎల్-2024కు రంగం సిద్ధమైంది. చెన్నైలోని చిదంబరం స్టేడియంలో శుక్రవారం జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. –స్పోర్ట్స్‌లో

ఫ్యాషన్

ధరించే డ్రెస్‌ను బట్టి తమ స్టైల్, లుక్ ఎదుటివారికి తెలియాలని కోరుకుంటారు. క్యాజువల్ వేర్ అయినా పార్టీ వేర్ అయినా తమను ప్రత్యేకంగా గుర్తించాలని తపిస్తారు. ముందే పలకరిస్తున్న వేసవి తాపాన్ని తట్టుకుంటూ వేడుకలలోనూ రాయల్ లుక్‌తో మెరిసిపోవడానికి ఓవర్‌కోట్ బార్డర్ స్టైల్ తన స్పెషాలిటీని చాటుతోంది. రెడీ అవ్వడానికి తక్కువ టైమ్ పట్టడమే కాదు సౌకర్యంలోనూ సరైన ఛాయిస్ అనిపించకమానదు.

టైమ్ లెస్ కంఫర్ట్ ప్లస్







ఇండోవెస్ట్రన్ స్టైల్ డ్రెస్సింగ్ నవతరాన్ని అధికంగా ఆకర్షిస్తుంటుంది. అప్పట్లో ఓవర్ కోట్ అంటే మందంగా ఉండే డ్రెస్‌గా మాత్రమే చూసేవారు. ఇప్పుడు అదే స్టైల్‌లో పట్టు, కాటన్స్‌తో తయారు చేస్తున్నారు.

• • •

ఎంచుకున్న మెటీరియల్‌ను బట్టి పైథానీ, గద్వాల్, ఇక్కత్ హ్యాండ్లూమ్ డిజైన్ గల బార్డర్స్ వచ్చేలా డిజైన్ చేస్తున్నారు. ఓవర్‌కోట్‌లా ఉండే టాప్స్, అదే రంగులో ఉండే బాటమ్ ప్యాంట్స్‌కి అంచును జత చేయడంతో ఈ డ్రెస్‌లో అమ్మాయిలు మరింత ప్రత్యేకంగా కనపడుతున్నారు.

• • •

సిల్క్, క్రేప్ ప్లెయిన్ మెటీరియల్‌ను ఈ డ్రెస్ తయారీకి ఎంచుకున్నప్పుడు ప్రత్యేక హంగుగా హ్యాండ్ ఎంబ్రాయిడరీని ఉపయోగిస్తున్నారు.

• • •

షరారా ప్యాంట్స్, టాప్స్, టై అండ్ డై మెటీరియల్ ఎంపిక కూడా ఈ డ్రెస్సింగ్‌కి ప్రత్యేక ఆకర్షణగా అమరుతున్నాయి.

• • •

బంగారు రంగులో ఉన్న వెడల్పాటి అంచులే కాదు, ఎంబ్రాయిడరీ చేసిన లేదా కాంట్రాస్ట్ బార్డర్స్ కూడా ఈ డ్రెస్ మోడల్స్‌ను స్పెషల్‌గా చూపుతున్నాయి.

• • •

గాఢమైన రంగులు లేదా లేత రంగులు సందర్భానికి అనుగుణంగా డ్రెస్‌ను ఎంపిక చేసుకోవచ్చు. వీటికి ఫ్యాషన్ జ్యువెలరీ అదీ చాలా తక్కువగా ఉపయోగించవచ్చు. లేదా ఆభరణాల ఊసు లేకపోయినా నప్పే హెయిర్ స్టైల్‌తో ఆధునికంగా మెరిసిపోవచ్చు.

వంటిల్లు

వడగాలి వస్తోంది!
వడియాల కాలం వచ్చేసింది!!

**మార్చి మూడు వంతులు గడిచింది.
ఆహారం ఎండబెట్టే కాలం వచ్చింది.
ఏడాదికి సరిపడా నిల్వ చేయాలి.
వానల్లో వెచ్చగా వేయించుకు తినాలి.
చలిలో కరకరలాడే రుచిని ఆస్వాదించాలి.
ఏప్రిల్ నెలకు ఎండ తీవ్రత పెరుగుతుంది.
వడగాలి వచ్చి దుమ్మెత్తి పోయకముందే...
వడియాలకు దినుసులు సిద్ధం చేద్దాం.
ఎండబెట్టమని సూర్యుడికి పని చెబుదాం.**

బియ్యప్పిండి వడియాలు



కావలసినవి: బియ్యప్పిండి – ఒక గ్లాసు; సగ్గుబియ్యం – పావు కప్పు; ఎండుమిర్చి – 2; జీలకర్ర – టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● ఒక పాత్రలో బియ్యప్పిండి వేసి అందులో రెండు గ్లాసుల నీటిని పోసి ఉండలు లేకుండా కలిపి పక్కన ఉంచాలి. ● ఒక పాత్రలో సగ్గుబియ్యం వేసి మునిగేలా నీటిని పోసి పక్కన పెట్టాలి. ● మిక్సీలో ఎండుమిర్చిని గ్రైండ్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలి. మెత్తగా గ్రైండ్ కావాల్సిన అవసరం లేదు. ● ఒక పెద్ద పాత్రలో ఆరుగ్లాసుల నీటిని పోసి వేడి చేయాలి. నీరు వేడెక్కిన తర్వాత ఉప్పు కలపాలి. నీరు మరగడం మొదలైన తర్వాత నానబెట్టిన సగ్గుబియ్యం వేసి కలిపి మూత పెట్టాలి. సగ్గుబియ్యం ఉడకడం మొదలైన తర్వాత నానబెట్టిన బియ్యప్పిండిని పోసి కలపాలి. పిండి అడుగు పట్టకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. పిండి ఉడికేటప్పుడు ఎండుమిర్చి పొడి, జీలకర్ర వేసి కలిపి దించేయాలి. వడియాల పిండి వేడి తగ్గేలోపు నూలు వస్త్రాన్ని తడిపి నేల మీద పరిచి సిద్ధం చేసుకోవాలి. ఇప్పుడు మిశ్రమాన్ని స్పూన్‌తో వడియాలుగా పెట్టాలి. రెండు రోజులు ఎండబెట్టిన తర్వాత క్లాత్‌కు వెనుకవైపు నీటిని చల్లి వడియాలను వలిచి డబ్బాలో నిల్వ చేసుకోవాలి. ● ఈ వడియాలు చాలా త్వరగా వేగుతాయి. నూనెలో వేసిన తర్వాత పొంగి పువ్వుల్లా విచ్చుకోవడం మొదలవుతుంది. అప్పుడు చిల్లుల గరిటెతో నూనెలో ముంచినట్లయితే రెండు వైపులా సమంగా వేగుతాయి. వీటిని తెల్లగా ఉండగానే నూనెలో నుంచి తీసేయాలి. తీయడం ఆలస్యమైతే ఎరుపురంగులోకి మారిపోయి చేదు వస్తుంది.

రవ్వ వడియాలు

కావలసినవి: బొంబాయి రవ్వ – కేజీ; పచ్చిమిర్చి– పది; జీలకర్ర : టేబుల్ స్పూన్; అల్లం – 50 గ్రాములు; ఉప్పు– టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి; నీరు – 8 లీటర్లు; సగ్గుబియ్యం – పావు కేజీ; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● రవ్వను ఒక పాత్రలో వేసి మునిగేటట్లు నీటిని పోసి పక్కన ఉంచాలి. ● అల్లం, పచ్చిమిర్చి శుభ్రం చేసి మిక్సీ జార్‌లో వేయాలి, అందులో జీలకర్ర, ఉప్పు కూడా వేసి గ్రైండ్ చేయాలి. ● పెద్ద పాత్రలో నీటిని పోసి వేడి చేయాలి. నీరు మరగడం మొదలైన తర్వాత గ్రైండ్ చేసిన అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, ఉప్పు మిశ్రమాన్ని వేసి కలపాలి. ఆ తరవాత సగ్గుబియ్యాన్ని, నానబెట్టిన రవ్వను వేసి కలియబెట్టాలి. రవ్వ ఉడికి దగ్గరవుతున్నప్పుడు స్టవ్ ఆపేయాలి. ● ఒక నూలు వస్త్రాన్ని తడిపి నేల మీద పరిచి వడియాలు పెట్టాలి. మిశ్రమాన్ని ఒక పాత్రలోకి తీసుకుని టీ స్పూన్‌తో ఒక్కో స్పూన్ మిశ్రమాన్ని వస్త్రం మీద వేయాలి. ఇలా రవ్వ మిశ్రమం మొత్తాన్ని వడియాలుగా పెట్టాలి. మంచి ఎండల్లో ఒక రోజుకే ముప్పావు వంతు ఎండిపోతాయి. లోపల ఉన్న పచ్చి రెండవ రోజుకు ఎండిపోతుంది. ఇలా రెండు రోజులు ఎండిన తర్వాత వస్త్రానికి వెనుక వైపు నీటిని చల్లి



వడియాలను వలవాలి. వలిచిన తరవాత ఒక రోజు ఎండబెట్టాలి. ఇలా తయారైన వడియాలు ఏడాదంతా నిల్వ ఉంటాయి. భోజనానికి పదిమినిషాల ముందు నూనెలో వేయించుకుంటే కరకరలాడే వడియాలు రెడీ.

గమనిక: 1. వడియాల మిశ్రమం వేడి తగ్గిన తర్వాత పూర్తిగా చల్లారే లోపు వడియాలు పెట్టేయాలి. మరీ చల్లారితే మిశ్రమం గట్టి పడిపోయి స్పూన్‌తో తీసి వస్త్రం మీద పెట్టేటప్పుడు స్పూన్‌ను వదలకుండా ఇబ్బంది పెడుతుంది. 2. వడియాలు పెట్టడానికి నూలు వస్త్రం లేకపోతే పాలిథిన్ షీట్ మీద పెట్టవచ్చు.

బియ్యం.. సగ్గుబియ్యం వడియాలు



కావలసినవి: బియ్యం – ఒక గ్లాసు; సగ్గుబియ్యం – పావు గ్లాసు; పచ్చిమిర్చి – 2; అల్లం – అంగుళం ముక్క; జీలకర్ర – టీ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి;

తయారీ: ● బియ్యం, సగ్గుబియ్యాన్ని కడిగి మంచినీటిలో నానబెట్టాలి. ఆరు గంటల తర్వాత మిక్సీ జార్‌లో వేసి, తగినంత నీటిని పోస్తూ, ఉప్పు కలిపి గ్రైండ్ చేయాలి. దోసెల పిండిలాగ మెత్తగా గరిటె జారుడుగా రుబ్బుకోవాలి. ● మరొక జార్‌లో పచ్చిమిర్చి, అల్లం గ్రైండ్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలి. ● పెద్ద పాత్రలో ఐదు గ్లాసుల నీటిని పోసి మరిగిన తర్వాత బియ్యప్పిండి మిశ్రమాన్ని పోసి గరిటెతో కలపాలి. మిశ్రమం దగ్గరయ్యేటప్పుడు అల్లం, పచ్చిమిర్చి పేస్టు, జీలకర్ర వేసి కలపాలి. మిశ్రమం బాగా దగ్గరయ్యి సంగటిలా ముద్దగా అవుతుంది. పాత్రను స్టవ్ మీద నుంచి దించేసి చల్లారనివ్వాలి. ● పాలిథిన్ షీట్ మీద వడియాల్లాగ పెట్టాలి. ఈ వడియాలను స్పూన్‌తో పెట్టడం కుదరదు. చేత్తోనే పెట్టాలి. కాబట్టి వేడి తగ్గిన తర్వాత పిండిని చేతిలోకి తీసుకుని పిండి కొద్దికొద్దిగా పడేటట్లు మునివేళ్లతో పేపర్ మీద పెట్టాలి. ఈ వడియాలు ఒక్కరోజులోనే ఎండిపోతాయి. ఉదయం పెడితే సాయంత్రానికి ఎండతాయి. వేళ్లతో కదిలించగానే పేపర్ మీద నుంచి ఊడి వచ్చేస్తాయి. లోపల కొద్దిపాటి పచ్చి ఉన్నప్పటికీ అదే రోజు వలిచి పేపర్ మీద ఆరబోసి రెండవ రోజు ఎండలో పెట్టాలి. ● ఈ వడియాలను వేయించేటప్పుడు కూడా కొద్దిపాటి జాగ్రత్త అవసరం. నూనె వేడెక్కిన తర్వాత వడియాలను నూనెలో వేసిన వెంటనే చిల్లుల గరిటెతో నూనెలో ముంచి కొద్ది సెకన్లపాటు ఉంచితే లోపల కూడా బాగా కాలి పువ్వులా విచ్చుకుంటాయి.

మినప్పప్ప వడియాలు



కావలసినవి: చాయ మినప్పప్పు – అర కేజీ; పచ్చిమిర్చి – 4; అల్లం – అంగుళం ముక్క; జీలకర్ర – టేబుల్ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; ఇంగువ – పావు స్పూన్; నూనె – వేయించడానికి సరిపడినంత;

తయారీ: ● మినప్పప్పును శుభ్రంగా కడిగి మంచినీటిలో నాలుగు గంటలసేపు నానబెట్టాలి. ● నానిన తర్వాత నీటిని వంపేసి పప్పును వెట్‌గ్రైండర్‌లో రుబ్బాలి (మిక్సీలో గ్రైండ్ చేస్తే వడియం గట్టిగా వస్తుంది, రుచిగా ఉండదు). పప్పు మెదిగేలోపు అందులో పచ్చిమిర్చి, అల్లం, ఉప్పు వేయాలి. మెత్తగా మెదిగిన తర్వాత జీలకర్ర, ఇంగువ వేసి రెండు నిమిషాల పాటు గ్రైండ్ చేస్తే వడియాల మిశ్రమం రెడీ. ● నూలు వస్త్రాన్ని తడిపి దానిమీద వడియాల మిశ్రమాన్ని టీ స్పూన్‌తో పెట్టాలి. రెండు రోజులు ఎండిన తర్వాత వస్త్రానికి వెనుక వైపు నీటిని చల్లి వడియాలను వలవాలి. వలిచిన వడియాలను మళ్లీ ఎండలో పెట్టాలి. బాగా ఎండిన తర్వాత గాలి దూరని డబ్బాలో నిల్వ చేయాలి.

గమనిక: మినప వడియాలను వేయించేటప్పుడు ఒకింత జాగ్రత్త అవసరం. నూనె బాగా వేడెక్కిన తర్వాత వడియాలను వేసి మంట మీడియంలోకి మార్చాలి. అప్పుడు వడియం లోపల కూడా చక్కగా సమంగా ఎర్రగా వేగుతుంది. మంట తగ్గించకపోతే... వడియం బయటి వైపు ఎర్రగా వేగినప్పటికీ లోపల పచ్చిదనం తగ్గదు. లోపల కూడా వేగేవరకు ఉంచితే వడియం అంచులు మాడిపోతాయి. **మరో విషయం...** ఈ వడియాలను వేయించి అలాగే తినవచ్చు, కూరల్లో కూడా వేసుకోవచ్చు.

అమ్మానాన్నా మాట్లాడుతున్నా సరే, వినకుండా విసురుగా వెళ్లిపోవడం వ్యంగ్యంగా మాటలు అనేయడం నాటకీయంగా కళ్లు తిప్పడం ఉన్నట్టుండి తమ గదిలోకి వెళ్లి 'ధఢేల్'న తలుపులు వేసుకోవడం ఇలాంటివెన్నో సంఘటనలు.. టీనేజ్ పిల్లలున్న తల్లిదండ్రులకు తెలియని విషయమేమీ కాదు. ఒంటరి తల్లులకు పిల్లల పెంపకం మరింత కష్టంగా ఉంటుంది. పిల్లల చంచలమైన భావాలను నియంత్రించలేక తల్లులు చాలాసార్లు మౌనంగా మారిపోతుంటారు. ఇంట్లో టీనేజర్లు సృష్టించే యుద్ధ వాతావరణంలో ఎవరు గెలుస్తారో ప్రతి పేరెంట్‌కు తెలుసు కాబట్టి ఆర్‌ఎమ్ఎఫ్ మంత్రాన్ని మననం చేసుకోండి అంటున్నారు నిపుణులు.

* ఆర్ఎమ్ఎఫ్

పేరెంటింగ్ ప్రపంచంలో కొత్త మంత్రం



ప్రతీకాత్మక చిత్రం

రెస్ట్ మామ్ ఫేస్ (ఆర్ఎమ్ఎఫ్) అనే ఈ మంత్రం అమ్మ ముఖకవళికలను పిల్లల ముందు ఎలా ప్రదర్శించాలి, అందుకు తగిన సాధన ఏ విధంగా చేయాలో నిపుణులు చెబుతున్నారు.

'టీనేజ్‌లో ఉన్న మా అమ్మాయి విషయంలో చాలాసార్లు నా ప్రవర్తన ఒత్తిడితో కూడుకున్నదై ఉంటుంది. చికాకు పరిచే సంఘటనలు ఎదురైనప్పుడు నా ఎమోషన్స్‌ని సమర్థంగా నియంత్రించలేక పోతుంటాను' అంటుంది కార్పొరేట్ ఆఫీసులో హెడ్‌గా పనిచేసే కౌముది.

• • •

'మా అబ్బాయితో గొడవపడటం, పదే పదే చెప్పడం, గతంలో చేసిన ప్రామిస్‌లను గుర్తుచేయడం అదేపనిగా జరుగుతుంటుంది. కానీ, ఆ వెంటనే తప్పనిసరై నాకు నేనే తగ్గడం, మౌనంగా ఉండటం, లేదంటే సర్దిచెప్పడం.. ఎప్పుడూ జరిగే పనే' అంటుంది బొటిక్‌ను నడిపే వింధ్య.

• • •

'కుటుంబ ఆకాంక్షలను పిల్లలు తీర్చాలనే లక్ష్యంగానే నేటి తల్లిదండ్రుల ప్రవర్తన ఉంటోంది. తల్లులు టీనేజ్ పిల్లల విషయంలో తమను తాము నియంత్రించు కోవడానికి ఇది కూడా ఒక కారణంగా ఉంటుంది' అని తెలియజేస్తుంది హోలీ గ్రెయిల్ ఆఫ్ పేరెంటింగ్ మ్యాగజైన్. ఎలాంటి భావోద్వేగాలను ముఖంలో చూపని తటస్థ స్థితిని రెస్టింగ్ మామ్ ఫేస్ సాధన చేస్తే సరైన ప్రయోజనాలను పొందవచ్చు అని చెబుతోంది. అదెలాగో చూద్దాం.

తటస్థంగా..

సాధారణంగా ఎలాంటి వ్యక్తీకరణ లేని స్త్రీ ముఖాన్ని చూసిన వాళ్లు అహంకారమనో లేదా నిరాడంబరత అనో నిర్ధారించుకుంటుంటారు. సంతోషించే సమయంలోనూ వీరు 'తటస్థ' ముఖాలతో ఉండటం చూస్తుంటాం. చూసేవారికి వీరి ముఖాల్లో ప్రశాంతత కూడా కనిపిస్తుంటుందని పరిశోధకులు గ్రహించారు. అందరూ ఇలా ఉండలేరు. కానీ, పిల్లల ముందు తమ భావోద్వేగాలను బయటకు చూపకుండా తమని తాము నిభాయించుకుంటూ ఉండాలంటే ప్రాక్టీస్ అవసరం.


విశ్రాంతికి 30 సెకన్లు

అమ్మల ముఖం పిల్లల ముందు సరైన విధంగా ఉండాలంటే...

- ఫేస్ యోగాను సాధన చేయాలి.
- కోపంగా ఉన్న పిల్లలతో మాట్లాడేముందు ముఖ కండరాలకు కూడా విశ్రాంతి అవసరం అని తమకు తాముగా చెప్పుకోవాలి. రెండు పిడికిళ్లతో ముఖాన్ని రుద్దుకుంటున్నట్టు, కోపాన్ని కూల్ చేసుకుంటున్నట్టు ఊహించుకోవాలి. గాఢంగా ఊపిరి పీల్చుకోవడం, వదలడం చేయాలి. అయితే, అది ఎదుటి వారికి నిట్టూర్పులా ఉండకూడదు. మీ ముఖ కండరాలలో చికాకు, ఆశ్చర్యం, విమర్శించడం ... వంటివన్నీ తీసేసి, స్పష్టంగా అనుకున్న విషయాన్ని చెప్పేయాలి.
- చిన్నపిల్లలు యుక్తవయసులో ఉన్నా, పెద్దవారైనప్పుడైనా ఈ ఆర్ఎమ్ఎఫ్ ఉపయోగకరంగా ఉంటుంది. నిజాయితీగా ఈ వ్యూహాన్ని అమలుపరిస్తే ప్రయోజనకరమైన మార్పులు కనిపిస్తాయి.
- గొడవ పడే సమయాల్లో ఎలాంటి బోధలు చేయద్దు. అలాగే శిక్షించవద్దు.
- పిల్లలు వారి భావోద్వేగాలను స్వీయ – నియంత్రణ చేయగలిగేలా చేయడమే లక్ష్యంగా ఉండాలి.
- మీ బిడ్డ తన ఆందోళనను, అసంతృప్తిని మరింత ఆమోదయోగ్యమైన మార్గాల్లో వ్యక్తపరచలేకపోతే అకస్మాత్తుగా దాడికి దిగవచ్చు. లేదంటే తనని తాను బాధించుకోవచ్చు. అందుకని సమస్యను కూల్‌గా పరిష్కరించాలి.

బంధాలు పదిలం..

'తల్లి మెరుగైన ఆలోచనతో ఉంటే పిల్లలతో స్నేహాలను, ఆరోగ్యకరమైన సంబంధాలను పెంచుకోగలదు. కానీ, నియంత్రణతో సరైన ప్రయోజనాలను రాబట్టలేరు' అంటారు సైకాలజిస్ట్ అండ్ పేరెంటింగ్ రైటర్ అలిజా. పిల్లల ఆకలి తీరినప్పుడు వారి కోపం చల్లబడుతుంది. అందుకని వారికి ఆరోగ్యకరమైన చిరుతిండిని అందిస్తుండాలి. దీంతో పిల్లల దృష్టి మారిపోతుంది. కానీ, అన్ని విషయాల్లో ఇది సాధ్యం కాకపోవచ్చు. అందుకని సాధ్యమైనంత వరకు ఆర్ఎమ్ఎఫ్‌ని సాధన చేయడమే మేలు అనేది నిపుణుల మాట.


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 361

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పార్టీని ఆర్థికంగా చిదిమేసే కుట్ర

కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాల్ని ఫ్రీజ్ చేయడంపై సోనియా మండిపడ్డారు. రూ.2 చెల్లించలేని స్థితిలో ఉన్నామని రాహుల్ అన్నారు.

వివరాలు 6లో ▶



అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌దే

అరుణాచల్‌ప్రదేశ్‌ను భారత్‌కు చెందినదిగానే గుర్తిస్తున్నామని అమెరికా ప్రకటించింది. దీనిని చైనా తీవ్రంగా వ్యతిరేకించింది.

వివరాలు 6లో ▶

కేజ్రీవాల్ అరెస్ట్

మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎంను అదుపులోకి తీసుకున్న ఈడీ

- అరెస్టు నుంచి ఉపశమనం కల్పించలేమని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసిన కొన్ని గంటల్లోనే ఈడీ ఆపరేషన్
- సెర్చ్ వారెంట్‌తో కేజ్రీవాల్ అధికారిక నివాసానికి అధికారులు
- తొలుత రెండున్నర గంటలపాటు విచారణ.. కేజ్రీవాల్‌తోపాటు కుటుంబ సభ్యుల ఫోన్లు సీజ్
- అనంతరం కేజ్రీవాల్ అరెస్టు... ఈడీ ప్రధాన కార్యాలయానికి తరలింపు
- నేడు కోర్టులో ప్రవేశపెట్టనున్న ఈడీ అధికారులు
- కేజ్రీవాల్‌ను తమ కస్టడీకి అప్పగించాలని కోరే అవకాశం
- ముఖ్యమంత్రి పదవిలో కేజ్రీవాల్ కొనసాగుతారని ఆమ్ ఆద్మీ పార్టీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: అంతా అనుకున్నదే జరిగింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన మనీ లాండరింగ్ వ్యవహారంలో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్(55)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నాటకీయ పరిణామాల మధ్య అరెస్టు చేసింది. ఈ కేసులో అరెస్టు చేయకుండా కేజ్రీవాల్‌కు రక్షణ కల్పించలేమని ఢిల్లీ హైకోర్టు తేల్చిచెప్పిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈడీ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. గురువారం సాయంత్రం నుంచి

మిగతా 6వ పేజీలో ▶

ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి భారీ నష్టమే!

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు కావడం ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి ఎదురు దెబ్బేనని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి భారీ నష్టం తప్పదని అంటున్నారు. ఢిల్లీ, హరియాణా, గుజరాత్‌లో కాంగ్రెస్‌తో ఆ పార్టీ పొత్తు కుదుర్చుకుంది. పంజాబ్‌లో ఒంటరిగానే అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికల్లో గణనీయంగా సీట్లు సాధించి, దేశమంతటా పార్టీని విస్తరింపజేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న తరుణంలో కేజ్రీవాల్ అరెస్టు కావడం ఆప్ శ్రేణులను నిరాశకు గురిచేసింది. నిజానికి ఆప్‌లో కేజ్రీవాల్ మాత్రమే స్టార్ క్యాంపెయినర్. ఒకవేళ ఆయన ఈడీ కస్టడీకి గానీ, జైలుకు గానీ పరిమితమైతే పార్టీని ముందుకు నడిపించే బలమైన నాయకులెవరూ లేరు. మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్, సంజయ్ సింగ్ లాంటి సీనియర్లు ఇప్పటికే అరెస్టయ్యారు. కేజ్రీవాల్ లేకపోతే ఇంకెవరు? అనే ప్రశ్న ఆమ్ ఆద్మీ పార్టీలో ఏనాడూ తలెత్తలేదు. మరోవైపు కేజ్రీవాల్ అరెస్టు వ్యవహారం బీజేపీకి మేలు చేయకపోగా బ్యాక్ ఫైర్ అయ్యే అవకాశాలు లేకపోలేదన్న వాదన వినిపిస్తోంది. 12 ఏళ్ల క్రితం పుట్టిన ఆమ్ ఆద్మీ పార్టీ భవితవ్యం ఏమిటన్నది మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది.

ఏపీకి ప్రైమ్ మినిస్టర్ ఎక్స్‌లెన్స్ అవార్డు

- ప్రభుత్వ స్కూళ్లలో సాంకేతిక విద్యకు ఎంపిక చేసిన కేంద్రం
- గుంటూరు జిల్లాలో కేంద్ర బృందం పర్యటన
- ఐఎఫ్‌పీ, ట్యాబ్స్ ద్వారా బోధనకు ప్రశంసలు

2లో

ట్యాపింగ్ వీరుడు.. డేటా చోరుడు.. బాబే

టీడీపీ ప్రభుత్వంలోనే ఇజ్రాయెల్ నుంచి ఫోన్ ట్యాపింగ్ సాఫ్ట్‌వేర్ కొనుగోలు

జాతీయ భద్రత చట్టాన్ని ఉల్లంఘించి మరీ కొన్న చంద్రబాబు

7లో

• బాబు 'గ్రూప్' పాలి'ట్రిక్స్'...

ఆ ఉద్యోగులకు ఊరట

2018 గ్రూప్ 1 మెయిన్స్‌పై సింగిల్ జడ్జి నిమ్మగడ్డ తీర్పును పాక్షికంగా సవరించిన హైకోర్టు ధర్మాసనం



- 167 మంది ఉద్యోగులకు తాత్కాలికంగా ఊరట.. 27న తదుపరి విచారణ
- తాము కోరకున్నా మొదటి మూల్యాంకనాన్ని నిమ్మగడ్డ రద్దు చేశారన్న పిటిషనర్లు
- గత చైర్మన్ ఉదయ్ భాస్కర్ నిర్వాకాలతోనే 'గ్రూప్స్'పై ముసిరిన వివాదాలు
- 2018 గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో 62 తప్పులు ఉన్నాయని కోర్టులో అభ్యర్థుల పిటిషన్
- హైకోర్టు ఆదేశాలతో సరిదిద్ది 2020 డిసెంబర్‌లో మెయిన్స్ నిర్వహణ
- నోటిఫికేషన్‌లో వెల్లడించలేదని డిజిటల్ మూల్యాంకనంపై కోర్టు అభ్యంతరం
- గౌతమ్ సవాంగ్ చైర్మన్‌గా 2022 మార్చిలో మాన్యువల్ మూల్యాంకనం
- మెయిన్స్ మార్కుల్లో వ్యత్యాసాన్ని తగ్గించేందుకు 2016 నుంచి మోడరేషన్
- 15 శాతం మార్కులు తేడా వస్తే మూడోసారి ప్రక్రియ నిర్వహణ
- మెయిన్స్ ఫలితాల వెల్లడి, ఇంటర్వ్యూలు నిలిపివేయాలని హైకోర్టులో రిట్.. కొట్టివేత
- స్టే ఇవ్వాలని రెండుసార్లు పిటిషన్ వేసిన బాబు బృందం.. అంగీకరించని న్యాయస్థానం
- నాలుగోసారి సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్‌పీ.. కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం
- ఐదోసారి హైకోర్టులో రిట్.. వాదనలు పూర్తి.. 2023 ఆగస్టులో జడ్జిమెంట్ రిజర్వు
- ఎనిమిది నెలల తర్వాత.. మెయిన్స్ రద్దు చేయాలంటూ సింగిల్ జడ్జి నిమ్మగడ్డ తీర్పు
- నిమ్మగడ్డ తీర్పుపై డివిజన్ బెంచ్‌కు వెళ్లిన కమిషన్.. తాజాగా స్టే ఇచ్చిన హైకోర్టు

12లో

విశాఖ పోర్టులో దొరికిన 25వేల కిలోల డ్రగ్స్...

కేరాఫ్ కోటయ్య చౌదరి

సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కేంద్రంగా భారీ డ్రగ్స్ దందా

- బ్రెజిల్ నుంచి కంటైనర్లో విశాఖ పోర్టుకు.. ఇంటర్‌పోల్ సమాచారంతో సీబీఐ తనిఖీ
- 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌తో కలగలిపి కొకైన్ దిగుమతి.. సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ పేరిట డెలివరీ
- ఈ కంపెనీ సీఈఓ కూనం కోటయ్య చౌదరి.. ఆయన తండ్రి వీరభద్రరావు ఎండీ
- బీజేపీ నేత పురందేశ్వరి కుటుంబీకులకు వీరభద్రరావు వ్యాపార భాగస్వామి.. టీడీపీ నేతలతోను, బాలకృష్ణ వియ్యంకుడి కుటుంబంతోనూ సాన్నిహిత్యం
- టీడీపీ హయాంలో అక్రమాలకు తెగబడ్డ 'సంధ్యా ఆక్వా'
- అక్రమాలపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొరడా.. కంపెనీని సీజ్ చేసిన పీసీబీ
- 2016లో అమెరికాలో విమాన ప్రయాణికురాలితో వీరభద్రరావు అసభ్య ప్రవర్తన, కేసు నమోదు
- ఢిల్లీ లిక్కర్ స్కాంలోనూ పాత్ర.. చేతులు మారిన రూ.25కోట్లు!

9లో

విశాఖ పోర్టులో సీబీఐ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న కంటైనర్ ఉన్న ప్రదేశం





ఎండీ కూనం వీరభద్రరావు





సీఈఓ కోటయ్య చౌదరి



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

క'న్నీటి' కష్టాలు తీరాయి



మాది శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దాన ప్రాంతం. వజ్రపుకొత్తూరు మండలం సీతాపురంలో చిన్నపాటి కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నా. నా భర్త చనిపోయారు. కొడుకు పెళ్లయ్యాక వేరే కాపురం ఉంటున్నాడు. కుమార్తె దివ్యాంగురాలు కావడంతో ఆమెను నేనే సాకుతున్నా. మా ప్రాంతంలో దశాబ్దాలుగా కిడ్నీ వ్యాధిబారిన పడి ప్రజలు పిట్టల్లా రాలిపోతుంటే పట్టించుకోనే నాథుడే కరువయ్యారు. అనేక పరిశోధన సంస్థలు మా ప్రాంతానికి వచ్చి కిడ్నీ వ్యాధికి తాగు నీరు ఒక కారణం అని తేల్చి చెప్పారు. మా గ్రామంలో ఉన్న బావి నీటిని తాగవద్దని అధికారులు చెప్పారు. అప్పటి నుంచి మంచి నీటి కోసం అనేక ఇబ్బందులు పడ్డాం. ఈ తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా ప్రాంతంలో ఇంటింటికి రక్షిత మంచి నీటిని కుళాయిల ద్వారా అందించి శాశ్వత పరిష్కారం చూపారు. గతంలో ఏ నాయకుడు మా బాగోగులను పట్టించుకున్న పాపాన పోలేదు. మా ఇంటికి కుళాయి నీరు వస్తుందని కలలో కూడా ఊహించలేదు. నాకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 వచ్చింది. సున్నా వడ్డీ కింద రూ.5,694 వచ్చింది. నాకు, నా కుమార్తె(దివ్యాంగురాలు)కు పెన్షన్ వస్తుండటంతో హాయిగా జీవనం సాగిస్తున్నాం. ఉద్దాన ప్రజల ప్రాణాలు కాపాడిన దేవుడికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– కోటి జయమ్మ, సీతాపురం
(కుసుమూరి చలపతిరావు విలేకరి, వజ్రపుకొత్తూరు రూరల్)

ఇంత సాయం ఎన్నడూ ఎరుగం



మాది నిరుపేద కుటుంబం. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మా కుటుంబానికి ఎంతో ఆసరాగా నిలిచాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు గ్రామంలో నా భర్త అల్లు నరసింహారావు ఆర్ఎంపీ వైద్యునిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మాకు ఏవిధమైన ఆస్తులు లేవు. గత ప్రభుత్వం మాకు ఏ విధంగానూ సహాయ పడలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాపు నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేల వంతున అందింది. జగనన్న ఇళ్ల కాలనీలో ఒకటిన్నర సెంటు స్థలం కూడా మంజూరైంది. మా అమ్మాయి ప్రసవానికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.35 వేల విలువైన చికిత్సను ఉచితంగా చేశారు. మా మనుమలకు అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేల వంతున సాయం అందిస్తున్నారు. మా లాంటి ఎంతో మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోడుగా నిలిచారు. మేమంతా ఆయనకు ఎంతో రుణపడి ఉంటాం.

– అల్లు మాధవి, మామిడి కుదురు
(యేడిద బాలకృష్ణ, విలేకరి, మామిడి కుదురు)

ఇప్పుడు హాయిగా జీవిస్తున్నాం



నేను ప్రకాశం జిల్లా బేస్తవారిపేట పోలీస్‌స్టేషన్ సమీపంలో టీ కొట్టు నడుపుకునేదాన్ని. నా భర్త సామ్యూలు గేదెల మారుబేరం వ్యాపారం చేసేవారు. ఏడాది క్రితం పక్షవాతం రావడంతో ఇంటికే పరిమితమయ్యారు. దీంతో మేము ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాం. ఈ సమయంలో ప్రభుత్వం మాకు అండగా నిలిచింది. జగనన్న ప్రవేశ పెట్టిన వైఎస్సార్ చేయూత పథకం కింద ఏడాదికి రూ.18750, రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 వంతున వచ్చింది. ఆ మొత్తంతో టీకొట్టు మానేసి ఇంటి వద్దే చిల్లర కొట్టు పెట్టుకున్నా. రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు సంపాదించగలుగుతున్నా. నా భర్తకు పక్షవాతం రావడంతో నెలకు రూ.3 వేల వంతున పింఛన్ వస్తోంది. రెండో కొడుకు దివ్యాంగుడు కావడంతో పింఛన్ వస్తోంది. ఇప్పుడు నా కుటుంబం గడవడానికి ఎటువంటి ఇబ్బంది లేదు. మా కుటుంబానికి అండగా నిలిచిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– గుంటి మార్తమ్మ, బేస్తవారిపేట
(పెరుమారెడ్డి హనుమంతారెడ్డి, విలేకరి, బేస్తవారిపేట)

'గ్యాప్' పంటలకు ధరహాసం

కొర్రల మద్దతు ధర రూ.2,500.. రైతులు పొందిన ధర రూ.7 వేలు

- ధాన్యం మద్దతు ధర రూ.2,203.. రైతులు పొందిన ధర రూ.4 వేలు
- వేరుశనగ మద్దతు ధర రూ.5,850.. లభించిన ధర రూ.8,300
- రాగుల మద్దతు ధర రూ.3,846.. రైతులకు చెల్లించిన ధర రూ.5 వేలు
- 1,673 మంది రైతులకు 'గ్యాప్ సర్టిఫికేషన్'.. వీరందరికీ రెట్టింపు కంటే అధిక ఆదాయం



నంద్యాల జిల్లా ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి పొలాన్ని పరిశీలిస్తున్న క్యూసీఐ బృందం

సాక్షి, అమరావతి: మంచి వ్యవసాయ పద్ధతులు (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్–గ్యాప్) సర్టిఫికేషన్ రైతులకు రెట్టింపు కంటే ఎక్కువ ఆదాయాన్ని తెచ్చి పెడుతోంది. ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ పండించిన పంటలకు మార్కెట్‌లో ప్రీమియం ధర లభిస్తోంది. పంట ఉత్పత్తుల్ని నచ్చినచోట నచ్చిన వారికి అమ్ముకునే వెసులుబాటు లభించడంతో రైతుల ఆనందం అవధులు దాటుతోంది.

నాణ్యమైన ధ్రువీకరణ వ్యవస్థ ఏర్పాటు

సమగ్ర పంట నిర్వహణ పద్ధతుల్ని పాటించడం ద్వారా సాగు వ్యయాన్ని నియంత్రిస్తూ నాణ్యమైన ఉత్పాదకతను పెంచాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లుగా కృషి చేస్తోంది. ఇందుకోసం పొలం బడులు, తోట బడుల ను నిర్వహిస్తూ ఉత్తమ యాజమాన్య పద్ధతుల్ని రైతుల ముంగిటకు చేరుస్తోంది. ఫలితంగా సాగు వ్యయం 6 నుంచి 17 శాతం ఆదా అవుతుండగా.. దిగుబడులు 9 నుంచి 20 శాతం పెరిగి రైతులకు గణనీయమైన ఆదాయాన్ని ఇస్తోంది. పంట ఉత్పత్తుల నాణ్యతను ధ్రువీకరించేందుకు వీలుగా దేశంలోనే తొలిసారి రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీకి అనుబంధంగా ఏపీ స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీని ఏర్పాటు చేసింది. తొలి దశలో పొలం బడులు, తోట బడుల ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్న రైతులకు గ్యాప్ సర్టిఫికేషన్, రెండో దశలో సేంద్రియ సాగు పద్ధతుల్లో పండించే ఉత్పత్తులకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ జారీ చేయాలని సంకల్పించింది.

క్వాలిటీ కౌన్సిల్ గుర్తింపుతో గ్యాప్ సర్టిఫికేషన్

రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న అవగాహనా ఒప్పందం మేరకు క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) ఏపీ స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీకి ఇండి గ్యాప్ సర్టిఫికేషన్ జారీ చేసేందుకు వీలుగా దేశంలోనే తొలి అక్రిడిటేషన్ జారీ చేసింది. సర్టిఫికేషన్ పొందేందుకు సాగులో అనుసరించాల్సిన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు మండల వ్యవసాయ అధికారులను టెక్నికల్ అడ్వైజర్లుగా, వ్యవసాయ, ఉద్యాన సహాయకులను ఫీల్డ్ ఆఫీసర్లుగా, తనిఖీలు చేసేందుకు అగ్రికల్చర్ డిప్లమో చేసిన వారిని ఇంటర్నెల్ ఇన్‌స్పెక్టర్స్‌గా ప్రభుత్వం నియమించింది. సర్టిఫికేషన్ జారీ కోసం అనుసరించాల్సిన పద్ధతులపై అధికారులు, సిబ్బందికి రైతులు పాటించాల్సిన ప్రమాణాలపై ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏవో), భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) సాజన్యంతో శిక్షణ ఇచ్చారు.



నంద్యాల జిల్లా డోన్ మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మీదేవి నాలుగేళ్లుగా పొలంబడుల ద్వారా ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ నాణ్యమైన పంటల్ని పండిస్తోంది. ఖరీఫ్–2023 సీజన్‌లో రెండెకరాల్లో కొర్రలు సాగు చేసింది. ఇండి గ్యాప్ సర్టిఫికేషన్ కోసం శాస్త్రవేత్తలు, అధికారులు సూచించిన మేలైన యాజమాన్య పద్ధతుల్ని పాటించింది. వర్షాభావ పరిస్థితుల ప్రభావం వల్ల ఎకరాకు 4 క్వింటాళ్ల చొప్పున మాత్రమే దిగుబడులొచ్చాయి. కానీ.. ఈమె గ్యాప్ సర్టిఫికేషన్ పొందటం వల్ల క్వింటాల్ కొర్రలకు రూ.7 వేలకు పైగా ధర లభించిందని సంతోషంతో చెబుతోంది.

క్వింటాల్‌కు రూ.7,500 లభించింది



రెండెకరాల్లో వేరుశనగ సాగు చేశా. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి తగిన మోతాదులో ఎరువులు వినియోగించాను. ఒకే ఒక్కసారి పురుగు మందులు పిచికారీ చేశాను. ఎకరాకు రూ.19,400 పెట్టుబడి అయ్యింది. రెండెకరాలకు 14 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గ్యాప్ సర్టిఫికేషన్‌తో వేరుశనగ క్వింటాల్‌కు రూ.7,500 చొప్పున ధర లభించింది. పెట్టుబడి పోగా రూ.66 వేల నికర ఆదాయం వచ్చింది.

– బి.రామ్మోహన్, ఎం.వేముల, అన్నమయ్య జిల్లా

ఇప్పటికే 1,673 మంది రైతులకు లబ్ధి

ఖరీఫ్ సీజన్‌లో జిల్లాకు 250 ఎకరాల చొప్పున 20 జిల్లాల్లో గ్యాప్ క్లస్టర్స్ ఎంపిక చేశారు. ఆయా క్లస్టర్లలో 990 ఎకరాల్లో వరి, కొర్రలు, రాగులు, వేరుశనగ వంటి వ్యవసాయ.. 2,534 ఎకరాల్లో మామిడి, అరటి, పసుపు, మిరప, కూరగాయల వంటి ఉద్యాన పంటలను గుర్తించారు. 1,673 మంది రైతులతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేశారు. ఇండిగ్యాప్ సర్టిఫికేషన్‌కు అనుసరించాల్సిన విధి విధానాలు, ఆహార ప్రమాణాలపై కృషి గ్యాప్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఎంపిక చేసిన రైతులకు శిక్షణ ఇచ్చారు. నాణ్యత పర్యవేక్షణకు సాంకేతిక బృందం ద్వారా దశల వారీగా తనిఖీలు, అంతర్గత ఆడిట్ నిర్వహించారు. సేకరించిన నమూనాలను పరీక్షించి పురుగు మందుల అవశేషాల గరిష్ట పరిమితికి లోబడి ఉన్నట్టుగా నిర్ధారించిన పంట ఉత్పత్తులకు ఇండి గ్యాప్ సర్టిఫికేషన్ జారీ చేశారు. సర్టిఫికేషన్ పొందిన రైతులు వారి పంట ఉత్పత్తులను మార్కెట్ ధరల కంటే మిన్నగా ప్రీమియం ధరకు విక్రయించుకుని అదనపు ఆదాయాన్ని ఆర్జించగలిగారు. గ్యాప్ సర్టిఫికేషన్‌తో వ్యాపారులూ పోటీపడి రైతు క్షేత్రాల నుంచే కొనుగోలు చేయడంతో కోతకొచ్చిన పంట ఉత్పత్తులను కనీస మద్దతు ధరల కంటే అధిక ధరలకు రైతులు అమ్ముకోగలిగారు. కొర్రలకు మద్దతు ధర రూ.2,500 ఉండగా.. గ్యాప్ సర్టిఫికేషన్ పొందిన రైతులు క్వింటాల్ కొర్రల్ని ధర రూ.7 వేలకు అమ్ముకోగలిగారు. వరి ధాన్యానికి మద్దతు ధర రూ.2,203 కాగా.. రైతులు రూ.4 వేలకు పైగా పొందగలిగారు. వేరుశనగ మద్దతు ధర రూ.5,850 ఉండగా.. గ్యాప్ సర్టిఫికేషన్‌తో రూ.8,300కు పైగా ధర లభించింది. రాగుల మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3,846 ఉండగా.. సర్టిఫికేషన్ పొందిన రైతులు క్వింటాల్‌కు రూ.5 వేలకు పైగా ధర పొందగలిగారు.

ఏపీకి ప్రైమ్ మినిస్టర్ ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యకు ఎంపిక చేసిన కేంద్రం



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలిస్తున్న ఆశిష్ సక్సేనా, హరీష్ రాయ్, ప్రవీణ్ ప్రకాష్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అందిస్తున్న విద్యా బోధనకు గాను 'ప్రైమ్ మినిస్టర్ ఎక్స్‌లెన్స్' అవార్డుకు ఆంధ్రప్రదేశ్ ఎంపికైంది. ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక విద్యకు శ్రీకారం చుడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన విద్యా విప్లవానికి దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయి. బ్లాక్ బోర్డు స్థానంలో తెచ్చిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ), బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల ద్వారా ఆధునిక బోధనకు గాను రాష్ట్రాన్ని ఈ అవార్డు వరించింది. ప్రభుత్వ పాఠశాలల్లో అమర్చిన ఐఎఫ్‌పీలు, 8, 9వ తరగతుల విద్యార్థుల చేతుల్లో ఉన్న ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన, సందేహాల నివృత్తికి బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులను పాఠశాలలకు అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన 'ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్' కార్యక్రమం బెస్ట్ ఇన్నోవేషన్ కేటగిరీలో అవార్డు ఎంపికలో కీలకపాత్ర వహించింది. దేశంలోనే అత్యుత్తమ విద్యాబోధన చేస్తున్న రాష్ట్రంగా అత్యున్నత అవార్డుకు ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఇద్దరు అధికారులను రాష్ట్రానికి పంపింది. కేంద్ర డిప్యూటీ కార్యదర్శులు ఆశిష్ సక్సేనా, హరీష్ రాయ్‌తో కూడిన బృందం గురువారం గుంటూరు జిల్లాలోని పెదకాకాని మండలం వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్, గుంటూరు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, పట్టాభిపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలను సందర్శించింది. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ వీరికి పాఠశాలల్లో అమలు చేస్తున్న సాంకేతిక విద్యా బోధన గురించి వివరించారు.

'ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్'పై ప్రశంసలు

కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆధునిక బోధన పద్ధతులు, వసతులను తిలకించిన అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఐఎఫ్‌పీలు, ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన అందించడంతో పాటు దేశంలోనే తొలిసారిగా ఇంజినీరింగ్ విద్యార్థులను పాఠశాలలకు అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన 'ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్' కార్యక్రమంపై ప్రశంసలు కురిపించారు. విద్యార్థులతో మాట్లాడిన ఆశిష్ సక్సేనా, హరీష్ రాయ్‌లు.. వారిలోని అద్భుతమైన మేధస్సు, సబ్జెక్టుల వారీగా పట్టు, ఇంగ్లిష్ భాష పరిజ్ఞానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ట్యాబ్‌ల ద్వారా ఇన్నోవేటివ్ ట్రెండ్స్, స్విఫ్ట్‌చాట్ యాప్, బైజూస్ కంటెంట్‌ను ఇంజినీరింగ్ విద్యార్థులు బోధిస్తున్న తీరును, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మెషీన్ లెర్నింగ్ తదితర సాంకేతిక నైపుణ్యాలపై పాఠశాల స్థాయిలోనే అవగాహన కల్పిస్తున్న తీరును పరిశీలించారు. ఐఎఫ్‌పీల ద్వారా ఉపాధ్యాయుల బోధనను ప్రత్యక్షంగా తిలకించారు. ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్ కార్యక్రమం ద్వారా ఏ ఏ అంశాలను నేర్చుకుంటున్నదీ విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. తరగతులను బోధిస్తున్న బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులతోనూ మాట్లాడారు. మూడు పాఠశాలల సందర్శన ముగించుకున్న అధికారుల బృందం.. సంబంధిత విద్యార్థులు చదువుతున్న కల్లం హరనాథరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లి యాజమాన్యంతో చర్చించారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి, ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, డీఈవో పి.శైలజ, సీఎస్ఈ ఐటీ సెల్ ప్రతినిధి రమేష్, హెచ్ఎంలు ఉన్నారు.

గురుకుల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్


ఆరిలోవ(విశాఖ తూర్పు): ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసిన గురుకులాల విద్యార్థులకు ఎంసెట్, ఐఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.హర్షవర్ధన్ తెలిపారు. ఆయన గురువారం విశాఖపట్నంలోని శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ బాలుర గురుకులాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ మాట్లాడుతూ ఎంసెట్, ఐఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ కోసం బాలురకు గుంటూరు జిల్లా అడవితక్కెళ్లపాడు, బాలికలకు కృష్ణా జిల్లా ఈడ్పుగల్లులో ప్రత్యేక కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వారంలో ఆయా కోచింగ్ సెంటర్లను ప్రారంభిస్తామని తెలిపారు. అన్ని గురుకులాల విద్యార్థులకు ఈ సెంటర్లలో అవసరమైన శిక్షణ ఇస్తారన్నారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి అన్ని గురుకులాల్లో పాఠ్య, నోట్ పుస్తకాలు సిద్ధంగా ఉంచుతామని చెప్పారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డ్రీమ్ ఆర్ట్స్‌లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు ఆయన ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. గురుకులాల డీడీ రామారావు, డీసీ శంబాన రూపావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీ లాసెట్ నోటిఫికేషన్ విడుదల

ఏఎన్‌యూ: ఏపీ లాసెట్– 2024 నోటిఫికేషన్ ఈ నెల 22న విడుదల చేస్తున్నట్లు సెట్ చైర్మన్, ఏఎన్‌యూ వీసీ ఆచార్య రాజశేఖర్, సెట్ కన్వీనర్ ఆచార్య సత్యనారాయణ తెలిపారు. ఏఎన్‌యూలోని లాసెట్ కార్యాలయంలో గురువారం నోటిఫికేషన్ వివరాలను వెల్లడించారు. మూడేళ్లు, ఐదేళ్లు, రెండేళ్ల పీజీ లా కోర్సుల్లో ప్రవేశాలకు ఈ టెస్ట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. రూ.500 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 26 నుంచి మే 3 వరకు, రూ.1,000 ఆలస్య రుసుంతో మే 4–11 వరకు, రూ. 2,000 ఆలస్య రుసుంతో మే 12–20 వరకు, రూ.3,000 ఆలస్య రుసుంతో మే 21–29 వరకు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల్లో మార్పులు చేసుకునేందుకు మే 30–జూన్ 1 వరకు అవకాశం ఉందన్నారు. జూన్ 9న మధ్యాహ్నం రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తామన్నారు.

రక్తహీనత నివారణలో ఏపీ భేష్

- ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, సిరప్ పంపిణీలో దేశంలోనే అగ్రస్థానం
- చిన్న పిల్లల, బాలింతల్లో 89 శాతం మందికి పంపిణీ
- రెండో స్థానంలో తమిళనాడు
- జాతీయ సగటు 58.8 శాతం
- ఎనీమియా ముక్త్ భారత్ 2023–24 నివేదికలో వెల్లడి



పలు రాష్ట్రాల్లో ఐఎఫ్ఏ పంపిణీ శాతం..

రాష్ట్రం	6-59 నెలల చిన్నారులు	5-9 ఏళ్ల పిల్లలు	10-19 పిల్లలు, యువత	గర్భిణులు	బాలింతలు
ఆంధ్రప్రదేశ్	76.9	95.0	93.7	95	84.6
తమిళనాడు	92.2	95.0	95.0	95	62.8
ఛత్తీస్‌గఢ్	75.0	91.6	95.0	95	76.3
తెలంగాణ	61.6	95.0	94.3	95	78.3
కేరళ	10.1	35.1	08.1	95	60.6
దేశవ్యాప్తంగా	37.1	46.5	50.1	95	65.2

సాక్షి, అమరావతి: రక్తహీనత (ఎనీమియా) నియంత్రణ చర్యల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఆరు నెలల శిశువు నుంచి చిన్న పిల్లలు, యువత, గర్భిణులు, బాలింతలు రక్తహీనత నియంత్రణకు చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వేసిన అడుగులు రాష్ట్రాన్ని జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిపాయి. ఎనీమియా ముక్త్ భారత్ (ఏఎంబీ) కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఐరన్ ఫోలిక్ యాసిడ్ (ఐఎఫ్ఏ) మాత్రలు, సిరప్ పంపిణీకి సంబంధించి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ 2023–24 వార్షిక నివేదికను ఇటీవల విడుదల చేసింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి మధ్య శిశువులు, బాలింతల్లో 89 శాతం మందికి ఐఎఫ్ఏ మాత్రల పంపిణీ చేపట్టి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 88 శాతంతో తమిళనాడు రెండో స్థానంలో, 86.6 శాతంతో ఛత్తీస్‌గఢ్ మూడో స్థానంలో, 84.8 శాతంతో తెలంగాణ నాలుగో స్థానంలో నిలిచాయి. 41.8 శాతంతో కేరళ 21వ స్థానానికి పరిమితమైంది. ఇక కేంద్రపాలిత ప్రాంతాల్లో 88 శాతంతో చండీగఢ్ మొదటి స్థానాన్ని దక్కించుకుంది. కాగా దేశవ్యాప్తంగా ఐఎఫ్ఏ మాత్రల పంపిణీ 58.8 శాతం మాత్రమే ఉంది. ఐఎఫ్ఏ మాత్రల పంపిణీలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలవడం ఇదే తొలిసారి కాదు. 2021–22లోనూ పిల్లలు, యువత, గర్భిణులు, బాలింతల్లో 83.6 శాతం మందికి ఐఎఫ్ఏ సిరప్, మాత్రలు పంపిణీ చేసి దేశంలోనే మన రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది.

రాష్ట్రంలో సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్

దేశంలో రక్తహీనతను నిర్మూలించే ఉద్దేశంతో ఎనీమియా ముక్త్ భారత్ (ఏఎంబీ) కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వైద్య శాఖ 6 నుంచి 59 నెలల పిల్లలకు 1 ఎంఎల్ ఐఎఫ్ఏ సిరప్ వారానికి ఒకసారి చొప్పున 8 నుంచి 10 డోసులు పంపిణీ చేస్తోంది. అలాగే 5–9 ఏళ్ల పిల్లలకు ఐఎఫ్ఏ మాత్రలు నెలలో నాలుగు నుంచి ఐదు అందిస్తున్నారు. అదేవిధంగా 10–19 ఏళ్ల కౌమార పిల్లలు, యువతకు నెలకు నాలుగు ఐఎఫ్ఏ మాత్రలు పంపిణీ చేస్తున్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు 180 మాత్రలు చొప్పున అందిస్తున్నారు. అంతేకాకుండా వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ పథకాల కింద అంగన్‌వాడీల ద్వారా చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఉచితంగా పౌష్టికాహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం కింద మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారు. స్కూల్ హెల్త్ యాప్‌ను రూపొందించి వైద్య శాఖ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. పిల్లలందరికీ ఐఎఫ్ఏ మాత్రలు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకుంది.

రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో సత్ఫలితాలు..

రాష్ట్ర ప్రభుత్వం రక్తహీనత నివారణకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. రాష్ట్రంలో ఏటా దాదాపు 9 లక్షల మంది మహిళలు గర్భం దాలుస్తున్నారు. 2019 నాటికి రాష్ట్రంలో 49 ఏళ్లలోపు వయసు ఉండి రక్తహీనత సమస్యతో బాధపడుతున్న గర్భిణులు 53 శాతం ఉండేవారు. కాగా, 2023 నాటికి రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల శాతం 29 శాతానికి తగ్గిపోయింది. 2023–24లో 2.79 లక్షల మంది రక్తహీనత సమస్యతో బాధపడుతున్నట్టు వైద్య శాఖ గుర్తించింది. వీరిలో 2.37 లక్షల మందిలో స్వల్పంగా, మధ్యస్థంగా రక్తహీనత ఉంది. మరో 42,463 మందిలో తీవ్ర రక్తహీనత సమస్య ఉందని నిర్ధారించారు. దీంతో సాధారణ రక్తహీనత ఉన్న గర్భిణులందరికీ ఐఎఫ్ఏ మందులను ప్రభుత్వం అందించింది. మధ్యస్థం, తీవ్ర రక్తహీనత సమస్య ఉన్న వారిని ఫ్యామిలీ డాక్టర్‌కు రిఫర్ చేసి ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యం గురించి ఆరా తీస్తూ వచ్చింది. ఈ క్రమంలో వైద్యుల సూచనల మేరకు 211 మంది గర్భిణులకు రక్తాన్ని ఎక్కించారు. అదేవిధంగా 6,731 మందికి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్‌లను చేశారు.

వేసవిలోనూ పుష్కలంగా తాగునీరు

- రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకూడదు
- రూ.115 కోట్ల అంచనాతో వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలు
- సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులన్నీ పూర్తిగా నీటితో నింపండి
- ఎక్కడైనా సమస్య ఉంటే ట్యాంకర్ల ద్వారా రోజూ తాగునీటి సరఫరా
- 1904 కాల్‌సెంటర్ ద్వారా తాగునీటిపై ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించండి
- అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వచ్చే జూన్ నెలాఖరు వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణం పూర్తి కావచ్చిన మంచినీటి పథకాలన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని స్పష్టంచేశారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపాలని ఆదేశించారు. తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వేసవి నీటి ఎద్దడిని అధిగమించేందుకు రూ.115 కోట్ల అంచనాతో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. బోర్‌వెల్స్ సహా ఇతర తాగునీటి వనరులన్నీ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి ఎద్దడి గల ఆవాసాలు, శివారు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా ప్రతి రోజూ తాగునీరు సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కుళాయిల ద్వారా రోజుకొకసారి తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. ఎక్కడైనా మంచినీటికి ఇబ్బంది కలిగితే 1904 కాల్‌సెంటర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. పశువులకు కూడా తాగునీటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రైవేట్ బోరులను అద్దెకు తీసుకోవడంతో పాటు ఇప్పటికే ఉన్న బోరులను మరింత లోతు చేయడం.. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నీటితో నింపడం వంటి పనులు చేస్తున్నట్లు చెప్పారు. నీటి ఎద్దడి ఉన్న 1,354 ఆవాసాలకు జూన్ వరకూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయగా.. ఈనెలలో 109 ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు అనుమతి మంజూరు చేశామని తెలిపారు. మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్ శ్రీకేశ్ బాలాజీ రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం 47 పట్టణ స్థానిక సంస్థల్లో రోజుకు ఒకసారి, 29 యూఎల్బీల్లో రోజుకు 2సార్లు, 43 చోట్ల 2 రోజులకు ఒకసారి తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కడప, పెనుగొండ, ఒంగోలు, హిందూపురంలో మూడు రోజులకు ఒకసారి మంచినీటి సరఫరా చేస్తున్నామని.. ఇక్కడ పరిస్థితిని మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో ఉన్నతాధికారులు ఎస్ఎస్ రావత్, కేవీవీ సత్యనారాయణ, ఆర్పీ కృష్ణారెడ్డి, ఆనందరావు పాల్గొన్నారు.

172 లీగల్ మెట్రాలజీ కేసుల నమోదు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లు, ఎంఎల్ఎస్ పాయింట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. 533 తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 172 కేసులు నమోదు చేశారు. రైతు బజార్లు/కూరగాయల మార్కెట్లపై 121, మార్కెట్ యార్డులు/కమీషన్ ఏజెంట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు/ఎంఎల్ఎస్ పాయింట్లపై 27 కేసులు, ఇతర వ్యాపార సంస్థలపై మిగిలిన కేసులు నమోదయ్యాయి. నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ పోర్టల్, కన్స్యూమర్ హెల్ప్‌లైన్ నంబర్ 1967కు వచ్చిన ఫిర్యాదుల మేరకు రాజాం, పాలకొండ, అనకాపల్లి, మచిలీపట్నం, భీమవరం, బాపట్ల, చీరాల, చిలకలూరిపేట, ప్రొద్దుటూరు, ఆదోనిలో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేసినట్టు అధికారులు తెలిపారు.

ఏజీ శ్రీరామ్‌కు మాతృ వియోగం

సాక్షి, అమరావతి: రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) సుబ్రహ్మణ్య శ్రీరామ్ తల్లి సరస్వతి (80) గురువారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. హైదరాబాద్‌లోనే ఆమె అంత్యక్రియలు జరిగాయి. సరస్వతి మృతి పట్ల పలువురు న్యాయవాదులు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శ్రీరామ్‌ను పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పరామర్శించారు.

రాష్ట్రాన్ని మింగేయడానికే బాబు పొత్తులు

- అవినీతిని ఆయన వ్యవస్థీకృతం చేసి రాష్ట్రానికి అపఖ్యాతి తెచ్చారు
- షర్మిలకు స్క్రిప్ట్ ఎక్కడి నుంచి వస్తోందో అందరికీ తెలుసు
- 'మహాదోపిడీ' పుస్తకావిష్కరణలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల

సాక్షి, అమరావతి: చంద్రబాబు అవినీతిని వ్యవస్థీకృతం చేయడమే కాక.. అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను అపఖ్యాతి పాల్జేశారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. రాష్ట్రాన్ని నమిలి మింగడానికి పొత్తులతో ఆయన మళ్లీ వస్తున్నాడు. వ్యవస్థలను అవినీతిమయం చేయటం, మీడియా ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడంలో చంద్రబాబు ఆరితేరారని విమర్శించారు. తన పాలనలో కేంద్ర, రాష్ట్ర నిధులను పూర్తిగా మింగేశారని.. అసలు రాజకీయం అంటే దోపిడీ అన్నట్లుగా బాబు వ్యవహరించారని సజ్జల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబు అంతటి అవినీతి పరుడులేరని ప్రధాని సైతం విమర్శించారని.. మరి ఆయనతో బీజేపీ ఎలా పొత్తు పెట్టుకుందని సజ్జల ప్రశ్నించారు. సీనియర్ జర్నలిస్ట్ పి.విజయబాబు రచించిన మహాదోపిడీ పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం తాడేపల్లిలోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా సజ్జల ఏమన్నారంటే.. ఈ పుస్తకంలో చంద్రబాబు వ్యవస్థలను ఎలా మేనేజ్ చేశారో.. కేంద్ర, రాష్ట్ర నిధులను ఎలా దోచేశారో స్పష్టంగా రాశారు. అధికారం కోసం ఆయన పవన్, బీజేపీని వాడుకుంటూ ఆఖరి ప్రయత్నం చేస్తున్నారు. ఈ సమయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఇక షర్మిల మాట్లాడే భాషను ప్రజలు గమనిస్తున్నారు. ఆమె మాట్లాడే స్క్రిప్ట్ మొత్తం చంద్రబాబు నుంచే వస్తోంది.


మహా దోపిడీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, విజయ్ బాబు తదితరులు

ఓడినా బాబుకు సిగ్గు రాలేదు..

చంద్రబాబు అవినీతి పరాకాష్టకు చేరినందువల్లే 2019లో ప్రజలు ఆయన్ను ఓడించారు. అయినా బాబుకు సిగ్గురాలేదు. ఐఎంజీ భారత్ పేరుతో చేసిన స్కాం ఇంటర్నేషనల్ క్లాసిక్ స్కాం అని తెలంగాణ హైకోర్టు సైతం అభిప్రాయపడింది. వేల కోట్ల దోపిడీకి ఆ రోజుల్లోనే చంద్రబాబు ప్లాన్ చేశారు. అమరావతి స్కాంలాంటిదే ఐఎంజీ స్కాం కూడా. అంతకుముందు.. కుప్పంలో ఇజ్రాయిల్ సాగు పేరుతో ఒక స్కాం.. నీరుచెట్టు పేరుతోనూ దోపిడీ చేశారు. జన్మభూమి కమిటీల దోపిడీ ఏ ఇంట్లో అడిగినా చెబుతారు.

'స్కిల్ బిల్ పాండే' చంద్రబాబు..

మహాదోపిడీ పుస్తక రచయిత, సీనియర్ జర్నలిస్టు విజయబాబు మాట్లాడుతూ.. 'దోపిడీలు చేసిన గద్దలు ఇప్పుడు సుద్దులు చెప్తున్నాయి. రామోజీ జర్నలిజం ముసుగులో విషం చిమ్ముతున్నారు. చంద్రబాబు కుహనా రాజకీయాలను నేను దగ్గరగా చూశా. ఆయన ఓ 'స్కిల్ బిల్ పాండే'. స్కిల్ కార్పొరేషన్‌లో భారీ స్కాం చేసి జైలుపాలయ్యారు. తొక్కేస్తానంటూ విర్రవీగిన పవన్ చివరికి తన కార్యకర్తలనే తొక్కేశారు. అధికారంలోకి రాకుండా వేలకోట్లు సంపాదించే టెక్నిక్ కనిపెట్టిన పవనిజంపై కూడా పుస్తకం రాస్తా'. ఈ కార్యక్రమంలో శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్లు కొమ్మూరి కనకారావు, అమ్మాజి, వైఎస్సార్‌సీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

బాబు అవినీతి రూ.6లక్షల కోట్లకు పైనే..

సీనియర్ జర్నలిస్టు విజయబాబు పైపైన ఈ పుస్తకం రాయడం కోసం చంద్రబాబు పాలనలోని చరిత్ర తడిమితే రూ.నాలుగు లక్షల కోట్ల అవినీతి ఉందంటున్నారు. నిజానికి అది రూ.ఆరు లక్షల కోట్ల కంటే ఎక్కువ ఉంటుంది. ఇప్పుడు ఎన్నికలు రావడంతో ఆయన ప్రజల్లో తిరిగి భ్రమలు కల్పించడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు.



అభ్యర్థులను ఖరారు చేయలేక చులకన అవుతున్నాం

- హైదరాబాద్‌లో చంద్రబాబు, పవన్ మరోసారి భేటీ
- త్వరలో ఎన్నికల ప్రచారం ప్రారంభించాలని నిర్ణయం
- పవన్ ఎక్కడెక్కడ ప్రచారం చేయాలో సూచనలిచ్చిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మరోసారి సమావేశమయ్యారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసానికి గురువారం పవన్ వెళ్లి గంటపాటు చర్చించారు. ఎన్నికల్లో బీజేపీతో కలిసి కూటమిగా పోటీ చేస్తున్న నేపథ్యంలో పలు అంశాలపై వీరిద్దరు చర్చించినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. పొత్తులో జనసేనకు 21 సీట్లు కేటాయించినా ఇంకా కొన్ని చోట్ల అభ్యర్థులను ఖరారు చేయలేకపోవడంపై వీరు చర్చించినట్లు తెలిసింది. పొత్తు వల్ల పలు నియోజకవర్గాల్లో ప్రతిష్టంభన ఏర్పడటం, బీజేపీతో సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కి రాకపోవడంపై మంతనాలు జరిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులందరినీ ఒకేసారి ప్రకటించి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతుంటే కూటమిగా ఉండి ఇంకా సీట్ల సర్దుబాటుతో కాలం గడపడం వల్ల ప్రజల్లో చులకన అవుతున్నట్లు ఇద్దరూ చర్చించుకున్నట్లు తెలిసింది. అందుకే ఇంకా కొన్ని సీట్లు ఖరారు చేయకపోయినా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని ఇరువురు నిర్ణయించారు. అయితే పవన్ ఎక్కడెక్కడ ప్రచారం చేయాలనే దానిపై చంద్రబాబు పలు సూచనలు చేసినట్లు తెలిసింది. మేనిఫెస్టోపైనా చర్చించిన నేతలు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో వచ్చేదాకా వేచి చూద్దామనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.

రెండేళ్లలో 13.37 లక్షల పుస్తకాల ముద్రణ

- భాషాభివృద్ధికి తెలుగు, సంస్కృత అకాడమీ విశేష కృషి
- మార్కెట్‌లోకి 10.37 లక్షల ఇంటర్, 3 లక్షల పోటీ పరీక్షల పుస్తకాలు
- రెండేళ్లలో రూ. 21 కోట్ల విలువైన పుస్తకాలను ముద్రించిన అకాడమీ
- చంద్రబాబు హయాంలో అకాడమీ విభజనను గాలికి వదిలేశారు
- తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీ పార్వతి


తెలుగు అకాడమీ ప్రచురించిన పోటీ పరీక్షల పుస్తకాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక అకాడమీ ప్రచురణలను మార్కెట్‌లోకి తీసుకొచ్చినట్టు తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి తెలిపారు. తెలుగు భాషాభివృద్ధి, ఉన్నత విద్యకు అవసరమైన విజ్ఞాన సంపదను అందించేందుకు అకాడమీ విశేష కృషి చేస్తోందన్నారు. గురువారం వడ్డేశ్వరంలోని ఆమె కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి అకాడమీ విభజన పూర్తయిన తర్వాత ఏపీలో సేవలు ప్రారంభించిన రెండేళ్లలో రూ. 21 కోట్ల విలువైన 13.37 లక్షల పుస్తకాలను ముద్రించామన్నారు. డీఎస్సీ, బీఈడీ, టెట్, ఏపీపీఎస్సీతో పాటు వివిధ రకాల పోటీ పరీక్షల సిలబస్‌తో 67 రకాల పుస్తకాలకు సంబంధించి 3 లక్షల కాపీలను మార్కెట్‌లోకి విడుదల చేశామన్నారు. వీటితో పాటు 10.37 లక్షల ఇంటర్మీడియెట్ పాఠ్యపుస్తకాలను ముద్రించడం ద్వారా పేద విద్యార్థులకు తక్కువ ధరకు స్టడీ మెటీరియల్స్ అందించామన్నారు. ఆంగ్లం, ఇతర భాషల ద్వారా వాడుకలోకి వచ్చిన పదాలకు త్వరలోనే తెలుగు పదజాలాన్ని రూపొందిస్తామన్నారు. తెలుగు-సంస్కృతం-ఆంగ్లం కలగలిపిన త్రిభాషా పదకోశాన్ని (డిక్షనరీ) ముద్రిస్తామన్నారు. డిగ్రీ, పీజీ పాఠ్యప్రణాళికలకు తగ్గట్టుగా పుస్తకాలను ముద్రిస్తామన్నారు. ఇకపై అకాడమీ ప్రతి ముద్రణను తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రవేశపెడుతుందన్నారు.

బాబు స్వార్థానికి అకాడమీ బలి

చంద్రబాబు స్వార్థ రాజకీయాలకు తెలుగు అకాడమీ తీవ్రంగా నష్టపోయిందని లక్ష్మీపార్వతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన హయాంలో తెలుగు అకాడమీ విభజనను పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు అకాడమీని ఏర్పాటు చేశారన్నారు. అనంతరం కోర్టుకు వెళ్లి ఉమ్మడి అకాడమీ విభజన పూర్తి చేసి ఏపీ వాటా కింద రూ. 140 కోట్లు సాధించామన్నారు. కానీ, చంద్రబాబు అకాడమీ ప్రచురణలకు పాతరేసి నారాయణకు పాఠ్యపుస్తకాల ముద్రణను కట్టబెట్టడం ద్వారా భారీ రేట్లకు విక్రయించి రూ. కోట్లు దండుకున్నారని మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎల్లో మీడియా అకాడమీ సేవలపై విషం చిమ్ముతోందన్నారు. తిరుపతి నుంచే తెలుగు, సంస్కృత అకాడమీలు పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయన్నారు. విజయవాడ కేంద్రంలో ఎక్కువ ముద్రణాలయాలు ఉండటంతో ప్రింటింగ్ ఉద్యోగులు మాత్రమే స్థానిక కార్యాలయంలో సేవలందిస్తున్నారన్నారు. త్వరలోనే తిరుపతిలో ఎస్వీ వర్సిటీ స్థలంలో తెలుగు, సంస్కృత అకాడమీ శాశ్వత భవనం నిర్మాణాన్ని చేపడతామన్నారు.





ఆయనే ఆకాశం నుండి భూమి వరకు ప్రతి వ్యవహారాన్ని నడిపిస్తున్నాడు:
తరువాత అంతా ఒకే దినమున, ఆయన వద్దకు పోయి చేరుతుంది:
దాని (ఆ దినపు) పరిమాణం మీ లెక్క ప్రకారం వేయి సంవత్సరాలు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 22 మార్చి 2024

గరళ కంఠ భారతం

ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి అంటూ రొమ్ము విరుచుకుంటున్న మనకు ఇప్పుడు పెద్ద అపకీర్తి కిరీటమూ దక్కింది. ప్రపంచంలోకెల్లా అత్యంత కలుషిత దేశాల్లో భారతదేశం ఒకటని తాజాగా తేలింది. స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ సంస్థ 'ఐక్యూ ఎయిర్' మొత్తం 134 దేశాలు, ప్రాంతాల్లోని 7,812 నగరాలలో 30 వేలకు పైగా వాయు నాణ్యతా పర్యవేక్షక కేంద్రాల నుంచి డేటా సేకరించి ఈ నివేదికను అందించింది. వారి ప్రపంచ వాయు నాణ్యతా నివేదిక ప్రకారం అత్యంత కాలుష్యదేశాల్లో బంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల తర్వాత మూడో స్థానం భారత్‌దే. 2022లో ఎనిమిదో స్థానంలో ఉన్న భారత్ ఒక్క ఏడాది కాలంలో కాలుష్యంలో మూడో ర్యాంకుకు చేరడం ఆందోళన రేపుతోంది. పైగా, ప్రపంచంలోకెల్లా అత్యంత కలుషిత రాజధాని అనే దుష్కీర్తి వరుసగా రెండో ఏడాది కూడా మన ఢిల్లీకే దక్కింది. అవి చాలదన్నట్టు ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా బెగూసరాయ్ నిలవడం దిమ్మ తిరిగేలా చేస్తోంది.

ప్రపంచంలో గత ఏడాది ఎదురైన ఆరోగ్య విపత్తు వాయు కాలుష్యమని నిపుణుల మాట. మన దేశంలో శిలాజ ఇంధనాల వినియోగం ప్రధాన కాలుష్యకారకం కాగా, ఉత్తరాదిన ఖరీఫ్ సీజన్‌లో పంట వ్యర్థాల్ని కాల్చే అలవాటుకు సరైన ప్రత్యామ్నాయం చూపడంలో పాలకుల వైఫల్యాలు సైతం ఢిల్లీ దుఃస్థితికి కారణమై వెక్కిరిస్తున్నాయి. అయితే, మెట్రోలు, గౌహతి – పాట్నా లాంటి ద్వితీయ శ్రేణి నగరాలే కాదు... బిహార్‌లోని బెగూసరాయ్, హర్యానాలోని రోహ్‌తక్, యూపీలోని మీరట్ లాంటి చిన్న పట్నాలు సైతం వాయు గరళంతో నిండిపోతున్నాయని నివేదిక తేల్చింది. ఐక్యూ ఎయిర్ జాబితాలోని 83 భారతీయ నగరాల్లో చాలావాటిలో కాలుష్య కారకాలు ఏమిటనే సమాచారం లేదు. అలాగే, బెగూసరాయ్ లాంటి చోట ఏడాది తిరగక ముందే కాలుష్యం 6 రెట్లు ఎలా పెరిగిందనేది కనిపెట్టాల్సి ఉంది. కారణాల్ని అంచనా వేస్తూనే, ముంచుకొచ్చిన ఈ ముప్పును విధానపరమైన పరిష్కారాలతో సమర్థంగా ఎదుర్కోవడం పాలకుల ముందున్న సవాలు.

గాలిలో ధూళికణాల (పీఎం) సాంద్రత ఏ మేరకున్నదనే దాన్ని బట్టి వాయుకాలుష్య ర్యాంకులు నిర్ణయిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) మార్గదర్శకాల ప్రకారం క్యూబిక్ మీటర్‌కు 5 మైక్రోగ్రాములు ఫరవాలేదు. అలాకాక, ధూళికణాలు 2.5 మైక్రాన్లు లేదా అంతకన్నా తక్కువ వ్యాసం (పీఎం 2.5) ఉన్నప్పుడు ఊపిరితిత్తుల, గుండె జబ్బులు, క్యాన్సర్, చిన్న వయసులోనే మరణాలు సంభవిస్తాయి. కాబట్టి అది ప్రమాదఘంటికకు కొలమానం. 2023లో భారత్‌లో వార్షిక సగటు పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటర్‌కు 54.4 మైక్రోగ్రాములుగా రికార్డయింది. అలా భారత్ మూడో స్థానంలో నిలిచింది. ఇక, క్యూబిక్ మీటర్‌కు 79.9 మైక్రోగ్రాములతో బంగ్లాదేశ్ మొదటి స్థానంలో, క్యూబిక్ మీటర్‌కు 73.3 మైక్రోగ్రాములతో పాకిస్తాన్ రెండోస్థానంలో ఉన్నాయి. నిజానికి, మిగతా రెండు దేశాలతో పోలిస్తే, భారత్ పీఎం2.5 సాంద్రత 2021 నాటి నుంచి తగ్గింది. అప్పట్లో భారత్‌లో క్యూబిక్ మీటర్‌కు 58.1 మైక్రోగ్రాములు ఉండేది. ఇప్పుడది 54.4కు తగ్గిందన్న మాటే కానీ ఇవాళ్టికీ ప్రపంచ టాప్ 50 కాలుష్య నగరాల్లో 42 మన దేశంలోవే కావడం కలతపరిచే అంశం.

దేశ జనాభాలో కొద్ది మంది మినహా దాదాపు 136 కోట్లమంది నిత్యం డబ్ల్యూహెచ్‌ఓ మార్గదర్శకాలను మించి పీఎం2.5 ధూళికణ సాంద్రతకు లోనవుతున్నవారే! మరీ ముఖ్యంగా, మన దేశంలోని పట్టణప్రాంతాల్లో అధిక శాతం మంది ఇలా నిత్యం కాలుష్యం కోరల బారిన పడుతూ, శ్వాసకోశ సమస్యలతో డాక్టర్ల చుట్టూ తిరుగుతుండడం తరచూ కంటి ముందు కనిపిస్తున్న కథే. మిగిలినవి అటుంచితే, భారత్‌లో ఉత్పత్తి అయ్యే విద్యుచ్ఛక్తిలో 70 శాతం థర్మల్ విద్యుత్తే అన్నది గమనార్హం. ఇప్పటికీ మనం పునరుత్పాదక శక్తి వనరుల మార్గం పట్టలేదు. పైపెచ్చు, దేశ ఆర్థిక వృద్ధి మరింత వేగవంతమయ్యేకొద్దీ ఇది పెను సవాలు కానుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఇంటి పైకప్పులపై సౌరవిద్యుత్ ఫలకాల ఏర్పాటు లాంటి భారీ ప్రణాళికలు ప్రకటించింది. అయితే, ఇవన్నీ ఆచరణలోకొచ్చి, ప్రభావం చూపడానికి మరికొంత సమయం పడుతుంది. ఇలాంటి ప్రయత్నాలు గణనీయంగా ప్రభావం చూపాలంటే, మన విద్యుత్ విధానాలను సమూలంగా మార్చడం ముఖ్యం.

అసలు 'స్వచ్ఛమైన గాలి' కూడా ప్రాథమిక జీవనహక్కే. కోర్టులు ఆ సంగతి పదేపదే చెప్పాయి. బరిలోకి దిగక తప్పని పరిస్థితిని ప్రభుత్వాలకు కల్పించాయి. అయితే, పౌర రవాణాలో సీఎన్‌జీ, మెట్రో వ్యవస్థ, 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్' లాంటివి తీసుకొచ్చినా ఢిల్లీ లాంటి చోట్ల కాలుష్యం కోరలు చాస్తూనే ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు సమస్య అవగాహన, పరిష్కారానికై శాస్త్ర విజ్ఞానాన్ని ఆశ్రయించాలి. అలాగే, కాలుష్య నియంత్రణకు అవసరమైన రీతిలో జనజీవితంలో అలవాట్లు మారేలా ప్రోత్సాహకాలు, అతిక్రమిస్తే జరిమానాల పద్ధతి తేవాలి. సర్వజన శ్రేయస్సు కోసం పార్టీలన్నీ కాలుష్యంపై పోరును రాజకీయ అంశంగా తీసుకొని, ఎన్నికల మేనిఫెస్టోల్లో చోటివ్వాలి. నిజానికి, జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమాన్ని పటిష్ఠం చేస్తామంటూ 2019లో కాంగ్రెస్, బీజేపీలు తమ ఎన్నికల వాగ్దానపత్రంలో పేర్కొన్నాయి. ఇది కేవలం కేంద్రం పనే కాదని గుర్తించి, రాష్ట్రాల నుంచి మునిసిపాలిటీల దాకా అన్నీ తమ వంతుగా కాలుష్యంపై పోరులో చేతులు కలపాలి. వాయు కాలుష్యం వల్ల ప్రజల ఆరోగ్యమే కాక, దరిమిలా సంక్లిష్టమైన పర్యావరణ ప్రక్రియలతో పుడమి వాతావరణమే దెబ్బతింటుందని శాస్త్రవేత్తల మాట. అందుకని ఈ విషానికి విరుగుడు కనిపెట్టడం అన్ని విధాలా అత్యవసరం. ఈ క్రమంలో తాజా ఐక్యూ ఎయిర్ నివేదిక మనకు మరో మేలుకొలుపు.

ఓడినా మారని బాబు...

విశ్లేషణ



టంకశాల అశోక్

మొదటిసారి చంద్రబాబు ముఖ్యమంత్రి అయినప్పటినుంచి, ఆయన విధానాలు తన స్వప్రయోజనాల చుట్టూ, సంపన్నుల ప్రయోజనాల చుట్టే తిరిగాయి. విద్యుత్ ట్యారిఫ్ పెంచి ఆందోళనాకారులపైన, రైతు వ్యతిరేక విధానాలు ప్రవేశపెట్టి రైతు ఆందోళనాకారులపైన కాల్పులు జరిపించారు. ఇక కాంగ్రెస్‌ను వదిలి టీడీపీలో చేరినప్పటి నుంచీ ఆయన వైఖరి కపటపూరితమైనదే. మొదట ఎన్టీఆర్ పట్ల, తర్వాత తనతో మైత్రి చేసిన కమ్యూనిస్టుల పట్ల, బీజేపీ పట్ల, కాపుల వంటి ప్రధాన కుల సమాజాల పట్ల, అల్ప సంఖ్యాక వర్గాల పట్ల ఎప్పటికప్పుడు తన రాజకీయ అవసరాలను బట్టి అవకాశవాద ఎత్తుగడలను అనుసరిస్తూ వస్తున్నారు. అందుకే, చంద్రబాబును చిత్తు చేసిందెవరు? స్వయంగా ఆయన పరిపాలనా విధానాలు, వాటి పట్ల సామాన్యుల ఆగ్రహం!

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతో సమస్యంతా ఆయన విధానాలతోనే. 1995లో మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పటినుంచి తర్వాత 29 సంవత్సరాల సుదీర్ఘ కాలమంతా ఆయన రాజకీయ విధానాలు, పరిపాలనా విధానాలు కూడా తన స్వప్రయోజనాల చుట్టూ, సంపన్నుల ప్రయోజనాల చుట్టే తిరిగాయి. సామాన్యుల గురించి కొన్ని కపటపు మాటలు మినహా వారి ప్రయోజనాల కోసం ఆయన ఎప్పుడూ పని చేయలేదు.

ఆయన 1995లో ముఖ్యమంత్రి అయ్యే నాటికి రాష్ట్రంలో ఎన్టీఆర్ సంక్షేమ రాజ్యం సామాన్యుల ఆదరణ పొంది నడుస్తున్నది. మరొకవైపు, 1991 నుంచి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు ఇంకా వేగం పుంజుకోవలసి ఉంది. చంద్రబాబు విషయానికి వస్తే, తనకు సంపన్నులపై గల ప్రేమ కారణంగా ఆర్థిక సంస్కరణలపై అమితమైన ప్రేమ, ఎన్టీఆర్ సంక్షేమ పథకాలపట్ల విముఖత ఏర్పడ్డాయి. దానితో జరిగిందేమిటి? సామాన్యులకు ఇందిరమ్మ రాజ్యానికి మించి దేవునిగా మారిన ఎన్టీఆర్ పథకాలను దెబ్బ తీస్తూ పోయారు. మరొకవైపు ఆర్థిక సంస్కరణలను, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ నిర్దేశాలను కేంద్రంతో సహా మొత్తం దేశంలోనే ఏ రాష్ట్రమూ చేయనంతగా తలకెత్తుకున్నారు. తనను తాను ముఖ్యమంత్రిని కాను, ఒక కంపెనీ నిర్వాహకుని తరహా సీఈఓను అని ప్రకటించుకుని, స్వదేశంతోపాటు విదేశాలలో కూడా పెట్టుబడిదారులకు దేవునిగా మారారు. విద్యుత్ ట్యారిఫ్ పెంచి ఆందోళనాకారులపైన, రైతు వ్యతిరేక విధానాలు ప్రవేశపెట్టి రైతు ఆందోళనాకారులపైన కాల్పులు జరిపించారు. చివరకు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రపంచబ్యాంక్ అధికారులు పరిశీలించి ఆమోదించే ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల దిగ్భ్రాంతికర పరిస్థితులను తీసుకు వచ్చారు. ఇక సామాన్యులైతే ఎన్టీఆర్ సంక్షేమం అడుగంటగా ఏమీ చేయలేని దిక్కు తోచని స్థితికి లోనయ్యారు. వారు మారుమూల గ్రామాల వరకు సైతం చంద్రబాబును 'బ్యాంకు బాబు' అని పిలవ సాగారు. ఇంత జరుగుతుండినా చంద్రబాబు తనకు దేశ, విదేశీ వ్యాపార వర్గాల నుంచి వెల్లువెత్తుతుండిన ప్రశంసలతో పొంగిపోయారు. కనుకనే ఆయన 2004 ఎన్నికలలో వైఎస్ రాజశేఖరరెడ్డి చేత దారుణంగా ఓడినపుడు ప్రపంచమంతా నిర్ఘాంతపోయింది.

చంద్రబాబును ఆ విధంగా చిత్తు చేసిందెవరు? తెరముందు కన్పించింది రాజశేఖరరెడ్డి. తెర వెనుక పనిచేసింది స్వయంగా చంద్రబాబు పరిపాలనా విధానాలు, వాటి పట్ల సామాన్యుల ఆగ్రహం. ఇందుకు పరాకాష్ఠగా కన్పించిన మరొక దృశ్యాన్ని చూడండి. 2004 ఎన్నికల సమయంలో ఆయనపై అలిపిరి వద్ద నక్సలైట్లు హత్యా యత్నం చేశారు. దానివల్ల కలిగిన సానుభూతితో తను గెలిచి తీరగలడని పలువురు భావించారు. అదీగాక ఆయన అంతవరకు తీవ్ర నిర్లక్ష్యం చేసిన రైతులపై అకస్మాత్తుగా వరాలు ప్రకటించారు. కానీ ఆ సానుభూతిగానీ, ఈ వరాలు గానీ ఓటమి నుంచి కాపాడలేక పోయాయి. చంద్రబాబు పరిపాలనా విధానాలపట్ల సామాన్యులలో పేరుకుపోయిన వ్యతిరేకత ఎంతటిదో దీనినిబట్టి గ్రహించవచ్చు.



చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాల గురించి, తనకు ముందటి కాంగ్రెస్, ఎన్టీఆర్ విధానాలతో... తన తర్వాతి రాజశేఖరరెడ్డి విధానాలతో పోల్చుతూ, ఆయా పాలనలపట్ల సామాన్య ప్రజల అభిప్రాయాలను కూడా పోల్చుతూ ఒక విధానపరమైన అధ్యయనం జరగవలసిన అవసరం ఎంతైనా ఉంది. పైన చర్చించినదంతా ఒక స్థూలమైన చిత్రం మాత్రమే. చెప్తూ పోవాలంటే ఇంకా ఎంతైనా ఉంది. అందులో ఒక ముఖ్యమైనది తన విజన్–2020 పత్రం. మొదట ఉమ్మడి రాష్ట్రంలో, తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఆయన ఓటమి వల్ల ఏ విజన్లూ అమలుకు రాలేదు. కానీ అందులో పేర్కొన్న ఆయన ప్రణాళికలు అన్నీ అంతిమ సారాంశంలో సంపన్న వర్గాలకు లాభం చేకూర్చి, సామాన్యులను ఉన్న చోట ఉంచేవే. కాకపోతే ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ సిద్ధాంత కర్తలు మొదటినుంచి సూచిస్తూ వచ్చిన ట్రికిల్ డౌన్ థియరీ ప్రకారం సామాన్యులకు కొన్ని ఎంగిలి మెతుకులు విదల్చటం వంటిది మాత్రం అందులో చూడవచ్చు. సంపదలన్నీ సంపన్నులకే దోచిపెడితే సామాన్యుల నుంచి వ్యతిరేకత పెరిగి ఎదురు తిరుగుతుందని ముందే గ్రహించిన సంస్కరణల మేధావులు ట్రికిల్ డౌన్, రిఫార్మ్స్ విత్ హ్యూమన్ ఫేస్ వంటి తరుణోపాయాలను కూడా మొదటనే సిఫారసు చేశారు. ఇంకా చెప్పాలంటే ఇందుకు కాపీ రైట్ జర్మనీ మొదటి ఛాన్సలర్ బిస్మార్క్ (1815–98)ది. ప్రస్తుత సందర్భంలో గమనించవలసిందేమంటే, ఈ రిఫార్మ్స్ విత్ హ్యూమన్ ఫేస్ అన్నది సంస్కరణల పట్ల ప్రజల వ్యతిరేకతను ఒక పరిమితిలో ఉంచేందుకు తప్పనిసరి అన్న ఉపాయాన్ని కొందరు పాలకులు గుర్తించి పాటించగా, బాబు వంటి వారు ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ నియంతల తరహాలో పక్కకు తోసేశారు.

తన ఈ స్వభావాన్ని చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా (2014–19) కూడా మార్చుకోలేదు. అందువల్లనే ఆయన పార్టీ గెలిచిన సీట్లు 102 (2014) నుంచి 23 (2019)కి పడిపోయాయి. అందుకు కారణం ఎవరితోనో పొత్తులు ఉండటం లేకపోవటంకాదు. నిజానికి ఆ కాలమంతా ఏపీలోని ఇతర పార్టీల బలం నామమాత్రమే. కనుక, చంద్రబాబును అంతగా పరాభవించిన కారణాలు ఆయన ప్రజా వ్యతిరేక విధానాలు, సంపన్నుల అనుకూల విధానాలు మాత్రమే. మొదలు అనుకున్నట్లు టీడీపీ అధ్యక్షుడు కేవలం తన ప్రజా వ్యతిరేకమైన సహజ స్వభావాన్ని మార్చుకోలేక 2019లో మరొకసారి మట్టికరిచారు.

ఇక రాజకీయ విధానాల విషయానికి వస్తే, చంద్రబాబు తీరు ఆయన కాంగ్రెస్‌ను వదిలి టీడీపీలో చేరినప్పటి నుంచి గత 29 సంవత్సరాలుగా కపటపూరితమైనదే. మొదట ఎన్టీఆర్ పట్ల, తర్వాత తనతో మైత్రి చేసిన కమ్యూనిస్టుల పట్ల, బీజేపీ పట్ల, కాపుల వంటి ప్రధాన కుల సమాజాల పట్ల, అల్ప సంఖ్యాక వర్గాల పట్ల, ఒక దశలో టీఆర్ఎస్ పట్ల ఆయన ఎప్పటికప్పుడు తన రాజకీయ అవసరాలను బట్టి అవకాశవాద ఎత్తుగడలను అనుసరిస్తూ వస్తున్నారు. ఎన్టీఆర్ ప్రాపకంవల్ల పైకి వచ్చి ఆయనకు ద్రోహం చేసి చివరకు మానసిక క్షోభతో మరణించేట్లు చేశారు. కమ్యూనిస్టులను టూరిజం తప్ప కమ్యూనిజం అనేదేమీ లేదని ఈసడించారు. బీజేపీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఎంతెంత దూషించారో, హైదరాబాద్‌లో అడుగు పెడితే అరెస్టు చేస్తామన్నారో లెక్కలేదు. ఈ ధోరణి ఎన్డీయే నుంచి బయటకు వచ్చి, ఇటీవల మళ్లీ ప్రవేశం కొరకు తాపత్రయ పడటం వరకు కొనసాగింది. కాపుల వంటి సమూహాలను ఎప్పుడూ చదరంగంలో పావులుగానే చూశారు.

చంద్రబాబు రాజకీయ విధానాలకు ప్రస్తుత ఎన్నికల సమయంలో మరొకమారు సామాన్యుల నుంచి ప్రశ్నార్థకత ఎదురవుతున్నది. జగన్ మోహన్ రెడ్డి పరిపాలన తను విమర్శిస్తున్నట్లు నిజంగానే అభివృద్ధి వ్యతిరేకంగా ఉన్నట్లయితే ఆయన జనసేన, బీజేపీలతో పొత్తు కోసం నెలల తరబడి అంతగా ఎందుకు వెంపర్లాడినట్లు? ఒక్క మాటలో చెప్పాలంటే, మూడు సుదీర్ఘ దశాబ్దాలుగా బాబుతో సమస్యంతా ఆయన విధానాలతోనే!

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆగదు పోరాటం



నా ప్రియమైన హిందూ అన్నా చెల్లెళ్లారా! చాలాకాలంగా నా సొంత చిన్న మార్గాల్లో ప్రయత్నిస్తూనే ఉన్నాను; కానీ బదాయూ (ఉత్తరప్రదేశ్) ఘోరం (ఇద్దరు పిల్లల్ని గొంతుకోసి చంపిన ఘటన) నన్ను దారుణంగా కలచివేసింది. మన పిల్లలు ఆయుష్, అహాన్‌ల సాక్షిగా చెబుతున్నాను, నా జీవితాంతం మతోన్మాదుల నుంచి మిమ్మల్ని కాపాడేందుకు పోరాడుతూనే ఉంటాను.

– అంబ్రీన్ జైదీ, రచయిత్రి

మార్పు మంచిదేనా?



కథువా (జమ్మూ) రేపిస్టులను 2018లో సమర్థించిన బీజేపీ నాయకుడు లాల్ సింగ్ ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరారు. కథువా అత్యాచార బాధితులకు మద్దతుగా నిలిచినందుకు బీజేపీ, రైట్‌వింగ్ తిట్లు, ట్రోలింగ్ ఎదుర్కొన్న షెహ్లా రషీద్ (యాక్టివిస్ట్) అనధికారికంగా బీజేపీలో చేరారు.

– మహమ్మద్ జుబేర్, ఫ్యాక్ట్ చెకర్

తప్పలేదు



సంగీత కళానిధి అవార్డును తిరిగి ఇచ్చేస్తున్నాను. మూల సూత్రాలకే ప్రమాదం వాటిల్లుతున్నందున చాలా జాగ్రత్తగా అన్నీ పరిగణించి ఈ నిర్ణయం తీసుకున్నాను. (మద్రాసు మ్యూజిక్ అకాడమీ టి.ఎం. కృష్ణకు సంగీత కళానిధి అవార్డు ఇస్తున్నందుకు నిరసనగా.)

– చిత్రవీణ రవికిరణ్, సంగీతకారుడు

అక్కడా ఇదే తినాలా?



నేనొక ట్రిప్‌కు వెళ్లాల్సి ఉంది. కచ్చితంగా ఇండియన్ ఫుడ్ వడ్డిస్తామనే చోటే ట్రావెల్ ఏజెంట్లు హోటళ్లు బుక్ చేస్తున్నారు. నాకు విదేశంలో కూడా ఇండియన్ ఫుడ్ వద్దని వారిని ఒప్పించలేకపోతున్నా.

– రీతూపర్ణా ఛటర్జీ, జర్నలిస్ట్

భావజాల పోరు



దీనికి సంగీతంతో, టి.ఎం. కృష్ణ ప్రతిభతో సంబంధం లేదు. ఇది పూర్తిగా భావజాల పోరాటం. గాయక సోదరీమణులైన రంజని – గాయత్రి రాజకీయాలను కొన్నేళ్లుగా గమనిస్తున్న వాళ్లకు ఇదేమీ ఆశ్చర్యం కలిగించదు. (మద్రాస్ మ్యూజిక్ అకాడెమీలో తమ ప్రదర్శనను వాళ్లు రద్దు చేసుకున్నారు.)

– రాధికా సంతానం, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

భగవంతుడు సమాధానం చెప్పాలి?

''ఈ భూమినీ, ఈ ప్రపంచాన్నీ సృష్టించిన ఒక సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి, భగవంతుడు ఉన్నాడని మీరు నమ్ముతున్నారు. అలా అయితే దానిని ఆయన ఎందుకు సృష్టించాడో చెప్పగలరా? ఈ ప్రపంచంలో ప్రజలు పేదరికంతో, రకరకాల కష్టాలతో, బాధలతో అనేక అత్యాచారాలకు గురవుతూ జీవిస్తున్నారు. ఎవ్వరూ తృప్తిగా జీవించడం లేదు. దయచేసి ఆయనకున్న శాసనాలకు లోబడి చేస్తున్నాడని అనబోకండి. ఆయనే గనుక కొన్ని శాసనాలకు కట్టుబడి ఉండవలసిన వాడైతే ఆయన కూడా ఒదిగి ఒదిగి వుండవలసిన బానిస మాత్రమే కాగలడు. ఇలా జనాన్ని బాధపెట్టడం ఆయనకు సరదా అని అనబోకండి. నీరో చక్రవర్తి రోమ్ నగరాన్ని తగులబెట్టించాడు. నీరో పరిమిత సంఖ్యలోనే ప్రజలను హతమార్చాడు. అనేక విషాదాలను తన చిద్విలాసం కోసమే ఆయన జరిపించాడు. మరి అలాంటి నీరో చక్రవర్తి స్థానం చరిత్రలో ఏమిటి? చరిత్రకారులు ఆయనను ఏ పేరుతో పిలుస్తారు?... నీరో చక్రవర్తి పరమ నిరంకుశుడు, హృదయం లేని పరమ క్రూరుడు అని చరిత్ర పుటల నిండా వర్ణించబడ్డాడు.

ఇక చెంఘిజ్ ఖాన్ క్రూరమైన సంతోషం కోసం వేలమందిని హతమార్చాడు. చెంఘిజ్ ఖాన్ పేరు చెబితేనే మనకు ఒళ్లు మండుతుంది. అత్యంత ద్వేషం, అసహ్యం కలుగుతుంది. అలాంటప్పుడు ప్రపంచంలోని అశేష ప్రజల జీవితాలనే దుఃఖభాజనం చేసే దేవుణ్ణి, ప్రతిరోజూ, ప్రతి గంట, ప్రతి నిమిషం కష్టాలతో, విషాదాలతో వారి జీవితాలను అధోగతి పాల్జేసే దేవుణ్ని, ఈనాటికీ వారిని కష్ట సముద్రాల్లో నిత్యమూ ముంచుతున్న దేవుణ్ణి మనం ఏమనాలి? చెంఘిజ్ ఖాన్, నీరో చక్రవర్తి ఎప్పుడో ఒకసారి చేసిన దానికంటే దేవుడు ఈ ప్రపంచంలోని ప్రజలను నిత్యమూ కష్టాలకు, బాధలకు అత్యాచారాలకు గురి చేస్తున్నప్పుడు ఆయనను ఎలా పూజించాలి? ఎలా కొలవాలి? మీకు నా సూటి ప్రశ్న ఇది. ఇంచుమించు నరకప్రాయంగా వున్న ఈ ప్రపంచాన్ని ఆయన ఇలా ఎందుకు సృష్టించాలి? ఎల్లప్పుడూ మానవులకు ఆవేదనలనూ, అశాంతినీ కలుగజేసే విధంగా ఈ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాలి. ఆయన చేసిన పనిని మనం ఎలా సమర్థించగలం? ఇదంతా ఆయన ఆనందానికే అయితే, నీరో చక్రవర్తికీ, భగవంతుడికీ ఏమిటీ తేడా?



భగత్ సింగ్

చెరసాలలో మగ్గేవాళ్లు, ఆకలి మంటలతో అలమటించేవాళ్లు లక్షలాది కోట్లాది ప్రజలు ఈ ప్రపంచంలో ఉన్నారు. దోపిడీ చేయబడుతున్న కష్టజీవులు, కార్మికులు, అభాగ్యులు, దీనులు, హీనులు ఉన్నారు. వీరంతా తమ రక్తాన్ని స్వేదంగా మారుస్తున్నారు. ఈ రక్తాన్ని పిండి పెట్టుబడిదారీ వర్గాలు రాబందుల వలె, జలగల వలె వీరిని పీలుస్తూ సంపన్నులవుతున్నారు... అవసరమైతే తమ లాభాల రక్షణ కోసం, నిల్వపడి వున్న సరుకులను, ఆహార ధాన్యాలను సముద్రం పాలు చేస్తున్నారు. ఆకలితో మలమల మాడే కోటాను కోట్ల ప్రజలకు ఈ ఆహార ధాన్యాలను, పాల డబ్బాలను, బట్టలను తదితర జీవితావసర వస్తువులను పంచిపెట్టరు. వారందరూ దార్శిద్ర్యంతో కడుపునిండా తిండిలేక, బట్టలేక, ఇల్లులేక ఎందుకు అలమటించాలి? దీనికి భగవంతుడు ఏమి సమాధానం చెబుతాడు? ఇలా ఎందుకు జరుగుతున్నది? ఇలా ఒకవైపున జరుగుతూ వుంటే నా సృష్టి అంతా సవ్యంగా ఉన్నదని భగవంతుడు ఎలా అనగలడు? దీనికి ఆయన ఏమైనా సమాధానం చెప్పగలడా? మౌనమే సమాధానమా?''

– ఎమ్.డి. మునీర్, సీనియర్ జర్నలిస్ట్

(రేపు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా 'నేనెందుకు నాస్తికుడినయ్యాను' అనే భగత్ సింగ్ పుస్తకం నుంచి)

జల గండం గట్టెక్కేదెలా?

మనకు అందుబాటులో ఉండే మంచి నీటిలో 90 శాతాన్ని వ్యవసాయం కోసమే వాడుతున్నాం. మిగతా పది శాతాన్ని తాగటానికి, పారిశ్రామిక అవసరాలకు వాడుకుంటున్నాం. అయినా, సాగు భూమిలో 24 శాతం విస్తీర్ణానికి మాత్రమే నీటి పారుదల సదుపాయం ఉంది. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయోత్పత్తుల దిగుబడిలో 40 శాతం సాగునీటి సదుపాయం ఉన్న భూముల ద్వారానే అందుతోంది.

నానాటికీ భూతాపం పెరుగుతున్న నేపథ్యంలో నీటిపారుదల సదుపాయాన్ని మరింత విస్తరింప జేసుకోవడానికి వ్యవసాయక దేశాలు ప్రయత్నించటం సహజమే. అయితే, ఈ విస్తరణ ఆహార అవసరాల కోసమే అయినప్పటికీ అది పర్యావరణ అస్థిరతకు దారితీయకుండా ఉండేలా చూసుకోవాలన్నది నిపుణుల మాట. కాని, ఇందుకు భిన్నంగా జరుగుతోంది. ఇప్పటికే నీటి వనరులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న ప్రాంతాల్లోని నదుల్లో పారే నీటిని ప్రకృతి అవసరాల కోసం, మనుషుల ఇతర అవసరాల కోసం మిగల్చకుండా దాదాపు మొత్తాన్నీ వ్యవసాయానికే మళ్లించటం వంటి అస్థిర నీటి విస్తరణ కార్యకలాపాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది.

తాజా అధ్యయనం హెచ్చరిక

243 దేశాల ఇరిగేషన్ ప్రాజెక్టుల గణాంకాలపై అమెరికా, జర్మనీ, ఫిన్లాండ్, చైనాకు చెందిన పరిశోధకులు చేసిన తాజా అధ్యయనం ప్రకారం... 21వ శతాబ్దం తొలి (2000 – 2015 వరకు) 15 ఏళ్లలో ప్రపంచ వ్యాప్తంగా సాగునీటి పారుదల 11 శాతం మేరకు విస్తరించింది. 2000–2015 మధ్యకాలంలో 29.7 కోట్ల హెక్టార్ల నుంచి 33 కోట్ల హెక్టార్లకు పెరిగింది. భారత్, చైనాల్లో ఈ విస్తరణ ఎక్కువగా ఉంటే, రష్యాలో తగ్గటం విశేషం.

ఆహారోత్పత్తిలో స్వావలంబన సాధించే లక్ష్యంతో భారీ నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించటం ద్వారా చైనా కోటి 28 లక్షల హెక్టార్లలో, భారత్ 85 లక్షల హెక్టార్లలో సాగు భూమికి ఈ 15 ఏళ్లలో అదనంగా నీటిపారుదల సదుపాయాన్ని విస్తరింప చేసుకున్నాయి. అయితే, అప్పటికే నీటి వనరులపై తీవ్ర ఒత్తిడి ఉన్న ఈ దేశాల్లో ఈ సరికొత్త డ్యామ్‌ల నిర్మాణం వల్ల నదుల్లో జల ప్రవాహం, భూగర్భజలాలపై ఒత్తిడి మరింత పెరిగిందని ఈ అధ్యయనం చెబుతోంది.

బ్రెజిల్ 34 లక్షల హెక్టార్లలో అదనంగా నీటిపారుదల సదుపాయాలు కల్పించగా,



ఇందులో 96 శాతం విస్తీర్ణం జల వనరుల లభ్యత సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో ఆ పని చేసింది. ఫ్రాన్స్ 88 శాతం, ఇటలీ 85 శాతం, పెరు 94 శాతం, ఇండోనేషియా 76 శాతాలతో సుస్థిర నీటిపారుదల విస్తరణలో ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

జలవనరులు ఇప్పటికే తీవ్ర ఒత్తిడికి గురవుతున్న ప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులు నిర్మిస్తే... అప్పటికే నీటిపారుదల సదుపాయం ఉన్న ప్రాంతాల్లోనూ నీటి లభ్యత కొరవడి ఆహారోత్పత్తి కూడా అనిశ్చితికి గురవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పర్యావరణ సంక్షోభ పరిస్థితులే రాష్ట్రాలు, ప్రాంతాలు, దేశాల మధ్య జల జగడాలకు అగ్గి రాజేస్తున్నాయి.

వ్యవసాయంలో నీటి వినియోగం ఎక్కువగా ఉండటానికి ఒక ముఖ్య కారణం రసాయనిక పారిశ్రామిక వ్యవసాయ పద్ధతేనని అనేక అధ్యయనాల్లో వెల్లడైంది. చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు చేసిన గత 14 నెలల కాలం నీటి విపత్తు నుంచి బయటపడాలంటే సాగు పద్ధతి మార్చుకోవాల్సిందేనని హెచ్చరిస్తోంది. ప్రకృతికి అనుగుణమైన సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించటం ద్వారా 50 శాతం సాగు నీటి అవసరాలను క్షేత్రస్థాయిలో తగ్గించవచ్చని తేల్చిచెప్తున్న సుసంపన్న క్షేత్రస్థాయి అనుభవాలు మన ముందున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల భాగస్వామ్యంతో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతే ఇందుకు ప్రబల ఉదాహరణ. సగానికి సగం నీటి వినియోగం తగ్గటంతో పాటు... అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల్ని తట్టుకోవటంలోనూ, రైతుల నికరాదాయాన్ని పెంచటంలోనూ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు తలెత్తుకొని నిలుస్తున్న ఉదంతాలు కూడా మనకు తెలుసు.

ప్రోత్సాహం అవశ్యం

వ్యక్తిగత శ్రద్ధ, శారీరక శ్రమ అదనంగా అవసరమయ్యే ప్రకృతి వ్యవసాయం వైపు ఎక్కువ మంది రైతులు ఆకర్షితులవ్వాలంటే పాలకులు మరింత తెలివైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఈ రైతులకు నేరుగా ప్రత్యేక ఆర్థిక ప్రోత్సాహం అందించాలి. రసాయనాల్లేకుండా పండించిన ఆహారోత్పత్తులకు గ్రామస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు ప్రత్యేక విశ్వసనీయమైన మార్కెటింగ్ వ్యవస్థను నిర్మించటం ద్వారా వినియోగదారులకు అందుబాటులోకి తేవాలి. అప్పుడే ప్రకృతి సేద్యం తామరతంపర అవుతుంది. 'క్లైమెట్ ఎమర్జెన్సీ'నీ, దుర్భిక్షాన్నీ, పౌష్టికాహార లోపాన్నీ దీటుగా ఎదుర్కోవటానికి మన దేశానికి పునరుజ్జీవన సేద్యం అత్యవసరమే కాదు, అనివార్యం కూడా!

– పంతంగి రాంబాబు, సీనియర్ జర్నలిస్టు

సుఖమే దుఃఖం

దహింప బడతాను అని తెలియక పురుగు అగ్నిలో పడి చస్తుంది. చస్తాను అని తెలియక గాలానికి ఉన్న ఎరను తిని చేప తన ఆయుష్షు పోగొట్టుకుంటుంది. కానీ మనం మాత్రం తెలిసి తెలిసి కొన్ని వ్యామోహాలలో చిక్కుకొని, కొన్ని తప్పుదారుల్లో నడిచి వినాశనం కొని తెచ్చుకుంటాం. తరచి చూస్తే మనం ఏవి సుఖాలని వెంట పడతామో అవే అసలు దుఃఖాలుగా గ్రహించే సరికి జీవితం ముగిసిపోతుంది.



ముసలితనం పెద్దపులి వలె భయపెడుతూ మనపై పడుతుంది. రోగాలు శత్రువుల్లా శరీరాన్ని కబళిస్తాయి. రంధ్రం పడిన కుండలోని నీరులా ఆయువు తరిగి పోతుంది. 'లోకం శోక హతం చ సమస్తం' అని తెలిసినప్పటికీ ఆశాపాశంతో జీవితం ముడిపడి మనం తప్పు దారిని విడవడం లేదు. మనకు కోరికలు తీరుతున్న కొద్దీ ఇంకా ఇంకా అనుభవించాలి, పొందాలి అనే తృష్ణ ఏర్పడుతుంది. తృష్ణను పారద్రోలి తృప్తిని పెంచుకున్న మానవుడు నిత్యానందాన్ని అనుభవిస్తాడు.

సంతృప్తిని మించిన సౌభాగ్యం లేదు. 'తృప్తిని పొందని మనుజుడు సప్త ద్వీప ములనైన చక్కం బడడు' అని పోతన చెప్పారు.

భక్తి, సజ్జన సాంగత్యం మాత్రమే మనిషికి సంతృప్తినీ, శాంతినీ ఇవ్వగలవు.

– ధనిష్ఠ

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.త్రయోదశి పూర్తి (24 గంటలు), **నక్షత్రం:** మఖ తె.4.46 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.3.35 నుండి 5.19 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.29 నుండి 9.17 వరకు, తదుపరి ప.12.32 నుండి 1.20 వరకు, **అమృతఘడియలు:** రా.2.10 నుండి 3.56 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.07, **సూర్యాస్తమయం:** 6.07.

ఆధ్యాత్మిక శోభ..
అజ'రామ'రం



సర్కారు కృషితో అందాల సిరిగా ఏకశిలానగరం
ఒంటిమిట్ట ఆలయం చుట్టూ మాడవీధులు
ఉద్యాన వనాలతో కొత్త కళ
యాత్రికులకు అధునాతన వసతి సాకర్యాలు
పుష్కరిణికి కొంగొత్త హంగులు

ఏకశిలపై వెలసిన ఆధ్యాత్మిక నగరి.. అందాల పురి.. ఆంధ్ర అయోధ్య ఒంటిమిట్ట కోదండ రామాలయం కొత్త కళతో మిలమిలా మెరిసిపోతోంది. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్టకు అధికారిక గుర్తింపు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ ఆలయ అభివృద్ధిని అటకెక్కించింది. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఇది అద్భుత క్షేత్రంగా ఆవిష్కృతమైంది. సుమనోహర మాడవీధులు, సుందర ఉద్యానవనాలతో అజరామర కోవెలై విరాజిల్లుతోంది. – సాక్షి, రాయచోటి


వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విశాలంగా అన్ని వసతులతో ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక

రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు

2019 తర్వాత టీటీడీ ఆధ్వర్యంలో ఒంటిమిట్టలో సుమారు రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టారు. ప్రధానంగా శాశ్వత కల్యాణ మండపంతోపాటు చుట్టూ ప్రహరీ నిర్మాణం, భక్తులకు విశ్రాంతి గదులు, వీవీఐపీల అతిథి గృహాలు, కొండపై పార్వేట మండపం, పుష్కరిణి, ఆలయ సమీపంలో రామసేతు కోనేరు ఆధునీకరణ, రామాలయం చుట్టూ మాడవీధుల నిర్మాణాలు జరిగాయి. పచ్చదనంతో కూడిన ఉద్యాన వనాలతో కోవెల కొత్త అందాలు సంతరించుకుంది. ఆలయంలో ప్రత్యేకమైన బండరాయితో చప్టా ఏర్పాటైంది. గుడి వెలుపల మండపం నిర్మితమైంది. నూతన రథం సమకూరింది. ఆలయం చుట్టూ ఆక్రమణలు తొలగించారు. కొత్త రోడ్ల నిర్మాణాలతో ఏకశిలానగరం ముగ్ధమనోహరమై ఆకర్షిస్తోంది. క్షేత్రంలో జాంబవంతుడు, పోతన, హనుమంతుని విగ్రహాల ఏర్పాటుకూ వేగంగా సన్నాహాలు చేస్తున్నారు. శ్రీరామ ఎత్తిపోతల పథకంలో భాగంగా సోమశిల నుంచి ఒంటిమిట్ట చెరువుకు పైపులైన్ ద్వారా నీటిని అందించేలా చేపట్టిన పనులూ పూర్తయ్యాయి.

టీడీపీ హయాంలో అంతంత మాత్రమే

2014లో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయాన్ని పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. 2015 సెప్టెంబరు 9న ఆలయాన్ని టీటీడీలో విలీనం చేశారు. తర్వాత కాలంలోనూ అభివృద్ధి పనులు అంత వేగంగా జరగలేదు. పైగా 2018లో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా స్వామి కల్యాణం రోజున ప్రకృతి విపత్తుతో అనేక దుష్పరిణామాలు చోటుచేసుకున్నాయి. కల్యాణం రోజు ఇంతటి అపశృతి చరిత్రలో ఎన్నడూ చూడలేదని స్థానికులు చెబుతున్నారు. 2014 నుంచి స్వామికి కల్యాణం రోజున పట్టు వస్త్రాలు సమర్పించేందుకు స్వయంగా సీఎం హోదాలో అప్పటి టీడీపీ అధినేత చంద్రబాబు వచ్చినా అభివృద్ధి దిశగా అంత ఆలోచనచేయలేదని విమర్శిస్తున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా టీటీడీ అధికారుల ద్వారా అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేసి భక్తులకు అన్ని వసతులూ కల్పించింది.

పౌర్ణమి వెలుగులో స్వామి కల్యాణం

ఒంటిమిట్టలో ఏటా శ్రీరామనవమిని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ కోదండ రాముని కల్యాణ ఘట్టం పౌర్ణమి వెన్నెల్లో చంద్రుడి సాక్షిగా నిర్వహించడం ఆనవాయితీ. గతంలో కల్యాణ వేదిక అందుబాటులోలేక అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో కల్యాణ వేదికకు స్థలాన్ని కేటాయించడంతోపాటు అందులో శాశ్వత మండప నిర్మాణాలు పూర్తి చేయడంతో ఏటా స్వామి కల్యాణం నిర్వహిస్తూ వస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో మధ్యాహ్న సమయంలో భక్తులకు నిత్యాన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. రెండో శనివారం తిరుమల లడ్డూ ప్రసాదాన్నీ విక్రయిస్తున్నారు.

అభివృద్ధితో కళకళ



చిన్నతనం నుంచి చూస్తున్న ఒంటిమిట్ట శ్రీకోదండ రామాలయం గత నాలుగేళ్లలో నమ్మలేనంతగా మారిపోయింది. ఆలయాన్ని చూస్తుంటే కళ్లు చెదిరిపోతున్నాయి. ప్రభుత్వం బాగా అభివృద్ధి చేసింది. గుడి కళకళలాడుతోంది. భక్తులకు సకల వసతులూ సమకూరాయి.
– శ్రీనివాసులు, ఒంటిమిట్ట

రామయ్యకు రాజయోగం



నేను కొన్నేళ్లు ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం చైర్మన్‌గా పనిచేశాను. ఇతిహాసాల్లోనూ ఒంటిమిట్ట రామయ్యకు చరిత్ర ఉంది. అంతటి ప్రాధాన్యం ఉన్న ఈ ఆలయం గురించి గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ సర్కారు హయాంలో రామయ్యకు రాజయోగం పట్టింది. చాలా సంతోషంగా ఉంది. ఈ ప్రభుత్వం వచ్చాక బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి.
– ముమ్మడి నారాయణరెడ్డి, పెన్నపేరూరు, ఒంటిమిట్ట మండలం

అద్భుత క్షేత్రమైంది

ఈ రామాలయం టీటీడీ ఆధ్వర్యంలో అద్భుత క్షేత్రంగా ఆవిష్కృతమైంది. భక్తులకు కావాల్సిన విడిది గృహం సమకూరింది. స్వామి శాశ్వత కల్యాణ వేదిక నిర్మితమైంది. పచ్చని నందన వనాలు కనువిందు చేస్తున్నాయి. వీవీఐపీ బిల్డింగ్, అన్నప్రసాద కేంద్రం, నూతనంగా నిర్మించిన పార్వేటి మండపంతో ఆలయం అభివృద్ధి బాటపట్టింది. పుష్కరిణి, రామాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలవ రాతి బండలు, రామతీర్థం భక్తులను ఆకట్టుకుంటున్నాయి. – నటేష్‌బాబు, డిప్యూటీ ఈఓ, ఒంటిమిట్ట

వేడుకగా రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి తెప్పోత్సవం



తిరుమల: తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామివారు తెప్పలపై భక్తులకు అభయమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లో వైభవంగా ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన తెప్పపై స్వామివారు ఆశీనులై పుష్కరిణిలో ముమ్మార్లు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వేదం, గానం, నాదం మధ్య తెప్పోత్సవం వేడుకగా జరిగింది. మూడోరోజు శ్రీభూ సమేతంగా మలయప్పస్వామివారు తిరుచ్చిపై సర్వాలంకార భూషితుడై పురవీధుల్లో ఊరేగిన అనంతరం కోనేటిలోని తెప్పపై ఆశీనుడై ముమ్మార్లు విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి, చీఫ్ పీఆర్వో డాక్టర్ టి.రవి, శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, అధికారులు పాల్గొన్నారు.

కొల్లేటికోట కిటకిట

పెద్దింట్లమ్మకు బోనాలు సమర్పణ / ఆకట్టుకున్న ప్రభల ఊరేగింపు

కైకలూరు: ప్రకృతి రమణీయత, పక్షుల కేరింతల మధ్య కొల్లేటికోట పెద్దింట్లమ్మ ప్రాంగణం అమ్మ స్మరణతో గురువారం మార్మోగింది. కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర ఈనెల 11న ప్రారంభమైంది. జాతరలో కీలకఘట్టం జలదుర్గా, గోకర్ణేశ్వరుని కల్యాణం గురువారం రాత్రి జరిగింది. తెలంగాణ బోనాల సంప్రదాయాన్ని ఐదేళ్లుగా ఈ కళ్యాణం రోజున అమలు చేస్తున్నారు. బోనాలపై కలువపువ్వులు, దీపాలతో ఏలూరు జిల్లాలోని కొల్లేరు గ్రామాల నుంచి వేలాదిగా మహిళలు బోనాలతో నడుచుకుంటూ వచ్చి అమ్మకు సమర్పించారు. మహిళలు ఎర్రటి చీరలు ధరించి బోనాలపై అమ్మ సన్నిధికి చేరే దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. బోనాలు ప్రారంభించి ఐదేళ్లవడంతో పందిరిపల్లిగూడెం నుంచి పెద్దింట్లమ్మకు పంచభోగ ప్రసాదాలు (చక్కెర పొంగలి, పులిహోర, గారె, బూరి, బూందీ)లను ఎడ్లబండిపై తీసుకొచ్చి గ్రామస్తులు సమర్పించారు. పందిరిపల్లిగూడెం నుంచి అమ్మవారి దేవస్థానం వరకు ప్రభల ఊరేగింపు ఆకట్టుకుంది. ఆలయ ఈవో కె.వి. గోపాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



24, 25 తేదీల్లో తుంబురు తీర్థ ముక్కోటి

తిరుమల: తిరుమల శ్రీ తుంబురు తీర్థ ముక్కోటి ఉత్సవం మార్చి 24, 25వ తేదీల్లో ఘనంగా జరుగనుంది. తీర్థానికి విశేషంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా తుంబురు తీర్థానికి మార్చి 24వ తేదీ ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, 25వ తేదీ ఉదయం 5 నుంచి 11 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతిస్తారు. పాపవినాశనం డ్యామ్ వద్ద భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదాలు, తాగునీరు అందిస్తారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులు, మందులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. తీర్థానికి ఎక్కువ దూరం నడవాల్సి ఉండటంతో గుండె, శ్వాస కోశ సమస్యలు, స్థూలకాయం ఉన్నవారికి అనుమతి లేదు. భక్తులు వంట సామగ్రి, కర్పూరం, అగ్గిపెట్టెలు తీసుకురాకూడదని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. పోలీసు, అటవీశాఖ, టీటీడీ విభాగం సమన్వయంతో పాపవినాశనం నుంచి తుంబురు తీర్థం వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టనున్నారు.

రాజకీయ అజ్ఞాని పవన్



రాజమహేంద్రవరం సిటీ: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఒక ఆలోచన, లక్ష్యం లేవని, కేవలం బాబు పల్లకీ మోయడమే పనిగా పెట్టుకోవడంతో.. ఆయన సామాజిక వర్గీయుల ఆగ్రహానికి గురవుతున్నారని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. రాజమహేంద్రవరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పిఠాపురం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వంగా గీతను, కాకినాడ లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్‌ను జనసేన పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారంటూ భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ ఎంతసేపూ బాబును సీఎంను చేయడానికే ఆరాటపడుతున్నాడని దుయ్యబట్టారు. కాకినాడ జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానాన్ని కాపు సామాజిక వర్గానికి ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీకి దక్కిందన్నారు. రాజకీయాల్లో మార్పు కోసం పార్టీ పెట్టానని చెప్పుకుంటున్న పవన్.. ఆ పార్టీ స్థాపించి పదేళ్లవుతున్నదని, అసలు ఆయన ఆలోచనలోనే మార్పు రావాలని భరత్‌రామ్ సూచించారు.

25న భద్రాద్రి రామయ్య పెళ్లి పనులకు శ్రీకారం

అదే రోజు డోలోత్సవం, వసంతోత్సవం • ఏప్రిల్ 9న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణ ఘడియలు సమీపిస్తున్నాయి. ఏప్రిల్ 17న శ్రీరామ నవమి, 18న పట్టాభిషేక మహోత్సవం జరగనున్నాయి. ఈ క్రమంలో ఈనెల 25న పెళ్లి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఉత్తర ద్వారం వద్ద సంప్రదాయపద్ధతిలో ప్రత్యేక పూజలు చేసి, పసుపు కొమ్ములను దంచుతారు. అలాగే తలంబ్రాలు కలిపే క్రతువును ప్రారంభిస్తారు. అదేరోజు హోలీ కావడంతో వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించనున్నారు.

సుమారు 200 క్వింటాళ్ల తలంబ్రాలు..


భక్తులు పవిత్రంగా భావించే స్వామి వారి తలంబ్రాలను గత ఏడాది సుమారు 180 క్వింటాళ్లు తయారు చేశారు. ఈ ఏడాది 200 క్వింటాళ్ల మేర కలిపేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటిని నవమి రోజున ప్రత్యేక కౌంటర్ల ద్వారా భక్తులకు ఉచితంగా పంపిణీ చేయడమే కాక ముత్యాలతో కూడిన తలంబ్రాలను విక్రయిస్తారు. ఇక శ్రీరామనవమికి సంబంధించిన పనుల టెండర్లు పూర్తి కాగా, పనులు ప్రారంభించాల్సి ఉంది. ఈ అంశంపై భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక ఆల కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కాగా ఏటా ఉగాది రోజున ముఖ్యమంత్రి, గవర్నర్‌కు శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవ ఆహ్వాన పత్రికలను అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆహ్వాన పత్రిక అందజేసినా సీఎం వస్తారా లేక ఉన్నతాధికారులు హాజరవుతారా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా, ఏప్రిల్ 9 నుంచి 23వ తేదీ వరకు దేవస్థానంలో వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

టీడీపీ, జనసేనలను వీడిన 450 మందికి పైగా నేతలు, కార్యకర్తలు

నరసాపురం/భీమవరం/ఉండి/ఏలూరు టౌన్/నరసాపురం రూరల్: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలోని 26వ వార్డులో 50 మంది కార్యకర్తలు స్థానిక పార్టీ దళిత విభాగం సీనియర్ నేత ఇంజేటి రవీంద్ర ఆధ్వర్యంలో జనసేన, టీడీపీలను వీడి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. భీమవరం 25వ వార్డుకు చెందిన 100 మంది జనసేన, టీడీపీ నాయకులతో పాటు పట్టణంలోని ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు భారీగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బొమ్మదేవర ముస్లి, కలిశెట్టి శ్రీనివాస్, పోలిశెట్టి సత్యనారాయణ, కర్ర స్వామి, బొమ్మదేవర మందు తదితరులున్నారు. ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ సమక్షంలో 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరు శ్రీరామ్ నగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు దారపు తేజ, గేదెల సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో పోణంగికి చెందిన 200 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నరసాపురం మండలం చామకూరిపాలెంలోని అంబేద్కర్ నగర్‌లో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు గుంపుల రత్నరాజు ఆధ్వర్యంలో 50 మంది జనసేన, టీడీపీ కార్యకర్తలు పార్టీ నేత పీడీ రాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.


నరసాపురంలో జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రసాదరాజు


భీమవరంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన, టీడీపీ నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే గ్రంథి


ఉండిలో వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు


ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పోణంగి టీడీపీ నేతలు


నరసాపురంలోని చామకూరిపాలెంలో కార్యకర్తలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న పార్టీనేత పీడీ రాజు




గురువారం రాత్రి కేజ్రీవాల్ నివాసంలో ఈడీ అధికారులు


కేజ్రీవాల్ నివాసం వెలుపల ఆప్ శ్రేణుల ఆందోళన


కేజ్రీవాల్ నివాసం వద్ద మోహరించిన భద్రతా బలగాలు

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్ట్

► మొదటి పేజీ తరువాయి

పరిణామాలు చకచకా జరిగిపోయాయి. తొలుత అదనపు డైరెక్టర్ నేతృత్వంలో 10 మంది ఈడీ అధికారులు సెర్చ్ వారెంట్‌తో ఢిల్లీ ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని కేజ్రీవాల్ అధికారిక నివాసానికి చేరుకున్నారు. రెండున్నర గంటలపాటు ప్రశ్నించారు. కేజ్రీవాల్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యుల ఫోన్లను సీజ్ చేశారు. అనంతరం రాత్రి 9.11 గంటలకు ఆయనను అరెస్టు చేశారు. రాత్రి 11 గంటలకు తమ ప్రధాన కార్యాలయానికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. కేజ్రీవాల్‌ను శుక్రవారం ఉదయం కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. కోర్టు అనుమతితో తమ కస్టడీలోకి తీసుకొని, విచారణ జరపాలని ఈడీ అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. కేజ్రీవాల్ అరెస్టు సమాచారాన్ని ఆయన భార్యకు తెలియజేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో సిట్టింగ్ ముఖ్యమంత్రి అరెస్టు కావడం సంచలనాత్మకంగా మారింది. ఇదే కేసులో తెలంగాణ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవితను గతవారం ఈడీ అధికారులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

కేజ్రీవాల్ నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత

కేజ్రీవాల్ అరెస్టు సందర్భంగా ఆయన నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కేజ్రీవాల్‌కు అనుకూలంగా, ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేజ్రీవాల్ నివాసం చుట్టూ ఢిల్లీ పోలీసులతోపాటు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మోహరించారు. స్థానికంగా 144 సెక్షన్ విధించారు. నినాదాలు చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.



హైకోర్టు ఉత్తర్వుపై సుప్రీంకోర్టుకు కేజ్రీవాల్

లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్‌కు ఈడీ ఇప్పటిదాకా తొమ్మిది సార్లు సమన్లు జారీ చేసింది. ఒక్కసారి కూడా ఆయన విచారణకు హాజరుకాలేదు. గురువారం కూడా విచారణకు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ రాలేదు. తనకు సమన్లు జారీ చేయడం చట్టవిరుద్ధమని ఆయన చెప్పారు. ఈడీ తనను అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, ఊరట దక్కలేదు. అరెస్టు చేయకుండా రక్షణ కల్పించలేమని హైకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును వ్యతిరేకిస్తూ ఆయన వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ దాఖలు చేశారు. గురువారం రాత్రే అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరారు. ఇంతలోనే అరెస్టయ్యారు. కేజ్రీవాల్ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది. లిక్కర్ స్కామ్‌లో ఈడీ గతంలో దాఖలు చేసిన చార్జిషీట్లలో కేజ్రీవాల్ పేరును అధికారులు పలుమార్లు ప్రస్తావించారు.

జైలు నుంచే పరిపాలన!

కేజ్రీవాల్ అరెస్టు అయినప్పటికీ ఢిల్లీ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, అవసరమైతే జైలు నుంచే పరిపాలన కొనసాగిస్తారని ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత అతీషి ప్రకటించారు. కేజ్రీవాల్‌ను చూసి ప్రధాని నరేంద్ర మోదీ భయపడుతున్నారని, అందుకే లోక్‌సభ ఎన్నికల ముందు అక్రమంగా జైలుకు పంపించడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. సరిగ్గా ఎన్నికల సమయంలోనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం వెనుక పెద్ద కుతంత్రం ఉందని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా విమర్శించారు. కేజ్రీవాల్ అరెస్టును తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఖండించారు. ప్రతిపక్ష నేతలను మోదీ ప్రభుత్వం వేధిస్తోందని మండిపడ్డారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికం, దిగజారుడుతనానికి నిదర్శనమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఆక్షేపించారు. మరోవైపు, లిక్కర్ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి పదవికి కేజ్రీవాల్ వెంటనే రాజీనామా చేయాలని, దర్యాప్తునకు సహరించాలని ఢిల్లీ బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

అరెస్టయిన మొట్టమొదటి సిట్టింగ్ సీఎం

దేశంలో ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతూ అరెస్టయిన మొట్టమొదటి సిట్టింగ్ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కావడం గమనార్హం. గతంలో బిహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సైతం పదవిలో ఉండగానే అరెస్టయ్యారు. కానీ, దర్యాప్తు సంస్థలు కస్టడీలోకి తీసుకోవడం కంటే ముందే తమ పదవికి రాజీనామా చేశారు. కేజ్రీవాల్ మాత్రం ఇంకా రాజీనామా చేయలేదు.

ఏమిటీ కుంభకోణం?

➤ ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం 2021 నవంబర్‌లో నూతన మద్యం విధానాన్ని(పాలసీ) ప్రవేశపెట్టింది. ఈ విధానం ప్రకారం.. లిక్కర్ రిటైల్ విక్రయాల నుంచి ప్రభుత్వం తప్పుకుంది. మద్యం దుకాణాలను నడపడానికి ప్రైవేట్ లైసెన్స్‌దారులకు అనుమతులు ఇచ్చింది. దీనివల్ల లిక్కర్ బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట పడుతుందని, ప్రభుత్వ ఆదాయం భారీగా పెరుగుతుందని అరవింద్ కేజ్రీవాల్ సర్కారు ప్రకటించింది.

➤ కొత్త పాలసీ కింద మద్యం దుకాణాలను అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా.. తెల్లవారుజామున 3 గంటల వరకు తెరిచి ఉంచవచ్చు. మద్యంపై ప్రైవేట్ లైసెన్స్‌దారులు అపరిమితమైన డిస్కౌంట్ ప్రకటించవచ్చు. వినియోదారులకు అకర్షణీయమైన అఫర్లు ఇవ్వొచ్చు. లిక్కర్ హోం డెలివరీ కూడా చేయ్యొచ్చు. ఇవన్నీ మద్యం అమ్మకాలు పెంచుకోవడానికి ఉద్దేశించినవే. కొత్త పాలసీ వల్ల లిక్కర్‌పై ఆదాయం 27 శాతం పెరిగిందని, రూ.8,900 కోట్ల రాబడి వచ్చిందని ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది.

➤ కేజ్రీవాల్ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం విధానాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. నివాస గృహాల మధ్య విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారని, ఢిల్లీకి లిక్కర్ సంస్కృతిని తీసుకొచ్చారని బీజేపీ నాయకులు ఆరోపించారు.



➤ కొత్త మద్యం విధానంలో చాలా ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని, ప్రైవేట్ లైసెన్స్‌దారులకు అనుచిత ప్రయోజనాలు కల్పించారని స్పష్టం చేస్తూ 2022 జూలైలో ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేశ్ కుమార్ ఒక నివేదిక విడుదల చేశారు. కోవిడ్-19 వ్యాప్తి సమయంలో ప్రైవేట్ వ్యాపారులకు ప్రభుత్వం రూ.144 కోట్ల మేర లైసెన్స్ ఫీజు మినహాయింపు ఇచ్చిందని వెల్లడించారు.

➤ చీఫ్ సెక్రెటరీ నివేదికపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా స్పందించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీపై సీబీఐ విచారణ జరపాలంటూ సిఫార్సు చేశారు. తమపై వస్తున్న ఆరోపణలను ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు కొట్టిపారేశారు. తర్వాత కొన్ని రోజులకే నూతన లిక్కర్ పాలసీని కేజ్రీవాల్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. 400 మద్యం దుకాణాలు మూతపడ్డాయి. ఢిల్లీలో మద్యం విక్రయాలు మళ్లీ ప్రభుత్వ నియంత్రణలోకి వచ్చాయి.

➤ లెఫ్టినెంట్ గవర్నర్ సిఫార్సు మేరకు లిక్కర్ స్కామ్‌పై సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. 2022 ఆగస్టులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత మనీష్ సిసోడియా నివాసంతోపాటు 31 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. అయితే, ఈ సోదాల్లో సీబీఐకి ఎలాంటి ఆధారాలు దొరకలేదని మనీష్ సిసోడియా చెప్పారు. తమ పార్టీని అప్రతిష్ట పాలు చేయడానికి బీజేపీ పెద్దలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

➤ ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీ లాండరింగ్ కూడా జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గుర్తించింది. మనీష్ సిసోడియాతో పాటు మరో 14 మందిపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ సైతం కేసు నమోదు చేసింది. దర్యాప్తునకు శ్రీకారం చుట్టింది.

➤ అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) అధినేత కె.చంద్రశేఖరరావు కుమార్తె, తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని ‘సౌత్ గ్రూప్’కు లబ్ధి చేకూర్చడానికి వీలుగా కొత్త లిక్కర్ పాలసీని కేజ్రీవాల్ ప్రభుత్వం రూపొందించినట్లు ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. సౌత్ గ్రూప్‌కు పెద్ద ఎత్తున లైసెన్స్‌లు దక్కినట్లు తేల్చింది.

➤ తమకు అనుకూలంగా మద్యం విధానాన్ని రూపొందించినందుకు ప్రతిఫలంగా ఆమ్ ఆద్మీ పార్టీకి సౌత్ గ్రూప్ రూ.100 కోట్ల ముడుపులు చెల్లించినట్లు ఈడీ ఆరోపించింది. ఈ సొమ్మును గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఖర్చు చేసినట్లు తెలియజేసింది. ఢిల్లీలో లిక్కర్ వ్యాపారం ద్వారా సౌత్ గ్రూప్ ఈ రూ.100 కోట్లు తిరిగి రాబట్టుకున్నట్లు పేర్కొంది. నూతన లిక్కర్ పాలసీ వల్ల ఢిల్లీ ప్రభుత్వానికి రూ.2,800 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ఈడీ తేల్చిచెప్పింది.

➤ ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరుణ్ పిళ్లై, సమీర్ మహేంద్రు, పి.శరత్‌చంద్రారెడ్డి, బినోయ్‌బాబు, అభిషేక్ బోయినపల్లి, విజయ్ నాయర్, అమిత్ అరోరా, గోరంట్ల బుచ్చిబాబు, గౌతమ్ మల్హోత్రా, రాజేష్ జోషి, మాగుంట రాఘవ, మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, కల్వకుంట్ల కవిత అరెస్టయ్యారు. వీరిలో అరుణ్ పిళ్లై, మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్ జ్యుడీషియల్ కస్టడీలో ఉండగా, కల్వకుంట్ల కవిత ఈడీ కస్టడీలో ఉన్నారు. మనీష్ సిసోడియా అనుచరుడు దినేష్ అరోరా, మాగుంట రాఘవ, గోరంట్ల బుచ్చిబాబు పి.శరత్‌చంద్రారెడ్డి అప్రూవర్లుగా మారారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఈ కేసులో సీబీఐ విచారించింది. తాజాగా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అదుపులోకి తీసుకుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

‘మోదీ’ ప్రకటనలపై ఈసీకి ఫిర్యాదు

న్యూఢిల్లీ: ప్రభుత్వ వనరులను దుర్వినియోగం చేస్తూ బీజేపీ ‘మోదీకీ పరివార్’, ‘మోదీ కీ గ్యారెంటీ’ ప్రకటనలను గుప్పిస్తోందని, వీటిని వెంటనే తొలగించి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదుచేసింది. ముకుల్ వాస్నిక్, సల్మాన్ ఖుర్షీద్‌ల కాంగ్రెస్ ప్రతినిధి బృందం గురువారం ఈసీని కలిసి ఎన్నికల కోడ్‌ను బీజేపీ ఎలా ఉల్లంఘించిందో వివరించింది. సుప్రీంకోర్టు గతంలోనే క్లీన్‌చిట్ ఇచ్చినా 2జీ స్పెక్ట్రమ్ కేసులో అభూత కల్పనలతో బీజేపీ తప్పుడు అడ్వర్టైజ్‌మెంట్లు ఇచ్చిందని ఈసీకి ఫిర్యాదుచేసింది.

అరుణాచల్ భారత్‌దే: అమెరికా

వాషింగ్టన్: అరుణాచల్ ప్రదేశ్‌ను భారత్‌కు చెందిన ప్రాంతంగానే గుర్తిస్తున్నామని అమెరికా ప్రకటించింది. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) ఆవలి వైపు ప్రాంతం కూడా తమదేనంటూ చైనా సైన్యం కానీ, పౌరులు గానీ ఏకపక్షంగా అక్రమంగా చొరబాట్లకు పాల్పడేందుకు చేసే ప్రయత్నాలను గట్టిగా వ్యతిరేకిస్తున్నట్లు అగ్రరాజ్యం తెలిపింది. ఇటీవల ప్రధాని మోదీ అరుణాచల్ ప్రదేశ్‌లో పర్యటించిన నేపథ్యంలో చైనా ఆర్మీ మరో మారు ఆ భూభాగం తమదేనంటూ ప్రకటించడంపై అమెరికా విదేశాంగ శాఖ ప్రిన్సిపల్ ఉప అధికారప్రతినిధి వేదాంత్ పటేల్ మీడియాకు ఈ విషయం తెలిపారు. భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌ను టిబెట్‌లోని ‘జాంగ్నాన్’గా చైనా తరచూ పేర్కొంటోంది. దీనిని తీవ్రంగా వ్యతిరేకించిన భారత్..అరుణాచల్ ప్రదేశ్ ఎల్లప్పుడూ తమదేనని, ఇకపైనా విడదీయరాని అంతర్భాగంగానే కొనసాగుతుందని బుధవారం పునరుద్ఘాటించిన విషయం తెలిసిందే.

అమెరికాకు సంబంధం లేదు:చైనా

అరుణాచల్ భారత్‌దేనంటూ అమెరికా చేసిన ప్రకటనను చైనా తీవ్రంగా వ్యతిరేకించింది. భారత్-చైనా సరిహద్దు వివాదంతో అమెరికాకు ఏమాత్రం సంబంధం లేదని తెలిపింది. అమెరికా ఇతర దేశాల మధ్య వివాదాలను రెచ్చగొడుతూ, వాటిని తన స్వార్థ భౌగోళిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం అందరికీ తెలిసిందేనని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ వ్యాఖ్యానించారు.

పార్టీని ఆర్థికంగా చిదిమేసే కుట్ర

- మోదీ వ్యవస్థీకృత చర్యలకు పాల్పడుతున్నారు
- కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేయడంపై సోనియా ఆగ్రహం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ సభలు, ర్యాలీలు, అభ్యర్థుల భారీ ప్రచార కార్యక్రమాలకు ఎంతో ధనం అవసరమైన వేళ ప్రధాని మోదీ వ్యవస్థీకృతంగా కుట్రలు పన్ని కాంగ్రెస్ పార్టీని ఆర్థికంగా చిదిమేసేందుకు బరితెగించారని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం ఢిల్లీలో పత్రికా సమావేశంలో సోనియా, పార్టీ చీఫ్ ఖర్గే, రాహుల్ గాంధీలు మాట్లాడారు. పార్టీలో ముగ్గురు అగ్రనేతలు ఒకేసారి మీడియాతో మాట్లాడటం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి. దేశవ్యాప్తంగా పార్టీ అభ్యర్థుల ప్రచారఖర్చులు, ప్రకటనలకు భారీ మొత్తంలో నగదు అవసరమైన వేళ తమ బ్యాంక్ ఖాతాలను అదునుచూసి స్తంభింపజేయడాన్ని నేతలు తీవ్రంగా తప్పుబట్టారు. ‘కాంగ్రెస్‌కు ప్రజలిచ్చిన నగదు విరాళాలను బలవంతంగా లాగేసుకున్నారు. ఇది చాలా తీవ్రమైన అంశం. ఓవైపు ఎలక్టోరల్ బాండ్లపై నిషేధం, మరోవైపు ఖాతాల స్తంభనతో ఎదురైన ఆర్థిక ఇబ్బందులు. ఇవి నిజంగా అనూహ్యమైన తీవ్ర అవరోధాలు. ఇలా అత్యంత క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటూ కూడా మా శక్తిమేరకు అద్భుతంగా ఎన్నికల ప్రచార కార్యక్రమాలను చేపట్టగలుగుతున్నాం. ప్రత్యేకంగా కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకున్నారన్నది సుస్పష్టం. ప్రధాన ప్రతిపక్షం ఆర్థికమూలాలపై దాడి చేశారు’ అని సోనియా ఆగ్రహం వ్యక్తంచేశారు.

డీఫ్రీజ్ చేస్తేనే ఆరోగ్యకర పోటీ సాధ్యం: ఖర్గే

‘డీఫ్రీజ్ చేయడమే ఎన్నికల్లో ఆరోగ్యకర పోటీకి బాటలువరుస్తుంది. సాధారణ ప్రజానీకం కాంగ్రెస్‌కు విరాళంగా ఇచ్చిన మొత్తాలను ఫ్రీజ్ చేసి, ఐటీ శాఖతో బలవంతంగా రూ.115.32 కోట్లు నగదు విత్‌డ్రా చేయించి మమ్మల్ని బీజేపీ లూటీ చేసింది. స్వేచ్ఛాయుత, పారదర్శకమైన ఎన్నికలు అత్యావశ్యకమైన ఈ తరుణంలో రాజ్యాంగబద్ధ సంస్థలు కాంగ్రెస్ పార్టీ ఖాతాలను డీఫ్రీజ్ చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి’ అని ఖర్గే కోరారు. ‘బీజేపీ అధికారంలో ఉంది. పైగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీ తమ ఖాతాలను వేల కోట్ల రూపాయలతో నింపేసుకుంది. ఎన్నికల్లో దీటైన పోటీకి వీలు లేకుండా మా పార్టీ ఆర్థిక మూలాలను దెబ్బ తీసింది. అధికారంలో ఉన్న వారు ప్రత్యక్షంగాగానీ పరోక్షంగానీ రాజ్యాంగబద్ధ సంస్థలపై నియంత్రణ కల్గి ఉండొద్దు. వనరులపై గుత్తాధిపత్య ధోరణి అస్సలు మంచిది కాదు’ అని ఖర్గే వ్యాఖ్యానించారు.

రూ.2 కూడా చెల్లించలేని పరిస్థితి: రాహుల్

‘ప్రధాన ప్రతిపక్షం అన్ని అకౌంట్లను ఫ్రీజ్‌చేయడం అంటే అది కాంగ్రెస్‌పై మాత్రమే ప్రభావం చూపదు దేశ ప్రజాస్వామ్యానికీ అది విఘాతమే. ఎన్నికల్లో పోటీచేసే సామర్థ్యాన్ని దెబ్బతీశారు. మేం ప్రచార కార్యక్రమాలు చేసుకోలేకపోతున్నాం. ఫ్రీజ్ చేసి ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేరపూరిత చర్యకు పాల్పడ్డారు. ఇలాంటి చర్యలతో దేశంలో ప్రజాస్వామ్యం ఉందనడం అబద్ధమే అవుతుంది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థలేవీ ఇక్కడ పని చేయట్లేవు’ అని రాహుల్ అన్నారు. ‘ఖాతాల స్తంభనతో కరెన్సీ కష్టాలు విపరీతంగా పెరిగాయి. మా నేతలు, అభ్యర్థులు విమానాల్లో దేశంలోని ఒక చోటు నుంచి ఇంకో చోటుకు వెళ్లలేని పరిస్థితి. విమానం సంగతి పక్కనబెట్టండి. కనీసం రైలు టికెట్ కొనేందుకు కూడా కష్టపడుతున్నాం. 20 శాతం ఓటుబ్యాంక్ మాకున్నా రూ.2 కూడా చెల్లించలేని పరిస్థితి. అదునుచూసి ఎన్నికలకు రెండు నెలల ముందు మోదీ పన్నిన కుట్ర ఇది. ఇంత జరుగుతున్నా ఈసీ మౌనం వహించడం విచారకరం. ఈ విషయంలో ఈసీ ఇంతవరకు స్పందించలేదు’ అని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై బీజేపీ స్పందించింది. ఓటమి ఖాయం కావడంతో కావాలనే కాంగ్రెస్ ఇలాంటి ఆరోపణలు గుప్పిస్తోందని బీజేపీ ప్రతివిమర్శ చేసింది.


ఢిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాహుల్ గాంధీ, చిత్రంలో సోనియా గాంధీ, ఆ పార్టీ చీఫ్ ఖర్గే

అసుర శక్తిపైనే పోరాటం: రాహుల్

విద్వేషం నిండిన అసుర(రాక్షస) శక్తిపై తమ పార్టీ పోరాటం సాగిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. ‘శక్తికి వ్యతిరేకంగా పోరాడుతున్నాం’ అంటూ ఆయన ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. రాహుల్ వ్యాఖ్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సహా బీజేపీ నాయకులు దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్వేషం నిండిన అసుర శక్తిపైనే తమ పోరాటం అని రాహుల్ గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో స్పష్టం చేశారు. అసుర శక్తిని ఓడించడమే తమ లక్ష్యమన్నారు.

సీఈసీ, ఈసీల నియామక చట్టంపై స్టే ఇవ్వలేం: సుప్రీం

సాక్షి, న్యూఢిల్లీ: ‘ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (అపాయింట్‌మెంట్, కండీషన్స్ ఆఫ్ సర్వీస్, టరమ్స్ ఆఫ్ ఆఫీస్) చట్టం-2023’పై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సీఈసీ, ఈసీల నియామకానికి సంబంధించిన సెలక్షన్ కమిటీ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించడాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత జయ ఠాకూర్, ఇటీవల ఇద్దరు నూతన ఎన్నికల కమిషనర్ల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ఇతర పిటిషన్లను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారించింది. పిటిషనర్లలో ఒకరి తరఫున సీనియర్ లాయర్ వికాస్ సింగ్ వాదనలు వినిపించారు. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సీజేఐలతో కూడిన కమిటీ సిఫార్సుల మేరకు సీఈసీ, ఇతర కమిషనర్ల నియామకాలు చేపట్టాలని అనూప్ బరన్వాల్ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. కొత్త చట్టంపై స్టే విధించాల్సిందేనని అసోసియేషన్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ప్రభుత్వ పాలనాయంత్రాంగం కింద పని చేస్తోందని ఆరోపించారు. అయితే, ఎన్నికల సంఘం స్వతంత్ర సంస్థ అని, పాలనాయంత్రాంగం కింద పనిచేస్తోందని అనడం సరికాదని జస్టిస్ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. ‘‘ఇద్దరు నూతన ఎన్నికల కమిషనర్లు ఇప్పటికే నియమితులయ్యారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. నియమితులైన ఇద్దరు కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూపై ఎలాంటి ఆరోపణలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో చట్టంపై మధ్యంతర ఉత్తర్వు ద్వారా స్టే విధించడం గందరగోళానికి దారి తీస్తుంది. అలాగే వారి నియామకాన్ని నిలిపివేయలేం’’ అని జస్టిస్ సంజీవ్ ఖన్నా తేల్చిచెప్పారు. నూతన చట్టం ప్రకారం ఎంపికైన ఇద్దరు కమిషనర్ల నియామకంపై స్టే ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించింది. అయితే, ఈ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన ప్రధాన పిటిషన్లను పరిశీలిస్తామని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆరు వారాల్లోగా స్పందించాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఆగస్టు 5 తేదీకి వాయిదా వేసింది.

‘ఫ్యాక్ట్ చెకింగ్ యూనిట్’పై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ఆధ్వర్యంలో ఫ్యాక్ట్-చెకింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌పై అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది. ఇది భావ వ్యక్తీకరణకు సంబంధించిన అంశమని వెల్లడించింది. ప్రభుత్వంపై మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను, ఆన్‌లైన్‌లో నకిలీ కంటెంట్‌ను గుర్తించడానికి ఈ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్-2021లో సవరణలు చేసింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎడిటర్స్ గిల్డ్ ఇండియాతోపాటు పలువురు బాంబే హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన హైకోర్టు ఫ్యాక్ట్-చెకింగ్ యూనిట్ ఏర్పాటుపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు నిరాకరిస్తూ మార్చి 11న తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. మార్చి 11 నాటి బాంబే హైకోర్టు తీర్పును తోసిపుచ్చింది.

తమిళనాడు గవర్నర్‌పై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: డీఎంకే సీనియర్ నేత కె.పొన్ముడిని తిరిగి మంత్రి వర్గంలోకి తీసుకోవడాన్ని నిరాకరిస్తున్న తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన సుప్రీంకోర్టును సైతం ధిక్కరిస్తున్నారని వ్యాఖ్యానించింది. పొన్ముడిని మంత్రిగా నియమించే విషయాన్ని 24 గంటల్లో తేల్చాలని, లేదంటే తాము తీవ్ర చర్యలకు దిగుతామని హెచ్చరించింది. అక్రమాస్తుల కేసులో పొన్ముడికి హైకోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. దీంతో, సీఎం స్టాలిన్ ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించారు. హైకోర్టు ఉత్తర్వులపై ఈనెల 11న సుప్రీంకోర్టు స్టే విధించింది. దీంతో, పొన్ముడిని తిరిగి మంత్రివర్గంలోకి తీసుకోవాలంటూ ప్రభుత్వం సిఫారసు చేయగా గవర్నర్ రవి పట్టించుకోవడం లేదు. దీనిపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

‘వికసిత్ భారత్’ సందేశాలను ఆపండి: ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక కూడా కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రచారం చేసే వికసిత్ భారత్ సంకల్ప్ సందేశాలు ఓటర్ల ఫోన్లకు వాట్సాప్‌లో పంపడాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తప్పుబట్టింది. వెంటనే ‘వికసిత్ భారత్’ గంపగుత్త మెసేజ్‌లను వాట్సాప్ ద్వారా పంపడం ఆపేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కార్యదర్శికి గురువారం ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం నెలకొనడమే తమ ఉద్దేశమని ఈసీ పేర్కొంది. లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నిబంధనావళి అమల్లోకి వచ్చాక సామాజిక మాధ్యమాల వేదికగా ప్రభుత్వ పథకాలు, విజయాలను ప్రచారం చేయడం నిషేధమని ఈసీ పేర్కొంది.

పంజాబ్, అస్సాం జిల్లాల పోలీసు చీఫ్‌ల బదిలీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ ఎన్నికల కమిషన్(ఈసీ)మరికొందరు అధికారులకు స్థానచలనం కల్పించింది. తాజాగా అస్సాం, పంజాబ్‌ల్లోని జిల్లా పోలీసు చీఫ్‌లను బదిలీ చేసింది. పంజాబ్, ఒడిశా, గుజరాత్, పశ్చిమబెంగాల్‌లలో పనిచేసే అయిదుగురు నాన్ కేడర్ జిల్లా మేజిస్ట్రేట్లు(డీఎంలు), 8 మంది పోలీస్ సూపరింటెండెంట్ల(ఎస్పీలు)ను సైతం బదిలీ చేసింది. జిల్లా స్థాయిలో ప్రధానమైన పోస్టుల్లో ఐఏఎస్, ఐపీఎస్‌లు కాని నాన్-క్యాడర్ అధికారులను నియమించడంపై ఈసీ కఠినమైన వైఖరిని తీసుకుంది.

చెన్నై సౌత్ బరిలో తమిళిసై

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల మూడో జాబితాను బీజేపీ అధిష్టానం విడుదల చేసింది. ఈ జాబితాలో తమిళనాడులోని మొత్తం తొమ్మిది స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను చెన్నై సౌత్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు.

విరాళాల సమస్త వివరాలు బహిర్గతం

- ఈసీకి సమర్పించిన ఎస్‌బీఐ
- వెంటనే తమ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ) నుంచి ఎలక్టోరల్ బాండ్ల వివరాలన్నీ వాటి నంబర్లతో సహా పూర్తి స్థాయిలో కేంద్ర ఎన్నికల సంఘానికి చేరాయి. దీంతో ఆ సమస్త వివరాలను ఈసీ వెంటనే తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఆల్ఫా-న్యూమరిక్ నంబర్లతోసహా దాతలు, వాటిని అందుకున్న గ్రహీతల(రాజకీయ పార్టీలు) జాబితాను విడివిడిగా ఈసీ పొందుపరిచింది. ఆల్ఫా-న్యూమరిక్ నంబర్లను బట్టి ఏ ఎలక్టోరల్ బాండ్ మొత్తాన్ని ఈ రాజకీయ పార్టీ విరాళంగా పొందిందో సులభంగా తెల్సుకోవచ్చు. సుప్రీంకోర్టు గత ఆదేశాల సమయంలో ఈ ఆల్ఫా-న్యూమరిక్ నంబర్లు లేకుండానే బాండ్లు, వాటి గ్రహీతల జాబితాను ఈసీకి ఎస్‌బీఐ ఇచ్చింది. ఏ వ్యక్తి/సంస్థ బాండ్లను ఏ పార్టీకి విరాళంగా ఇచ్చారని తెలిపే ఈ నంబర్లు లేకపోవడంపై సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం బ్యాంకు తీరుపై



అసహనం వ్యక్తం చేసింది. సమస్త వివరాలను ఈసీకి ఇవ్వాలని ఆదేశించడంతో దిద్దుబాటు చర్యలకు దిగిన ఎస్‌బీఐ గురువారం ఆల్ఫా-న్యూమరిక్ నంబర్లతో కూడిన పూర్తి వివరాలను ఈసీకి అందజేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది.

రిలయన్స్ సంబంధ సంస్థ నుంచి బీజేపీకి రూ.395 కోట్లు

ఈసీ వెల్లడించిన తాజా వివరాల ప్రకారం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో సంబంధం ఉన్న క్విక్ సప్లై చైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బీజేపీకి రూ.395 కోట్ల విరాళాలు ఇచ్చింది. 2022లో శివసేన పార్టీకి రూ.25 కోట్ల విరాళాలు అందజేసింది. 2021-22, 2023-24కాలంలో బాండ్లు కొని విరాళంగా ఇచ్చిన మూడో అతిపెద్ద దాతగా క్విక్ సప్లై చైన్ నిలిచింది. ఈకాలంలో ఈ సంస్థ రూ.410 కోట్ల బాండ్లను కొనుగోలుచేసింది. అత్యధికంగా ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ సంస్థ రూ.1,368 కోట్ల బాండ్లను కొనుగోలుచేయడం తెల్సిందే. ఈ సంస్థ 2022 అక్టోబర్ వరకు మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీపార్టీకి రూ.540 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఈ సంస్థ నుంచి అత్యధిక విరాళాలు పొందిన పార్టీగా టీఎంసీ నిలిచింది. ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ నుంచి బీజేపీ రూ.100 కోట్ల విరాళాలు పొందింది. ఈ సంస్థ కాంగ్రెస్‌కు రూ.50 కోట్ల విరాళం ఇచ్చింది. సిక్కిం క్రాంతికారీ మోర్చా సైతం ఈ సంస్థ నుంచి విరాళాలు స్వీకరించింది. తమిళనాడులోని డీఎంకేకు ఈ సంస్థ ఏకంగా రూ.509 కోట్ల విరాళాలు ఇచ్చింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో సంబంధం ఉన్న హనీవెల్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ సైతం రూ.30 కోట్ల బాండ్లను కొని మొత్తం బీజేపీకే విరాళంగా ఇచ్చింది.

ఈసీకి ఇచ్చేశాం: ఎస్‌బీఐ

ఎలక్టోరల్ బాండ్ల వివరాలన్నీ వాటి నంబర్లతో సహా ఎన్నికల సంఘానికి అందజేశామని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్‌కుమార్ ఖరా గురువారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. దాతలు ఇచ్చిన బాండ్లను నగదుగా మార్చుకున్న రాజకీయ పార్టీల బ్యాంక్ ఖాతాల నెంబర్లు, కేవైసీ వివరాలను బయటపెట్టడం లేదని వెల్లడించారు.

ట్యాపింగ్ వీరుడు.. డేటా చోరుడు.. చంద్రబాబే

టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఇజ్రాయెల్ నుంచి ఫోన్ ట్యాపింగ్ సాఫ్ట్‌వేర్ కొనుగోలు

- జాతీయ భద్రత చట్టాన్ని ఉల్లంఘించి మరీ కొన్న చంద్రబాబు
- అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు సూత్రధారిగా కుట్ర
- ఐటీ గ్రిడ్స్, ఏబీ కుమారుడు భాగస్వామిగా ఉన్న ఆకాశ్ ఎంటర్‌ప్రైజెస్ ప్రధాన పాత్ర
- వైఎస్సార్‌సీపీ నేతల ఫోన్లు ట్యాపింగ్.. రాష్ట్ర ఓటర్ల డేటా చౌర్యం
- నిగ్గు తేల్చిన శాసన సభ ఉపసంఘం
- చంద్రబాబు పెగసస్ సాఫ్ట్‌వేర్ కొన్నారని చెప్పిన బెంగాల్ సీఎం మమతా బెనర్జీ
- ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉండగా కూడా చంద్రబాబుది ఇదే తంతు
- అప్పటి ప్రతిపక్ష నేత, విపక్ష అభ్యర్థుల ఫోన్ల ట్యాపింగ్‌కు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ అధికారీ ఇజ్రాయెల్ వెళ్లలేదు
- ఫోన్ల ట్యాపింగ్‌కు ఏ సాఫ్ట్‌వేరూ కొనలేదు
- అయినా ఫోన్ల ట్యాపింగ్.. అంటూ రామోజీ కట్టుకథలు
- టీడీపీ ఓడిపోతుందన్న భయంతో ఇప్పుడే కుంటిసాకులు



సాక్షి, అమరావతి

ఈ ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయమని తేలిపోవడంతో ఈనాడు రామోజీరావు బెంబేలెత్తుతున్నారు. అందుకే టీడీపీ ఓటమికి ఇప్పటి నుంచే కుంటిసాకులు వెతికే పనిలో పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం టీడీపీ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేస్తోందంటూ చిత్తకార్తి రాతలు రాస్తూ వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచార కుట్రకు తెరతీశారు. పచ్చ పైత్యం సోకి రామోజీరావుకు ఉద్దేశపూర్వక మతిమరుపు వచ్చిందేమోగానీ... రాష్ట్ర ప్రజలకు మాత్రం అన్నీ గుర్తున్నాయి. రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ప్రభుత్వం ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడటం, ఓటర్ల వ్యక్తిగత డేటా చౌర్యానికి బరితెగించడం అంతా ప్రజలకు గుర్తుంది. ఫోన్ల ట్యాపింగ్ కోసం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు ఇజ్రాయెల్ వెళ్లి మరీ అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ సాఫ్ట్‌వేర్‌ను కొన్నారన్నది బహిరంగ రహస్యమే. చంద్రబాబు బాగోతాన్ని శాసన సభ ఉప సంఘం కూడా నిగ్గు తేల్చింది. మరోవైపు చంద్రబాబు పెగసస్ కంపెనీ నుంచి ఫోన్ ట్యాపింగ్ సాఫ్ట్‌వేర్ కొన్నారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీనే స్వయంగా ఆ రాష్ట్ర శాసన సభలో వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ పోలీసు అధికారీ ఇజ్రాయెల్ వెళ్లలేదు. ఎలాంటి సాఫ్ట్‌వేర్ కొనలేదు. వీటన్నింటినీ మరుగున పరుస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే ధ్యేయంగా ఈనాడులో ఓ కట్టుకథ రాశారు. అసలు వాస్తవాలేమిటంటే...

ట్యాపింగ్ చరిత్ర బాబుదే



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఫోన్ ట్యాపింగ్ అనే జాడ్యానికి ఆద్యుడు చంద్రబాబే. 2004 ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన ప్రతిపక్ష నేతల ఫోన్ల ట్యాపింగ్ కోసం ఏకంగా ఓ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అప్పటి ఇంటెలిజెన్స్ విభాగంలో ఓ కీలక అధికారిని, మరో పోలీసు ఉన్నతాధికారిని అందుకోసం ప్రత్యేకంగా నియమించారు. ప్రతిపక్ష నేత నుంచి ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల వరకూ అందరి ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. ఆ కుట్రలో భాగస్వామి అయిన ఆ పోలీసు ఉన్నతాధికారికి 2014లో చంద్రబాబు మళ్లీ సీఎం అయిన తరువాత రాష్ట్ర పోలీస్ బాస్‌గా పోస్టింగ్ ఇచ్చారు కూడా.

భద్రతా చట్టాలను ఉల్లంఘించి మరీ పెగసస్ సాఫ్ట్‌వేర్ కొన్న చంద్రబాబు

రాష్ట్ర విభజన తరువాత 2014లో ఆంధ్రప్రదేశ్‌కు సీఎం అయిన చంద్రబాబు మరోసారి ఫోన్ ట్యాపింగ్ అక్రమాలకు పాల్పడ్డారు. ప్రధానంగా తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు కోట్లు వ్యవహారంలో 'మా వాళ్లు బ్రీఫ్డ్ మీ' అంటూ చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారు. రాత్రికి రాత్రే విజయవాడకు మకాం మార్చేశారు. ఇక్కడ ఆయన మరోసారి ఫోన్ ట్యాపింగ్‌పై దృష్టి సారించారు. అందుకోసం అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు నేతృత్వంతో ప్రత్యేకంగా ఓ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నేతల ఫోన్లు ట్యాపింగ్‌తోపాటు ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడటం ఆ వ్యవస్థ లక్ష్యం. ఐటీ గ్రిడ్స్ అనే ప్రైవేటు కంపెనీ, అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు కుమారుడు కూడా భాగస్వామిగా ఉన్న ఆకాశ్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీల ద్వారా ఏరోస్టాట్ బెలూన్లు, ఇతర ఫోన్ ట్యాపింగ్ సాఫ్ట్‌వేర్ కొనుగోలుకు పెగసస్‌తో సంప్రదింపులు జరిపారు. అందుకోసం ఏబీ వెంకటేశ్వరరావు బృందం ఇజ్రాయెల్‌లో పర్యటించింది. పెగసస్ సంస్థతో సంప్రదింపులు జరిపింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం విదేశీ కంపెనీల నుంచి ఫోన్ ట్యాపింగ్ సాఫ్ట్‌వేర్ కొనాలంటే రక్షణ శాఖ అనుమతి తప్పనిసరి. ఫోన్ ట్యాపింగ్ సాఫ్ట్‌వేర్ ఉగ్రవాద సంస్థలకు చిక్కితే దేశంలో విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉన్నందువల్ల దేశ భద్రత దృష్ట్యా ఈ నిబంధన విధించారు. కానీ, జాతీయ భద్రత చట్టాన్ని చంద్రబాబు ప్రభుత్వం ఉల్లంఘించింది. రక్షణ శాఖకు సమాచారం ఇవ్వకుండానే పెగసస్ కంపెనీతో సంప్రదింపులు జరిపింది. ఐటీ గ్రిడ్స్ కంపెనీ ద్వారా ఫోన్ ట్యాపింగ్ పరికరాలను కొనుగోలు చేసి దిగుమతి చేసుకుంది. అందుకోసం నిధులు కూడా చెల్లించింది.

రూ.25 కోట్లతో చంద్రబాబు పెగసస్ సాఫ్ట్‌వేర్ కొన్నారు: మమత

ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం రూ.25 కోట్లు వెచ్చించి పెగసస్ నుంచి అక్రమంగా ఫోన్ ట్యాపింగ్, డేటా చౌర్యం సాఫ్ట్‌వేర్ కొన్నారని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్వయంగా ప్రకటించడం జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. 2022లో పశ్చిమ బెంగాల్ శాసనసభలో ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ మాట్లాడుతూ డేటా చౌర్యం సాఫ్ట్‌వేర్ కొనాలని పెగసస్ కంపెనీ ప్రతినిధులు తనను సంప్రదించారని వెల్లడించారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం ఆ సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేసిందని, మీరు కూడా కొనాలంటూ ఆ సంస్థ ప్రతిపాదించిందని తెలిపారు. చట్ట విరుద్ధమైన ఆ పనిని తాను చేయలేనని తిరస్కరించానని మమతా బెనర్జీ చెప్పారు. ఇవన్నీ చంద్రబాబు కుతంత్రాలను బయటపెట్టే వాస్తవాలు. వీటిని ఏనాడూ ప్రశ్నించని రామోజీరావు.. ఇప్పుడు మాత్రం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడకపోయినా, ఓ అసత్య కథనాన్ని ప్రజల్లోకి వదిలి, టీడీపీ ఓటమికి ఓ కుంటిసాకును సిద్ధం చేసుకున్నారు.

యథేచ్ఛగా ఫోన్ ట్యాపింగ్.. 35 లక్షల మంది డేటా చౌర్యం

అక్రమంగా కొన్న ఫోన్ ట్యాపింగ్, డేటా చౌర్యం సాఫ్ట్‌వేర్‌తో చంద్రబాబు ప్రభుత్వం బరితెగించింది. అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌తో పాటు వైఎస్సార్‌సీపీకి చెందిన 65 మంది నేతల ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడింది. దీనిపై పూర్తి ఆధారాలతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2019 ఎన్నికలకు ముందు వివిధ కేసుల దర్యాప్తు ముసుగులో ఏకంగా వైఎస్సార్‌సీపీకి చెందిన 150 మంది ఫోన్లను ట్యాప్ చేయడం చంద్రబాబు దుర్మార్గ రాజకీయాలకు నిదర్శనం. మరోవైపు చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన ప్రజా సాధికార సర్వే ద్వారా సేకరించిన ఓటర్ల డేటా (సమాచారం) మొత్తాన్ని టీడీపీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. టీడీపీ రాజకీయ ప్రయోజనాల కోసం రూపొందించిన 'సేవా మిత్ర' యాప్‌కు అనుసంధానించారు. రాష్ట్రంలోని ఓటర్ల వ్యక్తిగత సమాచారం చౌర్యానికి పాల్పడ్డారు. మరోవైపు టీడీపీ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉన్న 35 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు కుట్ర పన్నారు. ఈ కుట్రకు వ్యతిరేకంగా అప్పట్లోనే వైఎస్సార్‌సీపీ ఆందోళనలు చేసింది. పోలీసులు, కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పూర్తి ఆధారాలతో ఫిర్యాదులు చేసింది.

నిగ్గు తేల్చిన శాసనసభ ఉప సంఘం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ ప్రభుత్వ డేటా చౌర్యంపై విచారణకు సభా సంఘాన్ని నియమించింది. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలోని ఈ కమిటీ హోం, ఆర్థిక, సమాచార–పౌర సంబంధాల శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులను విచారించింది. అప్పటి సీఎం చంద్రబాబు ఆదేశాలతోనే తాము ఓటర్ల వ్యక్తిగత సమాచారాన్ని టీడీపీ సేవామిత్ర యాప్‌నకు బదిలీ చేశామని ఆ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇజ్రాయెల్ నుంచి ఫోన్ ట్యాపింగ్, డేటా చౌర్యం సాఫ్ట్‌వేర్‌ను అక్రమంగా కొన్న మాట వాస్తవమేనని, అందుకే ఆ దేశంలో పర్యటించామని తెలిపారు. ఈ వ్యవహారంపై ఉప సంఘం మధ్యంతర నివేదికను కూడా శాసనసభకు సమర్పించింది.

క్లుప్తంగా...

సీఎం జగన్ వెంటే ఉంటా

- నేను పార్టీ మారుతున్నానని వస్తున్న కథనాలన్నీ కల్పితాలే..
- స్పష్టంచేసిన అమలాపురం ఎంపీ చింతా అనూరాధ



అల్లవరం: వైఎస్సార్‌సీపీ నుంచి తాను మరో పార్టీలోకి వెళుతున్నట్లు వస్తున్న కథనాలన్నీ కల్పితాలేనని, తాను ఎప్పుడూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటానని అమలాపురం ఎంపీ చింతా అనూరాధ స్పష్టంచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్లమూరులోని తన కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల్లో అమలాపురం ఎంపీ అభ్యర్థిగా తన పేరు ప్రకటించిన నాటి నుంచి గెలిచేంత వరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సాయం మరువలేనిదని చింతా అనూరాధ చెప్పారు. ఈ ఐదేళ్లపాటు తనకు సీఎం జగన్ ఎంతో అండగా నిలిచారని, ఆయనంటే ఓ నమ్మకమని, తనను నమ్ముకుని ఉన్నవారికి ఎప్పుడూ భరోసాగా నిలబడతారని తెలిపారు. తాను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నీడలోనే పని చేస్తానని, మరో పార్టీలో చేరే ప్రసక్తే లేదని అనూరాధ స్పష్టంచేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ విజయం సాధించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. బీజేపీ అభ్యర్థిగా రేసులో ఉన్న వ్యక్తికి, తన కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని, ఆయన ఎన్ని పార్టీలు మారినా తాను మాత్రం వైఎస్సార్‌సీపీలో ఉంటానని ఆమె చెప్పారు.

బీజేపీ ఏపీ ఎన్నికల ఇన్‌చార్జ్‌ల నియామకం

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ అధిష్టానం ఆంధ్రప్రదేశ్‌కు ఇద్దరు ఎన్నికల ఇన్‌చార్జ్‌లను నియమించింది. జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్, యూపీ ఎమ్మెల్యే సిద్ధార్థ్‌నాథ్ సింగ్‌ను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఎంపిక చేశారు. ఈ మేరకు గురువారం కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన మధ్య పొత్తు నేపథ్యంలో ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల ఎంపిక, కూటమితో సత్సంబంధాలపై అరుణ్‌సింగ్, సిద్ధార్థ్‌నాథ్ దృష్టిసారించనున్నారు.

బీజేపీది అరాచక పాలన

ఏపీసీసీ చీఫ్ షర్మిల



సాక్షి, అమరావతి: దేశంలో బీజేపీ పాలన ఓ అరాచకమని ఏపీసీసీ చీఫ్ షర్మిల విమర్శించారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఇండియా భాగస్వామ్య పార్టీలు, సారూప్య రాజకీయ, రైతు, కార్మిక, మహిళా, ప్రజా సంఘాల ఐక్య వేదిక సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన షర్మిల మాట్లాడుతూ.. మతాలను బీజేపీ రెచ్చగొడుతోందని, కులాల మధ్య తగవులు పెడుతోందని విమర్శించారు. సీబీఐ, ఈడీ వంటి వ్యవస్థలను తమకు నచ్చనివారి మీదకు పంపుతోందని చెప్పారు. విశాఖ స్టీల్‌ను అదానీ, అంబానీకి కట్టబెట్టే కుట్ర చేస్తోందన్నారు. ప్రత్యేక హోదా రాష్ట్రానికి ఊపిరి లాంటిదన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ నేత రామకృష్ణ, సీపీఎం నేత శ్రీనివాసరావు, జై భారత్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అనంతరం ఆంధ్రరత్న భవన్‌లో వైఎస్సార్ జిల్లా నేతలతో షర్మిల సమావేశమయ్యారు. కడప నుంచి ఎంపీగా పోటీ చేయాలని ఆ జిల్లా నేతలు షర్మిలను కోరారు. రాష్ట్రంలో సమస్యలపై సజ్జల సమాధానం చెప్పాలని షర్మిల అన్నారు. కడప స్టీల్‌పై ఎంపీ అవినాష్ రెడ్డి ఎందుకు పోరాటం చేయలేదని ప్రశ్నించారు.

శ్రీవారిని దర్శించుకున్న నారా లోకేశ్



కుటుంబ సభ్యులతో నారా లోకేశ్

తిరుమల: టీడీపీ నాయకుడు నారా లోకేశ్ కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారి దర్శనం అనంతరం లోకేశ్ కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం ట్రస్ట్‌కు ఒక రోజుకు భక్తులందరికీ అన్నదానం చేసేలా రూ.38లక్షల విరాళాన్ని అందజేశారు.

బీజేపీ కక్షపూరిత చర్యలను ఖండించాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఈడీ అధికారులు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఇంట్లో సోదాలు నిర్వహించి అరెస్ట్ చేయడాన్ని సీపీఎం ఖండిస్తున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఇలాంటి నిరంకుశ చర్యల ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని ఇండియా కూటమిలోని పార్టీలను దెబ్బతీయాలని బీజేపీ ప్రయత్నిస్తున్నదని చెప్పారు. బీజేపీ కక్షపూరిత ప్రతికార చర్యలను, నిరంకుశ పద్ధతులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సైకిల్‌పై 'డాలర్' సవారీ!

- టీడీపీలో చక్రం తిప్పుతున్న ఎన్ఆర్ఐ 'రాజా'
- చంద్రబాబు, లోకేశ్ అమెరికాకు వెళితే ఈయన ఇంట్లోనే బస
- ఆ చొరవతోనే ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లా సీట్ల కేటాయింపులో జోక్యం

సాక్షి ప్రతినిధి, కర్నూలు: అతనో ఎన్ఆర్ఐ.. మారు పేరు డాలర్ రాజా.. వృత్తి రీత్యా డాక్టర్.. అయితే పూర్తిగా టీడీపీ కోసమే పని చేస్తుంటాడు. అతను పుట్టింది గుంటూరులో.. ఉండేది అమెరికాలో.. ఎక్కువగా వచ్చేది కోవెలకుంట్లకు.. ఇతని తండ్రి గతంలో ఇక్కడ ఎంఈవోగా పని చేయడంతో పరిచయాలు ఎక్కువ. అతనికి కోవెలకుంట్లలో ఓ మిత్ర మండలి ఉంది. సేవా కార్యక్రమాల పేరుతో నియోజకవర్గంలో బలమైన వర్గాన్ని ఏర్పరుచుకున్నారు. ప్రతీ ఎన్నికకు టీడీపీకి భారీగా నిధులు సమకూరుస్తుంటారు. ప్రతిగా తనకు కావాల్సిన పనులు చేయించుకుంటారు. చంద్రబాబు, లోకేశ్ అమెరికా వెళితే ఆయన ఇంట్లోనే బస చేస్తారు. ఈసారి రూ.250 కోట్లకు పైగా ఫండింగ్ సమకూర్చడమే కాకుండా టికెట్ల కేటాయింపులోనూ జోక్యం చేసుకుంటున్నారు. ఆశావహులు అధిష్టానాన్ని కాకుండా 'డాలర్ రాజా'ను సంప్రదించడం వరకు ఈ జోక్యం వెళ్లిందంటే ఈ 'రాజా' మాటే చంద్రబాబుకు శాసనం అని ఆ పార్టీ నేతల్లో చర్చ జరుగుతోంది.

రాజా మాటే బాబు మాటట!

నంద్యాల జిల్లా టీడీపీలో బీసీ జనార్ధనరెడ్డి అంతా తానై నడిపిస్తున్నాడని, ఇతనివల్ల పార్టీ నష్టపోతోందనే అంచనాకు ఈ ఎన్ఆర్ఐ వచ్చినట్లు సమాచారం. నంద్యాల, డోన్ టికెట్లు ఫరూక్, ధర్మవరం సుబ్బారెడ్డికి తొలుత ప్రకటించడం వెనుక జనార్ధన్‌రెడ్డి ఉన్నారని ఇతని భావన. దీంతోనే డోన్ టికెట్ సుబ్బారెడ్డికి తప్పించి, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి దక్కేలా చేయడంలో కీలకంగా వ్యవహరించారు. జనార్ధనరెడ్డి వ్యతిరేకులను ఒకతాటిపైకి తెచ్చేందుకు ఈ 'రాజా' తెరవెనుక చక్రం తిప్పుతున్నారు. ఆదోని టికెట్ కోసం జనసేన పట్టుబట్టినా, చివరకు దాన్ని బీజేపీకి ఇవ్వాలనే యోచనలో టీడీపీ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే 'రాజా' మాత్రం తన సామాజికవర్గ నేత మీనాక్షినాయుడుకో లేక ఆయన కుమారుడికి ఇప్పించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. దీంతో కోడుమూరు స్థానాన్ని బీజేపీకి ఇచ్చి, ఆదోనిలో టీడీపీ తరఫున మీనాక్షినాయుడు కుమారుడు భూపాల్‌నాయుడును బరిలోకి దింపాలని చంద్రబాబుకు సూచించినట్లు తెలిసింది. ఈ దెబ్బతో కోడుమూరు టీడీపీ అభ్యర్థి దస్తగిరితోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డికి కూడా చెక్ పెట్టొచ్చన్నది ఈ 'రాజా' ఆలోచనట. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం టికెట్ రాజకీయంగా ఎలాంటి అనుభవం లేని సురేంద్రబాబుకు రావడం వెనుక కూడా ఇతని హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే అనంతపురం సీటు కూడా రాప్తాడు మాజీ మండలాధ్యక్షుడు దగ్గుబాటి ప్రసాద్‌కు ఖరారు చేసేందుకు చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇతను పార్టీకి రూ.50 కోట్లు ఫండ్ ఇస్తానని చెప్పడంతో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. దీని వెనుక కూడా ఈ ఎన్ఆర్ఐ పావులు కదిపినట్లు చర్చ జరుగుతోంది.

పిఠాపురంలో వంగా గీతను గెలిపిస్తా

- పవన్‌ని ఓడించి తీరుతాం
- వంగా గీతను గెలిపించి సీఎం జగన్ వద్దకు వస్తా
- రాష్ట్రంలో 175 స్థానాలూ వైఎస్సార్‌సీపీవే
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు



సాక్షి అమలాపురం: వైఎస్సార్‌సీపీ పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థి వంగా గీతను గెలిపించేందుకు కృషి చేస్తానని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు చెప్పారు. ఆయన గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. తాను సీఎం వైఎస్ జగన్‌ను కలిశానని, పిఠాపురంలో పవన్ కళ్యాణ్ని ఓడించాలని తనను ఆదేశించారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ నిర్ణయాన్ని శిరసావహిస్తానన్నారు. పిఠాపురంలో పవన్‌ను ఓడించి తీరుతామని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వంగా గీతను గెలిపించుకొని సీఎం జగన్ వద్దకు వస్తానని చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 175 స్థానాలూ వైఎస్సార్‌సీపీవేనని, ఈ విషయాన్ని జూన్ 4న చూస్తారని తెలిపారు. ఎన్నికల పోలింగ్ మొదలైన తర్వాత ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కుతుంటే టీడీపీ, జనసేన, బీజేపీ నేతల గుండెలు ఆగిపోయే పరిస్థితి వస్తుందన్నారు. పొత్తులతో వారు ఎన్నెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, ఎల్లో మీడియాను అడ్డంపెట్టుకుని దుష్ప్రచారం చేసినా, సీఎం జగన్‌పై బుట్టలు బుట్టలుగా బురదజల్లినా, రామోజీ, రాధాకృష్ణ, బీఆర్ నాయుడు దిగొచ్చినా ప్రజల గుండెల్లోని సీఎం జగన్ బొమ్మను చెరపడం ఎవరివల్లా సాధ్యం కాదని చెప్పారు. టీడీపీ ప్రజాగళం సభ అట్టర్ ఫ్లాప్ అయిందని, ఆ విషయాన్ని పక్కదోవ పట్టించేందుకే చంద్రబాబు అండ్ కో ప్రభుత్వం మీద, సీఎం జగన్ మీద దుష్ప్రచారానికి దిగాయనేది ప్రజలందరికీ తెలుసునని అన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండమైన మెజార్టీతో 175 స్థానాల్నీ కైవశం చేసుకుంటుందని ఎమ్మెల్యే దొరబాబు స్పష్టం చేశారు.

పార్టీలన్నీ ఏకమైనా.. వైఎస్సార్‌సీపీదే విజయం

రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



దళితులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీకి ఉన్న ప్రజాబలాన్ని చూసి భయంతో విపక్షాలన్నీ ఏకమయ్యాయని, అయినా వారి కుయుక్తులు ఫలించబోవని, వైఎస్సార్‌సీపీనే విజయం వరిస్తుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని పెద్దరెల్లివీధికి చెందిన దాదాపు వంద దళిత కుటుంబాలు గురువారం మంత్రి ధర్మాన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ ఎన్నికల్లో ధర్మానను భారీ మెజారిటీతో గెలిపిస్తామని పార్టీలో చేరిన కళ్యాణ జ్యోతిప్రసాద్ స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో యువత బాధ్యతగా పనిచేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ధర్మాన కోరారు. బడుగు, బలహీనవర్గాలకు అధిక సీట్లు కేటాయించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, ఎస్సీసెల్ అధ్యక్షుడు పొన్నాడ రుషి, శిమ్మ రాజశేఖర్, సాధు వైకుంఠరావు, మండవల్లి రవి, జలగడుగుల శ్రీనివాస్, భైరి మురళి, సుంకరి కృష్ణ, బుక్కూరు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టక్కుటమారి.. టముకుతో సరి

- మాటల్లోనే బీసీలపై ప్రేమ
- వెనుకబడిన వర్గాలను పట్టించుకోని టీడీపీ
- ఆ పార్టీపై రగిలిపోతున్న యాదవ సామాజికవర్గం
- ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో ఒక్క సీటూ కేటాయించని బాబు
- వారికి సముచిత స్థానం కల్పించిన సీఎం జగన్
- నరసరావుపేట ఎంపీ, కనిగిరి, కందుకూరు అసెంబ్లీ స్థానాల కేటాయింపు



సాక్షిప్రతినిధి, ఒంగోలు: జయహో బీసీ... అంటూ వారిని ఉద్ధరిస్తామని టీడీపీ–జనసేన సంయుక్తంగా ప్రకటించి నేడు విస్మరించాయి. బీసీలను అందులో ప్రధానంగా యాదవ సామాజికవర్గానికి ఉమ్మడి గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఒక్క సీటు కూడా కేటాయించకుండా చంద్రబాబు వారి వెన్ను విరిచారు. కానీ బీసీలు అంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు, బ్యాక్ బోన్ క్లాస్ అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి భరోసా కల్పించారు. ఈ మూడు జిల్లాల్లో 50 శాతానికి పైగా బీసీ ఓట్లు ఉన్నాయి. ఒక్కో జిల్లాలో 2.50 లక్షల నుంచి 3.50 లక్షల వరకు యాదవ ఓటర్లు ఉన్నారు. అయితే ఆ జిల్లాల్లో పార్లమెంట్ కానీ, అసెంబ్లీకి కానీ టికెట్లు కేటాయించకపోవటంతో టీడీపీపై యాదవులు రగిలిపోతున్నారు. కానీ యాదవులకు వైఎస్సార్‌సీపీ సముచిత స్థానం కల్పించింది. ఆ జిల్లాల్లో వారికి పెద్దపీట వేసింది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన యాదవ నేత బీదా మస్తాన్‌రావును రాజ్యసభకు పంపింది. నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా మాజీ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పోలుబోయిన అనీల్‌కుమార్ యాదవ్‌ను ఎంపిక చేసింది. ప్రకాశం జిల్లా కనిగిరి అసెంబ్లీకి సాధారణ జెడ్పీటీసీ సభ్యుడిని ప్రకటించి సంచలనం సృష్టించింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను కందుకూరు అసెంబ్లీకి పోటీలో నిలబెట్టింది. మరోవైపు గురజాల నియోజకవర్గానికి చెందిన యాదవ నేత జంగా కృష్ణమూర్తికి టీడీపీలో చాన్సే లేకుండా పోయింది. ఆయన గురజాల టికెట్ కావాలని వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీలో ఆయనకు సీఎం జగన్ ఎంతో ప్రాధాన్యత కల్పించారు. పార్టీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా, ఆ తరువాత ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. అయితే గురజాల అసెంబ్లీ సీటు ఇస్తానని జంగాకు టీడీపీ నమ్మబలికి మొండిచేయి చూపింది. చీరాలలో టీడీపీ నేత, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్దులూరి మాలకొండయ్యను దాదాపు ఆ పార్టీ పక్కన పెట్టేసింది. టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీకి బాబు మొండిచేయి చూపారు.

యాదవుల్లో సమర్థులు లేరా?



ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాలో టీడీపీలో యాదవ సామాజిక వర్గానికి చెందిన సమర్థులు లేరా? ఒకప్పటిలా టీడీపీ పరిస్థితి లేదు. వైఎస్సార్‌సీపీలో ఒక పార్లమెంట్, రెండు అసెంబ్లీ సీట్లిచ్చి సీఎం జగన్ యాదవులను ఎంతగానో గౌరవించారు. మాకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీలనే ఆదరిస్తాం.

– మిరియం శ్రీనివాసులు, 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

మైనారిటీలకు పెరిగిన ప్రాధాన్యం

- అసెంబ్లీ టికెట్లలో 4శాతం ప్రకటించిన వైఎస్సార్‌సీపీ
- ఏడుగురికి అవకాశం కల్పించిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్
- పొత్తులో ఉండి మూడింటితోనే మదత పెట్టిన బాబు
- ముస్లిం రిజర్వేషన్లు వ్యతిరేకించిన బీజేపీతో కలిసి ఎన్నికల బరిలోకి

సాక్షి, మచిలీపట్నం: సార్వత్రిక ఎన్నికల్లో ముస్లింల ప్రాతినిధ్యం పెంచేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. నాడు విద్య ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చి వారి జీవితాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వెలుగులు నింపారు. అప్పుడు స్థానిక సంస్థలకే 4శాతం రిజర్వేషన్లు అమలైతే.. నేడు రిజర్వేషన్లతో సంబంధం లేకుండా చట్టసభల్లో 4 శాతం టికెట్లు ప్రకటించి వారి అభ్యున్నతి, అభివృద్ధి కోరే పెద్దన్నగా నిలిచారు సీఎం వైఎస్ జగన్. వైఎస్సార్‌సీపీ నుంచి షేక్ బెపారి అంజద్ బాషా(కడప), అల్లుగుండు మహమ్మద్ ఇంతియాజ్(కర్నూలు), ఖలీల్ అహ్మద్(నెల్లూరు సిటీ), షేక్ నూరి ఫాతిమా(గుంటూరు తూర్పు), షేక్ నిసార్ అహ్మద్(మదనపల్లె), బాపనపల్లి షేక్ మక్బూల్ అహ్మద్(కదిరి), షేక్ ఆసిఫ్ (విజయవాడ పశ్చిమ)కి అవకాశం కల్పించారు.

చట్టసభల్లో ప్రాధాన్యత కోసమే

2019 ఎన్నికల్లో ఐదుగురికి వైఎస్సార్‌సీపీ టికెట్లు ఇవ్వగా, వారిలో నలుగురు విజయం సాధించారు. హిందూపురం అభ్యర్థి మహమ్మద్ ఇక్బాల్ ఓటమి చెందగా ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవం పెంచారు. గెలిచిన వారిలో ఒకరికి మంత్రి పదవితోపాటు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి, అల్ప సంఖ్యాకుల గౌరవాన్ని పెంచారు సీఎం జగన్. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల్లో ఏడుగురు మైనారిటీలు ఉన్నారు. అంటే.. నూటికి నలుగురు చొప్పున 175 స్థానాలకు 4 శాతం ఏడుగురికి అవకాశం కల్పించారు.

మూడింటితోనే మదత పెట్టిన బాబు

రానున్న ఎన్నికల్లో ముగ్గురు ముస్లింలకు మాత్రమే టికెట్ ఇస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. ఆయన ఏకంగా మైనారిటీ రిజర్వేషన్లు వ్యతిరేకించిన బీజేపీతోపాటు జనసేనతో పొత్తు పెట్టుకున్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు కేవలం ఒకరికే టికెట్ ఇచ్చినప్పటికీ ఆయన్ను గెలిపించుకోలేకపోయారు. దీంతో చంద్రబాబు హయాంలో మైనార్టీ సంక్షేమ శాఖ, మసీదులు, దర్గాలు, వక్ఫ్ బోర్డు లాంటివి ముస్లిమేతరుల చేతిలో ఉన్నాయి.

క్లుప్తంగా...

ఈసీ పేరుతో తప్పుడు ప్రచారం

వలంటీర్లపై వార్తను ఖండించిన ఏపీ సీఈవో

సాక్షి, అమరావతి : వలంటీర్లపై ఫిర్యాదులు చేయాలని ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసిందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఏపీ సీఈవో కార్యాలయం ఖండించింది. రాజకీయ ప్రచారంలో పాల్గొనే వలంటీర్లను ఎవరైనా మీ కంట కనపడితే వారి ఫొటోలు/వీడియోలతో పాటు వలంటీర్ల పేరు ఊరు పేర్లు తెలియజేస్తూ ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, లొకేషన్‌ను 9676692888కు వాట్సప్‌కు షేర్ చేయాలంటూ సామాజిక మాధ్యమాల్లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. వలంటీర్లపై ఫిర్యాదులు చేయాలంటూ తామెలాంటి సర్క్యులర్ జారీచేయలేదని, ఇది ఫేక్‌న్యూస్ అంటూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఏపీ సీఈవో గురువారం పేర్కొన్నారు.

హైకోర్టు ఆదేశాలతో టీడీపీ జెండా స్థూపం తొలగింపు



జెండా దిమ్మను తొలగిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: స్థానిక కాలేజీ రోడ్డు 216 జాతీయ రహదారి చెంతన ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌కు ఎదురుగా గతంలో టీడీపీ నాయకులు ఏకపక్షంగా నిర్మించిన టీడీపీ జెండా స్థూపం (దిమ్మ)ను హైకోర్టు ఆదేశాలతో గురువారం తొలగించారు. గత సంవత్సరం జూలై నెల 10వ తేదీ అర్ధరాత్రి సమయంలో టీడీపీ నాయకులు అక్కడ ఉన్న షాపు యాజమానులకు దారి లేకుండా పార్టీ స్థూపాన్ని నిర్మించారు. దీనిపై ఓ షాపు యాజమాని జీవీఎల్‌ఎస్ శర్మ అప్పట్లో మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారి శాఖలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై ఆయన హైకోర్టును సైతం ఆశ్రయించారు. టీడీపీ జెండా దిమ్మను తక్షణమే తొలగించాలని హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీసు, ఆర్ అండ్ బీ శాఖల అధికారులు జేసీబీతో టీడీపీ దిమ్మను తొలగించారు. కాగా, పార్టీ జెండా స్థూపాన్ని తొలగించడంపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నాయి.

నారా భువనేశ్వరిపై ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

- కడపలో రూ. 3 లక్షల చెక్కులు పంపిణీ చేశారు
- అసత్య కథనాన్ని ప్రచురించిన ఈనాడు ఎడిటర్‌పైనా చర్యలు తీసుకోవాలి

సాక్షి, అమరావతి: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనాకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి గురువారం ఫిర్యాదు చేశారు. బుధవారం కడప జిల్లాలో నిజం గెలవాలి పేరుతో పర్యటిస్తూ ఓటర్లను ఆకట్టుకునేలా ఆర్థిక సహాయం పేరుతో మూడు లక్షల రూపాయల చెక్కును భువనేశ్వరి పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. ఇది ఎన్నికల రూల్స్ ప్రకారం ప్రలోభాల కిందకే వస్తుందన్నారు. అలాగే ఈనాడు ఎడిటర్ నాగేశ్వరావు సీఎం జగన్‌పై తన పత్రికలో ప్రజాస్వామ్య వనంలో గంజాయి మొక్క అంటూ అసత్య కథనాన్ని ప్రచురించారని, అతనిపై చర్యలు తీసుకోవాలని అప్పిరెడ్డి కోరారు.

ఒంటరి మహిళను వేధించిన టీడీపీ సీనియర్ నేత

రాజంపేటలో అదుపులోకి తీసుకున్న పోలీసులు



రాజంపేట: ఒంటరి మహిళను వేధించిన టీడీపీ సీనియర్ నేతను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన అన్నమయ్య జిల్లాలో జరిగింది. రాజంపేట అర్బన్ సీఐ మద్దయ్య ఆచారి గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (మోదుగల కళావతమ్మ ఇంజినీరింగ్ కళాశాల) అధినేత, తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత మోదుగల పెంచలయ్య స్థానిక ఉస్మాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఒంటరి మహిళను వేధించాడు. బుధవారం రాత్రి ఆ మహిళ ఇంటికి వెళ్లి తన లైంగిక వాంఛ తీర్చాలని బలవంతం చేశాడు. ఇందుకు ఒప్పుకోని ఆ మహిళ.. పెంచలయ్య ఇంటిలో ఉండగా బయటకు వచ్చి తలుపుకు గడియ పెట్టి పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. దీంతో వెంటనే బాధితురాలి ఇంటికి వెళ్లిన పోలీసులు పెంచలయ్యను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై విచారణ నిర్వహిస్తున్నట్టు అర్బన్ సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు.

టీడీపీ నేతల బరితెగింపు

కొనసాగుతున్న కోడ్ ఉల్లంఘనలు • దుత్తలూరులో అనుమతి లేకుండా సమావేశం.. అడ్డుకోబోయిన ఎంపీడీవోపై దౌర్జన్యం



వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల మండలం చిలంకూరు టీడీపీ కార్యాలయంలో బ్యానర్లు



ఏలూరులో బహిరంగ ప్రదేశాల్లో టీడీపీ ఫ్లెక్సీలు

ఉదయగిరి/గుడివాడ టౌన్/కడప సెవెన్‌రోడ్స్/ఎర్రగుంట్ల/ జంగారెడ్డిగూడెం: టీడీపీ నేతల ఎన్నికల కోడ్ ఉల్లంఘన కొనసాగుతూనే ఉంది. ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉన్నా అనుమతులు లేకుండానే సమావేశాలు నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న అధికారులు వెళ్లి అభ్యంతరం తెలిపితే దాడులకు సైతం తెగపడుతున్నారు.

ఎంపీడీవోపై దౌర్జన్యం

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం దుత్తలూరు మండల కేంద్రంలోని ఓ పెట్రోలు బంకు ఆవరణలో బుధవారం సాయంత్రం ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ అనుమతులు లేకుండా అనుచరులతో సమావేశం నిర్వహించారు. దుత్తలూరు ఎంపీడీవో కె.సురేష్‌బాబు సమావేశ ప్రాంతానికి వెళ్లి అనుమతులు తీసుకోనందున సమావేశం ఆపివేయాలని నేతలకు తెలిపారు. కానీ వారు పట్టించుకోకుండా సమావేశం కొనసాగించడంతో ఆ దృశ్యాలను తన సెల్‌లో ఎంపీడీవో చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అక్కడున్న టీడీపీ నేతలు, కొంతమంది కార్యకర్తలు ఎంపీడీవోపై దౌర్జన్యం చేస్తూ నానా దుర్భాషలాడుతూ సెల్‌ఫోన్ లాక్కునే ప్రయత్నం చేశారు. ఎంపీడీవో ఆ ప్రాంతం నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా అక్కడున్న కార్యకర్తలు కారును చుట్టుముట్టి ముందుకు కదలనీయకుండా అడ్డుకున్నారు. అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడగా కొందరు కార్యకర్తలకు సర్దిచెప్పి కారును అక్కడి నుంచి పంపించారు. ఎంపీడీవో పోలీసులకు ఫిర్యాదు చేయగా టీడీపీకి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చేజర్ల మల్లికార్జునపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా రెండ్రోజుల క్రితం వింజమూరులోని కాకర్ల క్యాంపు కార్యాలయం వద్ద టీడీపీ ఫ్లెక్సీలు తొలగించడానికి ప్రయత్నించిన అధికారులను కూడా అడ్డుకున్నారు. అయితే ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఎట్టకేలకు అధికారులు ఆ ఫ్లెక్సీలు తొలగించారు.



నెల్లూరు జిల్లా దుత్తలూరులో ఎంపీడీవో కారును అడ్డుకుంటున్న టీడీపీ కార్యకర్తలు

కడప టీడీపీ అభ్యర్థి అభ్యంతరకర పోస్టు

ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన కడప నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మాధవికి గురువారం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు కడప రెవెన్యూ డివిజన్ అధికారి, రిటర్నింగ్ అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. ఆమె బుధవారం ఫేస్‌బుక్‌లో అభ్యంతరకరమైన పోస్టును విడుదల చేయడంపై షోకాజ్ నోటీసును జారీ చేశామన్నారు.

అనుమతులు లేకుండా టీడీపీ కార్యాలయం

అనధికారికంగా ఓ భవనంలో టీడీపీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదుతో జంగారెడ్డిగూడెం ఎంపీడీవో, ఎంసీసీ నోడల్ అధికారి కేవీప్రసాద్ మున్సిపల్ కమిషనర్, ఎంసీసీ నోడల్ అధికారి నరేంద్రకుమార్, పోలీస్ సిబ్బంది, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అధికారి కేవీ రమణ సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అధికారులు అక్కడికి వచ్చేలోపే పార్టీ జెండాలు, ఫ్లెక్సీలను టీడీపీ నేతలు తొలగించారు. అక్కడికి చేరుకున్న అధికారులకు ఇది పార్టీ కార్యాలయం కాదని.. ఓ తెలుగుదేశం పార్టీ నాయకుడి ఇల్లు అని, తమ పార్టీకి సంబంధించి ఎటువంటి కార్యకలాపాలు చేయడం లేదని టీడీపీ నేతలు చెప్పుకొచ్చారు. అనుమతులు లేకుండా ఎటువంటి పార్టీ కార్యకలాపాలు ఆ భవనంలో చేయకూడదని హెచ్చరించి అధికారులు వెనుతిరిగారు. కాగా, ఈనెల 16న దేశవ్యాప్తంగా ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చిన రోజే సాయంత్రం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో టీడీపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి అట్టహాసంగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. స్థానికులను కార్యాలయానికి రప్పించి ప్రలోభాలకు గురి చేస్తున్నారు.

టీడీపీ నాయకుల వీరంగం

గుడివాడ పట్టణం ఏలూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం చుట్టుపక్కల ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను గురువారం తొలగించే ప్రయత్నం చేసిన మున్సిపల్ సిబ్బందిపై టీడీపీ నాయకులు వీరంగం చేశారు. తాము అనుమతుల కోసం దరఖాస్తు చేశామని అవి వచ్చేవరకు తొలగించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

టీడీపీ కార్యాలయంలో బ్యానర్లు

వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం యర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామంలో గురువారం నాటికి కూడా టీడీపీ కార్యాలయంలో బ్యానర్లపై పేర్లు తొలగించలేదు. అధికార పక్షానికి చెందిన పోస్టర్లు, బ్యానర్లు తొలగించిన అధికారులు టీడీపీ పోస్టర్ల జోలికి వెళ్లకపోవడం విశేషం.

టీడీపీ నేత వాహనం సీజ్

ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా కారులో సామగ్రి



కడప అర్బన్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి తిరుగుతున్న టీడీపీ నేత వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేష్ వాహనాన్ని రెవెన్యూ, పోలీసు బృందం గురువారం సీజ్ చేసింది. ఎన్నికల కోడ్ అమలు చేసే క్రమంలో కడప డిప్యూటీ తహసీల్దార్ రోనాల్డ్ శామ్యూల్ ఆధ్వర్యంలో డబ్ల్యూఆర్‌డీ ఏఈ రమణ, హెడ్‌కానిస్టేబుల్ జె.సుబ్రహ్మణ్యం, కానిస్టేబుల్ ఎం.వి శేషారెడ్డి వాహనాలను ఆపి సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో స్కార్పియో వాహనం (ఏపీ39 క్యూఎఫ్ 3838) కోడ్‌కు విరుద్ధంగా ఉండటాన్ని గుర్తించారు. కారు వెనుక అద్దం మొత్తం 'మన భూపేష్ అన్న మన జమ్మలమడుగు' అని ఫొటో అతికించడంతో పాటు వాహనంలో పార్టీ కండువాలు, ప్లాస్టిక్ జెండా పైపులు, క్యాలెండర్లు, కరపత్రాలు ఉన్నాయి. దీంతో ఆ సామగ్రితో పాటు వాహనాన్ని అధికారుల బృందం స్వాధీనం చేసుకుంది. దీనిపై కడప వన్‌టౌన్ సీఐ సి.భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వాహన డ్రైవర్ పరారయ్యాడు.

3 జిల్లాల ఎస్పీలు వివరణ ఇచ్చారు

- వారి నివేదికలను కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తాం
- నారా భువనేశ్వరి చెక్కుల పంపిణీపై కలెక్టర్ల నివేదిక కోరాం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా



సాక్షి, అమరావతి: నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో జరిగిన హత్యలు, పల్నాడు జిల్లాలో కారు దహనంపై ఆ మూడు జిల్లాల ఎస్పీలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనాకు వివరణ ఇచ్చారు. సీఈవో మీనా ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీరా రెడ్డి, ప్రకాశం జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి గురువారం సాయంత్రం సచివాలయంలోని సీఈవో కార్యాలయానికి వచ్చారు. అక్కడ సీఈవో ముఖేష్ కుమార్ మీనా, అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్) శంకబ్రత్ బాగ్చీ ఎదుట హాజరై ఆ సంఘటనలకు దారి తీసిన పరిస్థితులు, అనంతరం తాము చేపట్టిన చర్యలపై నివేదికలు అందజేశారు. అనంతరం సీఈవో మీనా విలేకరులతో మాట్లాడుతూ గిద్దలూరులో జరిగినది రాజకీయ హింసేనని ఎస్పీ నివేదిక ఇచ్చారని తెలిపారు. ఆళ్లగడ్డలో జరిగిన హత్య కుటుంబ కక్షల వల్ల జరిగిందని ఆ జిల్లా ఎస్పీ వివరించారన్నారు. మాచర్లలో రెండు వర్గాల ఘర్షణ సందర్భంగా కారు దహనం జరిగిందని, గురువారం రాత్రిలోగా నిందితులను అరెస్ట్ చేస్తామని పల్నాడు ఎస్పీ చెప్పినట్లు తెలిపారు. ఎస్పీలు ఇచ్చిన నివేదికలను కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీకి) సమర్పిస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఎటువంటి హింసాత్మక ఘటనలు, రీపోలింగ్ లేకుండా నిర్వహించాలనేది తమ లక్ష్యమని చెప్పారు. రాజకీయ హింసను నిరోధించేలా కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తే కోడ్ ఉల్లంఘనే

నారా భువనేశ్వరి నిజం గెలవాలి కార్యక్రమంలో చెక్కులు పంపిణీ చేసినట్లు వచ్చిన ఫిర్యాదులపై ఆ జిల్లాల కలెక్టర్ల నుంచి నివేదికలు కోరినట్లు మీనా తెలిపారు. డబ్బులు పంపిణీ కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని స్పష్టం చేశారు. నారా భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతో చేపట్టిన పరామర్శ యాత్ర కొనసాగించవచ్చని, కానీ చెక్కులు పంపిణీ చేయకూడదని ఆయన స్పష్టం చేశారు.

ప్రధాని సభలో భద్రత వైఫల్యంపై ఈసీ నివేదిక కోరింది

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న చిలకలూరిపేట బహిరంగ సభలో భద్రత వైఫల్యంపై ఈసీ నివేదిక కోరిందని మీనా తెలిపారు. ఈ సభలో భద్రత వైఫల్యంపై వివిధ రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సభలో జరిగిన సంఘటనలపై వాస్తవాలను సమర్పించాలని ఈసీ కోరిందని, త్వరలోనే పూర్తి వివరాలను తెప్పించుకొని నివేదిక పంపుతామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయండి

ఎన్నికల కమిషన్‌కు ఏపీ మహిళా కమిషన్ విజ్ఞప్తి



సాక్షి, అమరావతి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు (గర్భిణులు, బాలింతల) పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకట లక్ష్మి ఏపీ ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె ఎన్నికల కమిషన్‌కు రాసిన లేఖను గురువారం మీడియాకు విడుదల చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద మహిళలకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటుచేయాలని, బాలింతల కోసం ఫీడింగ్ రూమ్ అందుబాటులో ఉంచాలని కోరారు. గర్భిణులకు అత్యవసర పరిస్థితిలో వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు వేసేందుకు వచ్చే మహిళలు వడదెబ్బకు గురికాకుండా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద షెల్టర్లు ఏర్పాటుచేయాలని, మంచినీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేకంగా మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. దాడులు, లైంగికదాడులు, వేధింపులకు గురైన మహిళలకు తగిన న్యాయం చేసేందుకు, బాధితులను పరామర్శించేందుకు మహిళా కమిషన్ చైర్‌పర్సన్, సభ్యులకు ఎన్నికల నిబంధనలలో సడలింపు ఇవ్వాలని కోరారు. గిరిజన మహిళలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించేందుకు మహిళా కమిషన్‌కు అనుమతివ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పేరుకే కూటమి... అంతటా అమీతుమీ!

క్షేత్ర స్థాయిలో పొత్తులపై పెరుగుతున్న వ్యతిరేకత

- హిందూపురం ఎంపీ సీటుపై టీడీపీ, బీజేపీ అమీతుమీ
- ధర్మవరంలో వరదాపురం వర్సెస్ పరిటాల
- జమ్మలమడుగులో రెండు ముక్కలైన దేవగుడి కుటుంబం
- రాజోలులో పోటీ చేసేదెవరో తేల్చని జనసేన
- తిరుపతిలో అభ్యర్థిత్వాలపై పెల్లుబుకుతున్న నిరసనలు
- పెనమలూరు టికెట్ వ్యవహారం వివాదాస్పదం



పిఠాపురంలో ఇటీవల తెలుగుదేశం, జనసేన జెండాలను తగులబెడుతున్న వర్మ వర్గీయులు

సాక్షి నెట్‌వర్క్: ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో కుమ్ములాటలు ముదురుపాకాన పడుతున్నాయి. అభ్యర్థిత్వాలు ఇంకా ఒక కొలిక్కి రాకపోగా... ప్రకటించిన స్థానాల్లో అసమ్మతి రాగాలు మిన్నంటుతున్నాయి. పొత్తు ధర్మం తమ అభ్యర్థిత్వాలకు ఎసరు పెట్టినట్టయిందని కూటమి పార్టీల్లోని ఆశావహులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా జెండామోసిన తమను కాదని వేరెవరికో టికెట్ ఇస్తే వారి గెలుపుకోసం ఎందుకు పాకులాడాలంటూ నిలదీస్తున్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో బీజేపీ, జనసేన గరం గరం

శ్రీ సత్యసాయి జిల్లాలో సీట్ల కేటాయింపు విషయంలో టీడీపీపై బీజేపీ, జనసేన గుర్రుగా ఉన్నాయి. ఈ జిల్లాలో జనసేనకు ఒక్క సీటు కూడా ఇవ్వబోమని తేల్చేసినా బీజేపీకి ధర్మవరం అసెంబ్లీ లేదా హిందూపురం పార్లమెంటు ఇస్తారని ప్రచారం సాగింది. దానికి అనుగుణంగా హిందూపురం నుంచి పరిపూర్ణానందస్వామి, ధర్మవరం నుంచి వరదాపురం సూరి బీజేపీ తరఫున టికెట్ ఆశిస్తున్నారు. కానీ ఆ స్థానాల్లో కూడా టీడీపీ నేతలే టికెట్ కోసం పట్టు బట్టడం ఇక్కడ వివాదానికి కారణమవుతోంది. హిందూపురం లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసేందుకు బీజేపీ తరఫున పరిపూర్ణానందస్వామి ఉత్సాహం చూపిస్తుండగా టీడీపీ నేత నిమ్మల కిష్టప్ప ఆ స్థానానికి పట్టుపడుతున్నారు. అధిష్టానం అంగీకరించకుంటే ఇండిపెండెంట్‌గానైనా పోటీచేయాలని ఆయన యోచిస్తున్నారు. మరోవైపు పెనుకొండ టికెట్ ఆశించి భంగపడ్డ బీకే పార్థసారథి, హిందూపురం నేత అంబికా లక్ష్మీనారాయణ కూడా ఇదే సీటుకోసం యత్నిస్తున్నారు. ధర్మవరంలో వరదాపురం సూరి(బీజేపీ), పరిటాల శ్రీరామ్(టీడీపీ) మధ్య అంతర్గత పోరు నడుస్తోంది.

బాబాయ్‌పై అబ్బాయ్ గుర్రు

మాజీ ఎమ్మెల్యే దేవగుడి ఆదినారాయణరెడ్డి ఎత్తుగడలు ఈమారు బెడిసికొట్టాయి. బీజేపీ తరఫున జమ్మలమడుగు ఎమ్మెల్యే టికెట్ దక్కించుకోవడంలో సఫలమైన ఈయన కుటుంబంలో ఐక్యత సాధించడంలో విఫలమయ్యారు. అప్పటికే అక్కడ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆయన అన్న, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి కుమారుడు భూపేష్ టికెట్ తనకే ఖాయమన్న ధీమాలో ఉన్నారు. అయితే బాబాయ్ చేసిన పని వల్ల ఆ అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు దేవగుడి సోదరులంతా ఒకవైపు ఆది ఒక్కరు ఒకవైపులా మారిపోయారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ ఎమ్మెల్యే టికెట్ తీసుకోవాలా? లేక కడప ఎంపీ సీటు అడగాలా అన్న ఆలోచనలో ఆది పడిపోయారు.

కోనసీమలో జనసేన సీటుపై వీడని సందిగ్ధం

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జనసేనకు కేటాయించిన రాజోలు స్థానంలోనూ అభ్యర్థి ఖరారు విషయంలో సందిగ్ధం కొనసాగుతోంది. జిల్లాలో సుమారు 29 శాతం ఓట్లున్న జనసేనకు కనీసం మూడు స్థానాలైనా ఇస్తారని అంతా భావించారు. గతంలో గెలిచిన రాజోలుతో పాటు అమలాపురం, రామచంద్రపురం నియోజకవర్గాల నుంచి పోటీచేయాలని నిర్ణయించుకున్నారు. టీడీపీ తొలి విడతలో కొత్తపేట, మండపేట, ముమ్మిడివరం, పి.గన్నవరం, రెండో దశలో రామచంద్రపురం అభ్యర్థులను ప్రకటించుకుంది. రాజోలు, అమలాపురం ఎస్సీ నియోజకవర్గాలు మిగలగా ఇప్పటికే రాజోలు నుంచి జనసేన పోటీచేస్తుందని అధినేత ప్రకటించిన విషయం తెలిసిందే. అమలాపురం కూడా టీడీపీ లాగేసుకున్నట్టు తెలిసింది. వివాదాస్పదంగా మారిన పి.గన్నవరాన్ని పొత్తుల్లో భాగంగా బీజేపీ కోరుకుంటోంది. ఇప్పటికీ రాజోలులో అభ్యర్థులను జనసేన ఖరారు చేయకపోవడంతో కేడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.



శ్రీనివాసులకు సీటు ఇవ్వాలంటూ గుంతకల్లులో బీజేపీ శ్రేణుల ర్యాలీ



పాలకొల్లులో 30 రోజుల తర్వాత నిమ్మల మెడలో జనసేన కండువా

కందుకూరు టీడీపీలో రాజేష్ తిరుగుబావుటా...

నెల్లూరు జిల్లా కందుకూరు టీడీపీలో నాయకుల మధ్య అంతర్గత పోరు ఢీ అంటే ఢీ అనే స్థాయికి చేరింది. దాయాదులైన ఇంటూరి నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్‌ల మధ్య పోరు సాగుతోంది. అధిష్టానం ఇంటూరి నాగేశ్వరరావును ఎంపిక చేయడంతో రాజేష్, ఆయన వర్గం వ్యతిరేకిస్తోంది. ఆయనకు నచ్చ జెప్పేందుకు ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ యత్నించినప్పటికీ రాజేష్ ససేమిరా అన్నారు. అంతేగాకుండా బుధవారం నుంచి పట్టణంలోని సుల్తాన్ మొహిద్దీన్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం కూడా మొదలెట్టేశారు. అధిష్టానం పునరాలోచించకుంటే ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

గుంతకల్లు అసెంబ్లీ సీటుకోసం బీజేపీ పట్టు

టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా అనంతపురం జిల్లా గుంతకల్లు అసెంబ్లీ సీటును బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుకు కేటాయించాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. అంతేగాకుండా గురువారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. 2014లో ఈ అసెంబ్లీ సీటును బీజేపీ అభ్యర్థి వెంకట్రామయ్యకు కేటాయించినప్పటికీ చంద్రబాబు పొత్తుధర్మానికి తూట్లు పొడిచి తిరిగి టీడీపీ అభ్యర్థి జితేంద్రగౌడ్‌కు బీ-ఫారం ఇచ్చి బీజేపీని మోసం చేశారనీ, ఈ సారి అలా కాకుండా సందిరెడ్డికే కేటాయించాలని కోరుతున్నారు.

జనసేన కండువా వేసుకోని నిమ్మలకు ఝలక్

పాలకొల్లు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు 30 రోజులుగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. కానీ ఆయన పసుపు కండువా వేసుకుని, జనసేన కండువా వేసుకోకపోవడంపై ఆ పార్టీ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. చివరకు గురువారం యలమంచిలి మండలం వడ్డిలంకలో జనసేన కండువా వేసుకుంటేనే తాము ప్రచారానికి వస్తామని లేదంటే కుదరదని చెప్పినట్లు తెలిసింది. చేసేది లేక ఆయన ఎర్ర కండువా వేసుకున్నాకే జనసైనికులు ప్రచారంలోపాల్గొన్నారు.

పెనమలూరుపై వీడని పీటముడి

కృష్ణాజిల్లా పెనమలూరు టికెట్‌పై పీటముడి వీడటం లేదు. అధిష్టానం అనుసరిస్తున్న నాన్చుడు ధోరణిపై పార్టీ శ్రేణులు మండిపడుతున్నాయి. టికెట్ ఆశిస్తున్న బోడె ప్రసాద్ తాజాగా సొంత పార్టీలో చేతకాని వెధవలు ఉన్నారంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. తనను కాదని బయటి వారికి అవకాశమిస్తే చూస్తూ ఊరుకోనని, స్వతంత్రంగానైనా పోటీ చేస్తానని ప్రకటించారు. దీనిపై విలేకరులు ప్రశ్నించగా తాను ఆవేశంలో ఆ ప్రకటన చేశానని దాటవేశారు.

ఎవరి దారి వారిదే...

తిరుపతి జిల్లాలో కూటమి నేతల్లో సయోధ్య కొరవడింది. వారు విడివిడిగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని అభ్యర్థులను మార్చాలంటూ అధినేతలకు సమాచారం పంపారు. తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరిలో గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కలిసి సమావేశాలు ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తిలో మాజీ ఎమ్మెల్యే ఎస్.సి.వి.నాయుడు, జనసేన నాయకురాలు వినూత, బీజేపీ నాయకుడు సుబ్రమణ్యం రెడ్డి తన అనుచరులతో రహస్యంగా సమావేశమయ్యారు. బొజ్జల సుధీర్‌రెడ్డిని వారు వ్యతిరేకిస్తూ ఆయన తప్ప తమలో ఎవరికిచ్చినా కలిసి పనిచేస్తామని ప్రకటించారు. తిరుపతి సీటు నాన్ లోకల్ వ్యక్తికి కేటాయించడాన్ని అక్కడి కూటమి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. సత్యవేడు అభ్యర్థి ఆదిమూలాన్నే కొనసాగిస్తే.. తాము సహకరించేది లేదని టీడీపీ నేతలు ఆందోళన చేపట్టారు. మరోవైపు టీడీపీ నాయకుడు జేడీ రాజశేఖర్ రెబల్ అభ్యర్థిగా ప్రచారాన్ని ప్రారంభించారు. వెంకటగిరిలో టీడీపీ నాయకుడు మస్తాన్ యాదవ్ అనుచరులు చంద్రబాబు ప్రకటించిన అభ్యర్థికి సహకరించేది లేదని మరోసారి తేల్చిచెప్పారు.

చల్లారని ఆగ్రహం

తూర్పు గోదావరి జిల్లాలో తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం చల్లారటం లేదు. తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని అధిష్టానంపై అసమ్మతి వర్గీయులు తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజుకు వ్యతిరేకంగా 'మద్దిపాటి వద్దు.. మరెవ్వరైనా ముద్దు' అంటూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు వర్గం నేతలు బుధవారం నిరసనకు దిగారు. వారం రోజుల్లోగా అభ్యర్థిని మార్చకపోతే తమ సత్తా చూపిస్తామని వారు అల్టిమేటం జారీ చేశారు. మద్దిపాటి బుధవారం చేపట్టిన పాదయాత్రను కూడా వారు బహిష్కరించారు. మరోవైపు కొవ్వూరులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కే.ఎస్.జవహర్‌ను కాదని, గోపాలపురం నుంచి తీసుకుని వచ్చి మరీ ముప్పిడి వెంకటేశ్వరరావుకి టికెట్టు కేటాయించడంపై అక్కడి ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

వర్మపై పిఠాపురం జనసైనికుల ఆగ్రహం

పిఠాపురంలో టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ అనుసరిస్తున్న వైఖరిపై జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి టికెట్ ఆశించిన వర్మ ఎన్నికల ప్రచారం సైతం ప్రారంభించారు. అప్పటి నుంచి అసలు జనసేన నాయకులను కనీసం మనుషుల్లా కూడా చూడలేదనీ, తమను సమావేశంనుంచి బలవంతంగా పంపించేశారని వారు మండిపడుతున్నారు. అయితే పొత్తులో భాగంగా పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్లు జనసేన అధ్యక్షుడు పవన్ ప్రకటించడంతో చాపకింద నీరులా ఉన్న విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. తరువాత ఏం జరిగిందో గానీ తాను పవన్ గెలుపునకు సహకరిస్తానంటూనే తనకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, సైన్యాన్ని నడపడానికి సైన్యాధిపతిగా తాను తీసుకునే నిర్ణయాలకు లోబడే జనసేన నడుచుకోవాలనే కొత్త డిమాండ్ వర్మ తీసుకువచ్చారు. పైగా తనను కాదని జనసేన విజయం సాధించడం అసాధ్యమనీ..క్కడ జనసేన అనేదే లేదనీ వర్మ చేసిన వ్యాఖ్యలపై జనసేన శ్రేణులు అగ్గి మీద గుగ్గిలమవుతున్నాయి. తామేంటో ఆయనకు రుచిచూపిస్తామని జనసైనికులు ఆగ్రహోదగ్రులవుతున్నారు.

'పచ్చ' మత్తు కిక్కుతో వంకర రాతలు

గంజాయి దందా పాపం చంద్రబాబుదే రామోజీ

- మంచి చేయడం కూడా మీ దృష్టిలో తప్పేనా?
- నర్సీపట్నం కేంద్రంగా టీడీపీ నేతల గంజాయి సిండికేట్
- స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- సీఎం జగన్ ఆదేశాలతో ఆపరేషన్ పరివర్తన్
- గిరిజనులకు ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా ప్రోత్సాహం
- ఏపీ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు

సాక్షి, అమరావతి : ఎక్కడైనా దొంగలను పట్టుకుంటే పోలీసులు సమర్థవంతంగా పని చేస్తున్నట్టు భావిస్తారు. కానీ రామోజీరావు మాత్రం అలాంటి మంచిని ప్రభుత్వ అసమర్థతగా వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గంజాయి దందాపై ఉక్కుపాదం మోపింది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో దశాబ్దాలుగా సాగుతున్న గంజాయి సాగును ధ్వంసం చేయడంతో పాటు గంజాయి అక్రమ రవాణాను సమర్థంగా కట్టడి చేస్తోంది. అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తోంది. నిందితులను అరెస్ట్ చేస్తోంది. అంత సమర్థంగా పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ఎవరైనా ప్రశంసించాలి. రామోజీరావు మాత్రం.. 'చూడండి.. అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.. స్మగ్లర్లను అరెస్ట్ చేశారు.. ఇదంతా ఈ ప్రభుత్వ తప్పిదమే' అని టముకేస్తూ వక్రభాష్యం చెబుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం హయాంలో చేసినట్టుగా గంజాయి దందాను ప్రభుత్వం పట్టించుకోకుండా ఉండాలన్నది రామోజీరావు ఉద్దేశమేమో! దశాబ్దాలుగా గంజాయి సాగు, అక్రమ రవాణా సాగుతున్నా చంద్రబాబు ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. గంజాయి సాగును ధ్వంసమూ చేయలేదు. అక్రమ రవాణాను అడ్డుకోలేదు. దీని వెనుక అసలు రహస్యమేంటంటే.. టీడీపీ ప్రభుత్వంలో గంజాయి దందా సాగించింది అంతా పచ్చ నేతలే. అదే రామోజీరావుకు నచ్చింది. తద్భిన్నంగా ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గంజాయి దందాకు అడ్డుకట్ట వేస్తుంటే రామోజీరావు సహించలేకపోతున్నారు.

జాతీయ స్థాయిలో ప్రశంసలు

గంజాయి దందాను నిర్మూలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు జాతీయస్థాయిలో ప్రశంసలు లభించాయి. కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ ఏపీ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పరివర్తన్‌ను అభినందించింది. ప్రత్యేక పరిశీలకులను పంపించి ఆపరేషన్ పరివర్తన్ పై అధ్యయనం చేయించింది. గంజాయి సాగును సమర్థంగా అడ్డుకున్న రాష్ట్రాల జాబితాలో ఏపీ మొదటిస్థానంలో నిలిచిందని కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించింది. దేశం మొత్తం మీద గంజాయి సాగు ధ్వంసంలో ఏపీ మొదటి స్థానంలో ఉందని పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది.

> రామోజీ దుష్ప్రచారం చూస్తుంటే ఆయన ఎంతగా భయపడిపోతున్నారో స్పష్టంగా తెలుస్తోంది. చంద్రబాబు హయాంలో గంజాయి సాగు చేసిన పచ్చ బ్యాచ్ గురించి అక్షరమ్ముక్క రాయని ఈ గురివింద.. ఇప్పుడు జగన్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నప్పటికీ తప్పుడు రాతలతో రెచ్చిపోతున్నారు. రాసిందే రాస్తూ.. చెప్పిందే చెబుతూ.. 'పచ్చ' మత్తు కిక్కులో అనునిత్యం ప్రభుత్వంపై కక్షగట్టి వ్యవహరిస్తుండటం రామోజీకి పరిపాటిగా మారింది. సీఎం జగన్ చేస్తున్న ప్రతి మంచి పనిలోనూ కోడిగుడ్డుపై వెంట్రుకలు పీకాలన్న చందంగా వ్యవహరిస్తుండటం చూస్తుంటే రామోజీ పచ్చ పిచ్చి వైద్యానికి అందనంతగా ముదిరిపోయిందని స్పష్టమవుతోంది.



రూ.144 కోట్లతో ఆపరేషన్ నవోదయం

దశాబ్దాలుగా జీవనోపాధి లేక గంజాయి సాగుపై ఆధారపడుతున్న గిరిజనుల జీవితాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త వెలుగులు తీసుకొచ్చింది. ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా వారిని ప్రోత్సహించింది. అందుకోసం రూ.144 కోట్లతో ఆపరేషన్ నవోదయం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. కాఫీ, రాగులు, జొన్నలు, రాజ్మా, మామిడి, కొబ్బరి, నిమ్మ, జీడి మామిడి, వేరుశెనగ, డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటల సాగు చేపట్టేలా ప్రోత్సహించింది. ఇందులో భాగంగా ఉచితంగా విత్తనాలను సరఫరా చేయడంతో పాటు ఈ–క్రాపింగ్ ద్వారా అన్నిరకాల పథకాలను అందుబాటులోకి తెచ్చింది. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పిస్తూ ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలను పంపిణీ చేసింది.

పచ్చ పెద్దలదే గంజాయి దందా



చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే ఆయనకు అత్యంత సన్నిహితులైన టీడీపీ కీలక నేతలు నర్సీపట్నం కేంద్రంగా గంజాయి సిండికేట్‌ను నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వ హయంలో ఉత్తరాంధ్రలో అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల్లో యథేచ్ఛగా గంజాయి సాగు చేయించారు. అప్పట్లో ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా పోలీసు ఉన్నతాధికారి ఈ గంజాయి దందాకు పూర్తి అండదండలు అందించారు. గంజాయి సాగును అడ్డుకుంటే గిరిజనులు నక్సలైట్లకు అనుకూలంగా మారతారన్న వితండవాదాన్ని బాబు ప్రభుత్వం తీసుకురావడాన్ని ఈనాడుకు కనిపించినట్లు లేదు. ఈ క్రమంలోనే టీడీపీ ప్రభుత్వం గంజాయి దందాకు పచ్చ జెండా ఊపడంతో విశాఖపట్నం ఏజెన్సీలో వేలాది ఎకరాల్లో గంజాయి సాగు యథేచ్ఛగా సాగిపోయింది. విశాఖపట్నం ఏజెన్సీలో సాగు చేసిన గంజాయిని నర్సీపట్నంలోని టీడీపీ సిండికేట్ నేతలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులతోపాటు ఉత్తరాది రాష్ట్రాలకు సరఫరా చేసేవారు. అందుకోసం ప్రత్యేకంగా వ్యవస్థీకృత కొరియర్ వ్యవస్థను సైతం ఏర్పాటు చేశారు. ఆ విధంగా చంద్రబాబు ప్రభుత్వ హయాంలో గంజాయి సాగు ద్వారా టీడీపీ ప్రభుత్వ పెద్దలు వేల కోట్ల రూపాయలు ఆర్జించారు.

11,550 ఎకరాల్లో గంజాయి సాగు ధ్వంసం

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గంజాయి దందాపై ఉక్కుపాదం మోపింది. ఈ సాగును నిర్మూలించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలీసు యంత్రాంగాన్ని విస్పష్టంగా ఆదేశించారు. గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా దందాను తుదముట్టించేందుకు ప్రత్యేకంగా 'స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో' (సెబ్)ను ఏర్పాటు చేసి, ఈ బ్యూరోకు విస్తృత అధికారాలు కల్పించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో 'సెబ్' గంజాయి సాగును నిర్మూలించేందుకు 'ఆపరేషన్ పరివర్తన్' కార్యక్రమాన్ని చేపట్టింది. ముందుగా గంజాయి సాగు వల్ల అనర్థాలపై ఆపరేషన్ పరివర్తన్ ద్వారా ఆంధ్ర–ఒడిశా సరిహద్దుల్లో విస్తృత అవగాహన కల్పించింది. పోలీసు, రెవెన్యూ, సెబ్, గ్రామ సచివాలయ అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేపట్టిన అవగాహన కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. ఈ పంట సాగు నిర్మూలన కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. శాటిలైట్ ఫొటోలతో ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతాన్ని జీయో మ్యాపింగ్ చేశారు. అనంతరం ప్రత్యేక యంత్రాలతో సాగును ధ్వంసం చేశారు. రెండు దశల్లో ఏకంగా 11,550 ఎకరాల్లో పంటను ధ్వంసం చేశారు. ఏకంగా 4.50 కోట్ల గంజాయి మొక్కలను తొలగించి దహనం చేశారు. ఒడిశా, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లో సాగు చేస్తున్న గంజాయిని ఆంధ్ర ప్రదేశ్ గుండా అక్రమ రవాణానూ పోలీసు యంత్రాంగం సమర్థంగా అడ్డుకుంటోంది. దీనికోసం ప్రత్యేకంగా అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, ఇతర చెక్ పోస్టులను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. ఇప్పటివరకు 4.50 లక్షల కేజీల గంజాయి, 131 లీటర్ల ద్రవ రూప గంజాయిని స్వాధీనం చేసుకుంది. 13,210 మందిని అరెస్ట్ చేయడంతో పాటు 2,950 వాహనాలను జప్తు చేసింది.

విశాఖ పోర్టులో దొరికిన 25వేల కిలోల డ్రగ్స్...

కేరాఫ్ కోటయ్య చౌదరి

సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కేంద్రంగా భారీ డ్రగ్స్ దందా

- బ్రెజిల్ నుంచి కంటైనర్లో విశాఖ పోర్టుకు.. ఇంటర్‌పోల్ సమాచారంతో సీబీఐ తనిఖీ
- 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌తో కలగలిపి కొకైన్ దిగుమతి.. సంధ్యా ఆక్వా పేరిట డెలివరీ
- ఈ కంపెనీ సీఈవో కూనం కోటయ్య చౌదరి.. ఆయన తండ్రి వీరభద్రరావు ఎండీ
- బీజేపీ నేత పురందేశ్వరి కుటుంబీకులకు వీరభద్రరావు వ్యాపార భాగస్వామి



విశాఖ సిటీ/ సాక్షి, అమరావతి : అచ్చం సినిమాను తలపించే రీతిలో విదేశాల నుంచి విశాఖ పోర్టుకు వచ్చిన నౌకలో భారీ స్థాయిలో డ్రగ్స్‌ను సీబీఐ అధికారులు పట్టుకున్నారు. ఇంటర్‌పోల్ సమాచారంతో ఆపరేషన్ గరుడలో భాగంగా ఎవరికీ అనుమానం రాకుండా డ్రై ఈస్ట్‌తో కలిపి బ్యాగుల్లో ప్యాక్ చేసిన ఈ డ్రగ్స్ కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్‌లో 25 కేజీల చొప్పున 1000 బ్యాగ్‌లు.. మొత్తంగా 25 వేల కిలోల ఇనాక్టివ్ డ్రై ఈస్ట్‌తో మిక్స్ అయిన డ్రగ్స్ ఉండటంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. ఎవరిదీ కంటైనర్.. అని విచారణ మొదలుపెట్టగానే.. ఈ స్మగ్లింగ్ దందా వెనుక టీడీపీ నేతల పాత్ర ఉందనే విషయం బట్టబయలైంది. తీగ లాగితే డొంక కదిలినట్లు ఇందులో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబ, వ్యాపార సంబంధాలూ బయటపడ్డాయి. బ్రెజిల్ దేశంలోని శాంటోస్ పోర్టు నుంచి బయలుదేరిన 'జిన్ లియన్ యన్ గ్యాంగ్' కంటైనర్ నౌక ఈ నెల 16వ తేదీ రాత్రి 9.30 గంటలకు విశాఖ పోర్టు టెర్మినల్–2కు చేరుకుంది. అందులో వచ్చిన కంటైనర్లను విశాఖ పోర్టు స్టాక్ యార్డ్‌లో అన్‌లోడ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ షిప్‌లోని ఎస్ఈకేయూ 4375380 నంబర్ గల కంటైనర్‌లో మాదక ద్రవ్యాలు ఉన్నాయని, తనిఖీ చేయాలని ఈ నెల 18న ఇంటర్‌పోల్ నుంచి ఒక ఈ–మెయిల్ వచ్చింది. వెంటనే ఢిల్లీలో సీబీఐ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దర్యాప్తు బాధ్యతలను డీఎస్పీ ఉమేష్ శర్మకు అప్పగించారు. సీబీఐ ఎస్పీ గౌరవ్ మిట్టల్ పర్యవేక్షణలో ఉమేష్‌కుమార్‌తో పాటు మరో డీఎస్పీ ఆకాష్ కుమార్ మీనా బృందం నార్కోటిక్ డిటెక్షన్ కిట్‌తో ఈ నెల 19వ తేదీ ఉదయం 8.15 గంటలకు విశాఖ చేరుకుంది. విశాఖ సీబీఐ డీఎస్పీ సంజయ్‌కుమార్ సమల్‌తో కలిసి విశాఖ పోర్టు విజిలెన్స్, కస్టమ్స్ అధికారుల సహకారంతో పోర్టులో తనిఖీ చేపట్టారు. ఇంటర్‌పోల్ సమాచారమిచ్చిన నంబర్ గల కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

భారీగా మాదక ద్రవ్యాలు గుర్తింపు

సదరు కంటైనర్ లాసెన్స్ బే కాలనీ ప్రాంతంలో ఉన్న సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరు మీద ఉన్నట్లు గుర్తించారు. ఈ కంపెనీకి కూనం వీరభద్రరావు ఎండీ కాగా.. సీఈఓగా ఆయన కుమారుడు కోటయ్య చౌదరి వ్యవహరిస్తున్నారు. విశాఖలో అందుబాటులో ఉన్న ఆ కంపెనీ సప్లై చైన్ మేనేజ్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.వి.ఎల్.ఎన్.గిరిధర్, కంపెనీ ప్రతినిధులు పూరి శ్రీనివాస కృష్ణమాచార్య శ్రీకాంత్, కె.భరత్ కుమార్‌ను రప్పించారు. కంటైనర్, సీల్ నెంబర్లు చూపించి అందులో ఏముందని సీబీఐ అధికారులు వారిని ప్రశ్నించారు. కంటైనర్‌లో 25 కేజీలు చొప్పున 1000 బ్యాగ్‌లు మొత్తంగా 25 వేల కిలోల ఇనాక్టివ్ డ్రై ఈస్ట్ ఉందని చెప్పారు. దీంతో కంటైనర్ తెరిచి చూడగా లోపల 20 బాక్సులలో వెయ్యి బ్యాగులు ఉన్నట్లు గుర్తించారు. ఒక్కో బాక్స్ నుంచి ఒక్కో బ్యాగ్‌ను కంపెనీ ప్రతినిధుల సమక్షంలోనే బయటకు తీశారు. ఆ బ్యాగుల్లో పచ్చ రంగులో ఉన్న పౌడర్‌ను నార్కోటిక్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించారు. 20 బ్యాగుల్లో పౌడర్‌ను పరీక్షించిన సీబీఐ అధికారులు విస్తుపోయారు. ఈ పౌడర్‌లో కొకైన్, మెథాక్వాలోన్, ఓపియం, మారిజోనా, హాషిష్ మాదక ద్రవ్యాలు ఉన్నట్లు రెండు వేర్వేరు పరీక్షల ద్వారా నిర్ధారణ అయింది. తాము తొలిసారిగా వీటిని దిగుమతి చేసుకున్నామని, అందులో ఉన్న పదార్థాల గురించి తమకు తెలియదని కంపెనీ ప్రతినిధులు చెప్పారు. తిరిగి సీబీఐ బృందం 20వ తేదీ ఉదయం 10.15 గంటలకు విశాఖ పోర్టుకు చేరుకొని సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కూనం హరికృష్ణ, ఇతరుల సమక్షంలో మరి కొన్ని బ్యాగులను పరీక్షించారు. అన్నింటిలోను మాదక ద్రవ్యాలు ఉన్నట్లు గుర్తించారు. దీనిపై కంపెనీ ప్రతినిధులను ప్రశ్నించగా.. వారు సరైన సమాధానాలు చెప్పలేకపోయారు. దీంతో సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కంపెనీపై కేసు నమోదు చేశారు.

సంధ్యా ఆక్వాపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు

టీడీపీ ప్రభుత్వ హయాంలో సంధ్యా ఆక్వా అక్రమాలు యథేచ్ఛగా సాగాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కంపెనీలో తనిఖీలు నిర్వహించింది. అనుమతి లేకుండా ఈక్వెడార్ దేశం నుంచి రొయ్యలను దిగుమతి చేసుకుని వాటిని ప్రాసెస్ చేసి అమెరికాకు ఎగుమతి చేశారని తేలింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకుని ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు భారత చట్టాలు అనుమతించవు. కానీ ఆ చట్టాన్ని సంధ్యా ఆక్వా ఎండీ కూనం వీరభద్రరావు చౌదరి బేఖాతరు చేస్తూ అక్రమాలకు పాల్పడ్డారు. దాంతో పాటు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను కూడా ఉల్లంఘించినట్టు తనిఖీల్లో వెల్లడైంది. ఏకంగా 16 ఉల్లంఘనలను గుర్తించి కేసు నమోదు చేసి సంధ్యా ఆక్వా కంపెనీని సీజ్ చేశారు. ఇదిలా ఉండగా కూనం వీరభద్రరావుపై యూఎస్ పోలీసులు 2016లో కేసు నమోదు చేశారు. ఆ ఏడాది జూలై 30న లాస్ ఏంజెలిస్ నుంచి న్యూజెర్సీకి వెళ్తున్న విమానంలో తన పక్కనే నిద్రిస్తున్న మహిళా ప్రయాణికురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో వీరభద్రరావుని ఎఫ్‌బీఐ అరెస్టు చేసి న్యూయార్క్ కోర్టులో హాజరు పరిచారు. అనంతరం తానా ప్రతినిధుల సహాయంతో ఈ కేసు నుంచి బయటపడ్డారు. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లోనూ వీరభద్రరావు పాత్ర ఉందని తెలుస్తోంది. ఈయన నేతృత్వంలో రూ.25 కోట్లు చేతులు మారినట్లు సమాచారం.

టీడీపీ, పురందేశ్వరితో అనుబంధం

భారీగా డ్రగ్స్ దిగుమతి చేసుకున్న సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఈవో కూనం కోటయ్య చౌదరి, ఎండీ కూనం వీరభద్రరావు చౌదరితో టీడీపీ నేతలకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. చంద్రబాబు వదిన, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబానికి వీరు సమీప బంధువులు, వ్యాపార భాగస్వాములు కూడా కావడం గమనార్హం. పురందేశ్వరి కుమారుడు దగ్గుబాటి చెంచురామ్, ఆమె సమీప బంధువు ప్రసాద్‌రావులతో కలసి సంధ్యా ఆక్వా అనే కంపెనీని ఏర్పాటు చేశారు. అనంతరం ఆ కంపెనీని సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (విశాఖపట్నం, ఉయ్యూరు), సంధ్యా మెరైన్ (పాలకొల్లు), సంధ్యా ఆక్వా టెక్ (ప్రకాశం జిల్లా) పేర్లతో మూడుగా విభజించారు. వాటిలో సంధ్యా మెరైన్‌ను పురందేశ్వరి సమీప బంధువు (వియ్యంకుడు) ప్రసాద్‌రావు, సంధ్యా అక్వాటిక్‌ను పురందేశ్వరి కుమారుడు చెంచురామ్ నిర్వహిస్తుండగా.. సంధ్యా ఎక్స్‌పోర్ట్స్‌ను కూనం వీరభద్రరావు, కోటేశ్వరరావు నిర్వహిస్తున్నారు. కాగా, బాలకృష్ణ వియ్యంకుడి కుటుంబంతోనూ (గీతం యాజమాన్యం) వీరభద్రరావుకు సన్నిహిత సంబంధాలున్నాయి.

ఈ కేసును మేము ఎదుర్కొంటాం..



ఈ కేసును కంపెనీ తరఫున మేము ఎదుర్కొంటాం. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి సంబంధం లేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫీడ్ ప్లాంట్ ప్రారంభించాం. మైదా, సోయా, ఫిష్ మీల్ తదితర 10–15 రకాల ముడి సరుకును వినియోగిస్తుంటాం. ఇందులో ఈస్ట్ కూడా ఒకటి. రొయ్యల మేతకు 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌ను బ్రెజిల్‌లో ఆర్డర్ చేశాం. ఐసీసీబీ కంపెనీ ద్వారా జనవరి 14న బ్రెజిల్ నుంచి బయలుదేరిన ఈ కంటైనర్ రావాల్సిన సమయం కంటే చాలా ఆలస్యంగా విశాఖకు వచ్చింది. దేశంలో డ్రైడ్ ఈస్ట్ కేజీ రూ.200 ఉండగా.. బ్రెజిల్‌లో రూ.70కే వస్తుండడంతో అక్కడి నుంచి దిగుమతి చేసుకున్నాం. ఇది మా మొదటి ఆర్డర్. అందులో ఏముందో మాకు తెలియదు. మా కంపెనీ జెన్యూన్ అన్ని డాక్యుమెంట్స్ ఉన్నాయి. దీనిపై ఎటువంటి విచారణకైనా సిద్ధమే.

– కూనం హరికృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆక్వా మెరైన్ కంపెనీ

సిద్ధం సభలతో కూటమిలో భయం

- ఐదేళ్ల మా ప్రభుత్వంలో పేదోడికి జరిగిన మేలే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తుంది
- ఎన్నికల ప్రచారంలో భాగంగా మరోసారి 'గడప గడపకూ' కార్యక్రమాన్ని చేపడతాం
- ప్రజల్ని మరోసారి మోసగించేందుకు కూటమి నేతలు వస్తున్నారు..
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రులు బొత్స, గుడివాడ అమర్‌నాథ్, తిప్పల నాగిరెడ్డి, కోలా గురువులు

సాక్షి, విశాఖపట్నం : సిద్ధం సభలతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో భయం పెరిగిందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఐదేళ్ల తమ ప్రభుత్వంలో పేదోడికి జరిగిన మేలే తమను మరోమారు విజయపథంలో నిలుపుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 13 వరకూ గడప గడపకూ కార్యక్రమాన్ని మరోసారి విస్తృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. గురువారం ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీలో 175 అసెంబ్లీ, 24 పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ఒకేసారి ప్రకటించి ఎన్నికలకు సిద్ధమైతే.. ప్రతిపక్ష కూటమి ఇప్పటికీ తిప్పలు పడుతోందని ఎద్దేవా చేశారు. 2014–19లో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కూటమి.. మరోమారు మోసం చేసేందుకు బయలుదేరిందని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

మోదీ రాకుంటే ప్రచారం చేయలేని దుస్థితి

'వారాహిపై పవన్ ఎన్నిసార్లు ఎక్కారు? ఎన్నిసార్లు దిగారు? ఉపయోగం ఏమైనా ఉందా? అది చంద్రబాబు కోసమే తప్ప ప్రజల బాగోగులు కోసం కాదు' అని వైవీ సుబ్బారెడ్డి విమర్శించారు. ప్రధాని మోదీ రాకుంటే ఎన్నికల ప్రచారం కూడా చేయలేని స్థితిలో ప్రతిపక్ష కూటమి ఉందని ఎద్దేవా చేశారు. ఐదేళ్లలో తమ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై ప్రజల ముందు చర్చకు సిద్ధంగా తాము ఉన్నామని, మా ఎన్నికల ప్రచారాన్ని అనుసరించే దుస్థితిలో కూటమి నేతలున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ విశాఖ నగరం అభివృద్ధి చెందాలంటే తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. విశాఖ, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం పాటుపడిందే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉమ్మడి విశాఖ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే అభ్యర్థులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, కేకే రాజు, ఆడారి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'చక్షు'కు చెప్పండి!

సైబర్ నేరాల కట్టడికి కొత్త పోర్టల్ తెచ్చిన కేంద్రం

- అనుమానాస్పద ఫోన్ నంబర్లపై రిపోర్ట్ చేసే అవకాశం
- అలాంటి ఫోన్ నంబర్లను దర్యాప్తు సంస్థలతో పంచుకోనున్న టెలికాం

సాక్షి, హైదరాబాద్:

"హలో.. మీకు లక్కీ లాటరీలో రూ.50 లక్షలు వచ్చాయి.. ఈ మొత్తాన్ని పొందాలంటే మేం చెప్పే బ్యాంకు అకౌంట్ నంబర్‌కు రూ.లక్ష పంపండి.. మిగిలిన మొత్తం మీ సొంతం అవుతుంది.."

'మీ వాట్సప్ నంబర్‌కు వచ్చిన లింక్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేయండి.. సర్‌ప్రైజ్ గిఫ్ట్ పొందండి..'

"హలో.. బ్యాంకు మేనేజర్‌ను మాట్లాడుతున్నాను.. మీ కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలి. లేదంటే మీ క్రెడిట్‌కార్డు, డెబిట్‌కార్డు బ్లాక్ అయిపోతాయి. మేం అడిగే వివరాలు చెప్పండి.."

రోజుకో కొత్త తరహా సైబర్ మోసం...సైబర్ నేరగాళ్ల ఎత్తు ఏదైనా.. మూలం మాత్రం మన ఫోన్‌కు వచ్చే కాల్స్.. లేదంటే ఎస్ఎంఎస్‌లు. సైబర్ నేరగాళ్లు వివిధ ఫోన్ నంబర్ల నుంచి ఫోన్‌కాల్స్, ఎస్ఎంఎస్‌లు పంపి ఆర్థిక మోసాలకు పాల్పడటం ఇటీవల విపరీతంగా పెరిగింది. ఇలా ఫోన్ నంబర్లను ఉపయోగించి చేస్తున్న మోసాలను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'చక్షు' అస్త్రాన్ని అందుబాటులోకి తెచ్చింది. మోసపూరిత ఫోన్ నంబర్ల వివరాలు ఈ వెబ్ పోర్టల్‌లో నమోదు చేస్తే.. మోసగాళ్ల పనిపడతాయి దర్యాప్తు సంస్థలు. బ్యాంకులకు సైతం ఈ అనుమానాస్పద ఫోన్ నంబర్లు పంపుతారు. ఇలా చేయడం వల్ల సైబర్ నేరగాళ్లు సదరు నంబర్‌తో తెరిచిన బ్యాంకు ఖాతాలను జప్తు చేయడంతోపాటు మరొకరు మోసానికి గురికాకుండా కాపాడతారు. సాధారణ పౌరులు సైతం సైబర్ మోసగాళ్ల సమాచారాన్ని, మోసపూరిత ఫోన్ నంబర్ల సమాచారాన్ని చక్షు పోర్టల్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తేవచ్చు.

ఏమిటీ చక్షు పోర్టల్?

చక్షు అంటే కన్ను అని అర్థం.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ అందిస్తున్న సిటిజన్ సెంట్రిక్ సర్వీసెస్‌లో చక్షు పేరిట 'రిపోర్ట్ సస్పెక్టెడ్ ఫ్రాడ్ కమ్యూనికేషన్' కొత్త సేవా పోర్టల్‌ను కేంద్ర కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవలే ప్రారంభించారు. అనుమానిత మోసపూరిత కాల్‌లు, సందేశాలు వివరాలు ఇందులో నమోదు చేయవచ్చు.

చక్షు పోర్టల్ ఎలా వినియోగించాలి..

- https://sancharsaathi.gov.in లింక్ ద్వారా సంచార్ సాథి పోర్టల్‌లోకి లాగిన్ అవ్వాలి. • సిటిజన్ సెంట్రిక్ సర్వీసెస్‌లో చక్షు ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. కంటిన్యూ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. • మోసపూరిత కమ్యూనికేషన్‌కు సంబంధించిన వివరాలు, ఆ కాల్ లేదా మెసేజ్ వచ్చిన సమయం, ఇతర వివరాలు నమోదు చేయాలి. • ఫిర్యాదు నమోదైన తర్వాత వెరిఫికేషన్ కోసం ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా నమోదైన ఫిర్యాదు దర్యాప్తు సంస్థలకు వెళుతుంది.

తెలంగాణ


యువకుడి ప్రాణాల మీదకు తెచ్చిన ఆన్‌లైన్ గేమ్

- లెక్కలో రూ.6లక్షలు తేడాతో పెట్రోల్‌బంక్ యజమానుల ఫిర్యాదు
- రికవరీ పేరిట ఇంటిని రాయించుకున్న వైనం
- మనస్తాపంతో క్రిమిసంహారక మందు తాగిన యువకుడు

పరకాల: ఆన్‌లైన్ గేమ్ ఓ యువకుడి ప్రాణాల మీదకు తెచ్చింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో గురువారం రాత్రి వెలుగులోకి వచ్చింది. బాధితుడి తల్లి పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం.. పరకాలలోని వెలుమవాడకు చెందిన ఎండీ గౌస్‌పాషా గుడెప్పాడ్‌లోని జీకే పెట్రోల్ బంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గౌస్‌పాషా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆలోచనతో రమ్మీ ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటు పడి బంక్‌కు సంబంధించిన రూ.6లక్షలు పోగొట్టాడు. దీంతో బంక్ యజమానులు ఈ నెల 18న ఆత్మకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగకుండా ఆ డబ్బులు రికవరీ చేసేందుకు గౌస్‌పాషా ఇంటిని రూ.100 స్టాంప్ కాగితంపై రాయించుకున్నారు. అదే రోజు ఇంటికి చేరుకున్న గౌస్‌పాషా ఎంతో కష్టపడి తన తల్లిదండ్రులు కట్టుకున్న ఇంటిని బంక్ యజమానులు రాయించుకోవడం తెలిస్తే తట్టుకోలేరని మనస్తాపం చెంది ఈ నెల 19న పురుగుల మందు తాగాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని..మీరంతా తనను మరిచిపోవాలని తల్లి, తమ్ముడికి ఫోన్ చేశాడు. దీంతో వారు పోలీసులను సంప్రదించగా, పరకాల బంధం రోడ్డులో క్రిమిసంహారక మందు తాగి ప్రాణపాయ స్థితిలో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. తన కొడుకు ఆత్మహత్యయత్నానికి బంక్ యాజమానుల వేధింపులే కారణమని బాధితుడి తల్లి ఎండీ ఫర్వీనా పరకాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై పరకాల సీఐ రవిరాజుకు ఫోన్‌చేయగా స్పందించలేదు.



వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌస్‌పాషా



నల్లా ఇరుక్కు!

మీ ఇంట్లో నల్లాల ద్వారా నీరొస్తోందా.. దాన్ని నేరుగా తాగుతున్నారా? లేదా ఏదైనా ఫిల్టర్‌లో వేసి తాగుతున్నారా? అత్యధిక శాతం ప్రజలు ఫిల్టర్‌లనే వాడుతుంటారు. ఎందుకంటే.. మంచి నీళ్లని చెబుతున్నా.. అవన్నీ మంచిగా ఉన్నవేనా అన్న డౌటు. ఫిల్టరైజేషన్ చేయకుంటే.. రోగాల బారినపడతామన్న భయం. అయితే.. కొన్ని దేశాల్లో నల్లా నీటిని నేరుగా తాగేయొచ్చు. ఎందుకంటే.. తాగునీటి సరఫరా విషయంలో ఇవి కఠిన నిబంధనలు పాటిస్తున్నాయి. సురక్షితమైన నీటిని నల్లాల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నాయి. అందుకే ఈ కింది దేశాల్లోని నీరు 'నల్లా ఇరుక్కు'అన్నమాట!! చాలా సినిమాల్లో ఈ మాట విన్నట్లు అనిపిస్తోంది కదూ.. ఈ తమిళ పదానికి అర్థం ఇది బాగుంది లేదా మంచిది అని అర్థం. మార్చి 22న **'అంతర్జాతీయ నీటి దినోత్సవం'** నేపథ్యంలో.. ఈ 'నల్లా ఇరుక్కు' దేశాల టాప్–10 వివరాలివీ..

ఫిన్లాండ్ 1
ప్రకృతి సహజ వనరులకు పెట్టింది పేరైన ఫిన్లాండ్‌లో అత్యాధునిక వ్యవస్థలతో విస్తృతంగా నీటి శుద్ధి చేపడతారు. ఇక్కడ నల్లాల ద్వారా సరఫరా చేసే మంచి నీరు ప్రపంచంలోనే సురక్షితమైనదిగా పేరుపొందింది.

ఐస్‌ల్యాండ్ 2
ఈ దేశంలో హిమానీ నదాలు (గ్లేసియర్లు), వేడి నీటి ఊటల నుంచి వచ్చే నీరు సాధారణంగానే సురక్షితమైనది. ఆ నీటినే మరికాస్త శుద్ధిచేసి ఇళ్లకు సరఫరా చేస్తారు.

స్విట్జర్లాండ్ 3
కలుషితాల విషయంలో కఠిన నిబంధనలు, శుద్ధి చేసేందుకు అనుసరించే విధానాలతో ఈ దేశంలో నల్లా నీళ్లు సురక్షితమైనవిగా గుర్తింపు పొందాయి.

ఆస్ట్రియా 4
ఇక్కడి పర్వత ప్రాంతాలు, వాటికి అనుబంధంగా ఉన్న మంచి నీటి వనరులకు తోడు.. నీటి సంరక్షణ చర్యలు, కఠిన నిబంధనలతో నాణ్యమైన నీటిని ఇళ్లకు సరఫరా చేస్తున్నారు.

నార్వే 5
హిమానీనదాలు, ఇతర మంచి నీటి వనరులు అందుబాటులో ఉండటం, నీటి శుద్ధికి అత్యంత ఆధునిక విధానాలు అవలంబించడంతో.. సురక్షిత నీరు సరఫరా చేసే దేశాల్లో నార్వే ఒకటిగా నిలిచింది.

నెదర్లాండ్స్ 6
మంచినీటి వనరులు మరీ ఎక్కువగా లేని దేశమే అయినా.. నీటి శుద్ధి, నల్లాల ద్వారా పరిశుభ్రమైన నీటి సరఫరా విషయంలో ముందు నుంచీ మంచి ప్రమాణాలు పాటిస్తోంది.

మాల్టా 7
ఇది చుట్టూ ఉప్పునీరే కమ్ముకుని ఉన్న చిన్న ద్వీప దేశమే అయినా.. సముద్రపు నీటిని మంచినీటిగా మార్చే (డీసాలినేషన్) ద్వారా సురక్షిత నీటిని ఇళ్లకు సరఫరా చేస్తోంది.

ఐర్లాండ్ 8
ఇక్కడ మంచినీటి వనరులు పుష్కలంగా ఉండటంతో పాటు జలాల సంరక్షణ, శుద్ధి విషయంలో కఠిన నిబంధనలతో నాణ్యమైన నీటి సరఫరాలో టాప్–10 దేశాల్లో నిలిచింది.

గ్రీస్ 9
ఈ దేశంలోని పర్వతాలు, కొండల నుంచి వచ్చే నీటి ఊటలు, నీటి నాణ్యత విషయంలో పకడ్బందీ చర్యలతో ఇళ్లకు సురక్షిత నీరు అందుతున్నాయి

యునైటెడ్ కింగ్‌డమ్ 10
కలుషితాల విషయంలో కఠిన నిబంధనలు పాటించడం, నీటి శుద్ధికి అత్యున్నత విధానాలను అవలంబించడంతో ప్రమాణాలతో కూడిన నీటిని ఈ దేశంలో సరఫరా చేస్తున్నారు.

విజయవాడకు చెందిన నిఖిలేష్ కొన్నేళ్లుగా బెంగళూరులోని ఓ బహుళజాతి ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవలే పెళ్లి కావడంతో భార్యతో సహా కేఆర్ పురంలో నెలకు రూ.20 వేల అద్దెతో ఓ గేటెడ్ కమ్యూనిటీలో కాపురం పెట్టాడు. అయితే ఈమధ్య కాలంలో బెంగళూరు ప్రధాన నగరంలో నీటి ఎద్దడి తీవ్రం కావడంతో యాజమాన్యం ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఇచ్చింది. కానీ, అపార్ట్‌మెంట్‌లో నీటి వినియోగం, సరఫరాలో రెసిడెన్షియల్ సొసైటీ ఆంక్షలు విధించింది. దీంతో అటు ఆఫీసుకు వెళ్లలేక, ఇటు ఇంట్లో ఉండలేక ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న బ్రాంచ్ ఆఫీసు నుంచి పని చేయాలని సూచించింది. అతడు భార్యను పుట్టింట్లో వదిలిపెట్టి ప్రస్తుతం హైదరాబాద్ నుంచే పనిచేస్తున్నాడు.

ఐటీ ఉద్యోగులకు నీళ్ల బదిలీలు!



- బెంగళూరులో తీవ్రమైన నీటి సంక్షోభం
- దీంతో హైదరాబాద్, పుణేకు ఉద్యోగులు షిఫ్ట్
- సొంతూర్ల నుంచి పనిచేసే వీలు కూడా..
- వేతన పెంపు, ఇతరత్రా అలవెన్స్‌ల చెల్లింపులు

సాక్షి, హైదరాబాద్

.. ఇదీ బెంగళూరులోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఉద్యోగికి జరిగిన నీళ్ల బదిలీ. సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పేరొందిన బెంగళూరు గతంలో ఎన్నడూ లేనివిధంగా నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్ వంటి ప్రముఖ ఐటీ కంపెనీలకు కేంద్రమైన వైట్‌ఫీల్డ్, వర్తూర్ వంటి ఐటీ హబ్‌లలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో ఐటీ సంస్థలు, ఉద్యోగుల కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది. ఐటీ హబ్‌లు, ఉద్యోగుల నీటి కష్టాలు వీడియో పలు సామాజిక మాధ్యమాల్లోనూ వైరల్ కావడం గమనార్హం.

దేశీయ ఐటీ పరిశ్రమ అమెరికా, యూకే, యూరప్, ఆస్ట్రేలియా వంటి పలు దేశాల మీద ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. దీంతో రాజకీయ అస్థిరత, స్థానిక సమస్యలతో సంబంధం లేకుండా గడువులోగా ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడం సాఫ్ట్‌వేర్ కంపెనీలకు తప్పనిసరి. ఈ నేపథ్యంలో బెంగళూరు ఐటీ పరిశ్రమ నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది.

హైదరాబాద్, పుణేలకు బదిలీ

తాత్కాలికంగా కొద్దికాలం పాటు ఉద్యోగులను సొంతూర్ల నుంచి పని చేసే వీలు కల్పించడం, హైదరాబాద్, పుణే వంటి ఇతర నగరాల్లోని బ్రాంచ్ ఆఫీసులకు బదిలీ చేయడం వంటివి చేస్తున్నాయి. విధి నిర్వహణలో ఎదురయ్యే సందేహాలు, టాస్క్‌లను నివృత్తి చేసేందుకు సాంకేతిక నిపుణులను జూమ్ వంటి ఆన్‌లైన్ మాధ్యమాల్లో అందుబాటులో ఉంచుతున్నాయి. అలాగే ఉద్యోగుల పనితీరుపై ఒత్తిడి ప్రభావం పడకుండా వారాంతాల్లో వర్చువల్‌గా శిక్షణ, మీటింగ్‌లను సైతం నిర్వహిస్తున్నాయి.

ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఇచ్చినా బెంగళూరు నుంచే పని చేస్తారని, దీంతో అపార్ట్‌మెంట్లలో నీటి సమస్య మరింత తీవ్రమవుతుందని భావించిన పలు ఐటీ కంపెనీలు ఉద్యోగులను వర్క్ ఫ్రం హోం బదులుగా వర్క్ ఫ్రం హోంటౌన్ (సొంతూర్ల నుంచి పని) చేయాలని సూచిస్తున్నాయి.

వేతన పెంపు, అలవెన్స్‌లు కూడా..

అయితే ఉద్యోగులు ఇతర పట్టణాలు/మెట్రో సిటీల నుంచి పని చేయాలంటే వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. కుటుంబంతో సహా వేరేచోటుకు మారడం, ప్రయాణ ఖర్చులతోపాటు అప్పటికే బెంగళూరులో ఉండే ఇంటికి అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఉద్యోగులకు భారం కావడంతో పలు కంపెనీలు తాత్కాలిక వేతన పెంపు, అలవెన్స్‌లు వంటివి ఇస్తున్నాయి. బెంగళూరులో నీటి సమస్య తీరిన తర్వాత తిరిగి ఆఫీసుకు రావాలని చెబుతున్నాయి.

రోజుకు 500 మిలియన్ లీటర్ల నీటి కొరత

ప్రస్తుతం కర్ణాటకలో సుమారు 8,785 ఐటీ, ఐటీఈఎస్ కంపెనీల్లో 18 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వేగవంతమైన పట్టణీకరణ, జనాభా పెరుగుదల, అస్తవ్యస్తమైన పట్టణ ప్రణాళిక, లోటు వర్షపాతం, తలసరి నీటి వినియోగం పెరుగుదల వంటి కారణాలతో బెంగళూరులో నీటి సమస్య జటిలమైంది. నగరంలో రోజుకు తాగునీరు, పరిశ్రమ అవసరాలకు 2,600 ఎంఎల్‌డీ (రోజుకు మిలియన్ లీటర్లు) నీరు అవసరం ఉండగా.. ఇందులో 1,450 ఎంఎల్‌డీలు కావేరి నది నుంచి, 650 ఎంఎల్‌డీలు బోరు బావుల నుంచి సమకూరుతుండగా, 500 ఎంఎల్‌డీల నీటి కొరత ఉందని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. గేటెడ్ కమ్యూనిటీలు, పెద్ద నివాస సముదాయాలతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అగ్నిమాపక కేంద్రాలు, హోటళ్లు, రెస్టారెంట్లు కూడా నీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి.



ఐటీ ఆఫీసులపై ప్రభావం

బెంగళూరులో నీటి సమస్య ఐటీ కార్యాలయాల మీద కూడా ఎక్కువ ప్రభావం చూపిస్తోంది. మహాదేవపుర, కెంగేరి, వైట్ ఫీల్డ్, సజ్జాపూర్ రోడ్, కోర మంగళ వంటి ప్రాంతాల్లోని ఐటీ సంస్థలు, ఉద్యోగులపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో పలు సంస్థలు రిమోట్ వర్కింగ్, హైబ్రిడ్ మోడల్ పని విధానంతోపాటు ఇతర నగరాల్లోని బ్రాంచీల నుంచి పని చేయాలని ఉద్యోగులకు సూచిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఇలా పని చేస్తున్నారు. **-సందీప్ కుమార్ మక్తల, ప్రెసిడెంట్, తెలంగాణ ఐటీ అసోసియేషన్**

క్యూఆర్ కోడ్‌తో రైల్ టికెట్ బుకింగ్

- అందుబాటులోకి తెచ్చిన దక్షిణ మధ్య రైల్వే
- తొలిదశలో సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో 14 స్టేషన్లలో అమలు
- జనరల్ బుకింగ్ కౌంటర్ వద్ద ప్రయాణ వివరాలు, చార్జీల డిస్‌ప్లే బోర్డు



సాక్షి, హైదరాబాద్: సాధారణ రైల్వే టికెట్‌లను క్యూఆర్ కోడ్ ద్వారా బుక్ చేసుకొనే సదుపాయాన్ని దక్షిణ మధ్య రైల్వే అందుబాటులోకి తెచ్చింది. తొలిదశలో సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని 14 స్టేషన్లలో ఉన్న 31 కౌంటర్లలో ఈ సౌకర్యాన్ని ప్రవేశపెట్టారు. జనరల్ బుకింగ్ కౌంటర్లలో నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు ఈ సౌకర్యాన్ని ప్రవేశపెట్టినట్టు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. టికెట్ కొనుగోలు చేసే సమయంలో జనరల్ బుకింగ్ కౌంటర్ల టికెట్ విండో వద్ద ప్రయాణికులు బుక్ చేసుకునే టికెట్ వివరాలు, చార్జీలను అందుబాటులో ఉంచుతారు. అందుకనుగుణంగా చార్జీలు చెల్లించి క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్ తీసుకోవచ్చు. ఈ డిస్‌ప్లే బోర్డులో రైలు బయల్దేరే స్టేషన్, చేరుకొనే స్టేషన్, ప్రయాణపు తరగతి, పెద్దలు, పిల్లల సంఖ్య, చార్జీలు వంటి వివరాలను ప్రదర్శిస్తారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని సికింద్రాబాద్, నాంపల్లి, లింగంపల్లి, హైటెక్ సిటీ, బేగంపేట్, కాజీపేట, జేమ్స్‌స్ట్రీట్, ఫతేనగర్ బ్రిడ్జ్, వరంగల్, మంచిర్యాల, మహబూబాబాద్, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, వికారాబాద్ స్టేషన్లలోని 31 కౌంటర్ల ద్వారా నగదు రహిత లావాదేవీల సదుపాయాన్ని ప్రయాణికులు పొందవచ్చు.

కవితతో తల్లి శోభ ములాఖత్

ఐదో రోజూ కొనసాగిన ఈడీ విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఈడీ కస్టడీలో ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో తల్లి శోభ ములాఖత్ అయ్యారు. శోభతోపాటు సోదరుడు కేటీఆర్, సోదరి సౌమ్య కూడా కలిశారు. వీరు గురువారం సాయంత్రం సుమారు గంట సేపు కవితతో మాట్లాడారు. కవిత యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణకు రానున్న కవిత పిటిషన్‌పైనా చర్చించినట్లు తెలిసింది. మరోవైపు, ఐదోరోజూ గురువారం కవితను ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసులో సాక్షులైన తన పీఏలు చెప్పిన సమాచారం మేరకు కవితను ప్రశ్నించినట్లు తెలిసింది.

జిల్లా వార్తలు



సింహ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న నారసింహుడు

సింహ వాహనంపై బ్రహ్మాండ నాయకుడు

మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గ్రామోత్సవంలో సింహ వాహనంపై విహరిస్తూ భక్తులకు స్వామి దర్శనమిచ్చారు. సింహ వాహనంలో కొలువుదీరిన బ్రహ్మాండ నాయకుడు నృసింహస్వామిని భక్తులు దర్శించుకున్నారు. కొబ్బరి కాయలు కొట్టి, హారతులిచ్చారు. హింసించే స్వభావం కలవారిని హింసించేవాడు నారసింహుడు. నరులలో సింహం వంటి వాడు. నరసింహ స్వరూపుడైన స్వామి సింహ వాహనోత్సవం తిలకించిన వారికి దుర్మార్గుల వల్ల కలిగే భయం తొలగుతుందని భక్తుల నమ్మకం. అభయాయచ సాధూనాం, సాధుజనులకు అభయాన్నిస్తూ.. దుర్మార్గాన్ని పారద్రోలుటకు స్వామి వారు సింహ వాహనరూఢుడై భక్తులకు దర్శనమిచ్చారు. పక్షుల్లో గరుత్మంతుడు, మృగాల్లో సింహం తానే అని స్వామి వారు చెప్పినట్లు.. అర్చకులు ఉత్సవ విశిష్టతను వివరించారు. ఉత్సవం సందర్భంగా రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు సాంస్కృతిక కళా వేదిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నరసింహుని వేషాలు, భజనలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా మాల్యవంతం వెంకటకృష్ణమాచార్యులు మనుమలు వ్యవహరించారు. ఆలయ పాలకవర్గ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. ఉదయం చిన్న శేషవాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కైంకర్య పరులుగా దేవతి భగవన్నారాయణ కుటుంబం వ్యవహరించింది.

నేడు హంస, గజ వాహనాలపై స్వామి గ్రామోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం గజ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్న శ్రీ వారు.. రాత్రి గజ వాహనంపై స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎ. రామకోటిరెడ్డి తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకుని, కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.


ఓటమి భయంతోనే జాప్యమా?

- అభ్యర్థి ప్రకటనలో జాప్యం చేస్తున్న టీడీపీ
- సీటు కోసం పోటీ పడుతున్న ఉమా, వసంత, బొమ్మసాని
- బీసీలకు చంద్రబాబు అన్యాయం చేశారంటూ కొండపల్లి కౌన్సిలర్ రాజీనామా
- గందరగోళంలో టీడీపీ కేడర్
- సామాన్యుడికే జైకొట్టిన వైఎస్సార్ సీపీ

జి.కొండూరు(మైలవరం): దశాబ్దాల అనుభవం అని చెప్పుకునే తెలుగుదేశం అధిష్టానం ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ మైలవరం నియోజకవర్గంలో అభ్యర్థిని ప్రకటించలేక సందిగ్ధావస్థలో తలలు పట్టుకు కూర్చున్న తీరు నియోజకవర్గ ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇప్పటికే మూడు ముక్కలాటలా మారిన నియోజకవర్గ టీడీపీ రాజకీయం గురువారం మరో మలుపు తిరిగింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు మైలవరం టీడీపీ సీటు కేటాయించాలని పలుమార్లు కోరినప్పటికీ చంద్రబాబు నాయుడు పట్టించుకోలేదని, బీసీలకు చంద్రబాబు నాయుడు అన్యాయం చేస్తున్నాడంటూ కొండపల్లి 17వ వార్డు కౌన్సిలర్ ఎం.భూలక్ష్మి టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తనను స్వతంత్ర కౌన్సిలర్‌గా గుర్తించాలని కోరారు. ఇప్పటికే మైలవరం టీడీపీలో దేవినేని ఉమామహేశ్వరరావు, వసంత వెంకటకృష్ణప్రసాద్, బొమ్మసాని సుబ్బారావుల మధ్య జరుగుతున్న సీటుపైటు ఎపిసోడ్ ఒక కొలిక్కి రాకముందే కౌన్సిలర్ భూలక్ష్మి రూపంలో టీడీపీకి మరో ఎదురు దెబ్బ తగిలింది.

ఓటమి భయంతోనే ప్రకటనలో జాప్యం?

మైలవరం నియోజకవర్గంలో ఓటమి భయంతోనే టీడీపీ అధిష్టానం సీటును ప్రకటించడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా అతి సామాన్యుడు, బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన సర్నాల తిరుపతిరావుని ప్రకటించి నెలన్నర కావస్తున్నా టీడీపీ అధిష్టానం మాత్రం తన అభ్యర్థిని ప్రకటించడంలో జాప్యం చేస్తుండడంతో టీడీపీ కేడర్‌లో తీవ్ర గందరగోళం నెలకొంది. ఒక వైపు టీడీపీ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు తనకే సీటు కేటాయించాలని ర్యాలీలు చేయడం, టీడీపీకి సిట్టింగ్ నాయకుడు, పార్టీలో రెండవ స్థానం అని చెప్పుకునే దేవినేని ఉమామహేశ్వరరావుని కాదని వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరిన వసంత వెంకట కృష్ణప్రసాద్‌కి సీటు కేటాయించేందుకు టీడీపీ అధిష్టానం మొగ్గు చూపడం, ఆ దిశగా సర్వేలు చేపట్టడం వంటి చర్యలతో తెలుగుదేశం పార్టీపై నియోజకవర్గంలో ప్రజల నుంచి ప్రతికూల ప్రభావం పడింది. దీనికి తోడు టీడీపీ చేపట్టిన సర్వేలలో దేవినేని ఉమామహేశ్వరరావుతో పాటు వసంత వెంకటకృష్ణప్రసాద్‌పై కూడా సొంత పార్టీలోనే వ్యతిరేక స్వరాలు వినపడడంతో ఎవరికి సీటు కేటాయించాలో అర్థం కాక టీడీపీ అధిష్టానం డైలమాలో పడింది. నియోజకవర్గం టీడీపీలో జరుగుతున్న ఈ గందరగోళంతో కేడర్ సైతం విసిగెత్తిపోతున్నారు.



వికటించిన తాయిలాల రాజకీయం

మైలవరం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి తానేనంటూ ప్రత్యక్షంగా చెప్పక పోయినా కేడర్‌తో సమావేశాలు నిర్వహిస్తున్న వసంత వెంకట కృష్ణప్రసాద్ ఇప్పటికే టీడీపీలో తనను వ్యతిరేకిస్తున్న నాయకులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులను సైతం తన వైపు తిప్పుకునేందుకు తాయిలాలు ప్రకటిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో కొండపల్లిలోని కౌన్సిలర్లను తన వైపు తిప్పుకునేందుకు చేపట్టిన తాయిలాల వైద్యం వికటించింది. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్‌లు వసంత చూపిన ఆఫర్‌కి తలొగ్గకపోవడంతో పాటు సొంతపార్టీకి చెందిన కౌన్సిలర్ రాజీనామా చేయడంతో గట్టి షాక్ తగిలింది.

అధిష్టానం నుంచి పిలుపు?

గత కొన్ని రోజులుగా మైలవరం నియోజకవర్గం టీడీపీ కేడర్‌తో సమావేశమవుతున్న వసంత వెంకట కృష్ణప్రసాద్‌కి అధిష్టానం నుంచి పిలుపు రావడంతో బుధవారం ఆయన హైదరాబాద్ వెళ్లినట్లు సమాచారం. ఇప్పటికే టీడీపీ చేసిన సర్వేల్లో వసంతపై నెగిటివ్ టాక్ వినపడడంతో ఆయనకు సీటు కేటాయించే అంశంపై పునరాలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈవీఎం, వీవీ ప్యాట్స్‌కు పటిష్ట భద్రత

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం) వీవీ ప్యాట్స్ గోడౌన్ భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్స్ గోడౌన్‌ను గురువారం ఆయన అదనపు సీఈఓ ఎంఎన్ హరెంధిర ప్రసాద్, సమన్వయ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. సీసీ కెమెరాల భద్రత వ్యవస్థను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో గోడౌన్ భద్రతకు చేసిన కట్టుదిట్టమైన ఏర్పాట్ల కొనసాగింపునకు ఎన్నికలు, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి నెలా ఈవీఎం, వీవీ ప్యాట్స్ గోడౌన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. గోడౌన్ భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసీఐ సీఈఓ సూచనల మేరకు ఎప్పటికప్పుడు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం, వీవీ ప్యాట్స్ గోడౌన్ తనిఖీ ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతోపాటు డీఆర్ఓ వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లపూడిలోని గోడౌన్ వద్ద కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల నూతన కమిటీలు

సాక్షి, మచిలీపట్నం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల కృష్ణాజిల్లా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయా కమిటీలకు పదవుల్లో నియామకాలు చేసినట్లు పేర్కొంది.

ఎస్సీ విభాగం : అధ్యక్షుడిగా గుర్రం బసవయ్య (అవనిగడ్డ నియోజకవర్గం), ఉపాధ్యక్షుడిగా బెజ్జం సువర్ణరాజు (గుడివాడ), ప్రధాన కార్యదర్శులుగా చాట్రగడ్డ భరత్‌కుమార్ (అవనిగడ్డ), దేవరపల్లి వెంకటేశ్వరరావు (గన్నవరం), మెండ్రు వెంకటేశ్వరరావు (గుడివాడ), కలపాల రాంబాబు (పామర్రు)

రైతు విభాగం : అధ్యక్షుడిగా శ్రీకాకోళపు నాగేశ్వరరావు (మచిలీపట్నం), ఉపాధ్యక్షులుగా బీసాబత్తిన ప్రసాద్ (అవనిగడ్డ), వై.వెంకటరెడ్డి (గన్నవరం), ప్రధాన కార్యదర్శులుగా కొండవీటి వెంకట నారాయణ (అవనిగడ్డ), అల్లంశెట్టి శ్రీనివాసరావు (గన్నవరం), మందా బాబూరావు(మచిలీపట్నం), గోగినేని పెరుమాళ్లు (పామర్రు)

పంచాయతీరాజ్ విభాగం : ఈ కమిటీలో అవనిగడ్డ నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆ ప్రాంతానికి చెందిన ముద్దినేని చంద్రరావు ను ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా వేమూరి గోవర్ధన్ రావును నియమించారు.

మైనార్టీ విభాగం : అధ్యక్షులుగా అయూబ్‌ఖాన్ (పెడన), ఉపాధ్యక్షుడిగా మొహమ్మద్ అబ్దుల్ హఫీజ్ (అవనిగడ్డ), ప్రధాన కార్యదర్శులుగా సయ్యద్ సికిందర్ (అవనిగడ్డ), పఠాన్ కరీముల్లా ఖాన్ (అవనిగడ్డ), షేక్ జానీ (గన్నవరం)

మహిళా విభాగం : అధ్యక్షురాలిగా కైలే జ్ఞానమణి (గన్నవరం), ఉపాధ్యక్షులుగా వల్లూరు ఉమాపద్మ (అవనిగడ్డ), మట్టా తులసమ్మ (మచిలీపట్నం), ప్రధాన కార్యదర్శులుగా బీసా బత్తిన విజయలక్ష్మి (అవనిగడ్డ), పి.కవిత (గన్నవరం), బోయిన కనకదుర్గ (గుడివాడ), రమాదేవి (మచిలీపట్నం), ఆరుమళ్ల రమాదేవి (పామర్రు)

ఐ.టి. విభాగం : ఈ కమిటీలో అవనిగడ్డ నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆ ప్రాంతానికి చెందిన పూషడపు నాగిరెడ్డి ప్రధాన కార్యదర్శిగా, కార్యదర్శులుగా అర్జా వెంకటేష్, తుమ్మా నాగబాబు.

కల్చరల్ విభాగం : ఉపాధ్యక్షుడిగా భీమవరపు రామ్మోహన్‌రెడ్డి (గుడివాడ), ప్రధాన కార్యదర్శులుగా ఎ.రమేష్ (అవనిగడ్డ), మోటూరు ఆంథోని (గన్నవరం), కూచిపూడి సత్యవేదం (గన్నవరం), లోయ రాధాకృష్ణ (గుడివాడ)


క్రిస్టియన్ మైనార్టీ విభాగం : అధ్యక్షుడిగా పోలిమెట్ల జయరాజు (గన్నవరం), ఉపాధ్యక్షుడిగా కె.అనుపమ ముఖర్జీ (మచిలీపట్నం), ప్రధాన కార్యదర్శులుగా నలుకుర్తి పృథ్వీరాజ్ (అవనిగడ్డ), కొమరవల్లి కిరణ్ మూర్తి (గన్నవరం), అబూరి నాగేశ్వరరావు (మచిలీపట్నం)

బీసీ విభాగం : అధ్యక్షుడిగా ఉలిసి ఆదినారాయణమూర్తి (మచిలీపట్నం), ప్రధాన కార్యదర్శులుగా నాయుడు చంద్రశేఖర్ (అవనిగడ్డ), సామల ఆంజనేయులు (గన్నవరం)


అదుపు తప్పి పెళ్లి బృందం కారు బోల్తా

పెళ్లి కుమార్తెతో సహా ఎనిమిది మందికి గాయాలు

ఆనందపురం(విశాఖపట్నం): మండలంలోని శొంఠ్యాం వద్ద ఆరు లేన్ల రహదారిపై గురువారం పెళ్లి బృందంతో వెళ్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడడంతో ఎనిమిది మంది గాయపడ్డారు. వారంతా సంగివలసలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారిలో పెళ్లి కుమార్తె కూడా ఉండడంతో విషాదం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడకు చెందిన పెళ్లి కుమార్తె రాజేశ్వరితో సహా ఎనిమిది మంది కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి కారులో బయలు దేరి శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం గుడూరు గ్రామంలో వివాహానికి వెళ్తున్నారు. ఆ కారు మండలంలోని శొంఠ్యాం సమీపానికి చేరుకునే సరికి అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో కారు నడుపుతున్న పోతూరి వీరభద్రరావు, పెళ్లి కుమార్తె రాజేశ్వరి, ఆమె మేనత్త మోదూరి కృష్ణవేణి, కర్ణాటు నాగలక్ష్మి, కౌశిక్, సుప్రియ, వశిష్ట, రఘు గాయపడ్డారు. కారులో నుంచి ఎగిరిపడి గాయాల పాలైన వారిని ట్రాఫిక్ ఎస్‌ఐ సునీల్ సిబ్బంది చికిత్స కోసం సంగివలసలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆనందపురం ఎస్‌ఐ గంట్యాడ సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు



గాయపడిన పెళ్లి కుమార్తె రాజేశ్వరి, రఘు, కృష్ణవేణి

1న సరస్వతి యాగం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఏప్రిల్ 1వ తేదీ సోమవారం సరస్వతి యాగం నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. ఫాల్గుణ మాసం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఆలయ అర్చకులు యాగాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
22-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
539	173
72,641	22,012

విదేశీ సూచీలు (పొద్దు రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్డాక్	16,488	▲ 119
డోజోన్స్	39,858	▲ 346
ఎఫ్టీఎస్ఈ 100	7,883	▲ 145
డాక్స్	18,174	▲ 159
షాంఘై	3,077	▼ 3
నికాయ్	40,815	▲ 812

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	66,914 ▲ 1,125
బంగారం (99.5 స్వచ్ఛత)	66,646 ▲ 1,120
వెండి (కిలో)	75,045 ▲ 1,159

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.19	84.48
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.88	108.12
€	యూరో	ఒకటి	88.12	91.90
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	47.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.07	56.58
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.13	64.88
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.21	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.65	23.43
¥	చైనా యువాన్	పదింటికి	10.28	12.29

బంగారం మెరుపులు

రికార్డు స్థాయికి అప్



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ద్రవ్య, ఆర్థిక ధోరణులు బంగారానికి మరింత మెరుగులు పెడుతున్నాయి. పసిడి ధర న్యూఢిల్లీలో గురువారం 10 గ్రాములకు ఏకంగా 1,130 పెరిగి ఆల్-టైమ్ హై రూ.67,450ని తాకింది. ఇక వెండి కూడా కేజీకి రూ.1,100 పెరిగి రూ.77,750కి ఎగసింది. అంతర్జాతీయ మార్కెట్ల కమోడిటీ ఎక్స్చేంజీలో స్పాట్ బంగారం ఔన్సు (31.1) ధర 2,225 డాలర్లను తాకింది. ఇది క్రితం స్థాయితో పోల్చితే ఏకంగా 84 డాలర్లు అధికం. ద్రవ్యోల్బణం భయాలకుతోడు అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు పసిడికి తక్షణం కలిసివస్తున్న ప్రధాన అంశాలు. ఇక ముంబైలో 99.9 స్వచ్ఛత, 99.5 స్వచ్ఛత ధరలు 10 గ్రాములకు రూ.1,125, రూ.1,120 చొప్పున పెరిగి వరుసగా రూ.66,914, రూ.66,646కు ఎగశాయి. వెండి కేజీ ధర 1,159 పెరిగి రూ.75,045 వద్దకు చేరింది.

సూచీలకు ఫెడ్ జోష్

- ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఆశలు సజీవం
- మార్కెట్లో ఉరకలేసిన ఉత్సాహం
- 539 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 22 వేల స్థాయి పైకి నిఫ్టీ
- రూ.5.72 లక్షల కోట్ల సంపద సృష్టి



ముంబై: ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ వడ్డీరేట్ల తగ్గింపు ఆశలను సజీవంగా ఉంచడంతో గురువారం స్టాక్ సూచీలు లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ 539 పాయింట్లు పెరిగి 72,641 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 173 పాయింట్లు లాభపడి 22,012 వద్ద నిలిచింది. ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ ద్రవ్య పాలసీ నిర్ణయాల వెల్లడి సందర్భంగా బుధవారం రాత్రి 'ద్రవ్యోల్బణం దీర్ఘకాలిక లక్ష్యానికి మించి ఉన్నప్పటికీ, ఈ ఏడాదిలో మూడు సార్లు వడ్డీరేట్ల కోత ఉంటుంది' అని పావెల్ సంకేతాలిచ్చారు. దీంతో అమెరికాతో సహా ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సంకేతాలు నెలకొన్నాయి.

సెన్సెక్స్ ఉదయం 405 పాయింట్లు పెరిగి 72,507 వద్ద, నిఫ్టీ 151 పాయింట్లు బలపడి 21,990 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు రోజంతా ట్రేడయ్యాయి. ముఖ్యంగా మెటల్, విద్యుత్, ఇంధన షేర్లు సూచీల ర్యాలీకి ప్రాతినిథ్యం వహించాయి. ఒక దశలో సెన్సెక్స్ 781 పాయింట్లు ఎగసి 72,881 వద్ద, నిఫ్టీ 242 పాయింట్లు బలపడి 22,081 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. కొంతకాలంగా అమ్మకాల ఒత్తిడికి లోనైన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ ఇండెక్సులు వరుసగా 2.36%, 2.01% చొప్పున ర్యాలీ చేశాయి. ఈ ఏడాది జూన్ నుంచి ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు ఉండొచ్చనే ఆశలతో బుధవారం అమెరికా మార్కెట్లు జీవితకాల గరిష్టాన్ని నమోదు చేశాయి. సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్ఈలో రూ.5.72 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ. 379 లక్షల కోట్లకు చేరింది.

క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ లిస్టింగ్ లాభాలు మాయం

క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ లిమిటెడ్ లిస్టింగ్ లాభాలు నిలుపుకోలేకపోయింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.715)తో పోలిస్తే 11% ప్రీమియంతో రూ.795 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో లిస్టింగ్ లాభాలన్నీ మాయమయ్యాయి. చివరికి రూ.0.38% నష్టంతో రూ.712 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.995 కోట్లుగా నమోదైంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-3-2024	
విశాఖ	435-00
చిత్తూరు	478-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	72.00
21-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	415-00
వరంగల్	417-00
రిటైల్ ధర	4.75

కియా కార్లు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆటోమొబైల్ సంస్థ కియా ఇండియా వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతోంది. ఏప్రిల్ 1 నుంచి సవరించిన ధరలు అమలులోని రానున్నట్టు కంపెనీ గురువారం ప్రకటించింది. ముడిసరుకు ధరలు, సరఫరా సంబంధిత వ్యయాల పెరుగుదల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. ధరలను పెంచడం ఈ ఏడాది ఇదే తొలిసారి అని కియా తెలిపింది.

శామ్‌సంగ్ కొత్త ఫోన్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: శామ్‌సంగ్ భారత్‌లో గెలాక్సీ సిరీస్‌లో ఏ55 5జీ, ఏ35 5జీ స్మార్ట్‌ఫోన్లను ప్రవేశపెట్టింది. 6.6 అంగుళాల ఎఫ్‌హెచ్‌డీ ప్లస్ సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే, నాక్స్ వాల్ట్ సెక్యూరిటీ, 50 ఎంపీ ట్రిపుల్ కెమెరా వంటి ఫీచర్లను జోడించింది. ఈ మోడళ్లు 5జీతోపాటు వేగంగా వృద్ధి చెందుతున్న రూ.30-50 వేల ధరల విభాగంలో తమ స్థానాన్ని కన్సాలిడేట్ చేస్తాయని శామ్‌సంగ్ తెలిపింది. ధర రూ.27,999 నుంచి రూ.42,999 వరకు ఉంది.

నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీగా సౌరభ్ వత్స



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్ మోటర్ ఇండియా ఎండీగా సౌరభ్ వత్స నియమితులయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నియామకం అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం ఆ స్థానంలో ఉన్న రాకేశ్ శ్రీవాస్తవ మార్చి 31తో రిటైరవుతున్నారు. ఇటీవల జనవరి 15నే కంపెనీలో ఆయన డిప్యూటీ ఎండీగా నియమితులయ్యారు. అనుభవజ్ఞుడైన వత్స సారథ్యం .. కంపెనీ తదుపరి వృద్ధికి దోహదపడగలదని నిస్సాన్ ఇండియా ఆపరేషన్స్ విభాగం ప్రెసిడెంట్ ఫ్రాంక్ టోరెస్ తెలిపారు.

ప్రభుత్వ బ్యాంకుల్లో తగ్గిన మొండిబాకీలు

ఆరు నెలలుగా భారీ వెనుకడుగు • ఫిక్కీ-ఐబీఏ బ్యాంకర్ల సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులన్నింటిలోనూ గత ఆరు నెలలుగా మొండిబాకీలు (ఎన్‌పీఏ) గణనీయంగా తగ్గాయి. ప్రైవేట్ రంగంలో 67 శాతం బ్యాంకుల్లో మాత్రమే ఎన్‌పీఏలు తగ్గాయి. పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ-ఐబీఏ బ్యాంకర్ల సర్వే నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. సర్వేలో పాల్గొన్న వాటిల్లో 77 శాతం బ్యాంకులు గత ఆరు నెలలుగా మొండిబాకీలు తగ్గినట్లు వెల్లడించాయి. సగం పైగా బ్యాంకులు రాబోయే ఆరు నెలల్లో తమ స్థూల ఎన్‌పీఏలు 3-3.5 శాతం శ్రేణిలో ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపాయి. ప్రైవేట్ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) అసెట్ క్వాలిటీ మెరుగుపడింది. పీఎస్‌బీలు, విదేశీ బ్యాంకుల్లో గత ఆరు నెలల్లో ఎన్‌పీఏలేమీ పెరగలేదు. కానీ 22 శాతం ప్రైవేట్ బ్యాంకుల్లో మాత్రం పెరిగాయి. 18వ ఫిక్కీ-ఐబీఏ బ్యాంకర్ల సర్వేను గతేడాది జూలై-డిసెంబర్ మధ్య కాలంలో నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఫారిన్ బ్యాంకులు కలిపి మొత్తం 23 బ్యాంకులు ఇందులో పాల్గొన్నాయి. అసెట్ల పరిమాణంపరంగా బ్యాంకింగ్ రంగంలో వీటి వాటా 77 శాతంగా ఉంటుంది.

మరిన్ని ముఖ్యాంశాలు..

- ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో అధికంగా ఎన్‌పీఏలు ఉన్నాయి.
- వచ్చే ఆరు నెలల్లో ఆహారేతర పరిశ్రమలకు రుణాల వృద్ధి 12 శాతం పైగానే ఉండొచ్చని 41 శాతం బ్యాంకులు, 10-12 శాతం ఉండొచ్చని 18 శాతం బ్యాంకులు భావిస్తున్నాయి. 36% బ్యాంకులు ఇది 8-10 శాతం స్థాయిలో ఉండొచ్చని అంచనా వేస్తున్నాయి.
- రాబోయే ఆరు నెలల్లో ఎన్‌పీఏలు 2.5-3 % స్థాయిలో ఉండొచ్చని 14% బ్యాంకులు తెలిపాయి.
- టర్మ్ డిపాజిట్లు పుంజుకోగా, మొత్తం డిపాజిట్లలో కాసా డిపాజిట్ల వాటా తగ్గిందని 70 శాతం బ్యాంకులు తెలిపాయి. దీర్ఘకాలికంగా అధిక వడ్డీ రేట్లకు డిపాజిట్లను లాకిన్ చేయాలనే ధోరణిలో కస్టమర్లకు ఉండటమనేది టర్మ్ డిపాజిట్లకు సానుకూలంగా మారింది.
- ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెటల్స్, ఐరన్ .. ఉక్కు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో దీర్ఘకాలిక క్రెడిట్ కోసం డిమాండ్ నెలకొంది.

టాక్ ఇన్ఫోసెక్ @ రూ.100-106



టాక్ ఇన్ఫోసెక్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ నెల 27న ప్రారంభంకానున్న ఇష్యూకి రూ. 100-106 చొప్పున ధరల శ్రేణిని ప్రకటించింది. ఏప్రిల్ 2న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 30 కోట్లు సమీకరించనుంది.

ష్నైడర్ ఎలక్ట్రిక్ భారీ పెట్టుబడులు

తయారీపై రూ. 3,200 కోట్లు

బెంగళూరు: ఎనర్జీ మేనేజ్‌మెంట్, ఆటోమేషన్ దిగ్గజం ష్నైడర్ ఎలక్ట్రిక్ దేశీయంగా తయారీపై భారీ పెట్టుబడులకు సిద్ధపడుతోంది. 2026కల్లా తయారీ ప్లాంట్లపై రూ. 3,200 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. తద్వారా దేశ, విదేశాలలో అమ్మకాలకు భారత్‌ను తయారీ కేంద్రంగా వినియోగించుకోనున్నట్లు పేర్కొంది. ఈ బాటలో స్థానికంగా డేటా సెంటర్లకు అవసరమయ్యే కూలింగ్ సొల్యూషన్స్‌ను ఉత్పత్తి చేసేందుకు రూ. 100 కోట్లతో ఏర్పాటు చేసిన ప్లాంటును తాజాగా ప్రారంభించింది. ప్రణాళికల్లో భాగంగా గ్రూప్ తయారీ కేంద్రంగా భారత్‌లో పెట్టుబడులు చేపట్టనున్నట్లు ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రెసిడెంట్, గ్రేటర్ ఇండియా జోన్ ఎండీ, సీఈవో దీపక్ శర్మ వెల్లడించారు. వివిధ ప్రాడక్టులు, సొల్యూషన్ల తయారీకి దేశవ్యాప్తంగా తయారీ ప్లాంట్లను నెలకొల్పనున్నట్లు కూలింగ్ సొల్యూషన్స్ యూనిట్ ప్రారంభం సందర్భంగా తెలియజేశారు. వెరసి మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తరాఖండ్, ఒడిషాలలో యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. తాజా యూనిట్‌తో కలిపి ప్రస్తుతం కంపెనీ దేశవ్యాప్తంగా 30 ఫ్యాక్టరీలను నిర్వహిస్తోంది.



విదేశీ ఈటీఎఫ్‌లో పెట్టుబడులొద్దు

ఫండ్స్‌కు సెబీ ఆదేశాలు



ముంబై: విదేశీ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్(ఈటీఎఫ్)లలో ఇన్వెస్ట్ చేసేందుకు పెట్టుబడులను అనుమతించవద్దంటూ సెబీ తాజాగా దేశీ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్(యాంఫి)ను ఆదేశించింది. ఏప్రిల్ 1నుంచి తాజా ఆదేశాలు అమలుకానున్నాయి. కాగా.. ఎంఎఫ్‌లు విదేశీ సెక్యూరిటీల(షేర్లు)లో 7 బిలియన్ డాలర్లవరకూ ఇన్వెస్ట్ చేసేందుకు సెబీ అనుమతిస్తుంది. అయితే 2022 జనవరిలోనే గరిష్ట పరిమితికి చేరడంతో విదేశీ సెక్యూరిటీలలో ఎంఎఫ్ పెట్టుబడులకు ఇప్పటికే సెబీ చెక్ పెట్టింది. ఈ బాటలో ప్రస్తుతం విదేశీ ఈటీఎఫ్‌లో పెట్టుబడులకు నో చెప్పింది. వెరసి ఇన్వెస్టర్ల నుంచి విదేశీ ఈటీఎఫ్‌ల కోసం పెట్టుబడులను అనుమతించవద్దంటూ ఎంఎఫ్‌లను ఆదేశించింది. దేశీయంగా 77 ఎంఎఫ్ పథకాలు విదేశీ సెక్యూరిటీలలో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. కాగా.. విదేశీ మార్కెట్లు దిద్దుబాటుకు లోనుకావడంతో ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) విలువ క్షీణించే అవకాశముంది. దీంతో ఆమేర పెట్టుబడులకు సెబీ 2023లో అనుమతించింది.

సాక్షి స్పోర్ట్స్

కెప్టెన్సీ నుంచి తప్పుకున్న ధోని ఆటగాడిగా మరో టైటిల్ విజయంలో భాగం అవుతాడా? ఇంకా తొలి ట్రోఫీ కోసమే ఎదురు చూస్తున్న కోహ్లికి ఈ సారైనా దానిని అందుకునే అదృష్టం ఉందా? సారథ్యం కోల్పోయిన రోహిత్ శర్మ తన బ్యాటింగ్ సత్తాతో ముంబైకి మరో విజయం అందిస్తాడా? చావుకు దగ్గరగా వెళ్లి వచ్చి మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టిన పంత్ కొత్త ఇన్నింగ్స్‌లో ఆటగాడిగా, నాయకుడిగా జట్టును నడిపించగలడా? ముంబై అభిమానుల ఆశలకు విరుద్ధంగా కెప్టెన్సీ అందుకున్న హార్దిక్ పాండ్యా తన ఆటతో, వ్యూహాలతో వారి మనసు గెలవగలడా? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలన్నీ రాబోయే రెండు నెలల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో లభిస్తాయి. క్రికెట్ అభిమానులను ఫోర్లు, సిక్సర్లతో అలరిస్తూ పూర్తి స్థాయి వినోదాన్ని అందించే వేసవి పండగకు సమయం వచ్చేసింది. చెన్నై వేదికగా నేడు ఐపీఎల్ 17వ సీజన్ మొదలు కానుంది. గత ఏడాదిలాగే 10 జట్లు 74 మ్యాచ్‌లతో టోర్నీ సిద్ధం కాగా... ఎన్నికల కారణంగా తొలి దశలో 21 మ్యాచ్‌లకే బీసీసీఐ షెడ్యూల్ ప్రకటించింది. గత కొద్ది రోజులుగా భారత టెస్టు క్రికెట్‌ను ఆస్వాదించిన ఫ్యాన్స్ రాబోయే దాదాపు ఎనిమిది వారాల పాటు బౌండరీల గురించే చర్చించడం ఖాయం.

అటు ఫోర్... ఇటు సిక్సర్!

నేటి నుంచి ఐపీఎల్ టోర్నీ

- మొదటి పోరులో చెన్నైతో బెంగళూరు 'ఢీ'
- తొలి రోజు గంట పాటు ప్రారంభోత్సవ వేడుకలు

రాత్రి 8 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



ఐపీఎల్ ట్రోఫీతో కేఎల్ రాహుల్ (లక్నో), కమిన్స్ (హైదరాబాద్), జితేశ్ శర్మ (పంజాబ్-వైస్ కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (చెన్నై), రిషభ్ పంత్ (ఢిల్లీ), డు ప్లెసిస్ (బెంగళూరు), శుబ్‌మన్ గిల్ (గుజరాత్), సంజూ సామ్సన్ (రాజస్తాన్), శ్రేయస్ అయ్యర్ (కోల్‌కతా), హార్దిక్ పాండ్యా (ముంబై ఇండియన్స్)

చెన్నై: మెగా టి20 టోర్నీ ఐపీఎల్-2024కు రంగం సిద్ధమైంది. ఎంఎ చిదంబరం స్టేడియంలో నేడు జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తలపడుతుంది. గత రెండు సీజన్ల తరహాలోనే ప్రతీ జట్టు 14 మ్యాచ్‌ల చొప్పున ఆడుతుంది. లీగ్ దశలో 70 మ్యాచ్‌లు, 4 ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు (క్వాలిఫయర్-1, ఎలిమినేటర్, క్వాలిఫయర్-2, ఫైనల్) ఉంటాయి. తుది షెడ్యూల్ ప్రకటించకపోయినా... మే 26న ఫైనల్ జరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు జరిగిన 16 సీజన్లలో చెన్నై, ముంబై ఐదేసిసార్లు విజేతగా నిలవగా కోల్‌కతా 2 సార్లు టైటిల్ సాధించింది. దక్కన్ చార్జర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్తాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల ఖాతాలో ఒక్కో ట్రోఫీ చేరాయి. చెపాక్ మైదానంలో మొదటి మ్యాచ్‌కు ముందు ప్రత్యేక ఆరంభోత్సవ వేడుకలు జరుగుతాయి. ఏఆర్ రెహమాన్, సోనూ నిగమ్, అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. 17వ ఐపీఎల్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఏడాది టోర్నీకి సంబంధించిన విశేషాలు...

- తాజా సీజన్‌లో పలు జట్లకు కొత్త కెప్టెన్లు వచ్చారు. ముంబైకి రోహిత్ స్థానంలో పాండ్యా, హైదరాబాద్‌కు మార్క్‌రమ్ స్థానంలో కమిన్స్, చెన్నైకి ధోని స్థానంలో రుతురాజ్ గైక్వాడ్, గుజరాత్‌కు పాండ్యా స్థానంలో శుబ్‌మన్ గిల్ బాధ్యతలు చేపడుతున్నారు. గాయం నుంచి కోలుకొని వచ్చిన రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్ మళ్లీ ఢిల్లీ, కోల్‌కతా జట్ల పగ్గాలు చేపట్టారు. మిగతా నలుగురు కేఎల్ రాహుల్ (లక్నో), సంజూ సామ్సన్ (రాజస్తాన్), డుప్లెసిస్ (బెంగళూరు), శిఖర్ ధావన్ (పంజాబ్)లు గత సీజన్‌లాగే ఈసారి సారథులుగా కొనసాగనున్నారు.
- ఎనిమిది జట్ల 'హోం' వేదికల్లో ఎలాంటి మార్పు లేకపోగా... ఢిల్లీ తమ తొలి రెండు మ్యాచ్‌లను విశాఖపట్నంలో ఆడుతుంది. పంజాబ్ కింగ్స్ ఈసారి మొహాలిలో కాకుండా కొత్తగా ముల్లన్‌పూర్‌లో కట్టిన స్టేడియాన్ని తమ హోం గ్రౌండ్‌గా మార్చుకుంది.
- ఈ సీజన్‌లో కొత్తగా రెండు నిబంధనలు వచ్చాయి. ఒక ఓవర్లో రెండు బౌన్సర్లను అనుమతిస్తారు. చెలరేగిపోతున్న బ్యాటర్లను కొంత వరకు నిలువరించేందుకు పేస్ బౌలర్లకు ఇది ఒక అదనపు బలంగా పనికొస్తుంది. 'స్మార్ట్ రీప్లే' సిస్టంను కూడా తొలిసారి అమలు చేస్తున్నారు. దీని ద్వారా అంపైర్ రివ్యూ ఫలితాలను మరింత వేగంగా, కచ్చితంగా అందించే అవకాశం ఉంటుంది. టీవీ అంపైర్, హాక్ ఐ ఆపరేటర్ కలిసి ఒకే చోట కూర్చునే ఏర్పాటు చేయడం వల్ల ఇది సాధ్యమవుతుంది. గత సీజన్‌లో అమల్లోకి వచ్చిన 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధన ఈసారి కూడా కొనసాగుతుంది.
- ఐపీఎల్ తర్వాత వెంటనే టి20 ప్రపంచకప్ ఉండటంతో భారత జట్టులో చోటు సంపాదించుకునేందుకు పలువురు యువ ఆటగాళ్లకు ఈ టోర్నీ అవకాశం కల్పిస్తోంది.
- ఐపీఎల్ వేలంలో ఆసీస్ స్టార్ బౌలర్లు మిచెల్ స్టార్క్ రూ. 24 కోట్ల 75 లక్షలకు, ప్యాట్ కమిన్స్ రూ.20 కోట్ల 50 లక్షలకు అమ్ముడుపోయారు. ఈ నేపథ్యంలో తమ జట్లు కోల్‌కతా, హైదరాబాద్‌లను గెలిపించే విషయంలో వీరిద్దరిపై తీవ్ర ఒత్తిడి ఉండటం ఖాయం.
- గాయం కారణంగా లేదా వేలంలో అమ్ముడుపోకపోవడం వల్ల తాజా సీజన్‌కు దూరమైన కొందరు కీలక ఆటగాళ్లలో షమీ, మార్క్ వుడ్, ప్రసిధ్ కృష్ణ, జేసన్ రాయ్, హ్యారీ బ్రూక్, డెవాన్ కాన్వే, ఎన్‌గిడి, మదుషంక, స్టీవ్ స్మిత్, హాజల్‌వుడ్, బెన్ స్టోక్స్, జో రూట్, ఆడమ్ జంపా తదితరులు ఉన్నారు.



గురువారం ప్రాక్టీస్ సెషన్‌లో ధోని, రుతురాజ్

కెప్టెన్సీకి ధోని గుడ్‌బై
సీఎస్‌కే కొత్త సారథిగా రుతురాజ్

చెన్నై: 'కొత్త సీజన్‌లో కొత్త 'పాత్ర' పోషించేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'... మార్చి 4న సోషల్ మీడియాలో ధోని పెట్టిన పోస్ట్ ఇది! ఆ కొత్త పాత్ర ఏమిటనేది ఎవరూ ఊహించలేకపోయారు. కానీ మార్చి 21కి వచ్చేసరికే అదేంటో ధోని చూపించాడు. తాజా ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ సారథ్య బాధ్యతల నుంచి ధోని తప్పుకున్నాడు. కెప్టెన్‌గా కాకుండా కేవలం ఆటగాడిగా అతను ఈ సీజన్ బరిలోకి దిగనున్నాడు. ధోని స్థానంలో జట్టు ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసినట్లు సీఎస్‌కే యాజమాన్యం ప్రకటించింది. 42 ఏళ్ల ధోని 2008లో ఐపీఎల్ తొలి ఏడాది నుంచి చెన్నై కెప్టెన్‌గా వ్యవహరించాడు. మధ్యలో రెండేళ్లు జట్టు నిషేధానికి గురి కాగా... 2022 సీజన్‌లో రవీంద్ర జడేజా కెప్టెన్ అయ్యాడు. అయితే 8 మ్యాచ్‌ల తర్వాత తనవల్ల కాదంటూ జడేజా తప్పుకోవడంతో సీజన్ మధ్యలో మళ్లీ ధోని పగ్గాలు చేపట్టాడు. ఐపీఎల్‌లో అతను మొత్తం 212 మ్యాచ్‌లలో కెప్టెన్‌గా వ్యవహరించగా... 128 మ్యాచ్‌ల్లో గెలిచి, 82 మ్యాచ్‌ల్లో ఓడిన చెన్నై 5సార్లు చాంపియన్ కావడంతో పాటు మరో 5సార్లు రన్నరప్‌గా నిలిచింది. మరో 23 చాంపియన్స్ లీగ్ మ్యాచ్‌ల్లో కెప్టెన్సీ చేసిన అతను 2 టైటిల్స్ అందించాడు. 2023లో టైటిల్ గెలిచాక అదే ధోని ఆఖరి సీజన్ అనిపించింది. కెప్టెన్సీ కాకుండా ఆటగాడిగా అతని ప్రభావం దాదాపు శూన్యంగా మారింది. కానీ మోకాలి ఆపరేషన్ తర్వాత అతను మరోసారి బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు.

అనుభవం లేకపోయినా...

మహారాష్ట్రకు చెందిన రుతురాజ్‌కు పెద్దగా కెప్టెన్సీ అనుభవం లేదు. సీనియర్ స్థాయిలో కేవలం 16 టి20 మ్యాచుల్లోనే అతను కెప్టెన్‌గా వ్యవహరించి 10 విజయాలు సాధించాడు. ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టుకు అతనే కెప్టెన్. అయితే ఓపెనర్ రూపంలో భారీగా పరుగులు సాధిస్తూ జట్టు విజయాల్లో అతను కీలకంగా మారాడు. 2020 సీజన్ నుంచి చెన్నై జట్టుతో ఉన్న రుతురాజ్ 52 మ్యాచ్‌లలో 135.52 స్ట్రయిక్‌రేట్‌తో 1797 పరుగులు సాధించాడు. రుతురాజ్ భారత్ తరఫున 6 వన్డేలు, 19 టి20లు ఆడాడు. 2022లో జడేజాను అనూహ్యంగా కెప్టెన్ చేయడంతో సమస్య వచ్చిందని, కానీ ఈసారి మార్పుకు తాము ముందే సిద్ధమయ్యామని సీఎస్‌కే మేనేజ్‌మెంట్ ప్రకటించింది.

ఐపీఎల్ తొలి దశ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక
మార్చి 22	చెన్నై x బెంగళూరు	చెన్నై
మార్చి 23	పంజాబ్ x ఢిల్లీ	చండీగఢ్
మార్చి 23	కోల్‌కతా x హైదరాబాద్	కోల్‌కతా
మార్చి 24	రాజస్తాన్ x లక్నో	జైపూర్
మార్చి 24	గుజరాత్ x ముంబై	అహ్మదాబాద్
మార్చి 25	బెంగళూరు x పంజాబ్	బెంగళూరు
మార్చి 26	చెన్నై x గుజరాత్	చెన్నై
మార్చి 27	హైదరాబాద్ x ముంబై	హైదరాబాద్
మార్చి 28	రాజస్తాన్ x ఢిల్లీ	జైపూర్
మార్చి 29	బెంగళూరు x కోల్‌కతా	బెంగళూరు
మార్చి 30	లక్నో x పంజాబ్	లక్నో
మార్చి 31	గుజరాత్ x హైదరాబాద్	అహ్మదాబాద్
మార్చి 31	ఢిల్లీ x చెన్నై	వైజాగ్
ఏప్రిల్ 1	ముంబై x రాజస్తాన్	ముంబై
ఏప్రిల్ 2	బెంగళూరు x లక్నో	బెంగళూరు
ఏప్రిల్ 3	ఢిల్లీ x కోల్‌కతా	వైజాగ్
ఏప్రిల్ 4	గుజరాత్ x పంజాబ్	అహ్మదాబాద్
ఏప్రిల్ 5	హైదరాబాద్ x చెన్నై	హైదరాబాద్
ఏప్రిల్ 6	రాజస్తాన్ x బెంగళూరు	జైపూర్
ఏప్రిల్ 7	ముంబై x ఢిల్లీ	ముంబై
ఏప్రిల్ 7	లక్నో x గుజరాత్	లక్నో

నోట్: తొలి మ్యాచ్ ఒక్కటే రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుండగా... మిగతా రాత్రి మ్యాచ్‌లన్నీ గం.7:30 నుంచి... మధ్యాహ్నం మ్యాచ్‌లన్నీ గం. 3:30 నుంచి జరుగుతాయి.

పతాకధారిగా శరత్ కమల్



న్యూఢిల్లీ: ఈ ఏడాది జూలై-ఆగస్టులలో జరిగే పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో భారత క్రీడాకారుల బృందానికి భారత టేబుల్ టెన్నిస్ దిగ్గజం ఆచంట శరత్ కమల్ పతాకధారిగా వ్యవహరిస్తాడు. తమిళనాడుకు చెందిన 41 ఏళ్ల శరత్ ఐదోసారి ఒలింపిక్స్‌లో పోటీపడనున్నాడు. మహిళల బాక్సింగ్ దిగ్గజం మేరీకోమ్ భారత జట్టుకు 'చెఫ్ డి మిషన్'గా వ్యవహరిస్తుందని భారత ఒలింపిక్ సంఘం ప్రకటించింది.

క్వార్టర్స్‌లో గాయత్రి-ట్రెసా జోడీ

బాసెల్: స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్ చేరింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-10, 21-12తో భారత్‌కే చెందిన ప్రియ-శ్రుతి మిశ్రా జంటను ఓడించింది. మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) జోడీ 17-21, 16-21తో రుయ్ హిరోకామి-యునా కాటో (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది.

క్లుప్తంగా...

వైజాగ్ స్మార్ట్ సిటీ కార్యకలాపాలు అద్భుతం

భారత్‌లో యూఎస్ అంబాసిడర్ ఎరిక్ గార్సెట్టీ ప్రశంసల జల్లు



సీవోసీను పరిశీలిస్తున్న అంబాసిడర్ ఎరిక్

సాక్షి, విశాఖపట్నం: విశ్వనగరంగా రూపుదిద్దుకుంటున్న విశాఖపట్నంలో స్మార్ట్ సిటీ కార్యకలాపాలు అద్భుతంగా ఉన్నాయని భారత్‌లో యూఎస్ అంబాసిడర్ ఎరిక్ గార్సెట్టీ ప్రశంసించారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ)లో ఉన్న కమాండ్ ఆపరేషన్స్ సెంటర్(సీవోసీ)ను ఎరిక్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సీవోసీలో జరుగుతున్న కార్యకలాపాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా.. నగరమంతా వినిపించేలా ఏర్పాటు చేసిన అనౌన్స్‌మెంట్ మైక్‌లో ఎరిక్ కాసేపు మాట్లాడారు. భారత్ పురోగతిని స్మార్ట్‌సిటీ మిషన్ చాటిచెబుతోందని ఆయన ప్రశంసించారు.

ప్రతి విద్యార్థికి సమగ్ర విద్య అందించడమే ఏపీ ప్రభుత్వ లక్ష్యం

దక్షిణ కొరియా 'ఐబీ గ్లోబల్ కాన్ఫరెన్స్'లో సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీనివాసరావు




సాక్షి, అమరావతి: విద్యార్థి నేపథ్యం, పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి సమగ్రమైన, సమానమైన విద్యను అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఐబీ వంటి సంస్థతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పరుచుకోవడం ద్వారా ఏపీ విద్యార్థులను బాధ్యతాయుతమైన ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దేందుకు అవకాశం లభించిందన్నారు. దక్షణ కొరియాలో గురువారం ప్రారంభమైన 'ఐబీ గ్లోబల్ కాన్ఫరెన్స్-2024'లో రాష్ట్రం నుంచి శ్రీనివాసరావుతోపాటు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్య విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దృక్పథం, విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణల గురించి ప్రపంచ దేశాల ప్రతినిధులకు శ్రీనివాసరావు వివరించారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలు గల ఐబీ బోధనను ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఐబీ వరల్డ్ స్కూల్స్‌తో ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల్లో సంపూర్ణ అభివృద్ధి, విమర్శనాత్మక ఆలోచన, అంతర్జాతీయ ఆలోచనను పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా దక్షిణ కొరియాలో సౌత్ ఆసియా రాయబారి అమిత్, ఐబీ డైరెక్టర్ జనరల్ ఆలీ పెక్కా హీనోనెన్‌తో పలు అంశాలపై సమగ్ర శిక్షా అధికారులు చర్చించారు.

• బాబు 'గ్రూప్' పాలి'ట్రిక్స్'...

ఆ ఉద్యోగులకు ఊరట

2018 గ్రూప్ 1 మెయిన్స్‌పై సింగిల్ జడ్జి నిమ్మగడ్డ తీర్పును పాక్షికంగా నిలిపివేసిన హైకోర్టు ధర్మాసనం

- నిరుద్యోగులకు, ఉద్యోగులకు ద్రోహం తలపెడుతూ బాబు బృందం కుట్రపూరిత రాజకీయాలు
- తెలంగాణ తరహాలో గ్రూప్స్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ లెక్కలేస్తూ దుష్ప్రచారం
- 2019 – 2023 వరకు 78 నోటిఫికేషన్లకు సంబంధించి ఒక్క వివాదం లేకుండా ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) 2018లో జారీ చేసిన గ్రూప్–1 నోటిఫికేషన్ ప్రకారం ఉద్యోగాలు పొంది ప్రస్తుతం వివిధ హోదాల్లో కొనసాగుతున్న 167 మందికి తాత్కాలిక ఊరటనిస్తూ హైకోర్టు ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు వారిని ఉద్యోగాల నుంచి తొలగించవద్దని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 27వతేదీకి వాయిదా వేసింది. న్యాయ ప్రయోజనాల నిమిత్తం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొంటూ న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ నూనేపల్లి హరినాథ్ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రూప్–1 మెయిన్స్‌కు సంబంధించి ఏపీపీఎస్సీ దాఖలు చేసిన అప్పీల్‌తో ముడిపడిన అన్ని వ్యాజ్యాలను ఈ అప్పీల్‌తో జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయంటూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలైన విషయం తెలిసిందే. వీటిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గ్రూప్–1 మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ ఈ నెల 13న తీర్పునిచ్చారు. అలాగే గ్రూప్–1 మెయిన్స్‌లో అర్హత సాధించిన వారి జాబితాను కూడా రద్దు చేశారు. తిరిగి గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని, మొత్తం ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఏపీపీఎస్సీని ఆదేశించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీపీఎస్సీ దాఖలు చేసిన అప్పీల్‌పై తాజాగా విచారణ జరిపిన జస్టిస్ తిల్హరీ నేతృత్వంలోని ధర్మాసనం ఇప్పటికే ఉద్యోగాలు పొందిన 167 మందికి ఉపశమనం కల్పిస్తూ ఆదేశాలు వెలువరించింది.

ఉదయించిన వివాదాలు..

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి స్వామికార్యం, స్వకార్యాలు చక్కబెట్టి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారు. తప్పులను నిలదీసిన వారిపై కేసులు బనాయించి బెదిరించారు. చంద్రబాబు సర్కారు హయాంలో ఏపీపీఎస్సీ చైర్మన్‌గా నియమితులైన ఉదయ్ భాస్కర్ 2015 నవంబర్ 27 నుంచి 2021 నవంబర్ 26 వరకు పదవిలో కొనసాగారు. ఆ కాలంలో ఆయన తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలు, నిర్లక్ష్యంతో సర్వీస్ కమిషన్ నిర్వీర్యమైంది. 2018 గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 62 తప్పులు దొర్లాయని 2019 జూన్‌లో అభ్యర్థులు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించవద్దని సెప్టెంబర్‌లో హైకోర్టులో రిట్ వేయడంతో స్టే ఇచ్చింది. దీనిపై సర్వీస్ కమిషన్ కోర్టులో వాదనలు వినిపించగా ఐదు తప్పులను సవరించాలని ఆదేశిస్తూ రిట్ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ప్రిలిమ్స్ ఫలితాలను ప్రకటించి మెయిన్స్ నిర్వహించేందుకు మార్గం ఏర్పడింది. బాబు బృందం మెయిన్స్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేయడంతో మూడుసార్లు షెడ్యూల్ మార్చాల్సి వచ్చింది.

మేం కోరకున్నా మొదటి మూల్యాంకనం రద్దు చేశారు..

పిటిషనర్ల తరఫున న్యాయవాదులు జొన్నలగడ్డ సుధీర్, రవిశంకర్ వాదనలు వినిపిస్తూ సింగిల్ జడ్జి తీర్పులోని కొంత భాగంపై తమకు అభ్యంతరం ఉందన్నారు. మొదటి మూల్యాంకనంపై తాము ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని, ఆ మూల్యాంకనం తాలూకు ఫలితాలను వెల్లడించాలని మాత్రమే కోరామన్నారు. అయితే సింగిల్ జడ్జి మొదటి మూల్యాంకనాన్ని కూడా రద్దు చేశారని నివేదించారు. అందువల్ల తాము సింగిల్ జడ్జి తీర్పుపై అప్పీళ్లు దాఖలు చేశామన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఇప్పటికే సర్వీసులో కొనసాగుతున్న ఉద్యోగులను తదుపరి విచారణ వరకు తొలగించవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

డిజిటల్ మూల్యాంకనం నాటిదే..

గ్రూప్–1 మెయిన్స్ పేపర్లను సంప్రదాయ పద్ధతిలో సబ్జెక్టు నిపుణులు మూల్యాంకనం చేయడం రివాజు. ఈ విధానంలో అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందంటూ నాటి కమిషన్ చైర్మన్ ఉదయ్ భాస్కర్ డిజిటల్ మూల్యాంకనం ప్రతిపాదించారు. కమిషన్‌లో చంద్రబాబు నియమించిన అత్యధిక మంది సభ్యులు దీనికి ఆమోదం తెలిపారు. 2018 గ్రూప్–1 మెయిన్స్ పేపర్లను ఈ విధానంలోనే మూల్యాంకనం చేసి 2021 ఏప్రిల్ 28న ఫలితాలను ప్రకటించారు. అయితే నోటిఫికేషన్‌లో డిజిటల్ మూల్యాంకనం గురించి పేర్కొనక పోవడంతో ఈ విధానాన్ని రద్దు చేయాలంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో సంప్రదాయ విధానంలో మరోసారి మూల్యాంకనం చేయాలని 2021 అక్టోబర్ 1న హైకోర్టు ఆదేశించింది. ఉదయ్ భాస్కర్ పదవీ కాలం అదే ఏడాది నవంబర్‌లో ముగియడంతో ఏవీ రమణారెడ్డి ఇన్‌చార్జి చైర్మన్‌గా 2021 డిసెంబర్ 20న బాధ్యతలు చేపట్టి దాదాపు రెండు నెలలు సేవలందించారు. అనంతరం 2022 ఫిబ్రవరి 19న గౌతమ్ సవాంగ్ చైర్మన్‌గా వచ్చి మార్చిలో సంప్రదాయ మూల్యాంకనం చేశారు.

మోడరేషన్‌పై తప్పుడు ప్రచారం

సబ్జెక్టు నిపుణులు మాన్యువల్‌గా మూల్యాంకనం చేసినప్పుడు మార్కుల్లో చోటు చేసుకునే వ్యత్యాసాలను సరిచేసేందుకు మోడరేషన్ ప్రక్రియ చేపడతారు. అంటే ఒక ప్రొఫెసర్ దిద్దిన పేపర్లను మరో నిపుణుడికి పంపిస్తారు. రెండుసార్లు చేసిన మూల్యాంకనంలో 15 శాతం మార్కులు తేడా వస్తే మూడోసారి మోడరేషన్ చేస్తారు. అంటే మరో ప్రొఫెసర్‌తో దిద్దిస్తారు. ఈ విధానాన్ని 2016లో చంద్రబాబు హయాంలో ప్రవేశపెట్టారు. 2018 గ్రూప్–1 మెయిన్స్ పేపర్ల విషయంలోనూ ఇదే జరిగింది. మోడరేషన్ ప్రక్రియ చేపడితే మూడుసార్లు పేపర్లు మూల్యాంకనం చేశారంటూ చంద్రబాబు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు మెయిన్స్ పత్రాలను మాన్యువల్‌గా మూల్యాంకనం చేసిన అనంతరం సర్వీస్ కమిషన్ 1:2 నిష్పత్తిలో 325 మందిని, స్పోర్ట్స్ విభాగంలో మరో 48 మందిని 2022 మేలో ఇంటర్వ్యూలకు ఎంపిక చేసింది.

'రిట్లు'.. మొట్టికాయలు

మెయిన్స్ పరీక్షలు, ఫలితాలను అడ్డుకునేందుకు బాబు బృందం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఇంటర్వ్యూలను అడ్డుకోవాలని ఎత్తులు వేశారు. అందుకోసం హైకోర్టు, సుప్రీంకోర్టులోను రిట్లు వేశారు. మాన్యువల్ మూల్యాంకనం, ఇంటర్వ్యూలు రద్దు చేయాలని 2022 జూన్ 13 హైకోర్టులో రిట్ వేయగా సరైన ఆధారాలు లేవని కొట్టివేసింది. దాంతో పదిరోజుల వ్యవధిలో ఇంటర్వ్యూలపై స్టే విధించాలని డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేయగా తిరస్కరించింది. ఈ మధ్యలో ఏపీపీఎస్సీ జూలై 5 నాటికి ఇంటర్వ్యూలు పూర్తి చేసింది.

పిటిషనర్లు కోరిన దానికి మించి సింగిల్ జడ్జి ఉత్తర్వులిచ్చారు..

ఏపీపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది సర్వ సత్యనారాయణ ప్రసాద్ వాదనలు వినిపించారు. పిటిషనర్లు కోరిన దానికి మించి సింగిల్ జడ్జి నిమ్మగడ్డ ఉత్తర్వులు జారీ చేశారని నివేదించారు. అడగని వాటిని పరిగణనలోకి తీసుకున్నారని, అభ్యర్థించిన వాటిని మాత్రం పరిగణనలోకి తీసుకోలేదన్నారు. జడ్జి పరిగణనలోకి తీసుకున్న అంశాలను పిటిషనర్లు అభ్యర్థించలేదన్నారు. తిరిగి మూల్యాంకనం చేపట్టాలన్న సింగిల్ జడ్జి నిమ్మగడ్డ ఆదేశాలు ఎంత మాత్రం సహేతుకం కాదన్నారు. మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన పిటిషనర్లు ఎవరూ మూల్యాంకనాన్ని సవాల్ చేయలేదని, అయినప్పటికీ సింగిల్ జడ్జి మూల్యాంకనాన్ని తప్పుపట్టి మొత్తం పరీక్షను తిరిగి నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. సింగిల్ జడ్జి ముందు పిటిషన్లు దాఖలు చేసిన పిటిషనర్లు సైతం ఆ తీర్పుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అప్పీళ్లు దాఖలు చేయడం ఆసక్తికరమని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. గ్రూప్–1 మెయిన్స్, ఇంటర్వ్యూల్లో అర్హత సాధించి పోస్టులు పొందిన 167 మంది ఇప్పటికే సర్వీసులో కొనసాగుతున్నారని, సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు వల్ల వారిని ఉద్యోగాల నుంచి తొలగించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైందని నివేదించారు.

చంద్రబాబు బృందం అదే ఏడాది జూలై 14న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేయగా సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇన్నిసార్లు భంగపడ్డ బాబు బృందం ఇంటర్వ్యూలు రద్దు చేయాలని మరోసారి హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై గతేడాది ఆగస్టు 21న తీర్పును రిజర్వు చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఎనిమిది నెలల తర్వాత 2018న గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలను రద్దు చేయాలని ఈ ఏడాది మార్చి 13న తీర్పు వెలువరించారు. తెలంగాణ తరహాలోనే గ్రూప్స్ పరీక్షల నిర్వహణలో ఏపీలోనూ అక్రమాలు జరిగాయంటూ చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్లతో స్క్రీన్‌పై లెక్కలు చెబుతూ ఎల్లో మీడియాలో దుష్ప్రచారం చేశారు. అయితే సింగిల్ జడ్జి నిమ్మగడ్డ తీర్పుపై సర్వీస్ కమిషన్ డివిజన్ బెంచ్‌కు వెళ్లి వాదనలు వినిపించడంతో స్టే విధిస్తూ తాజాగా మధ్యంతర ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఏడాది మార్చి 17న జరిగిన గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను కూడా నిలిపివేయాలని హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేయించిన ఎల్లో బ్యాచ్ తర్వాత పిటిషన్‌ను వెనక్కి తీసుకుంది. 2019 నుంచి 2023 వరకు ఏపీపీఎస్సీ నిర్వహించిన 78 నోటిఫికేషన్లకు సంబంధించి ఒక్క వివాదం కూడా లేకపోవడం గమనార్హం.

తెలంగాణ

దొంగలొస్తే.. దొరకబుచ్చుకుని..

- మారణాయుధాలతో వచ్చిన దుండగులను ధైర్యంగా ఎదుర్కొన్న తల్లీకూతుళ్లు
- గతంలో ఇంట్లో క్లీనింగ్ పనులు చేసిన వ్యక్తే దోపిడీ సూత్రధారి
- ఘటనా స్థలంలో ఒకరిని.. కాజీపేటలో మరొకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రెండు కత్తులు, తపంచా స్వాధీనం

సనత్‌నగర్ (హైదరాబాద్): ఇద్దరు దుండగులు ఓ ఇంట్లోకి చొరబడ్డారు. తపంచా (నాటు తుపాకీ), కత్తి చూపించి తల్లీకూతుళ్లను బెదిరించి, దోపిడీకి ప్రయత్నించారు. కానీ తల్లీకూతురు అప్రమత్తమై దుండగులను ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఒకరిని గదిలో బంధించారు. మరొకడిని కూడా పట్టుకునేందుకు ప్రయత్నించినా, పరారయ్యాడు. ఈ ఘటన అంతా సీసీ కెమెరాల్లో రికార్డయింది. హైదరాబాద్‌లోని బేగంపేట పైగాకాలనీలో గురువారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. పోలీసులు, బాధితులు చెప్పిన వివరాల మేరకు..

మాస్క్, హెల్మెట్ పెట్టుకుని..

బేగంపేట పైగాకాలనీకి చెందిన నవరతన్ జైన్, అమిత్ మహోత్ (46) భార్యాభర్తలు. వారికి ఒక మైనర్ కుమార్తె ఉంది. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో నవరతన్ ఇంట్లో లేని సమయంలో.. ఇద్దరు దుండగులు ఆ ఇంట్లోకి చొరబడ్డారు. ముఖాలు కనిపించకుండా ఒకరు మాస్క్, మరొకరు హెల్మెట్ పెట్టుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న తపంచా (నాటు తుపాకీ), కత్తి చూపించి.. ఇంట్లోని నగలు, నగదును తీసుకురావాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించారు. అమిత అరుపులతో ఇంట్లోనే ఉన్న ఆమె మైనర్ కుమార్తె ధైర్యంగా ముందుకొచ్చింది. తల్లీకూతురు కలిసి దుండగులతో పెనుగులాడారు. ఈ క్రమంలో వారి నుంచి నాటు తుపాకీని అమిత లాగేసుకుంది. అప్పటికే తల్లీకూతురు కలసి ఒకరిని లోపల బంధించారు. మరొకరు పారిపోతుండగా.. వెంటపడి పట్టుకునేందుకు ప్రయత్నించారు. కానీ ఆ వ్యక్తి వారిని నెట్టేసి పరారయ్యాడు. లోపల బంధించిన రెండో వ్యక్తి కూడా బయటపడి కత్తితో బెదిరిస్తూ, పారిపోయే యత్నం చేశాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.



దుండగుడిని అడ్డుకుంటున్న తల్లీకూతుళ్లు

గతంలో పనిచేసిన వ్యక్తే..

ఆ ఇంట్లో గతంలో క్లీనింగ్ పనులు చేసిన ప్రేమ్‌చంద్, అతడి స్నేహితుడు సుశీల్‌కుమార్ కలసి ఈ దోపిడీ యత్నానికి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. వీరిలో ప్రేమ్‌చంద్‌ను స్థానికులు పట్టుకోగా.. పరారైన సుశీల్‌కుమార్‌ను పోలీసులు కాజీపేటలో అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. వారి నుంచి రెండు కత్తులు, తపంచా (నాటు తుపాకీ)లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. దుండగులు మారణాయుధాలతో వచ్చినా తల్లి, కుమార్తె భయపడకుండా ఎదుర్కోవడంపై పోలీసులు, ప్రజల నుంచి ప్రశంసలు వస్తున్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం : 22 : మార్చి : 2024




సాయుధ బలగాలతో కవాతు

కోనేరుసెంటర్: జిల్లాకు విచ్చేసిన కేంద్ర సాయుధ బలగాలతో బందరు సబ్‌డివిజన్ పోలీసులు మచిలీపట్నంలో గురువారం కవాతు నిర్వహించారు.



కొండపై కూల్ కూల్‌గా..

ఇంద్రకీలాద్రి: వేసవిలో అమ్మవారి భక్తులకు ఇబ్బంది కలగకుండా దుర్గగుడి దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ ప్రాంగణంలో కూల్ పెయింట్, మ్యాట్లు, చలువ పందిళ్లు వేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
విజయవాడ	6.23	4.52
జగ్గయ్యపేట	6.26	4.58
మచిలీపట్నం	6.23	4.50
గుడివాడ	6.23	4.52

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగ కమిటీల నియామకం

గాంధీనగర్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగ కమిటీలను నియమించారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన షేక్ నాగుల్‌మీరాను వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగ సంయుక్త కార్యదర్శిగా నియమించారు. కృష్ణా జిల్లాకు చెందిన నెలకుర్తి రమేష్ రాష్ట్ర ఎస్సీ విభాగ కమిటీ ప్రధాన కార్యదర్శిగా అలాగే రాష్ట్ర బీసీ విభాగ కమిటీ అధికార ప్రతినిధిగా నాగిడి సాంబశివరావును నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



విజయవాడస్పోర్ట్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని ప్రజలు పూర్తిగా విశ్వసిస్తున్నారని ఎంపీ కేశినేని నాని అన్నారు. సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు నందేపు జగదీష్, గండూరి మహేష్‌లు కేశినేని భవన్‌లో ఎంపీ నానిని గురువారం కలిశారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. బొండా ఉమా వైఖరి నచ్చక టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని వివరించారు. ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు, జ్యేష్ఠ రమేష్‌బాబు, శ్రీనాథ్, మైలవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కర్రా హర్షవర్ధన్‌రెడ్డిలతో కేశినేని చర్చించారు.

విద్యార్థులను అభినందించిన ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన విద్యార్థులను ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నాగరాజు అభినందించారు. గత నెల 28న పాఠశాలలో చంద్రయాన్–3 అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కొండపల్లి డీఏవీ పాఠశాల విద్యార్థులు చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించినట్లు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం వెల్లడించినట్లు పాఠశాల హెచ్ఎం మన్‌మోహన్ తెలిపారు. ప్రశంసా పత్రాలతో పాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, జ్ఞాపికలు బహూకరించారు. కాలిగ్రఫీ ఉపాధ్యాయుడు సమ్మయ్యను సత్కరించారు.

అమ్మవారి ఆలయ హుండీ కానుకల లెక్కింపు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో హుండీ కానుకలు లెక్కించారు. గత నాలుగు నెలలుగా భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించగా రూ. 2,90,730 ఆదాయం వచ్చింది. అలాగే అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరల వేలం పాట నిర్వహించగా 176 చీరలకు రూ. 44,910 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనురాధ, ఈఓ యువీ. ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సుబాబుల్ రైతులకు సిరులు!

- అనూహ్యంగా పెరిగిన ధరలు
- టన్ను రూ.5,500 పలుకుతున్న వైనం
- ధర మరింత పెరిగే అవకాశం
- ఆనందంలో రైతులు



సుబాబుల్ కర్రను ఎగుమతికి సిద్ధం చేస్తున్న రైతులు

నందిగామ: సుబాబుల్ సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. గతంలో కనీస గిట్టుబాటు ధర లేక పంట సాగు చేసిన రైతులు ఆవేదన చెందారు. కొద్ది నెలలుగా సుబాబుల్ ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సుబాబుల్ పంట సాగు చేస్తున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మెట్ట ప్రాంతంగా పిలవబడే పశ్చిమ కృష్ణాలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు గతంలో రైతులు సుబాబుల్ పంట సాగు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో పంట విస్తీర్ణం గణనీయంగా పెరగడంతో పేపర్ కంపెనీలు ఇష్టాను సారం వ్యవహరించి కారు చౌకగా సుబాబుల్ కొనుగోలు చేశారు. దీంతో నష్టాలు చవి చూడలేక రైతులు సుబాబుల్ పంటకు స్వస్తి చెప్పి ఇతర పంటల వైపు మొగ్గు చూపారు. ప్రస్తుతం జిల్లాలో సుబాబుల్ సాగు గణనీయంగా తగ్గింది. ఈ క్రమంలో పేపర్ కంపెనీలకు అవసరమైనంత కర్ర అందుబాటులో లేకపోవడంతో ఉన్న సుబాబుల్‌కు డిమాండ్ పెరిగింది. దీంతో సుబాబుల్ సాగు చేస్తున్న రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది.

జిల్లాలో 42 వేల ఎకరాల్లో సాగు

ప్రస్తుతం ఉమ్మడి కృష్ణా జిల్లాలో 42 వేల ఎకరాల్లో సుబాబుల్ సాగవుతోంది. గతంలో 74 వేల ఎకరాల్లో సుబాబుల్ పంట సాగయ్యేది. ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు స్వయంగా పంటలను తొలగించారు. ఈ క్రమంలో జిల్లాలో పంట సాగు గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం 42 వేల ఎకరాల్లో మాత్రమే ఉమ్మడి కృష్ణా జిల్లాలో సుబాబుల్ సాగవుతోంది. దానిలో కూడా కోతకు సిద్ధంగా ఉన్న పంట తక్కువగా ఉంది. దీంతో ఇటీవల సుబాబుల్ ధరలు అమాంతంగా పెరిగాయి.

మరింత ధర పెరిగే అవకాశం....

గతంలో పేపర్ కంపెనీల అవసరానికి మించి సుబాబుల్ సాగు ఉండేది. అప్పట్లో పేపర్ కంపెనీల వారు నచ్చిన ధరలకు సుబాబుల్‌ను కొనుగోలు చేశారు. టన్ను సుబాబుల్ ధర కేవలం రూ.1,800 నుంచి రూ.2,300 వరకు మాత్రమే కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సుబాబుల్ సాగు గణనీయంగా తగ్గింది. ఈ క్రమంలో పేపర్ కంపెనీలకు అవసరమైనంత సుబాబుల్ కర్ర దొరకటం లేదు. దీంతో కొద్ది నెలలుగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం టన్ను సుబాబుల్ కర్రను ఖర్చులన్నీ పోనూ రైతుల నుంచి రూ.5,300 నుంచి రూ. 5,500 వరకు పోటీపడి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోందని రైతులు చెబుతున్నారు.

సుబాబుల్ సాగు వివరాలు....

సుబాబుల్ పంట నీటి సౌకర్యం లేని మెట్ట పొలాలలో సాగు చేస్తారు. కేవలం ఒక్కసారి పెట్టుబడి పెడితే మూడు సంవత్సరాల తర్వాత పంట చేతికి వస్తుంది. పంట సాగు చేసే సమయంలో ఎకరాకు రూ.23 వేల వరకు ఖర్చు అవుతుంది. ఆ తరువాత పంటకు అందిన నీటిని బట్టి మూడు లేదా నాలుగు సంవత్సరాల్లో కర్ర కోతకు సిద్ధమవుతుంది. ఎకరాకు 25 నుంచి భూమిలోని సారాన్ని బట్టి 35 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. కర్రను విక్రయించేటప్పుడు సైతం అన్ని ఖర్చులు పోను ధర నిర్ణయించి రైతులకు అందజేస్తారు. ఈ క్రమంలో ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉండడంతో మళ్లీ రైతులు సుబాబుల్ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.



నందిగామ ప్రాంతంలో సాగులో ఉన్న సుబాబుల్

ధర పెరిగింది



మునుపెన్నడూ లేని విధంగా కొంతకాలంగా సుబాబుల్ ధర గణనీయంగా పెరిగింది. ఇటీవల సాగు తగ్గటం, పేపర్ కంపెనీలకు అవసరమైనంత కర్ర అందుబాటులో లేకపోవడంతో ఇటీవల ధరలు బాగా పెరిగాయి.

– మానుకొండ కృష్ణారెడ్డి, సుబాబుల్ రైతు, పల్లగిరి

కర్ర కొనుగోలుకు పోటీ



కొద్ది నెలలుగా సుబాబుల్ కర్ర కొనుగోలు చేసేందుకు వివిధ పేపర్ కంపెనీలు పోటీ పడుతున్నాయి. గతంలో సుబాబుల్ కర్ర అమ్మాలంటే ఏజెంట్ల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అప్పట్లో వాళ్లు అడిగిన ధరకు ఇవ్వాల్సి వచ్చేది. ప్రస్తుతం కొద్ది నెలలుగా సుబాబుల్ కర్రకు డిమాండ్ బాగా పెరిగింది.

– ఈదా వెంకటనారాయణ, సుబాబుల్ రైతు, పల్లగిరి

టన్ను రూ.5,300కు విక్రయించా



నేను 17 ఎకరాల్లో సుబాబుల్ సాగు చేస్తున్నాను. టన్ను రూ.5,300 కు విక్రయించాను. 10 నెలల క్రితం కూడా నాలుగు ఎకరాల్లో పంటను టన్ను రూ.2,300 చొప్పున మాత్రమే విక్రయించాను. కేవలం కొద్ది నెలలుగా సుబాబుల్ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి.

– షేక్ ఖాసిం, సుబాబుల్ రైతు, పల్లగిరి

ఎన్నికల అనుమతులకు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి అవసరమయ్యే వాహనాలు, ఇతర అనుమతుల మంజూరుకు సువిధ పోర్టల్ లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాహనాల అనుమతికి సంబంధించి దరఖాస్తుతో పాటు వాహన రిజిస్ట్రేషన్ (ఆర్‌సీ బుక్) వివరాలు, డ్రైవింగ్ లైసెన్సు, వాహన యజమాని పేరు, డ్రైవర్ పేరు, చిరునామా, మొబైల్ నంబరు తదితర వివరాలు జత చేయాలని తెలిపారు. వాహనం సంచరించే ప్రదేశాల వివరాలు, రూట్ మ్యాప్ తెలియజేయాలని పేర్కొన్నారు. వాహన తనిఖీ అధికారి (మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) నుంచి వాహనాన్ని తనిఖీ చేయించుకుని సర్టిఫికెట్ పొందాలని చెప్పారు. తాత్కాలిక ఎన్నికల కార్యాలయం ఏర్పాట్లకు అనుమతి కోసం భవన యజమాని అనుమతి లేదా అద్దె వివరాలు, ఇతర అంచనా వ్యయం తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ర్యాలీలు, రోడ్ షోలు వంటి కార్యక్రమాల అనుమతికి ప్రదేశం, రూట్ మ్యాప్, ర్యాలీలో పాల్గొనే వారి సంఖ్య, తేదీ, సమయం తదితర వివరాలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి తెలియజేసి అనుమతి పొందాలన్నారు. బహిరంగ సభల నిర్వహణ సమయంలో వీవీపీ లేదా వీవీఐపీలు సందర్శన సమయంలో హెలిప్యాడ్ ఏర్పాటు అనుమతి కోసం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నుంచి అనుమతి కోసం ముందుగా దరఖాస్తు చేయాలన్నారు. ఎలాంటి అనుమతి కోసమైనా కనీసం 48 గంటల ముందుగా దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించినా, వాహనాలను ప్రచారానికి వినియోగించినా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లుగా పరిగణించి తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎన్నికలపై డేగ కన్ను

- 12 రాష్ట్ర, 5 అంతర జిల్లా సరిహద్దు చెక్ పోస్టులు ఏర్పాటు
- మూడు షిఫ్ట్‌ల్లో సిబ్బంది నియామకం
- ఇప్పటికే విస్తృతంగా తనిఖీలు

జిల్లాకు ఐదు కంపెనీల పారామిలటరీ బలగాలు



ఇబ్రహీంపట్నంలో సాయిధ దళాలతో టీకే రాణా

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా కట్టు దిట్టమైన చర్యలు తీసుకొంటున్నారు. కమిషనరేట్ పరిధిలోని ముఖ్య ప్రదేశాల్లో డీసీపీలు అధిరాజ్‌సింగ్ రాణా, కె.శ్రీనివాసరావు, టి.హరికృష్ణ పర్యవేక్షణలో సుమారు 200 మంది సివిల్, ఏఆర్, పారామిలటరీ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకొనేందుకు అండగా ఉంటామని, ప్రజలు ఎలాంటి అపోహలకు తావులేకుండా, ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పిస్తామని పేర్కొంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తరుణంలో పోలీసులు మరింత అప్రమత్తం అయ్యారు. రాష్ట్ర, జిల్లాల సరిహద్దుల్లో గట్టి నిఘా పెంచారు. విస్తృత సోదాల కోసం అన్ని సాంకేతిక వనరులను జిల్లా పోలీస్ యంత్రాంగం సమకూర్చుకొంది. తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల నుంచి అక్రమంగా నగదు, మద్యం రవాణాను అరికట్టేందుకు వీలుగా పటిష్ట చర్యలు తీసుకొంటున్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రలోభాలకు అడ్డుకట్ట వేసే విధంగా ప్రణాళికలు రచించారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 107 సీఆర్‌పీ కింద 1006 మంది, 109 సీఆర్‌పీ కింద 7, 110 సీఆర్‌పీ కింద 2369 మొత్తం 3382 మందిని బైండోవర్ చేశారు.

చెక్ పోస్టుల్లో నిరంతర సోదాలు...

రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలను ఇప్పటికే పోలీస్ శాఖ తన కనుసన్నల్లోకి తీసుకుంది. దీనిలో భాగంగానే తెలంగాణ రాష్ట్ర భౌగోళిక సరిహద్దులో 12 పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటయ్యాయి. గరికపాడు (జగ్గయ్యపేట), జొన్నలగడ్డ (నందిగామ), వత్సవాయి, పెద్దాపురం (వీరులపాడు), ముక్త్యాల (చిల్లకల్లు), గండ్రాయ్ (చిల్లకల్లు), రాజుపేట (తిరువూరు), రాజవరం (గంపలగూడెం), వేమిరెడ్డిపల్లి (విస్సన్నపేట) మెరుసుమిల్లి (మైలవరం) గంగినేనిపాలెం (జి.కొండూరు), లక్ష్మీపురం (తిరువూరు)లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో నిరంతర సోదాలు చేస్తున్నారు. మూడు షిప్టుల్లో పోలీసు సిబ్బంది పనిచేస్తున్నారు. ఒక్కో చెక్ పోస్టులో ముగ్గురు ఎస్‌ఐలు, ఆరుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 18 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, ముగ్గురు మహిళా పోలీసులను నియమించారు. ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల భౌగోళిక సరిహద్దుల్లోనూ పోలీస్ నిఘా మరింత పెంచారు. కృష్ణలంక, గూడవల్లి, గుంటుపల్లి, ప్రకాశం బ్యారేజి, నున్న సమీపంలో ఐదు అంతర్ జిల్లాల సరిహద్దు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో అక్రమాలు అడ్డుకునేందుకు పోలీస్ యంత్రాంగం వ్యూహాత్మక అడుగులు వేయనుంది. విజయవాడ సిటీతో పాటు ఆయా మండల, నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటైన సీసీ కెమెరాలను గస్తీ కోసం వినియోగించుకోనుంది. తెలంగాణ, జిల్లా సరిహద్దుల్లోని సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నాం. ఎన్నికల కమిషనర్ ఆదేశాలతో ఇప్పటికే అన్ని పోలింగ్ స్టేషన్లను సందర్శించాం. హోంగార్డు నుంచి అన్ని స్థాయిల అధికారులను ఎన్నికలకు సన్నద్ధం చేశాం. సరిహద్దుల్లో తనిఖీలు ముమ్మరం చేశాం. పాత నేరస్తులను బైండోవర్ చేస్తున్నాం. అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచాం.

- టీకే రాణా, పోలీస్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా

సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి...

ఎన్నికల సంఘం ముందస్తు ఆదేశాల మేరకు జిల్లాలలో ఇప్పటికే పోలీస్ యంత్రాంగం సోదాలను ముమ్మరం చేసింది. టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్, ఎస్ఈబీ, ఏఆర్, దిశ, సైబర్, స్పెషల్ బ్రాంచ్, హోం గార్డ్ తదితర విభాగాలను ఉన్నతాధికారులు ఏకతాటిపైకి తీసుకొచ్చారు. విజయవాడ సిటీతో పాటు, రూరల్ మండలాల్లోని 1863 పోలింగ్ కేంద్రాల్లో 696 సమస్యాత్మక, 1167 సాధారణ పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించారు. తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం నియోజకవర్గాల్లోని గ్రామాల్లో గతంలో సారా తయారు చేసే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించారు.

మద్యం, బంగారం, వెండి స్వాధీనం...

జిల్లాకు అక్రమంగా తీసుకొచ్చిన నగదు, విదేశీ, స్వదేశీ మద్యం, సారా, బంగారం, వెండిలను భారీ స్థాయిలోనే స్వాధీనం చేసుకున్నారు. పోలీసు శాఖ ద్వారా 2024 మార్చి 18 వరకు 35,992 లీటర్ల మద్యం, 165.76 కిలోల గంజాయి సీజ్ చేశారు. అలానే 33.97 కిలోల విలువైన లోహాలు, రూ. 4.19 కోట్ల నగదు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. 2023 మార్చి 16 నుంచి ఈ ఏడాది మార్చి 18 వరకు సెబ్ ద్వారా 37,841 లీటర్ల మద్యం, 5.5 కిలోల గంజాయిని పట్టుకున్నారు. సీజ్ చేసిన నగదు, మద్యం, విలువైన లోహాలు తదితరాల విలువ రూ. 10.10 కోట్లకు పైనే ఉంది. 2390 కేసులు నమోదు చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 443 ఆయుధాలకు గాను 441 ఆయుధాలను డిపాజిట్ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



ప్రయాణికుల గ్రీవెన్స్‌పై సమీక్ష సమావేశంలో పాల్గొన్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల ఫిర్యాదులు తక్షణ పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. 'రైలు మదద్' మొబైల్ అప్లికేషన్ యాప్, ప్రయాణికుల గ్రీవెన్స్‌పై డీఆర్ఎం తన కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ రైల్వే ఒక సేవా ఆధారిత సంస్థ అని చెప్పారు. ప్రయాణికుల ఫిర్యాదులను పరిష్కరించే సమయంలో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. మెరుగైన సేవలు కల్పించడంతో పాటు ఫిర్యాదులను సకాలంలోనే పరిష్కరించాలని ఆదేశించారు. సంతృప్తికరంగా ఫిర్యాదుదారుడి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని తెలిపారు. ఇతర డివిజన్‌లతో పోల్చితే విజయవాడ డివిజన్ తక్కువ శాతం అసంతృప్తి ఫీడ్ బ్యాక్‌లు ఉన్నట్లు చెప్పారు. సగటు పెండింగ్ కేసుల సమయాన్ని తగ్గించేందుకు సిబ్బంది చురుగ్గా వ్యవహరించాలని కోరారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 46,766 ఫిర్యాదులు అందగా అందులో 46,760 పరిష్కరించినట్లు వెల్లడించారు. ఇది 99.80 శాతం సాధించిన ఫలితం అని సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో ఏడీఆర్ఎంలు పి.ఈ ఎడ్విన్, ఎం.శ్రీకాంత్, పలు బ్రాంచ్‌ల అధికారులు పాల్గొన్నారు.

తన్మయ భరితం కూచిపూడి నాట్యం



నృత్యం చేస్తున్న కళాకారులు

కూచిపూడి(మొవ్వ): నాట్యాచార్యుల ఇలవేలుపు శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామివార్ల 261 వార్షిక కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని నాట్యక్షేత్రం కూచిపూడిలో గురువారం నిర్వహించిన కూచిపూడి నాట్యాంశాలు అలరించాయి. శ్రీ సిద్ధేంద్రయోగి కళావేదికపై కూచిపూడి, మచిలీపట్నం, విశాఖపట్నంకు చెందిన కళాకారులు హావ, భావ, పద విన్యాసాలతో ప్రదర్శించిన నృత్యాలతో సభికులు భక్తి భావంలో తన్మయం పొందారు. కూచిపూడి గ్రామానికి చెందిన నాట్యాచార్యులు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ శిష్య బృందం డి.వర్షిత వర్మ, ఎంహెచ్‌వీ సాయి భవ్య, పి.రుశాలి, ఎల్.సుస్మిత, ఈశ్వరి గోవర్ధన గిరిధార.. దశావతార శబ్దం.. జణుత శబ్దం, నమో నమో రఘుకుల నాయక... శివ తాండవాలకు నర్తించి ప్రదర్శనకు వన్నె తీసుకొచ్చారు. అలాగే విశాఖపట్నంకు చెందిన కూచిపూడి కళాక్షేత్రం నుంచి ఇరుగు మంజూష వినాయక కీర్తన, అన్నమాచార్య కీర్తనలకు నర్తించి భక్తిభావాన్ని పెంపొందించింది. మచిలీపట్నంకు చెందిన బాల త్రిపుర సుందరి నృత్యనికేతన్ నాట్యాచార్యులు ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు శిష్య బృందం శృంగార లహిరి, జతీశ్వరంలకు సీహెచ్ జాహ్నవి, పి.రాఘవ్, ఎస్.నందసాకేత్, జె. మశ్విత సాయిపూర్ణ, ఎ.కౌస్తుభమణి, కె.దేవి, శ్రీప్రియ, ఎస్.జశ్మితశ్రీలు నర్తించి ప్రేక్షకుల కరతాళ ధ్వనులందుకున్నారు. కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, పసుమర్తి రత్తయ్య శర్మ, చింతా రవి బాలకృష్ణ కళాకారులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు.



పెనమలూరు నియోజకవర్గం ఉయ్యూరు 12వ వార్డులో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న జోగి రమేష్



విజయవాడ ఈస్ట్ రామలింగేశ్వరనగర్‌లో మిషన్ కుడుతున్న మహిళతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్



విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం మధురానగర్‌లో దుస్తులు ఇస్త్రీ చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్

ముమ్మరంగా ప్రచారం

జిల్లాలోని వివిధ పార్టీల అభ్యర్థులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థులు వెలంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్‌తోపాటు పెనమలూరు అభ్యర్థి జోగి రమేష్ గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చిత్రాలివి.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అడ్వకేట్స్ క్రికెట్ రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా క్రాంతికుమార్



విజయవాడస్పోర్ట్స్: దక్షిణ భారత అడ్వకేట్స్ క్రికెట్ టోర్నమెంట్‌కు ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్‌గా విజయవాడకు చెందిన దూబ క్రాంతికుమార్ ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి హైదరాబాద్‌లో జరిగే ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ జట్లు పాల్గొంటాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టులో సతీష్, సురేష్‌కుమార్, చంద్రశేఖరరెడ్డి, అశోక్‌కుమార్, నవీన్, శ్రీనివాసులు యాదవ్, లక్ష్మీకాంత్, దేవానంద్, సుబ్రహ్మణ్యం, మహ్మద్ సాజిత్ ముజీబ్, శ్రీకృష్ణ, చక్రవర్తి, వెంకటేష్, నిఖిల్‌కుమార్, రవి గాంధీ చోటు దక్కించుకున్నట్లు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ఎన్నికలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలతో పాటు స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు.. ఇలా ప్రతి అంశంలోనూ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా గురువారం కలెక్టర్ ఢిల్లీరావు విజయవాడ ఆర్డీఓ బీహెచ్ భవానీ శంకర్, కేఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులతో కలిసి నగరంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ రిసెప్షన్ సెంటర్‌కు సంబంధించి ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ రిసెప్షన్ సెంటర్‌కు సంబంధించి గాంధీజీ మహిళా కళాశాలను తనిఖీ చేశారు. పోలింగ్ ముందు, పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత.. ఇలా మూడు దశలకూ అవసరమైన ఏర్పాట్లను ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియకు అవసరమయ్యే వివిధ కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరా, సూచికల ఏర్పాటు, మౌలిక వసతులు.. ఇలా ప్రతి అంశంపైనా ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. భద్రతాపరంగా కూడా పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. కలెక్టర్ వెంట రెవెన్యూతో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



ఎన్ఎస్ఎం స్కూల్ వద్ద తనిఖీలు చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఆర్డీఓ భవానీశంకర్

సత్వరం ఫిర్యాదుల పరిష్కారం

ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అమల్లో ఉన్నందున వివిధ మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులను నాణ్యతతో సత్వరం పరిష్కరిస్తామని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఎంసీసీ, ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను కంట్రోల్ రూం నెంబర్ (0866-2570051)కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

30న విజయవాడలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ

క్రైస్తవ సంఘాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈస్టర్ (పాస్కా) పర్వదినాన్ని పురస్కరించుకుని విజయవాడలో ఈ నెల 30 రన్ ఫర్ జీసస్ (యేసు కోసం పరుగు) భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు విజయవాడ కతోలిక పీఠం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తెలిపారు. క్రైస్తవ సంఘాల ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చెస్ హెడ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో వేలాది మంది క్రైస్తవులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని మరనాత టెంపుల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడలోనే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కూడా క్రైస్తవులు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రన్ ఫర్ జీసస్ ర్యాలీని బెంజిసర్కిల్ సమీపంలోని సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చి ప్రాంగణంలో ఉదయం 5.30 గంటలకు విజయవాడ కతోలిక పీఠం బిషప్ మోస్ట్ రెవరెండ్ తెలగతోటి జోసఫ్ రాజారావు, సీఎస్ఐ కృష్ణా గోదావరి డయాసిస్ బిషప్ మోస్ట్ రెవరెండ్ జార్జి కార్నేలియస్ జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. అక్కడి నుంచి ర్యాలీ సిద్ధార్థ పాలిక్లినిక్ రోడ్డులో మదర్ థెరిస్సా విగ్రహం మీదుగా గిరిపురం శిఖామణి సెంటర్ మీదగా సీఎస్ఐ బసిలిక చర్చి ప్రాంగణానికి చేరుకుంటుందన్నారు.



రన్ ఫర్ జీసస్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

ప్రమాదంలో గాయపడ్డ కార్మికుడు మృతి

కంకిపాడు: ప్రమాదంలో గాయపడ్డ కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు...పెనమలూరు మండలం వణుకూరు గ్రామానికి చెందిన తండు కమల పోరంకిలోని ప్రైవేటు కంపెనీలో పనిచేస్తోంది. పదేళ్ల క్రితమే భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమె కొడుకు సతీష్(25) ఇంటర్మీడియెట్ వరకూ చదివి మానేశాడు. ప్రస్తుతం పెయింట్ పనులు చేస్తున్నాడు. ఈనెల 20న పెయింట్ మేస్త్రీతో కలిసి కంకిపాడు బ్యాంకు కాలనీలోని దుర్గా ఎన్‌క్లేవ్ అపార్టుమెంటుకు రంగులు వేసేందుకు వచ్చాడు. సతీష్ రెండో అంతస్తు భవనం వెలుపల రంగులు వేస్తూ పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై కిందపడిపోయి గాయపడ్డాడు. ఇతర కార్మికులు ప్రమాద సమాచారాన్ని సతీష్ బంధువులకు తెలియజేసి వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్సులో తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సతీష్ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి కమల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.



మృతుడు తండు సతీష్ (25)

అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

- జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆవులయ్య
- బార్‌లు, వైన్ షాపులు ఎన్నికల నిబంధనలు పాటించాలి
- ప్రభుత్వ వైన్‌షాపుల్లో పని చేసేవారు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు



గుడివాడరూరల్: జిల్లాలో అక్రమ మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య హెచ్చరించారు. ఏపీఎస్‌బీసీఎల్ డిపోను గురువారం సాయంత్రం పరిశీలించేందుకు ఆయన గుడివాడ వచ్చారు. తొలుత డిపోలో అధికారులు, సిబ్బంది పనితీరు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ జీవో నెం-310 ప్రకారం ఒక వ్యక్తికి మూడు మద్యం సీసాలు (క్వార్టర్, ఫుల్స్) విక్రయించాలని, అలా కాకుండా అంతకంటే ఎక్కువగా విక్రయించినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేసే సూపర్‌వైజర్‌లు, సేల్స్ మ్యాన్ అందరూ ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎవరైనా నిబంధలనకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉద్యోగం నుంచి తక్షణమే తొలగిస్తామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మద్యం షాపుల్లో పని చేసే ఉద్యోగులు తమకు సహకరించాలని ఆయన కోరారు. ప్రభుత్వ మద్యం షాపులు ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే విక్రయాలు చేయాలని, సమయం దాటిన తర్వాత విక్రయాలు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యం విక్రయాలు చేయాలని, అదనంగా ఫుడ్‌కు మరో గంట సమయం ఉంటుందని ఈ సమయంలో మద్యం విక్రయించినట్లు తెలిస్తే ఎక్సైజ్‌శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. మద్యం షాపుల్లో పని చేసే ఉద్యోగులు రాజకీయ ప్రచారాలు, ప్రసంగాలు చేయకూడదని, అలా చేశారని తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎక్కడైనా బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరిగే ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజలు ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎన్నికల సమయంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది సమర్థంగా పని చేయాలని కోరారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ సీఐ డి.దుర్గా ప్రసాద్, ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి దుర్మరణం

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్‌నగర్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ చదువుతున్న చిలుమూరి శ్రీరామ్ శాస్త్రి కిరణ్(17) అనే విద్యార్థి తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. నున్న రూరల్ సీఐ ఎస్.దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం పాయకాపురం పెట్రోల్ బంక్ వెనుక తల్లిదండ్రులతో కలసి ఉంటున్న కిరణ్ అజిత్‌సింగ్‌నగర్ శ్రీవిద్య కాలేజీలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ పరీక్షలు రాశాడు. బిస్కెట్లు కొనుక్కొనేందుకు సైకిల్‌పై ప్రకాష్‌నగర్ వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ కిరణ్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో కిరణ్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కిరణ్ మృతి చెందాడు. లారీ డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుని తండ్రి కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం అదుపు తప్పి కార్మికుడు మృతి

ముక్త్యాల(జగ్గయ్యపేట): రోడ్డు ప్రమాదంలో కేసీఎల్ ఫ్యాక్టరీ ఉద్యోగి మృతి చెందిన ఘటన గ్రామ సమీపంలో గురువారం జరిగింది. వివరాలలోకి వెళితే గ్రామ సమీపంలోని కేసీఎల్ కర్మాగారంలో యర్రెడ్ల శ్రీనివాస రెడ్డి (48) కొంత కాలంగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం కర్మాగారంలోని క్వార్టర్స్ నుంచి తన కుమార్తెను జగ్గయ్యపేటలోని కళాశాల వద్ద దించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా కర్మాగారం గేటు వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలవటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

జనరంజక పాలన జగన్‌తోనే సాధ్యం

బందరు పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్

కోనేరుసెంటర్: జనరంజక పాలన జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బందరు పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్ తెలిపారు. బందరు మండలం చిన్నాపురం గ్రామంలో గురువారం జరిగిన గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్, బందరు అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిట్టుతో కలిసి ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. సమస్య ఎలాంటిదైనా పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. గ్రామాభివృద్ధికి ముఖ్యమంత్రి అందించిన సహాయ సహకారాలు, బందరు శాసనసభ్యుడు పేర్ని నాని, ఆయన కుమారుడు కిట్టు చేసిన కృషిని పరిగణనలోకి తీసుకుని వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకునేందుకు కృషి చేయాలని కోరారు. అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కిట్టు మాట్లాడుతూ గత ప్రభుత్వానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. గత ప్రభుత్వంలో ప్రజల కష్టాలను అప్పటి నాయకులు గాలికి వదిలేయగా ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి కష్టం రానీయకుండా చూసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జన్ను రాఘవరావు, మాజీ ఎంపీపీ తోట వాసు, గ్రామ ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



చిన్నాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖర్, పేర్ని కిట్టు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాణిగారితోట, కోరె నామయ్య వీధికి చెందిన గుండు శ్రీనివాసరావు(42), శ్రీలక్ష్మి భార్యాభర్తలు. వీరికి 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. శ్రీనివాసరావు వన్‌టౌన్‌లోని తారాపేటలో పౌండ్రీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శ్రీనివాసరావు తండ్రి కొండలరావు గత కొన్ని నెలల క్రితం మరణించాడు. అప్పటినుంచి అతను వ్యాపారం పట్టించుకోకుండా డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడు. నాలుగు రోజులకు ఒకసారి ఇంటికి వస్తూ ఉండేవాడు. శ్రీనివాసరావు వద్ద ఫోన్ కూడా లేకపోవడంతో ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సమాచారం ఇవ్వవలసి వస్తే ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో భార్య శ్రీలక్ష్మి ఒక కాగితంపై కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్ రాసి శ్రీనివాసరావుకు ఇచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో సీతమ్మ వారి పాదాల వద్ద ఒక వ్యక్తి చనిపోయి ఉన్నాడని చుట్టుపక్కల వారు ఆ నంబర్‌కు ఫోన్ చేసి చెప్పారు. వెంటనే శ్రీలక్ష్మి తన కుటుంబ సభ్యులతో కలిసి సీతమ్మ వారి పాదాల వద్దకు వెళ్లి మృతదేహాన్ని చూసి, తన భర్త శ్రీనివాసరావుగా గుర్తించింది. శ్రీలక్ష్మి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్ష

విజయవాడస్పోర్ట్స్: రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ విజయవాడ 3వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పి.తిరుమలరావు గురువారం తీర్పు చెప్పారు. మాచవరానికి చెందిన లారీ డ్రైవర్ వేముల శ్రీను 2017 నవంబర్ 3న తన లారీతో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు కూలీలను ఢీకొట్టాడు. ఎక్స్‌ఎల్ ప్లాంట్ వద్ద జరిగిన ఈ ఘటనలో వాసు అనే కూలీ మృతి చెందాడు. కేసు నమోదు చేసిన సింగ్‌నగర్ పోలీసులు డ్రైవర్ శ్రీనును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ శశికళ వాదనలు వినిపించారు. విచారణలో నేరం రుజువు కావడంతో లారీ డ్రైవర్ శ్రీనుకు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

అంబాపురంలో ప్లై ఉడ్ గోదాము దగ్ధం

పాయకాపురం(విజయవాడరూరల్): పైపులరోడ్డు సమీపంలో అంబాపురం గ్రామం 5వ లైన్లో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో ప్లైఉడ్ గోడౌన్ దగ్ధం అయింది.అగ్నిమాపక శాఖ పాయకాపురం అధికారి ఎస్.రమేష్ తెలియచేసిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబాపురం గ్రామ పరిధిలో ఎంఎస్ కంపెనీకి చెందిన ప్లైఉడ్ ప్రెస్సింగ్ డోర్లు నిల్వ చేసిన గోడౌన్లో విద్యుత్ షార్టు సర్క్యూట్ జరిగి కెమికల్‌కు మంటలు వ్యాపించి అగ్నిప్రమాదం సంభవించింది. అక్కడ పనిచేసే కార్మికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించగా మంటలు ఎగిసిపడటంతో కార్మికులు అటు వైపు వెళ్లలేక పోయారు. దట్టమైన పొగలు చుట్టుముట్టడంతో స్థానికులు కూడా ఇబ్బందిపడ్డారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. పాయకాపురం అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్.రమేష్, కొత్తపేట అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.



మంటల్లో దగ్ధమవుతున్న ప్లై ఉడ్ గోడౌను

రూ.8 లక్షల ఆస్తి నష్టం

గోడౌనుల్లో నిల్వ ఉంచిన వంద ప్రెస్సింగ్ డోర్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయినట్టు సంస్థ యజమాని సిద్దు తెలిపారు. వేసవి కాలం కావడంతో ఎక్కువ మొత్తంలో ప్రెస్సింగ్ డోర్లు నిల్వ ఉంచామని, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేయడం వలన లోపలి వైపు ఉన్న డోర్లు మాత్రం భద్రంగా ఉన్నట్టు తెలిపారు. రేకులషెడ్డు, రెండు వందల డోర్లు కాలిపోయాయని, మొత్తం నష్టం విలువ రూ.8 లక్షల వరకు ఉంటుందని అగ్నిమాపకశాఖ అధికారి ఎస్.రమేష్ తెలియజేశారు.

24న రాష్ట్ర ఓపెన్ టెన్నిస్ పోటీలు

విజయవాడస్పోర్ట్స్: శీలం రాజయ్య మెమోరియల్ ఏపీ స్టేట్ ఓపెన్ టెన్నిస్ పోటీలను ఈ నెల 24న నిడమానూరులోని స్టార్ టెన్నిస్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ కె.డోలగోపాలరావు తెలిపారు. విజయవాడ రూరల్ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నిడమానూరు గ్రామ సర్పంచ్ శీలం రంగారావు తాత శీలం రాజయ్య జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అండర్-10,12,14,16 విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు 95533 35375ను సంప్రదించి ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రైలు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి గుర్తింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం అంపాపురంలోని తేలప్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొనటంతో మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీని ఏలూరు రైల్వే పోలీసులు గుర్తించారు. రైలు పట్టాలపై యువకుడి మృతదేహాన్ని బుధవారం గుర్తించిన స్థానికులు ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందించటంతో విచారణ చేపట్టిన విషయం విదితమే. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ తెలిపిన వివరాలు ప్రకారం, మృతుడు ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన మంగదొడ్డి సుధాకర్ (41)గా గుర్తించినట్లు తెలిపారు. మృతుడు వ్యవసాయ కూలీ పనులు, బిల్డింగ్ వర్కర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటాడని, ఈ నెల 19వ తేదీ రాత్రి రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ గుర్తు తెలియని రైలు ఢీకొనటంతో మృతి చెందినట్లుగా తెలిపారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో భద్రపర్చిన మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ తెలిపారు.

కారు డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్ష

గన్నవరం: నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ఓ వ్యక్తి మృతికి కారకుడైన కారు డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ గన్నవరం 12వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు గురువారం తీర్పు ప్రకటించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమాచారం మేరకు...విజయవాడకు చెందిన గార్లపాటి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు 2019 ఏప్రిల్ 29న అద్దె కారులో శ్రీకాకుళం జిల్లా అరసవెల్లి ఆలయానికి వెళ్లారు. తిరిగి 30వ తేదీ రాత్రి అదే కారులో విజయవాడకు బయలుదేరారు. తెల్లవారుజామున డ్రైవర్ తలారి చిరంజీవి డ్రైవింగ్ చేస్తూ నిద్రలోకి జారుకోవడంతో కారు నియంత్రణ తప్పి కేసరపల్లి సమీపంలోని బుడమేరు కాలువ వద్ద పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు సీట్లో కూర్చున్న నాగేశ్వరరావు మృతి చెందాడు. ఈ ఘటనపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడ వాంబే కాలనీకి చెందిన కారు డ్రైవర్ చిరంజీవిపై నేరం నిరూపణ కావడంతో అతనికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.ప్రసన్న తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్ (విజయవాడ తూర్పు): రామలింగేశ్వరనగర్ సమీపంలోని స్క్రూబ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. ఫకీర్‌గూడెం, ప్రగతినగర్, శ్రీ రామ్‌నగర్, చంద్రమౌళిపురం, ఎంజీ రోడ్ బెంజిసర్కిల్‌తో పాటు మైత్రేయవీధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగ దారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆటోనగర్(విజయవాడతూర్పు): సుదూర ప్రాంతాలు ప్రయాణించే వారి సమస్యలను పరిష్కరించేందుకు గాను శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆటోనగర్ ఆర్టీసీ డీఎం కె. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 9959225463కి ఫోన్ చేసి సమస్యలు.. సలహాలను తెలియజేయాలని ఆయన కోరారు.

డాక్టర్ బషీర్‌కు సర్జన్ ఆఫ్ ది డికేడ్ అవార్డు


డాక్టర్ బషీర్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): దశాబ్ద కాలంగా పేద, మధ్య తరగతి ప్రజలకు అధునాతన ఫేకో, లేసిక్ సర్జరీలు 35 వేలకు పైగా నిర్వహించి కంటి చూపును ప్రసాదించినందుకు గాను అయాన్ ఐ ఆస్పత్రి అధినేత డాక్టర్ బషీర్ అహ్మద్ మయూఖ్ సర్జన్ ఆఫ్ ది డికేడ్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రఖ్యాత గీతా విజన్ ట్రస్టు ఏప్రిల్ 7న నిర్వహించే ఉగాది పురస్కారాలు 2024లో డాక్టర్ బషీర్‌కు ఈ అవార్డును అందజేయనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు పొక్కులూరి సుబ్బారావు తెలిపారు. శాశ్వత అంధత్వానికి దారితీసే పరిస్థితుల్లో ఉన్న రోగులు ఎందరికో వెలుగులు నింపినట్లు తెలిపారు.

సీఎంగా జగన్ మళ్లీ వస్తేనే సంక్షేమ పథకాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర అన్నారు. మళ్లీ జగన్ వస్తేనే ఆ పథకాలన్నీ అమలవుతాయని ఆమె పేర్కొన్నారు. గడప గడపకూ మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమంలో భాగంగా ఆమె గురువారం 8వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎలాంటి వివక్ష చూపకుండా అందరికీ పథకాలు అందించడమే కాకుండా, పెద్ద ఎత్తున అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయ కూడా పాల్గొన్నారు.

కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ఉత్సాహంగా సాగిన ఇన్‌కెండో–2కే24



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కామర్స్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని విజయవాడ సెంట్రల్ సర్కిల్ ఇన్‌కమ్ ట్యాక్స్ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ టి. నవీష్ వర్మ చెప్పారు. పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆడిటోరియంలో ఇన్‌కెండో–2కే24 పేరుతో కామర్స్ చదువుతున్న విద్యార్థులకు కామర్స్ కోర్సునకు సంబంధించిన అంశాలతో పాటుగా సాంస్కృతిక అంశాల్లో పోటీలను గురువారం జరిగాయి. నవీష్ వర్మ అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గొప్ప విజయాలు సాధించిన వారి జీవిత పుస్తకాలను చదివి స్ఫూర్తిని పొందాలని చెప్పారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం వల్ల వారిలో సృజనాత్మకతతో పాటుగా నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. కామర్స్ విభాగాధిపతి కె.నారాయణరావు, సిద్ధార్థ అకాడమీ సభ్యుడు లలిత్ ప్రసాద్ ప్రసంగించారు.

ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు..
సభ అనంతరం జరిగిన పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. క్విజ్, ఫ్లోర్ క్రాసింగ్, దలాల్ స్ట్రీట్, మైండ్ ఇట్, ఫైనాన్షియల్ అనలిస్ట్, ఐపీఎల్, మిస్టర్ అండ్ మిసెస్, డ్యాన్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

ప్రగతి పరుగులు.. ప్రజలకు వసతులు

- 22వ డివిజన్ రూ. 7కోట్లతో అభివృద్ధి పనులు
- యూపీహెచ్‌సీ, రైతుబజార్, దోబీఖానాలో షెడ్లు ఏర్పాటు
- మౌలిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గం పరిధిలోని కృష్ణలంక, 22వ డివిజన్‌లో ప్రగతి పరుగులు పెడుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండగా.. గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ డివిజన్ రూపురేఖలు మార్చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు సుమారు రూ.7కోట్లు వెచ్చించి పనులు చేపట్టింది. పనులు శరవేగంగా జరుగుతూ మోడల్ డివిజన్ దిశగా దూసుకుపోతోంది. స్థానిక కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి నిత్యం డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు తెలుసుకుని మౌలిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చొరవతో పనులు శరవేగంగా సాగుతున్నాయి.


దోబీఖానాలో నిర్మించిన రేకుల షెడ్



డివిజన్‌లో చేపట్టిన ప్రధాన అభివృద్ధి పనులు..

- డివిజన్‌లో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)ని రూ.80లక్షల నిధులతో నిర్మించారు. దాని ప్రాంగణం చుట్టూ మరో రూ.20లక్షలతో ప్రహరీ నిర్మించి, గేటు ఏర్పాటు చేశారు.
- జాతీయ రహదారి పక్కన పోలీస్ స్టేషన్ సమీపంలో రూ.90లక్షల మార్కెటింగ్ శాఖ నిధులతో రైతుబజార్‌ను ఏర్పాటు చేశారు.
- దోబీఖానా రక్షణ వలయంగా రూ.15లక్షలతో ప్రహరీ, రూ.12లక్షలతో రజకులు బట్టలు ఉతుక్కొనేందుకు రేకుల షెడ్డు, రూ.27లక్షలతో దోబీఖానా షెడ్ ఆధునికీకరణ చేశారు.
- రూ.20లక్షలతో స్వర్గపురి ఎలక్ట్రిక్ విభాగంలో నూతన టాయిలెట్స్, ఆఫీస్ రూమ్ ఆధునికీకరించారు.
- పరికరాలు లేక వెలవెలబోతున్న జిమ్‌పై ప్రత్యేక దృష్టి సారించి రూ.15లక్షలతో అత్యాధునిక జిమ్ పరికరాలు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు.
- అప్పల నరసమ్మ వీధిలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం చేశారు.
- రూ.15లక్షల వ్యయంతో కృష్ణానదిలో నూతన డ్రెయినేజీ వ్యవస్థ పెండింగ్ గేట్లు ఏర్పాటు చేశారు.
- వార్డు సచివాలయం ప్రాంగణంలో రూ.15లక్షలతో డ్వాక్రా సభ్యులకు సమావేశం హాల్ నిర్మించారు.
- నాడు–నేడు పథకం ద్వారా రూ.60లక్షల నిధులతో ఎస్.వి.రెడ్డి నగర పాలక సంస్థ పాఠశాలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉర్దూ స్కూల్‌ను సైతం ఆధునికీకరించారు.
- రూ.30లక్షల వ్యయంతో నూతన వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగు నీటి సమస్యను పరిష్కరించారు.
- రూ.6లక్షలతో సచివాలయం పక్కన డ్రెయినేజీ గోడ నిర్మించారు.
- రూ.15లక్షలతో 110,112 సచివాలయాల వద్ద డ్రెయినేజీ గోడ నిర్మాణ పనులు జరుగుతుండగా మరో రూ.80లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో డివిజన్‌లోని నాలుగు సచివాలయాల పరిధిలో సైడ్ కాలువలు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అలాగే బైరెడ్డి వారి వీధిలో రూ.15లక్షలతో నూతన యూజీడీ పైప్‌లైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.


డివిజన్‌లో జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన రైతుబజార్


అప్పలనరసమ్మ వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు

శరవేగంగా అభివృద్ధి పనులు..



గతంలో ఏ ప్రభుత్వంలో చేయని విధంగా డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకులేదు. ఇప్పుడు డివిజన్ ప్రజల అవసరాలను గుర్తించి యూపీహెచ్‌సీ, రైతుబజార్, దోబీఖానాలో షెడ్లు, జిమ్ ఏర్పాటు చేశారు.
– పి.లక్ష్మి, భ్రమరాంబపురం, కృష్ణలంక

మౌలిక సౌకర్యాల కల్పనే లక్ష్యం..



డివిజన్‌లో ప్రజల మౌలిక సౌకర్యాల కల్పనే లక్ష్యం అభివృద్ధి పనులు చేపట్టాం. తన మూడేళ్లలో కార్పొరేటర్ పదవీ కాలంలో డివిజన్‌లో సుమారు రూ.7కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేశాం. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాం. దేవినేని అవినాష్ సహకారంతోనే డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సాధ్యమైంది.
– తాటిపర్తి కొండారెడ్డి, 22వ డివిజన్ కార్పొరేటర్

ముస్లింలు జగనన్నకు అండగా ఉండాలి

ఇఫ్తార్ విందులో దేవినేని అవినాష్



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆరో డివిజన్ గులాం మొహిద్దిన్ నగర్‌లోని మస్జిద్ ఏ దారుల్ సలాంలో ముస్లిం సోదరులు గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో దేవినేని అవినాష్ పాల్గొన్నారు. అవినాష్ మాట్లాడుతూ కుటుంబ సభ్యుల్లాంటి ముస్లింలు సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను కోరుకుంటున్నానన్నారు. రాష్ట్ర ప్రజల కోసం ప్రత్యేకంగా ముస్లిం మైనారిటీల అభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అమర్, వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ మీర్ హుస్సేన్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజ, ముస్లిమ్ పెద్దలు అబ్దుల్లా, అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో తనిఖీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాధారణ ఎన్నికల నేపథ్యంలో స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ గరువారం బీఆర్‌టీఎస్ రోడ్డులో నాకాబందీ నిర్వహించింది. ఈ సందర్భంగా వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేశారు. భానూనగర్ జంక్షన్ వద్ద రూ. 12లక్షల నగదును తనిఖీలలో గుర్తించారు. దీంతో ఐటీ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందజేశారు. తాము బ్యాంకు సిబ్బంది అని బ్యాంకు పనిమీద నగదు తీసుకువెళ్తున్నట్లు వారు తెలిపారు. దీంతో ఎన్నికల అధికారి లత వారితో పాటు బ్యాంకుకు వెళ్లి బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడారు. సదరు నగదు బ్యాంకుకు సంబంధించినదేనని పత్రాలు చూపించారు. దీంతో నగదును బ్యాంకు సిబ్బందికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో నిబంధనల ప్రకారం నగదును తీసుకువెళ్లేటప్పుడు దానికి సంబంధించిన పత్రాలు తప్పకుండా తీసుకువెళ్లాలని ఆమె సూచించారు.

‘తూర్పు’లో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- ఎమ్మెల్యే గద్దెకు దేవినేని అవినాష్ సవాల్
- 15వ డివిజన్‌లో పాదయాత్ర

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రావాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సవాల్ విసిరారు. గురువారం స్థానిక 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ కరకట్ట ప్రాంతంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రెండో రోజు పాదయాత్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావులు ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నవరత్నాలు అందిన తీరును ప్రజలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ వయసులో పెద్దవారైన గద్దె తన వ్యక్తిత్వాన్ని దిగజార్చుకుని మాట్లాడుతున్నారని విమర్శించారు. గతంలో ఎంపీగా 10 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా ఉండి విజయవాడకు గాని, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న తూర్పు నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు. అంతా గ్రాఫిక్స్ మాయాజాలం తప్ప చేసిందేమి లేదని దుయ్యబట్టారు. ఆయన దత్తత తీసుకున్న (పాత 14వ డివిజన్), ప్రస్తుత 15వ డివిజన్‌కు ఒక్క పైసా నిధులు తేకపోగా ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు.


వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని మహిళను కోరుతున్న దేవినేని అవినాష్

అసత్య ప్రచారం మానుకో..
కాల్వగట్టుల పక్కన ఇళ్లను తొలగిస్తారని గద్దె రామ్మోహన్ చేస్తున్న అసత్య ప్రచారాన్ని అవినాష్ తీవ్రంగా ఖండించారు. ప్రజల పొట్టను కొట్టే నైజం టీడీపీదని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని ఇంటికి సంబంధించిన ఒక ఇటుక రాయిని కూడా తీసేది లేదని స్పష్టం చేశారు. డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ మాట్లాడుతూ 15వ డివిజన్‌లో రూ.33 కోట్లతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. డివిజన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, బాలాజీ, వీవీరెడ్డి, నాయుడు, చిన్న, బాలాజీ, నాని, సత్యనారాయణ, కనకదుర్గ, సీతా రామయ్య పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అప్రమత్తత అవసరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): డౌన్ సిండ్రోమ్ లోపం ఉన్న పిల్లల సంరక్షణలో తల్లిదండ్రులు కీలకంగా వ్యవహరించాలని ఆంధ్రా హాస్పిటల్ పీడియాట్రిక్ సర్వీసెస్ చీఫ్ డాక్టర్ పీవీ రామారావు అన్నారు. ప్రపంచ డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా గురువారం ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్(ఐఏపీ) కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్ శాఖల ఆధ్వర్యంలో డౌన్ సిండ్రోమ్ ఉన్న పిల్లల సంరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పీవీ రామారావు మాట్లాడుతూ పిల్లల కోసం హోమ్ బేస్డ్ ఇంటర్వెన్షన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఇంటి వద్దే చేయదగిన వ్యాయామాలు, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, పిల్లల మానసిక ప్రవర్తనలను ఎలా గమనించాలి, వారి భవిష్యత్తుకు తగిన పాఠశాలలు ఎలా ఎంపిక చేసుకోవాలని అనే అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ అశ్రిత, పిల్లల మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ ఐ. మీనా, పిడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఐ. సాయిదీపక్, స్పీచ్ థెరపిస్ట్ గాయత్రి, ఫిజియోథెరపిస్టు ప్రమోద, స్పెషల్ ఎడ్యుకేటర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన పెంచుకోవాలి
మధురానగర్(విజయవాడసెంట్రల్): డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన పెంచుకుని తగు చికిత్స అందించటం ద్వారా డౌన్‌సిండ్రోమ్ పిల్లలు కూడా మెరుగైన జీవనం సాగించవచ్చని ప్రముఖ సైకాలజిస్టు, చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి. కృష్ణకుమారి అన్నారు. స్థానిక అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణసంస్థ కార్యాలయంలో గురువారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినాన్ని పురస్కరించుకుని అవగాహన, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె డౌన్ సిండ్రోమ్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డౌన్ సిండ్రోమ్ పిల్లలకు సహజంగా హృదయ, కాలేయం, థైరాయిడ్, ఊపిరితిత్తులు, కంటి, దంత సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం గరుడ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎస్‌జే సిద్ధార్థ, డాక్టర్ హర్షిత, పి. బాలాజీ తదితరులు చిన్నారులు వారి తల్లిదండ్రులను ఉచితంగా పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు.


డౌన్ సిండ్రోమ్ ఉన్న పిల్లలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పీవీ రామారావు

భావాల వర్ణనే కవిత



లబ్బీపేట(విజయవాడతూర్పు): మనసులో మెదిలే భావాలను కళాత్మక రూపంలో వర్ణించేదే కవిత అని తెలుగు కవి, రచయిత డాక్టర్ గుమ్మా సాంబశివ రావు అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్ధార్థ మహిళా కళాశాల ఎస్‌డీఎల్‌ఐ క్లబ్, విద్యార్థి వికాస వాహిని ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో కవితా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ సమస్త మానవాళి అంగీకరించిన గొప్ప పద్ధతుల్లో కవిత్వం ఒకటిగా పేర్కొన్నారు. మరో అతిథి కేఎల్ యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నీలిమ చౌడరాజు మాట్లాడుతూ భాషా భిన్నత్వాల్ని కవితా ప్రచారం ద్వారా ఏకం చేసేందుకు యునెస్కో ఏటా మార్చి 21న కవితా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. కల్పన, డైరెక్టర్ టి. విజయలక్ష్మి, విద్యార్థి వికాస వాహిని కార్యదర్శి వి. కేశవరావు, బి. కిరణ్, గ్రంథ పాలకులు మల్లిక, లతాఫణి పాల్గొన్నారు.

సైన్స్ వల్లనే మనిషికి సౌకర్యాలు

- సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ బీఎల్‌వీ ప్రసాద్
- సిద్ధార్థలో ముగిసిన ఫిజిక్స్, కెమిస్ట్రీ మెటీరియల్ సైన్స్ ఎమర్జింగ్ ట్రెండ్స్ సదస్సు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రస్తుతం మనిషి అనుభవిస్తున్న సౌకర్యాలు అన్ని సైన్స్ ప్రసాదించిన కానుకలేనని బెంగళూరులోని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ బీఎల్‌వీ ప్రసాద్ అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో సిద్ధార్థ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ మెటీరియల్ సైన్స్ ఎమర్జింగ్ ట్రెండ్స్ అనే అంశంపై జరుగుతున్న రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు గురువారం సాయంత్రంతో ముగిసింది. ఈ సదస్సులో ప్రసాద్ మాట్లాడుతూ మన నిత్య జీవితంలో ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రించే వరకు ప్రతి పని సైన్స్‌తో ముడిపడి ఉంటుందన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశోక్ కె.గంగూలీ మాట్లాడుతూ విదేశాల్లో మంచి విశ్వవిద్యాలయాల్లో చదువుకుని దేశానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. ప్రొఫెసర్ బీవీఆర్ టాటా మాట్లాడుతూ నానో టెక్నాలజీ వల్ల మనిషి జీవనం చాలా సౌకర్యవంతంగా మారిందన్నారు. సిద్ధార్థ అకాడమీ అకడమిక్ సలహాదారుడు ప్రొఫెసర్ కేఎల్ మోహనరావు మాట్లాడుతూ తమ కళాశాలలో ఇలాంటి సదస్సు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఎల్‌వీ ప్రసాద్

దుర్గమ్మ సన్నిధిలో వేసవి ఏర్పాట్లు

- ఆలయ ప్రాంగణంలో కూల్‌పెయింట్
- గోశాల వద్ద కాయర్ మ్యాట్
- త్వరలో చలువ పందిళ్ల నిర్మాణం


గోశాల వద్ద ఫుట్‌పాత్‌పై కాయర్ మ్యాట్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవి ఎండ నుంచి భక్తులకు ఉపశమనం కలిగేలా దుర్గగుడి దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు కాళ్లు కాలకుండా పలు చోట్ల కూల్ పెయింట్‌ను ఇప్పటికే వేశారు. ఘాట్‌రోడ్డులో ఓం టర్నింగ్ నుంచి చిన్న గాలి గోపురం వరకు, స్కానింగ్ పాయింట్ నుంచి మహా మండపం వరకు, ఇటు మహా మండపం లిఫ్ట్ నుంచి మహామండపం వరకు కూల్ పెయింట్ వేశారు. ఇక కనకదుర్గనగర్ నుంచి మహా మండపం వరకు గోశాల వైపున కాయర్ మ్యాట్‌ను వేసి భక్తులకు ఉపశమనం కల్పించారు. మరో వైపున ఎండ తీవ్రత ఎక్కువైనా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన సామగ్రి ఇప్పటికే ఆలయ ప్రాంగణానికి తరలించారు. మరో మూడు, నాలుగు రోజులలో చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తామని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.


ఆలయ ప్రాంగణంలో కూల్ పెయింట్

ఫంక్షన్ హాల్ నిర్మాణానికి అవినాష్ హామీ

నెరవేరనున్న కృష్ణలంక ప్రజల కల

లబ్బీపేట(విజయవాడతూర్పు): కృష్ణలంక చిరకాల వాంఛ అయిన ఫంక్షన్ హాల్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ హామీనిచ్చారు. తమ ప్రాంతంలో నివసించే పేద, బడుగు, బలహీనవర్గాల వారు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు అనువైన ఫంక్షన్ హాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆ ప్రాంత వాసులు ఈ నెల 3న కృష్ణలంక ఆర్చి సెంటర్‌లో జరిగిన సభలో ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అదే వేదికపై నుంచి అందరికీ ఉపయోగపడేలా అనువైన స్థలాన్ని ఎంపిక చేసిన ఫంక్షన్ హాలు నిర్మించేందుకు కృషి చేస్తానని దేవినేని అవినాష్ వారికి భరోసా ఇచ్చారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పటి నుంచో ఆశ..
కృష్ణలంక ప్రాంతంలో నివసించే పేద, బడుగు, బలహీనవర్గాల వారు ఏదైనా శుభకార్యాలు జరుపుకోవాలంటే ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ ప్రాంతంలో ప్రభుత్వం తరఫున ఏదైనా ఫంక్షన్ హాలు నిర్మిస్తే బాగుంటుందని ప్రజలు ఎప్పటి నుంచో కోరుకుంటున్నారు. కానీ ప్రజల సమస్యను పట్టించుకునే వారు ఇప్పటి వరకూ లేరు. కానీ నేడు అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా ఫంక్షన్ హాలు ఏర్పాటుకు అవినాష్ నుంచి భరోసా రావడంతో తమ కల నెరవేరనుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సర్వత్రా హర్షం..
దేవినేని అవినాష్ ఇచ్చిన ఈ హామీతో కృష్ణలంక వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ ప్రోత్సాహంతో తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించారని కొనియాడుతున్నారు. ఎవరైనా హామీలివ్వడమేగానీ వాటిని నిలబెట్టుకున్న దాఖలాలు లేవని.. కానీ సీఎం జగన్ తన హామీలన్నీ నెరవేర్చారని, అదే స్ఫూర్తితో దేవినేని అవినాష్ కూడా పనిచేస్తుండటంతో ఫంక్షన్ హాల్ నిర్మాణం కూడా తప్పక చేస్తారన్న నమ్మకాన్ని వారు వెలిబుచ్చారు.

అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు కేబీఎన్ విద్యార్థి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): త్వరలో జరిగే అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు తమ కళాశాల విద్యార్థి పి. భరత్‌కుమార్ ఎంపికైనట్లు కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు తెలిపారు. ఏషియన్ యూనివర్సిటీస్ పవర్‌లిఫ్టింగ్ కప్ చాంపియన్‌షిప్ మే ఐదు నుంచి 11వ తేదీ వరకూ హాంకాంగ్‌లో జరగనున్నట్లు పేర్కొన్నారు. అందులో భారతదేశం పక్షాన తమ కళాశాల విద్యార్థి పి. భరత్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. దానికి అయ్యే ఖర్చు సుమారు రూ.1.50 లక్షల వ్యయాన్ని కళాశాల పక్షాన భరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆ మొత్తాన్ని విద్యార్థి భరత్‌కుమార్‌కు గురువారం కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యజమాన్యం విద్యార్థులను అభినందించినట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, కె. రామకృష్ణ, క్రీడా విభాగాధిపతి డి. హేమచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

యువర్స్

● గేమింగ్

వేయి కన్నుల శత్రువు వేట



హారైజన్ జీరో డాన్ (2017) గేమ్‌కు సీక్వెల్‌గా వచ్చిన యాక్షన్–రోల్ ప్లేయింగ్ గేమ్ హారైజన్ ఫర్‌బిడెన్ వెస్ట్(పీసీ) విడుదలైంది. థర్డ్–పర్సన్ పర్‌స్పెక్టివ్‌లో ఆడే గేమ్ ఇది. ప్రమాదకరమైన ఆయుధాలతో నిండిన ‘అలోయ్’ అనే హంటర్‌ను ప్లేయర్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. నోరా తెగకు చెందిన యంగ్ హంటర్ అలోయ్ శాస్త్రవేత్త ఎలిజబెత్ సోటెక్ క్లోన్. ‘మిస్టీరియస్ ప్లేగ్’ మూలాన్ని తెలుసుకోవడానికి తన బృందాన్ని ఫర్‌బిడెన్ వెస్ట్ అని పిలవబడే సరిహద్దు ప్రాంతానికి తీసుకువెళుతుంది. ఆలోయ్ తన ప్రయాణంలో భారీ తుఫానులను, సంచార తెగలతో యుద్ధాలను ఎదుర్కొంటుంది. పచ్చనిలోయల నుంచి శిథిలమైన నగరాల వరకు ఆలోయ్ ప్రయాణంలో ఎన్నో దృశ్యాలు కనిపిస్తాయి. గత గేమ్‌తో పోల్చితే ఈ గేమ్ మ్యాప్ పెద్దగా ఉంటుంది. షీల్డ్ వింగ్, ఫోకస్ స్కానర్, డైవింగ్ మాస్క్, పుల్‌కాస్టర్‌లాంటి టూల్స్‌ను కంబాట్‌లో ఉపయోగించవచ్చు.

- ప్లాట్‌ఫామ్స్: ప్లే స్టేషన్ 4, ప్లే స్టేషన్ 5,
- విండోస్ జానర్: యాక్షన్, అడ్వెంచర్
- మోడ్: సింగిల్–ప్లేయర్

● స్పేస్ టెక్ స్టార్టప్

అంతరిక్షంలో అగ్ని సంతకం





● శ్రీనాథ్ రవిచంద్రన్ ● మోహిన్



● శ్రీనాథ్ రవిచంద్రన్ ‘అగ్నికుల్’ కో–ఫౌండర్, సీయివో

ఏరో స్పేస్ టెక్నాలజీ అనగానే విదేశాల వైపు చూసే ఎంతో మందికి మన సత్తా చూపించిన స్టార్టప్‌లలో ‘అగ్నికుల్ కాస్మోస్’ ఒకటి. ఆకాశమంత కలతో బయలుదేరిన ‘అగ్నికుల్’ అమ్ముల పొదిలో దివ్యాస్త్రం అగ్నిబాణ్....

‘అగ్నికుల్’ అంటే భారత అంతరిక్ష రంగంలో ఆత్మ నిర్భర్ విజయగాథ.

ఐఐటీ–మద్రాస్ కేంద్రంగా పని చేస్తున్న ‘అగ్నికుల్ కాస్మోస్’ త్రీడీ ప్రింటెడ్ రాకెట్ ఇంజిన్‌ను తయారు చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ప్రశంసలు అందుకుంది. స్నేహితుడు మోహిన్, ప్రొఫెసర్ చక్రవర్తిలతో కలిసి 2017లో ‘అగ్నికుల్’ను లాంచ్ చేశాడు శ్రీనాథ్ రవిచంద్రన్. మన దేశంలోని ఫస్ట్ ప్రైవేట్ స్మాల్ శాటిలైట్ రాకెట్ ‘అగ్నిబాణ్’ను నిర్మించింది అగ్నికుల్. 30 కిలోల నుండి 300 కిలోల బరువు ఉన్న పేలోడ్‌ను తక్కువ భూకక్ష్యలోకి (సుమారు ఏడువందల కిలోమీటర్ల ఎత్తు) తీసుకువెళ్లే సామర్థ్యం దీని సొంతం. 2020లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)తో ఒప్పందం కుదర్చుకున్న తొలి భారతీయ కంపెనీగా ప్రత్యేకత సాధించింది అగ్నికుల్. ఒప్పందం ద్వారా ‘అగ్నిబాణ్’ నిర్మాణంలో ‘ఇస్రో’ సహాయ, సహకారాలను తీసుకుంది.

ప్లగ్–అండ్–ప్లే ఇంజిన్ కాన్ఫిగరేషన్ సామర్థ్యం ఉన్న అగ్నిబాణ్, మిషన్ అవసరాలకు ఖచ్చితంగా సరిపోయేలా కాన్ఫిగర్ చేయగలదు. ప్రతి క్లయింట్‌కు సంబంధించిన ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా కాన్ఫిగర్ చేయవచ్చు. 3డీ సాంకేతికతతో రూపొందించిన ఈ రాకెట్ ఉపగ్రహ ప్రయోగాల ఖర్చును తగ్గిస్తుంది.

మొదట్లో వారానికి కనీసం రెండు రాకెట్ ఇంజిన్‌లను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకొని ఆ తరువాత నాలుగు ఇంజిన్‌లకు విస్తరించింది అగ్నికుల్. ఒక్కో అడుగు వేస్తూ ముందుకు వెళ్లింది.

‘మోర్ యాక్సెసబుల్ అండ్ అఫర్డబుల్’ లక్ష్యంతో బయలు దేరిన శ్రీనాథ్ రవిచంద్రన్, మోయిన్‌లు మరిన్ని లక్ష్యాలు నిర్దేశించుకోవడానికి రెడీ అవుతున్నారు.

ఆత్మవిశ్వాసమే అద్భుత శక్తి

2017లో ‘అగ్నికుల్’తో శ్రీనాథ్ రవిచంద్రన్, మోయిన్‌లు ప్రయాణం మొదలు పెట్టినప్పుడు ఇన్వెస్టర్‌ల నుంచి విశ్లేషకుల వరకు ‘మన దేశంలో ఇది సాధ్యమా? ఈ కుర్రాళ్ల వల్ల అవుతుందా’ అనే అనుమాన నీడ ఉండేది. అయితే శ్రీనాథ్, మోహిన్‌లు ఎప్పుడూ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. ఆత్మవిశ్వాసం అనే అద్భుతశక్తితో ముందుకు కదిలారు. నాలుగు వందల వరకు పిచ్ మీటింగ్‌లు నిర్వహించిన తరువాతే ఫస్ట్ రౌండ్ ఫండింగ్ 2018లో వచ్చింది. అనుమాన నీడ వెనక్కి వెళ్లి ‘అగ్నికుల్’ పేరు ప్రపంచానికి పరిచయం కావడానికి ఎంతోకాలం పట్టలేదు. మన దేశంలో స్పేస్ టెక్ స్టార్టప్‌ల విజయాన్ని దృష్టిలో పెట్టుకొని ‘ఏరోస్పేస్ డిగ్రీలు చేయడానికి చాలామంది విదేశాలకు వెళ్లాలనుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇక్కడే ఉండాలనుకుంటున్నారు’ అంటున్నాడు ‘అగ్నికుల్’ కో–ఫౌండర్, సీయివో శ్రీనాథ్ రవిచంద్రన్.

● శ్రీహరి కోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని ప్రైవేట్ లాంచ్ ప్యాడ్ నుంచి ఈరోజు లాంచ్ చేయాల్సిన ‘అగ్నిబాణ్’ సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది.


● అదర్‌సైడ్

సామాజిక సేవ నుంచి సైన్స్ వరకు

బెంగళూరుకు చెందిన సియా గోడికా పేరు వినిపించగానే ‘సోల్ వారియర్స్’ గుర్తుకు వస్తుంది. ‘సోల్ వారియర్స్’ స్వచ్ఛంద సంస్థ ద్వారా పేదలకు పాదరక్షలను అందిస్తుంది సియా. ‘చేంజ్‌మేకర్’గా గుర్తింపు పొందిన సియా గోడికా చదువులోనూ ప్రతిభ చూపుతోంది. ‘ప్లూరిపోటెంట్ స్టెమ్ సెల్స్’ గురించి ఆమె చేసిన సైన్స్ వీడియో ‘బ్రేక్‌త్రూ జూనియర్ చాలెంజ్’లో బహుమతి గెలుచుకుంది. సైన్స్, మ్యాథమెటిక్స్‌కు సంబంధించి క్రియేటివ్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ఇచ్చే ప్రైజ్ ఇది.



● సియా గోడికా



సేవామార్గంలో ప్రయాణించడంతో పాటు క్రియేటివ్ థింకింగ్ కోసం పుస్తకాలు ఎక్కువగా చదువుతుంటుంది సియా. సైన్స్‌కు సంబంధించిన సరికొత్త విషయాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తుంటుంది.

‘ఇంట్లో పిల్లలకు ప్రోత్సాహకరమైన వాతావరణం ఉంటే గొప్ప విజయాలు సాధించవచ్చు’ అని చెప్పడానికి సియా ఒక ఉదాహరణ.

సేవాకార్యక్రమాలకు తమ వంతుగా సహాయపడడం నుంచి సైన్స్ సంగతులు చెప్పడం వరకు సియా గోడికాకు ఎన్నో రకాలుగా ఆమె తల్లిదండ్రులు సహకారం అందించారు.

English Idioms

కీప్ కార్డ్స్ క్లోజ్ టు చెస్ట్

ప్లాన్, ఇంటెన్షన్, ఇన్‌ఫర్‌మేషన్‌లను రహస్యంగా ఉంచే సందర్భంలో వాడే మాట... కీప్ కార్డ్స్ క్లోజ్ టు చెస్ట్.

ఉదా: ది చిల్డ్రన్ డిడ్ నాట్ నో వేర్ దే వర్ టు గో ఫర్ దెయిర్ ఫ్యామిలీ హాలిడే ట్రిప్. దెయిర్ డ్యాడ్ కెప్ట్ హిజ్ కార్డ్స్ క్లోజ్ టు హిజ్ చెస్ట్.

పుష్ ది బోట్ ఔట్

సెలబ్రేషన్ లేదా ఏదైనా కార్యక్రమం కోసం డబ్బును కుమ్మరించే సందర్భంలో వాడే మాట... పుష్ ది బోట్ ఔట్

ఉదా: లెట్ అజ్ పుష్ ది బోట్ ఔట్ అండ్ సెలబ్రేట్ ది విన్ విత్ ఏ ఫ్యాన్సీ డిన్నర్ నైట్

● టెక్... టాక్

ఆసూస్ జెన్‌ఫోన్ 11 ఆల్ట్రా



డిస్‌ప్లే	: 6.78 అంగుళాలు
రిజల్యూషన్	: 1080X2400 పిక్సెల్స్
మెమోరీ	: 256జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 16జీబి ర్యామ్
ఓఎస్	: ఆండ్రాయిడ్ 14
ఫ్రంట్ కెమెరా	: 32 ఎంపీ
బ్యాటరీ	: 5500 ఎంఏహెచ్
బరువు	: 224 గ్రా.

హానర్ వాచ్ జీఎస్ 4



● హార్ట్ రేట్ మానిటరింగ్, స్లీప్ ట్రాకింగ్, స్ట్రెస్ అండ్ బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ మెజరింగ్‌లాంటి హెల్త్ అండ్ ఫిట్‌నెస్ ఫీచర్‌లు ఉన్నాయి ● 100 ప్లస్ ఇండోర్ అండ్ ఔట్‌డోర్ మోడ్స్, కస్టమ్ స్పోర్ట్స్ మోడ్స్, 10 ప్లస్ ప్రొఫెషనల్ స్పోర్ట్స్ మోడ్స్‌ను సపోర్ట్ చేస్తుంది. ● రిజల్యూషన్: 466X466 పిక్సెల్స్ ● స్టోరేజ్: 4జీబి ● 5 ఏటీయం వాటర్ రెసిస్టెంట్ ● 32 ఎంబి ర్యామ్

బింగ్ ఏఐ హోలీ చిత్రాలు

ఆకట్టుకునే ఇమేజ్‌లతో ఫ్రెండ్స్‌కు హోలీ శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా? అయితే ఇది మీ కోసమే... మైక్రోసాఫ్ట్ వారి ‘బింగ్ ఏఐ ఇమేజ్ క్రియేటర్’ను ఉపయోగించి 3డీ హోలీ థీమ్ ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు. సింపుల్ ప్రాంప్ట్స్ ద్వారా ‘బింగ్ ఏఐ ఇమేజ్ క్రియేటర్’పై హోలి ఇమేజ్‌లు క్రియేట్ చేయవచ్చు. వీటిని ఆండ్రాయిడ్ అండ్ ఐఓఎస్, డెస్క్‌టాప్‌లతో యాక్సెస్ చేయవచ్చు. జెనరేట్ అయిన ఇమేజ్‌లు మీకు అంతగా నచ్చకపోతే ‘మేక్ దెమ్ మోర్ కలర్‌ఫుల్ అండ్ వైబ్రంట్’ ‘మేక్ దెమ్ డిటేయిల్డ్’ ‘మేక్ దెమ్ లుక్ ఫొటో–రియలిస్టిక్’ లాంటి ప్రాంప్ట్స్ ఇవ్వవచ్చు.



ఇమోజీ రియక్షన్ ఫీచర్

కమ్యూనికేషన్‌ను మరింత సులభతరం చేయడానికి ‘గూగుల్ మెసేజెస్’ చాట్స్‌లో ఇమోజీ రియాక్షన్ ఫీచర్ తీసుకువచ్చింది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఐమెసేజ్‌లలో మాదిరిగానే ఈ ఫీచర్‌ని ఉపయోగించవచ్చు. రియాక్షన్ ఇమోజీ జోడించడానికి పర్టిక్యులర్ ఎస్‌ఎంఎస్‌ను లాంగ్ ప్రెస్ చేస్తే ఇమోజీ మెనూ కనిపిస్తుంది. దీని నుంచి మనకు కావలసిన ఇమోజీని సెలెక్ట్ చేసుకోవచ్చు. థమ్స్ అప్, రెడ్ హార్ట్, లాఫింగ్ ఇమోజీ, థమ్స్ డౌన్, క్రైయింగ్ ఫేస్‌లాంటి పది ఇమోజీ క్యారెక్టర్లు ఇందులో ఉంటాయి.



సినిమా

తగ్గేదే లే!



● అల్లు అర్జున్

హీరో అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో అల్లు అర్జున్‌ని ఫాలో అయ్యేవారి సంఖ్య (ఫాలోవర్స్) 25 మిలియన్స్‌కు చేరుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంతమంది ఫాలోవర్స్ ఉన్న తొలి దక్షిణాది నటుడిగా అల్లు అర్జున్ రికార్డ్ సృష్టించి, తగ్గేదే లే అంటున్నారు. ‘పుష్ప: ది రైజ్’ సినిమాతో అంతర్జాతీయ స్థాయిలో అభిమానులను సొంతం చేసుకున్నారు అల్లు అర్జున్. అదే విధంగా ఆ మూవీకి ఉత్తమ నటుడి కేటగిరీలో తెలుగులో జాతీయ అవార్డు సాధించిన తొలి హీరోగా అరుదైన ఘనత సాధించారాయన. కాగా సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు సినిమా, వ్యక్తిగత విషయాలను అభిమానులతో పంచుకుంటారు అల్లు అర్జున్. అందులో భాగంగానే దక్షిణాదిలో అత్యధిక ఇన్‌స్టా ఫాలోవర్స్ ఉన్న హీరోగా రికార్డ్‌ను క్రియేట్ చేశారు. ఆ తర్వాతి స్థానంలో హీరో విజయ్ దేవరకొండ (21.3 మిలియన్లు), మూడో స్థానంలో హీరో రామ్ చరణ్ (20.8మిలియన్లు) ఉన్నారు.


భాగ్యనగరంలో పూర్తి



● కీరవాణి, త్రిష, చిరంజీవి

చిరంజీవి హీరోగా నటిస్తున్న ‘విశ్వంభర’ చిత్రం హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి చేసుకుంది. ‘బింబిసార’ చిత్రంతో బ్లాక్‌బస్టర్ అందుకున్న వశిష్ఠ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ‘స్టాలిన్’ (2006) వంటి హిట్ మూవీలో జోడీగా నటించిన చిరంజీవి–త్రిష ‘విశ్వంభర’ మూవీ కోసం రెండోసారి కలిశారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ చిత్రం నిర్మిస్తున్నారు. కాగా ఇటీవల హైదరాబాద్‌లో మొదలైన ‘విశ్వంభర’ షెడ్యూల్ పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. చిరంజీవి, త్రిషతో పాటు ప్రధాన తారాగణం పాల్గొన్న ఈ షెడ్యూల్‌లో కొంత టాకీ పార్ట్, ఓ పాట, యాక్షన్ బ్లాక్‌ని చిత్రీకరించినట్లు యూనిట్ పేర్కొంది. ‘‘ఫ్యాంటసీ అడ్వెంచర్‌గా రూపొందుతున్న చిత్రం ‘విశ్వంభర’. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ మూవీ ఉంటుంది. 2025 సంక్రాంతి కానుకగా జనవరి 10న ఈ సినిమాని విడుదల చేస్తాం’’ అని చిత్రబృందం తెలిపింది. ఇదిలా ఉంటే.. చిరంజీవి నివాసంలో చిత్ర సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణితో సహా యూనిట్‌తో దిగిన ఫొటోలను త్రిష సోషల్ మీడియాలో షేర్ చేసి, ‘ఇదొక లెజెండరీ, అద్భుతమైన రోజు! విశ్వంభర’ అని పోస్ట్ చేశారు. ఈ చిత్రానికి కెమెరా: ఛోటా కె. నాయుడు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కార్తీక్ శబరీష్, లైన్ ప్రొడ్యూసర్: రామిరెడ్డి శ్రీధర్ రెడ్డి.

కాంబినేషన్ రిపీట్



● రామ్‌చరణ్

‘రంగస్థలం’ కాంబినేషన్ రిపీట్ కానుందని టాక్. హీరో రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన బ్లాక్ బస్టర్ ఫిల్మ్ ‘రంగస్థలం’ (2018). కాగా రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో మరో సినిమాకు సన్నాహాలు మొదలయ్యాయట. ఈ నెల 27న రామ్‌చరణ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన వెల్లడి కానుందని తెలిసింది. ‘రంగస్థలం’ సినిమాను నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని, దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తారని భోగట్టా.

చరణ్ సినిమాలో సంజయ్ దత్?

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్న ఈ సినిమాలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ ఓ కీలక పాత్ర చేయనున్నారు. అలాగే బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారనే టాక్ తెరపైకి వచ్చింది. ఇక హిందీలో రామ్ చరణ్ చేసిన తొలి చిత్రం ‘తుఫాన్’లో సంజయ్ దత్ ఓ రోల్ చేశారు. మరి.. రామ్‌చరణ్, సంజయ్ దత్ మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకుంటారా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

గోదావరి నేపథ్యంలో...

‘పలాస 1978’ ఫేం రక్షిత్ అట్లూరి హీరోగా, కోమలీ ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘శశివదనే’. సాయి మోహన్ ఉబ్బర దర్శకుడు. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 19న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ– ‘‘మా సినిమాని ఏప్రిల్ 5న రిలీజ్ చేద్దామనుకున్నాం. కానీ డిస్ట్రిబ్యూటర్స్ అడిగిన మేరకు 19న రిలీజ్ చేస్తున్నాం’’ అన్నారు. ‘‘గోదావరి నేపథ్యంలో లవ్ అండ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన చిత్రం ‘శశివదనే’’ అన్నారు సాయి మోహన్ ఉబ్బర. ‘‘నా ‘పలాస 1978’ కంటే ‘శశివదనే’ పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది’’ అన్నారు రక్షిత్ అట్లూరి. కోమలీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీపాల్, సినిమాటోగ్రాఫర్ శ్రీసాయి కుమార్ దారా మాట్లాడారు.



● కోమలీ ప్రసాద్, రక్షిత్ అట్లూరి

అయోమయం.. ఆశ్చర్యం



● ‘దో ఔర్ దో ప్యార్’ మూవీ పోస్టర్

విద్యాబాలన్, ప్రతీక్ గాంధీ, ఇలియానా, సెంథిల్ రామమూర్తి లీడ్ రోల్స్‌లో నటించిన బాలీవుడ్ రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ ‘దో ఔర్ దో ప్యార్’. శీర్ష గుహ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ‘నేను వీగన్... పాలతో తయారైన వాటిని తినను (విద్యాబాలన్)’, ‘మరి.. మీ ఫేస్ వాష్‌లలో మిల్క్ ఉంటుంది కదా (ప్రతీక్ గాంధీ)!’, ‘మనం డేటింగ్‌లో ఉన్న వారిలా లేము.. నిజంగా భార్యాభర్తలు ఎలా ఉంటారో అలానే ఉంటున్నాం (ఇలియానా)’ వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ‘ప్రేమ కన్‌ఫ్యూజ్ చేస్తుంది. సర్‌ప్రైజ్ చేస్తుంది’ అన్నవి కూడా టీజర్‌లో కనిపించాయి.

గుండెల్లోన.. ప్రేమవాన!

నార్నే నితిన్, నయన్ సారిక హీరోహీరోయిన్లుగా అంజి కంచిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘ఆయ్’. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని ‘సూఫియానా.. గుండెల్లోన ప్రేమవాన..’ అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. రామ్‌మిరియాల సంగీత సారథ్యంలో శ్రీమణి ఈ పాటకు లిరిక్స్ అందించారు. రామ్ మిరియాల, సమీర భరద్వాజ్, రమ్యశ్రీ పాడారు.



● నయన్ సారిక, నార్నే నితిన్

మళ్లీ స్పైడర్‌మేన్ వస్తున్నాడు



● స్పైడర్‌మేన్ నో వే హోమ్ పోస్టర్

హాలీవుడ్ సూపర్ హిట్ సూపర్ హీరో ‘స్పైడర్ మేన్’ మళ్లీ థియేటర్స్‌కు వస్తున్నాడు. స్పైడర్ మేన్ ఫ్రాంచైజీలో ఇప్పటి వరకూ ఎనిమిది సినిమాలు వచ్చాయి. ‘స్పైడర్‌మేన్’ (2002), ‘స్పైడర్‌మేన్ 2’ (2004), ‘స్పైడర్‌మేన్ 3’ (2007), ‘ది అమేజింగ్ స్పైడర్‌మేన్’ (2007), ‘ది అమేజింగ్ స్పైడర్‌మేన్ 2’ (2014), ‘స్పైడర్‌మేన్: హోమ్ కమింగ్’ (2017), ‘స్పైడర్‌మేన్: ఫార్ ఫ్రమ్ హోమ్’ (2019), ‘స్పైడర్‌మేన్: నో వే హోమ్’ (2021)... ఈ 8 చిత్రాలూ రీ రిలీజ్ కానున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ కొలంబియా పిక్చర్స్ వంద సంవత్సరాలను పూర్తి చేసుకున్న సందర్భంగా ‘స్పైడర్‌మేన్’ ఫ్రాంచైజీ సినిమాలను రీ రిలీజ్ చేస్తోందని హాలీవుడ్ సమాచారం. ఈ 8 సినిమాలకు సంబంధించి ఓ కామన్ ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేశారు. ఈ చిత్రాలు కూడా ఏప్రిల్ 15 నుంచి వారానికి ఒక్కొక్కటి చొప్పున జూన్ 3 వరకు విడుదలవుతాయి. ప్రతి చిత్రం కూడా సోమవారమే రీ –రిలీజ్ కానుండటం విశేషం. ఎంపిక చేసిన థియేటర్స్‌లోనే ఈ సినిమాలు రీ రిలీజ్ కానున్నాయి.

ఆ ఒత్తిడి ఎదుర్కొన్నా!

- దర్శకుడు మల్లిక్ రామ్



‘‘డీజే టిల్లు’ (2022) సినిమాకి సీక్వెల్‌గా వస్తున్న ‘టిల్లు స్క్వేర్’పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఎలాగైనా హిట్ కొట్టాలి, వారి అంచనాలు అందుకోవాలనే ఒత్తిడితో ‘టిల్లు స్క్వేర్’ తీశాను. ఫైనల్ ఔట్‌పుట్ చూశాక సినిమా బాగా వచ్చింది.. ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుందనే నమ్మకంతో రిలీఫ్ అయ్యాను’’ అని దర్శకుడు మల్లిక్ రామ్ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం ‘టిల్లు స్క్వేర్’. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ– ‘‘నేను, సిద్ధు, ప్రశాంత్ వర్మ, తేజ సజ్జా... మేమంతా ఈ స్థాయికి రావడం కోసం 12 ఏళ్లుగా కష్టపడుతున్నాం. ఇప్పుడు కలిసి సినిమాలు చేస్తున్నాం. సిద్ధు బాగా నటించాడు. లిల్లీ పాత్రకి అనుపమ నూటికి నూరు శాతం న్యాయం చేసింది. నిర్మాతలు రాధాకృష్ణ, నాగవంశీ, సాయి సౌజన్యగార్లు బడ్జెట్ గురించి ఎప్పుడూ మాట్లాడలేదు. కంటెంట్ గురించి, క్వాలిటీ గురించే ఎక్కువ మాట్లాడారు. ఏ విషయంలో రాజీ పడలేదు.. అందుకే కొన్ని సన్నివేశాలు రీ షూట్ చేశాం. ఒక్కమాటలో చెప్పాలంటే ‘డీజే టిల్లు’ నచ్చినవారిని ‘టిల్లు స్క్వేర్’ ఏమాత్రం నిరాశపరచదు. ఇక ‘టిల్లు 3’కి అవకాశం ఉందా అంటే.. కొన్ని ఆలోచనలు ఉన్నాయి. భవిష్యత్తులో మూడో భాగం ఉండొచ్చు’’అన్నారు.